

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 147
గురువారం 17-8-2023
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'


కోస్టల్ రైడర్స్ శుభారంభం
ఆంధ్ర ప్రీమియర్ లీగ్ తొలి మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్‌పై విజయం - 14లో


పసిడి పోరుకు అర్హత
ఆర్చరీ ప్రపంచకప్ టోర్నీలో ఫైనల్ చేరిన భారత మహిళల, పురుషుల జట్లు -14లో


అనుచిత పదాలు వాడొద్దు
కేసుల విచారణ, తీర్పులు వెల్లడించేటప్పుడు మహిళలను ఉద్దేశించి అనుచిత పదాలు ఉపయోగించొద్దని జడ్జీలకు 'సుప్రీం' నిర్దేశించింది.
వివరాలు 6లో ▸


జాబిల్లి వైపు వడివడిగా..
ఇస్రో శాస్త్రవేత్తలు బుధవారం చంద్రుడి సమీప కక్ష్యలోకి చంద్రయాన్‌–3ను ఎలాంటి అవరోధాలు లేకుండా చేర్చారు.
వివరాలు 6లో ▸


కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య
కోచింగ్ హబ్ సెంటర్‌గా పేరొందిన రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెలలో ఇది నాలుగోది.
వివరాలు 6లో ▸


ఇక ప్రధాని మ్యూజియం
ఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియంను ప్రధాని మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీగా పేరు మార్చడం వివాదస్పదమైంది.
వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్
అలవోకగా అబద్ధాలు రామోజీకే చెల్లు
- సీఎం జగన్ స్వాతంత్య్ర దినోత్సవం సందేశంపై అక్కసు
- కనీస విలువలకు పాతర.. అనైతిక కథనంతో దుష్ప్రచారం
- మంత్రి పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 68 శాతం నిజం కాదా?
- 139 కులాలకు 56 కార్పొరేషన్ల ద్వారా సామాజిక న్యాయం కనిపించదా?
- రూ.2.33 లక్షల కోట్ల డీబీటీలో కులాలకు లబ్ధి చేకూరలేదా?
- బీసీలు రాజకీయంగా క్రియాశీలకంగా ఉండడం వల్లే మీకు కడుపు మంట.. గ్రామాల్లోనే పౌర సేవలు, పథకాలు గ్రామ స్వరాజ్యం కాదా?
- చంద్రబాబు ఊహాజనిత పరిశ్రమలు వెళ్లిపోయాయా?

3లో

చదువులపై 'ఈనాడు' చిత్తు కథ
- అందరికీ మంచి చదువులు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- నాడు–నేడు ద్వారా ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు
- విద్యా పథకాల ద్వారా 14,28,568 మంది ఎస్సీ, 5,19,116 ఎస్టీ విద్యార్థులకు లబ్ధి
- గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఏటా ఇచ్చింది రూ.100 కోట్లే
- అమ్మ ఒడి ద్వారానే ఈ 4 ఏళ్లలో సీఎం జగన్ ఇచ్చింది రూ.26,067 కోట్లు
- రూ.3,366 కోట్లతో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక
- డిజిటలీకరణతో ప్రైవేటుకన్నా ఉన్నత స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లు
- విద్యా రంగం కోసం నాలుగేళ్లలో రూ.68,607 కోట్ల ఖర్చు

11లో

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ
రెగ్యులరైజేషన్‌కు ఐదేళ్ల సర్వీసు నిబంధన ఎత్తివేత
స్వాతంత్య్ర దినోత్సవ వేళ సీఎం వైఎస్ జగన్ శుభవార్త
- సంబంధిత ఫైలుకు ముఖ్యమంత్రి ఆమోదం
- వీలైనంత ఎక్కువ మంది కాంట్రాక్టు సిబ్బందికి మేలు చేస్తూ తాజా నిర్ణయం
- 2014 జూన్ 2 ముందు నుంచి ఉన్న అందరూ రెగ్యులరైజ్
- సీఎంకు కాంట్రాక్టు ఉద్యోగులు, సంఘాల కృతజ్ఞతలు

2లో



జీపీఎస్‌తో.. జీవిత భాగస్వామికీ పెన్షన్
ఉద్యోగి పదవీ విరమణ చేశాక చివరి నెల బేసిక్‌లో 50 శాతం పెన్షన్‌తో పాటు డీఆర్‌లు
జీపీఎస్ చందాదారు మరణిస్తే వారి పెన్షన్ మొత్తంలో 60 శాతం జీవిత భాగస్వామికి
జూన్‌లోనే జీపీఎస్ అమలుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం.. గవర్నర్ వద్దకు చేరిన పత్రాలు
16లో

విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీ ఖరారు
2లో
గతేడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి కొత్త పీఆర్సీ
8% ఫిట్‌మెంట్.. 12 వాయిదాల్లో పీఆర్సీ బకాయిలు
ఒప్పందంపై యాజమాన్యాలు, జేఏసీ ప్రతినిధుల సంతకాలు.. 28,355 కుటుంబాలకు లబ్ధి

ఆర్టీసీలో మరోసారి 'కారుణ్యం'
1,538 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి.. 3 దశల్లో నియామకాలు
ఆర్టీసీలో 715 పోస్టుల గుర్తింపు
మిగిలినవి జిల్లా కమిటీల ద్వారా భర్తీ
- వివరాలు 2లో

మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం
ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే 24-25 ఎంపీ స్థానాలు
జూన్ 15- ఆగస్టు 12 మధ్య టైమ్స్ నౌ తాజా సర్వే
ఏప్రిల్‌లో జరిగిన సర్వేలోనూ ఇవే ఫలితాలు
51.3 శాతానికి పెరిగిన వైఎస్సార్‌సీపీ ఓట్లు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని టైమ్స్ నౌ సర్వేలో మరోసారి స్పష్టమైంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 24 నుంచి 25 లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ విజయ దుందుభి మోగిస్తుందని తెలిపింది. ఏప్రిల్‌లో నిర్వహించిన సర్వేలో వైఎస్సార్‌సీపీ ఏకపక్షంగా విజయం సాధిస్తుందని తేలిన విషయం తెలిసిందే. జూన్ 15–ఆగస్టు 12వ తేదీ మధ్య తాజాగా మరోసారి నిర్వహించిన సర్వేలోనూ అవే ఫలితాలు పునరావృతమయ్యాయని తెలిపింది. ఏప్రిల్‌లో జరిగిన సర్వే, తాజా సర్వే ఫలితాల మధ్య స్వల్ప తేడా మాత్రమే ఉన్నట్లు పేర్కొంది. ఆ తేడా
మిగతా 2వ పేజీలో ▶



వైఎస్సార్‌సీపీ గెలిచే ఎంపీ స్థానాలు

ఈసారీ ఎన్డీయేనే
6లో
ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే జాతీయ స్థాయిలో బీజేపీ కూటమి ఘన విజయం
296 నుంచి 326 స్థానాల్లో ఎన్డీయే గెలుపు
బీజేపీకి సొంతంగానే 288 నుంచి 314 సీట్లు
విపక్ష 'ఇండియా'కు 160 నుంచి 190 స్థానాలే

మరో ఫిషింగ్ హార్బర్
శ్రీకాకుళం జిల్లా మంచినీళ్లపేటలో ఏర్పాటుకు కసరత్తు
- గతంలో అక్కడ ఫిష్ ల్యాండ్ సెంటర్ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన
- స్థానిక మత్స్యకారుల అభ్యర్థనతో హార్బర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- రాష్ట్రంలో 10వ హార్బర్ ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదనలు
- కేంద్రం సూచనతో డీపీఆర్ కోసం ఏపీ మారిటైమ్ బోర్డు కసరత్తు
- డీపీఆర్ తయారీకి ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లకు ఆహ్వానం
- రాష్ట్రంలో ఇప్పటికే రెండు దశల్లో రూ.3,520.7 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం




సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇప్పటికే రెండు దశల్లో తొమ్మిది ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 10వ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్ల పేట వద్ద దీనిని ఏపీ మారిటైమ్ బోర్డు నిర్మించనుంది. రాష్ట్రంలోని సుదీర్ఘ తీర ప్రాంతం 974 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 555 మత్స్యకార గ్రామాలకు చెందిన 6.3 లక్షల మంది మత్స్యకార కుటుంబాలకు స్థానికంగానే ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.3,520 కోట్లతో తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో తొలి దశలో రూ.1,522.8 కోట్లతో నిర్మిస్తున్న జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నాలుగు హార్బర్లను వచ్చే డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకు రావాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. రెండో దశలో రూ.1,997.77 కోట్లతో నిర్మిస్తున్న బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, బియ్యపుతిప్ప, వోడరేవు ఫిషింగ్ హార్బర్ల పనులు ఇటీవలే మొదలయ్యాయి.

ఫిషింగ్ హార్బర్‌గా మార్పు

2019 సెప్టెంబర్ 6న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంచినీళ్లపేటవద్ద ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా
మిగతా 2వ పేజీలో ▶

ఫ్యాక్ట్ చెక్
ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టినా నేరమేనా?
- ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పాత టెక్నాలజీని మార్చినా తప్పుడు రాతలేనా?
- రిజిస్ట్రేషన్ల శాఖలో అత్యాధునిక టెక్నాలజీ ప్రవేశపెడితే ఈ పెడబొబ్బలు ఎందుకు?
- ఆధునిక అవసరాలకు తగ్గట్టు టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేయాలని ఎన్ఐసీని కోరిన రిజిస్ట్రేషన్ల శాఖ
- ఆ స్థాయి వనరులు తనవద్ద లేవని ప్రభుత్వం ఇచ్చిన రూ.6 కోట్లను వెనక్కి ఇచ్చేసిన ఆ సంస్థ
- నత్తనడకన నడుస్తున్న ఎన్ఐసీని పక్కకు తప్పించక ఏం చేయాలి?
- నిబంధనల ప్రకారమే క్రిటికల్ రివర్ కంపెనీకి కాంట్రాక్టు
- వాస్తవాలకు పాతరేసి ప్రభుత్వంపై 'ఈనాడు' శివాలు
- కొత్త టెక్నాలజీతో ప్రజలకు అత్యాధునిక సేవలు

16లో

'పీఎం విశ్వకర్మ'కు ఆమోదం


- రానున్న ఐదేళ్లలో అమలు చేయనున్న 'పీఎం విశ్వకర్మ' పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. రూ.13,000 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని కేంద్రం అమలు చేయనుంది. దీని ద్వారా దేశవ్యాప్తంగా 30 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని కేంద్రం తెలిపింది. సంప్రదాయ వృత్తుల్లో ఉన్నవారికి రూ.2లక్షల దాకా రుణ సాయం చేయనుంది. అలాగే ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో 169 నగరాల్లో 10,000 ఈ–బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. రైల్వే శాఖలో 7 మల్టీ–ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీ, తెలంగాణలో పలు రైల్వే లైన్ల డబ్లింగ్ పనులకు ఆమోదముద్ర వేసింది.

- వివరాలు 6లో

మోసం, దగా.. ఇవే చంద్రబాబు విజన్
- విజన్–2047ను ఏకిపారేసిన మాజీ మంత్రి పేర్ని నాని
- విజన్–2020 ఏమైంది? దాని వల్ల ఏం మార్పు వచ్చింది?
- 2024 ఎన్నికల్లో ఓట్ల కోసం కొత్త విజన్ అంటూ మళ్లీ ఎర
- విద్యుత్ చార్జీలు తగ్గించమంటే రైతుల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చడంలో విజనరీ.. యూజర్ చార్జీలు, మహిళల బంగారం వేలం, పిల్లల డ్రాపవుట్స్‌లో ఫస్ట్
- చంద్రబాబుకు పబ్లిసిటీ విజన్ తప్ప మరే విజనూ లేదు
- అధికారం ఉంటేనే ఇక్కడ నివాసం.. లేదంటే ప్రవాసం

10లో



ఇదం జగత్


అంతా 'సార్' చెప్పినట్లే..
బయటపడ్డ పుంగనూరు మర్డర్ ప్లాన్
పోలీసుల ఎదుట చల్లా బాబు డ్రైవర్ నవీన్‌కుమార్ వాంగ్మూలం

పుంగనూరులో పోలీసుల్ని చంపాలి.. అల్లకల్లోలం సృష్టించాలి
పోలీసులు కేసు పెడితే కోర్టులో మన 'సార్' చూసుకుంటాడు
టీడీపీ నేతల రహస్య సమావేశంలో చల్లా బాబు ఆదేశాలు
అంతకుముందు అంగళ్లులో చంద్రబాబుతో చల్లా బాబు భేటీ
అన్నీ 'సార్' ఆదేశాల మేరకే..

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో పోలీసులను చంపాలన్న కుట్ర, వాహనాలను తగులబెట్టడం, వ్యూహ ప్రతివ్యూహాలన్నీ 'సార్'కు తెలిసే జరిగాయా? ఈ విధ్వంసకాండతో సొంత పార్టీ కార్యకర్తల్ని సైతం బలిదానం తీసుకోవాలని 'సార్' నుంచి ఉత్తర్వులు వచ్చాయా? పోలీసులు కేసు పెడితే కోర్టులో కాపాడే విషయం కూడా 'సార్' చూసుకుంటారని స్పష్టమైన హామీ లభించిందా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈనెల 4వ తేదీన పుంగనూరు వద్ద జరిగిన విధ్వంసకాండతో పదుల సంఖ్యలో పోలీసులపై హత్యాయత్నం జరగడం, వాహనాలు తగులబెట్టిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు పరారీలో ఉండగా..
మిగతా 11వ పేజీలో ▶


పుంగనూరులో పోలీస్ వాహనాలు ధ్వంసం చేస్తున్న టీడీపీ మూకలు. (ఇన్‌సెట్‌లో) చల్లా బాబు (ఫైల్)



బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీ
- బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశమై మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించింది. ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కమిటీ సభ్యులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షాతో పాటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం రమణ్‌సింగ్ పాల్గొన్నారు. గట్టి పోటీ ఎదురయ్యే స్థానాలపై బీజేపీ ప్రధానంగా దృష్టి సారిస్తోంది.

- వివరాలు 6లో

క్లుప్తంగా...

విదేశీ విద్యకు రూ.కోటి మంజూరు

కృతజ్ఞతగా సీఎం ఫొటోకు క్షీరాభిషేకం చేసిన విద్యార్థి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థి కృష్ణకాంత్

అవనిగడ్డ: కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి శివారు అడపావారిపాలెం గ్రామానికి చెందిన పండలనేని శివప్రసాద్ కుమారుడు కృష్ణకిషోర్ అమెరికాలోని కొలంబియా వర్సిటీలో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్య అభ్యసించేందుకు ఫీజుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. దీనికి కృతజ్ఞతగా విద్యార్థి కృష్ణ కిషోర్ తన తల్లిదండ్రులతో వచ్చి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు విదేశీ విద్య అందిస్తోందని చెప్పారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ హర్షణీయం

సాక్షి, అమరావతి: కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణలో ప్రభుత్వం నిబంధనలు సడలించడం హర్షణీయమని ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు హేమంత్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2014 జూన్ 2వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి మాత్రమే కాకుండా నిర్దిష్ట నోటిఫికేషన్ ప్రకారం కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాల్లో చేరిన అందరినీ రెగ్యులర్ చేయడం చరిత్రాత్మకమని కొనియాడారు. ఒప్పంద ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ శాఖల్లో ఉద్యోగల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు.

క్రమబద్ధీకరణపై సీఎం నిర్ణయం విప్లవాత్మకం

ఏపీ స్టేట్ కాంట్రాక్ట్ ఫార్మాసిస్ట్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: 2014 జూన్ 2కి ముందు నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరణ చేయడానికి సీఎం వైఎస్ జగన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయమని ఏపీ స్టేట్ కాంట్రాక్ట్ ఫార్మాసిస్ట్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రత్నాకర్‌బాబు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. అర్హత,సర్వీస్ పరిగణలోకి తీసుకుని వీలైనంత ఎక్కువ మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకుంటూ గత జూన్‌లో కేబినెట్‌లో ఆమోదం తెలిపారన్నారు. 2014 జూన్ 2కి ఐదేళ్లు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామన్న నిర్ణయంతో కొందరు నష్టపోతున్నట్టు సీఎం దృష్టికి వెళ్లిన వెంటనే మానవతాదృక్పథంతో స్పందించి ఆ నిర్ణయాన్ని సవరించడం సంతోషనీయమన్నారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం ఎంతో విప్లవాత్మకమైనదన్నారు. వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కాంట్రాక్ట్, విద్యుత్ సిబ్బంది జీవితాల్లో సీఎం వైఎస్ జగన్ వెలుగులు నింపారని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.గౌతమ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆ ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిస్తోందన్నారు. వారి తరఫున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామంటూ టీడీపీ నేత చంద్రబాబు గతంలో ఒక కమిటీ వేసి మాయ చేశారని గౌతమ్‌రెడ్డి గుర్తుచేశారు. ఎన్నికల సమయం వచ్చేసరికి ముఖం చాటేశారని మండిపడ్డారు.

ఈనెల 27న ఖమ్మంకు అమిత్‌షా!

తెలంగాణ

సాక్షి హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల సమర భేరి మోగించేందుకు బీజేపీ సన్నద్ధమైంది. ఈ నెల 27న ఖమ్మంలో పార్టీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సభతో ప్రచారానికి శ్రీకారం చుట్టనుంది. అమిత్‌షా గత నెలలోనే రాష్ట్రంలో పర్యటించాల్సింది. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రద్దు అయింది. పరిస్థితులు చక్కబడిన నేపథ్యంలో అమిత్‌షా సభ నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ సిద్ధమైంది. ఈ నెల 27న ఖమ్మంలో ఆ సభ నిర్వహించాలని 3 రోజుల కింద జరిగిన రాష్ట్ర నేతల సమావేశంలో తీర్మానించారు. ఈ మేరకు పర్యటనను ఖరారు చేయడానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, పార్టీ ఎన్నికల వ్యవహారాల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ తాజాగా ఢిల్లీ వెళ్లారు. అక్కడ అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో సమావేశమయ్యారు. ఈ నెల 27న అమిత్‌షా షెడ్యూల్‌లో ఖాళీ ఉండటంతో రాష్ట్ర పర్యటనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.

ఆర్టీసీలో మరోసారి 'కారుణ్యం'

1,538 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి.. మూడు దశల్లో నియామకాలు

ఆర్టీసీలో 715 పోస్టుల గుర్తింపు

మిగిలినవి జిల్లా కమిటీల ద్వారా భర్తీ

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంపై చిత్తశుద్ధిని చాటుకుంటూ మరోసారి కారుణ్య నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. సర్వీసులో ఉండగా మరణించిన ఆర్టీసీ సిబ్బంది కుటుంబాలకు ఊరట కల్పిస్తూ అర్హులైన వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించనున్నారు. 2016 నుంచి 2020 జనవరి వరకు మృతి చెందిన 311 మంది ఆర్టీసీ సిబ్బంది వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే అనుమతించారు. ఆ ఉద్యోగాలను భర్తీ చేసిన ఆర్టీసీ యాజమాన్యం ప్రస్తుతం వారికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తాజాగా 2020 జనవరి 1 నుంచి ఇప్పటివరకు మరణించిన ఆర్టీసీ సిబ్బంది వారసులకు కూడా కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయించారు. ఈమేరకు రెండో విడత కారుణ్య నియామకాలకు ఆర్టీసీ కార్యాచరణ చేపట్టింది.

మూడు దశల్లో..

2020 జనవరి 1 నుంచి 2023 ఆగస్టు 15 వరకు 1,538 మంది ఆర్టీసీ ఉద్యోగులు చనిపోయారు. ఆయా కుటుంబాల్లో అర్హులైన వారసులకు కారుణ్య నియామకాల కింద మూడు దశల్లో ఉద్యోగాలు కల్పించనున్నారు. మొదటి దశలో కలెక్టర్ల ఆధ్వర్యంలోని జిల్లా కమిటీలు ఉద్యోగాలు కల్పిస్తాయి. ఆయా జిల్లాల్లో గ్రామ, వార్డు సచివాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వారిని నియమిస్తారు. జిల్లా కమిటీలు గుర్తించిన పోస్టులను భర్తీ చేయగా మిగిలిన వారికి ఆర్టీసీలో ఉద్యోగాలు కల్పిస్తారు. అప్పటికీ ఇంకా అర్హులు మిగిలిపోతే వారికి మళ్లీ జిల్లా కమిటీల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తారు. ఇప్పటికే మొదటి దశగా జిల్లా కమిటీల ద్వారా కారుణ్య నియామకాల ప్రక్రియను చేపట్టారు. మిగిలిన ఉద్యోగాల కల్పనకు కూడా ఆర్టీసీ సమాయత్తం అవుతోంది.

ఆర్టీసీలో 715 పోస్టుల గుర్తింపు

కారుణ్య నియామకాల కోసం ఆగస్టు 15 నాటికి ఆర్టీసీలో అందుబాటులో ఉన్న ఉద్యోగాలను గుర్తించారు. రాష్ట్రంలో 12 ఆర్టీసీ రీజియన్ల వారీగా మొత్తం 715 ఉద్యోగాలను గుర్తించారు. వీటిలో డ్రైవర్ పోస్టులు 346, కండక్టర్ పోస్టులు 90, అసిస్టెంట్ మెకానిక్ పోస్టులు 229, ఆర్టీసీ కానిస్టేబుల్ పోస్టులు 50 ఉన్నాయి. కారుణ్య నియామకాల కింద ఈ పోస్టులను నెల రోజుల్లో భర్తీ చేయాలని ఆర్టీసీ భావిస్తోంది.



కారుణ్య నియామకాల కోసం ఆర్టీసీలో గుర్తించిన పోస్టులు ఇవీ..

రీజియన్	డ్రైవర్లు	కండక్టర్లు	అసిస్టెంట్ మెకానిక్‌లు	ఆర్టీసీ కానిస్టేబుళ్లు
విజయనగరం	51	21	21	-
విశాఖపట్నం	6	-	29	-
తూర్పు గోదావరి	56	19	19	-
పశ్చిమ గోదావరి	25	9	21	11
కృష్ణా	18	0	17	20
గుంటూరు	65	4	23	-
ప్రకాశం	30	5	21	6
నెల్లూరు	-	-	24	13
చిత్తూరు	-	-	36	-
కర్నూలు	39	18	2	-
కడప	23	-	12	-
అనంతపురం	33	14	4	-
మొత్తం	346	90	229	50

ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు చెప్పారు. అర్హులైన వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామన్నారు.
– సీహెచ్.ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ ఎండీ

ప్రభుత్వానికి ఎన్ఎంయూ కృతజ్ఞతలు

కారుణ్య నియామకాల భర్తీకి ఆర్టీసీలో 715 పోస్టులను గుర్తించడం పట్ల నేషనల్ మజ్దూర్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు సర్క్యులర్ జారీ చేయడంపై ముఖ్యమంత్రి జగన్, ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావుకు ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంతో స్వామినారాయణ్ గురుకుల్ ట్రస్ట్ సభ్యుల భేటీ



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సాక్షి, అమరావతి: శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ ట్రస్ట్ సభ్యులు, ప్రతినిధులు బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ని కలిశారు. వచ్చే నెలలో తిరుపతిలో నిర్వహించనున్న స్కూల్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ సీఎంకు ఆహ్వాన పత్రిక అందజేశారు. వారి విన్నపాన్ని సీఎం జగన్ అంగీకరించారు. సీఎంతో సమావేశం అనంతరం ట్రస్ట్ మెంబర్ సుఖ్‌వల్లభ్ స్వామి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ గ్రూప్‌కు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, ఢిల్లీ, అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాలలో 52కు పైగా విద్యాసంస్థలు ఉన్నాయని చెప్పారు. 40 వేల మందికి పైగా విద్యార్థులు తమ గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 3 ప్రాంతాల్లో తమ విద్యాసంస్థల ఏర్పాటు కోసం భూములు కేటాయించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. పులివెందుల, విశాఖలో ఏర్పాటు చేయనున్న స్కూళ్లకు కూడా త్వరలోనే భూమి పూజ నిర్వహిస్తామన్నారు. ఆధునిక విద్యతో పాటు విలువలతో కూడిన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి బోధించడమే తమ లక్ష్యమని వివరించారు.ధర్మసాగర్ స్వామి, మాజీ మంత్రి జలగం ప్రసాదరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

సాక్షి, అమరావతి: కాంట్రాక్టు ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవ వేళ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభవార్త అందించారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించి ఐదేళ్ల సర్వీసు నిబంధనను ఎత్తివేస్తూ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ గత మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఇందుకు 2014 జూన్ 2వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులనే రెగ్యుల రైజేషన్ చేసేలా నిబంధన విధించారు. తాజాగా సీఎం జగన్ ఐదేళ్ల నిబంధనను తొలగిస్తూ సంబంధిత ఫైలుకు మంగళవారం ఆమోద ముద్ర వేశారు. వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులరైజ్ చేయాలనే ఉద్దేశంతో ఏ సంఘం డిమాండ్ చేయకుండానే స్వయంగా ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల నిబంధనను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 2014 జూన్ 2వ తేదీకి ముందు నియమితులై ఇప్పటి వరకు కొన సాగుతున్న కాంట్రాక్టు ఉద్యోగులందరి సర్వీసును రెగ్యులరైజ్ చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయి. వీలైనంత ఎక్కువ మంది కాంట్రాక్టు ఉద్యోగులకు మేలు చేస్తానని గత ఎన్నికల ముందు సీఎం జగన్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయం పట్ల కాంట్రాక్టు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలకు మేలు చేస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు తెలియ చేస్తున్నారు.

నాడు బాబు సర్కారు నమ్మక ద్రోహం..

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయబోమని, సుప్రీం కోర్టు తీర్పు అందుకు అనుమతించదని గతంలో చంద్రబాబు ప్రభుత్వం సాకులు చెప్పింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా సుప్రీం కోర్టు తీర్పు పేరుతో కాంట్రాక్టు ఉద్యోగులను మోసం చేసింది. కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు రెగ్యులరైజేషన్‌పై ముగ్గురు మంత్రుల బృందాన్ని నియమిస్తూ 2014 సెప్టెంబర్ 9న చంద్రబాబు సర్కారు జీవో 3080 జారీ చేసింది. ఐదేళ్ల పాటు సమావేశాలతో సాగదీసిన మంత్రుల బృందం చివరికి కోర్టు తీర్పును బూచిగా చూపిస్తూ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సాధ్యం కాదంది.

నేడు మాట నిలబెట్టుకున్న సీఎం జగన్

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు న్యాయపరమైన, చట్టపరమైన చిక్కులను అధిగమించి కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజ్‌కు సిద్ధమైంది. ప్రభుత్వ శాఖల్లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను అర్హత, సర్వీసును పరిగణలోకి తీసుకుని వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులరైజ్ చేస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ఆ ప్రకారం రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వం సుదీర్ఘ కసరత్తు చేసింది. మంత్రుల కమిటీతో పాటు సీఎస్ అధ్యక్షతన వర్కింగ్ కమిటీని నియమించింది. ఈ కమిటీలు న్యాయ పరమైన, చట్టపరమైన చిక్కు లపై చర్చించాయి. రెగ్యులరైజేషన్‌పై నిషేధం విధిస్తూ 1994లో చేసిన చట్టంలో సవరణలు చేయాలని కమిటీలు సూచించాయి. ప్రభుత్వ ఉద్యోగాలను పొందేందుకు కాంట్రాక్ట్ ఉద్యోగాలు దొడ్డి దారి కాకూడదని సుప్రీం కోర్టు తన తీర్పులో పేర్కొంది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చిక్కులు ఎదురుకాకుండా న్యాయపరంగా అన్ని అంశాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది. నాడు బాబు సర్కారు కోర్టు తీర్పును బూచిగా చూపిస్తూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా మోసగించగా సీఎం జగన్ ప్రభుత్వం కోర్టు ఆదేశాలను పరిగణలోకి తీసుకుంటూనే క్రమబద్ధీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది.

పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం హర్షం

కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు రెగ్యులరైజేషన్ విషయంలో తొలుత విధించిన ఐదేళ్ల సర్వీసు నిబంధనను తొలగిస్తూ ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్ర పాలిటెక్నిక్ ఆల్ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో ఎక్కువ మంది కాంట్రాక్టు ఉద్యోగులకు మేలు జరుగుతుందన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

వీలైనంత ఎక్కువ మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్‌కు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, కాంట్రాక్ట్ ఉద్యోగుల తరఫున హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి తెలిపారు.

వేల మందికి మేలు

ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయంతో వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులకు మేలు చేకూరుతోందని ఎమ్మెల్సీ తమటం కల్పలత పేర్కొన్నారు. వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్‌కు కాంట్రాక్టు ఉద్యోగులందరూ రుణపడి ఉంటారన్నారు.

మనసున్న ముఖ్యమంత్రి

వీలైనంత ఎక్కువ మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించేలా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. సీఎం వైఎస్ జగన్ మనసున్న ముఖ్యమంత్రిగా మరోసారి నిరూపించుకున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటారు.
– కె.మురళీరెడ్డి, యూనివర్సిటీస్ వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

చిరస్మరణీయమైన రోజు

కాంట్రాక్టు ఉద్యోగులకు ఇది జీవితంలో మరిచిపోలేని రోజు అని తూర్పు రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయంతో కాంట్రాక్టు అధ్యాపకులు కూడా రెగ్యులరైజ్ అవుతారని తెలిపారు. ఎన్నికల హామీని నిలబెట్టుకున్న సీఎం జగన్‌కు కాంట్రాక్టు ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.
– ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

వెలుగులు నింపిన సీఎం

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న దాదాపు 5 వేల మందిని రెగ్యులరైజ్ చేసేలా ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయం తమ జీవితాల్లో వెలుగులు నింపుతోందని గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. మాటకు కట్టుబడ్డ సీఎం జగన్‌కు సంఘం నేతలు వై.రామచంద్రారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, కరీంఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ రెగ్యులర్ చేస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని ఏపీ పాలిటెక్నిక్ ఆల్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.సాయిరాజు పేర్కొన్నారు.
– గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్

మరో ఫిషింగ్ హార్బర్

▶ మొదటి పేజీ తరువాయి

స్థానిక మత్స్యకారులు సీఎంను కలిసి ఇక్కడ కూడా ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి కోరిక మేరకు అక్కడ ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఏపీ మారిటైమ్ బోర్డును ఆదేశించారు. ఈ మేరకు పీఎం మత్స్య సంపద యోజన పథకం కింద మంచినీళ్లపేట వద్ద హార్బర్ నిర్మాణానికి ఏపీ మారిటైమ్ బోర్డు కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనను పరిశీలించిన కేంద్రం సమగ్ర ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పించాలని కోరింది. దీంతో డీపీఆర్ తయారీకి టెక్నికల్ కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేయడం కోసం ఏపీ మారిటైమ్ బోర్డు ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లను పిలిచింది. ఆగస్టు 23 మధ్యాహ్నం మూడు గంటలలోపు ఆసక్తి గల సంస్థలు బిడ్లు దాఖలు చేయాలని కోరింది. మొత్తంగా రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న పది ఫిషింగ్ హార్బర్ల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. వీటికి అదనంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నేలటూరు వద్ద అదానీ గ్రూపు సుమారు రూ.25.84 కోట్లతో



ఫిషింగ్ జెట్టీని నిర్మిస్తోంది. ఈ జెట్టీ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ 2022 అక్టోబర్ 27న భూమి పూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించిన సంగతి తెలిసిందే.

ఫిష్ ల్యాండ్ సెంటర్: చిన్న పడవలు, ఇంజిన్ బోట్లు నిలుపుకోవడానికి, చేపలు ఆరబెట్టుకునేందుకు అవకాశం. రూ.10 కోట్ల ఖర్చుతో నిర్మాణం.

ఫిషింగ్ హార్బర్: పెద్ద బోట్లు నిలుపుకునేందుకు బెర్త్‌లు, జెట్టీల నిర్మాణం. చేపల స్టోరేజ్‌కు అవకాశం. నిర్మాణ ఖర్చు రూ.150 కోట్ల వరకు ఉంటుంది. ఇక్కడ ఆగే బోట్లు సముద్రంలో చాలా దూరం వెళ్లగలవు. ఒక్క మాటలో చెప్పాలంటే మినీ పోర్ట్.

విద్యుత్ సిబ్బంది జీవితాల్లో వెలుగులు

2018 పే స్కేల్ ప్రకారం జీతాలకు ఓకే.. అదనంగా మరో 2 శాతం కూడా

సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల్లో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం వెలుగులు నింపింది. శాశ్వత ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారి వేతనాలను భారీగా పెంచేందుకు అంగీకరించింది. ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల్లో మాటిచ్చిందే తడవుగా రోజుల వ్యవధిలో అధికారికంగా జీవో విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలో దాదాపు 23,500 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు ఇప్పుడున్న దానిపై 37% పెరగనున్నాయి. ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల్లో గత 15 నుంచి 20 ఏళ్లుగా కాంట్రాక్టు సిబ్బంది పని చేస్తున్నారు. వీరంతా విద్యుత్ సంస్థల్లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో హైస్కిల్డ్, స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరీల్లో పని చేస్తున్నారు. ప్రస్తుతం 2014 పే స్కేల్ ప్రకారం వీరికి జీతాలు ఇస్తుండగా వాటిని సవరించి 2018 పే స్కేల్ ప్రకారం ఇచ్చేందుకు విద్యుత్ సంస్థల యాజమాన్యాలు అంగీకరించాయి. 2018 జీతాలపై 2% అదనంగా పెంచేందుకూ అంగీకరించాయి. దీంతో హై స్కిల్డ్ ఉద్యోగులకు ప్రస్తుతమున్న జీతంపై రూ.8016 చొప్పున పెరగనుంది. స్కిల్డ్ వారికి రూ.7,355, సెమీ స్కిల్డ్ వారికి రూ.6,092, అన్ స్కిల్డ్ సిబ్బందికి రూ.5,845 చొప్పున వేతనాలు పెరగనున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులివ్వగా డిస్కంల సీఎండీలు గురువారం ఉత్తర్వులు వెలువరించే అవకాశం ఉంది. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు పెరగడంతో పాటు బీమా కూడా సమకూరడంతో వారందరూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జీతాల పెంపు ఇలా (రూపాయల్లో)

కేటగిరీ	ప్రస్తుతం	2018 పీఆర్సీ	2 శాతం	మొత్తం
హై స్కిల్డ్	22,589	30,005	600	30,605
స్కిల్డ్	20,598	27,405	548	27,953
సెమీ స్కిల్డ్	17,144	22,780	456	23,236
అన్ స్కిల్డ్	16,473	21,880	437.60	22,318

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి: సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బాల్య వివాహాలను పూర్తిగా కట్టడి చేసేందుకు ప్రభుత్వం త్వరలో పెద్ద ఎత్తున ప్రచార, అవగాహన కార్యక్రమాలు చేపట్టనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్.జవహర్‌రెడ్డి తెలిపారు. బాల్య వివాహాల నియంత్రణపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో యూనిసెఫ్ ప్రతినిధుల బృందంతో ఆయన చర్చించారు. సీఎస్ మాట్లాడుతూ మధ్యలో చదువు మానేసిన బాలికలను గుర్తించి.. తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తున్నామన్నారు. మండలానికి ఒక ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలను ప్రభు త్వం అందుబాటులోకి తెస్తోందన్నారు. బాల్య వివాహాల నియంత్రణలో భాగంగా వివాహ రిజిస్ట్రేషన్లను తప్పనిసరి చేశామన్నారు. మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసేందుకు రెండు రోజుల్లో సమావేశం నిర్వహిస్తామన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడుతూ.. బాల్య వివాహాల నియంత్రణ కోసం మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నామన్నారు. హైదరాబాద్ యూనిసెఫ్ చీఫ్ డా.జలాలెమ్ బి.టాఫెస్సీ మాట్లాడుతూ బాల్య వివాహాల నియంత్రణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

రాజధాని ఎక్కడుంటే అక్కడే ఎస్‌బీఐ హెడ్ ఆఫీస్

- ఏపీలో గృహ రుణాల మార్కెట్ వృద్ధి చెందుతోంది
- వ్యవసాయ రుణాలు సకాలంలో చెల్లించే వారి సంఖ్య పెరుగుతోంది
- ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్‌కుమార్ ఖారా వెల్లడి
- విశాఖలో ఎస్‌బీఐ సీఎస్సార్ కార్యక్రమాలను ప్రారంభించిన దినేశ్



సాక్షి, విశాఖపట్నం: ఎస్‌బీఐ లోకల్ హెడ్ ఆఫీస్ ప్రస్తుతం అమరావతిలో ఉందని.. భవిష్యత్‌లో ప్రభుత్వం రాజధానిని ఎక్కడైనా ఏర్పాటు చేస్తే అక్కడికే హెడ్ ఆఫీస్‌ను కూడా తరలిస్తామని ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్‌కుమార్ ఖారా చెప్పారు. బుధవారం విశాఖపట్నంలో ఆయన పర్యటించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్సార్)లో భాగంగా జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జునకు రూ.40 లక్షల చెక్కును అందజేశారు. అలాగే రూ.35.92 లక్షల విలువైన 6 రిమోట్ కంట్రోల్ లైఫ్ సేవింగ్ బోట్‌లు, రూ.32.71 లక్షల విలువైన 42 సీటర్ బస్‌ను ఇండియన్ కోస్ట్‌గార్డ్ డీఐజీ యోగిందర్‌కు అందించారు. ఎక్స్‌ఆర్డీ అనలిటికల్ ల్యాబ్ ఏర్పాటు చేసేందుకు ఐఐపీఈకి రూ.3.94 కోట్లు అందజేశారు. అనంతరం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోను దినేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏపీలో గృహ రుణాల మార్కెట్ గణనీయంగా వృద్ధి చెందిందని చెప్పారు. గృహ రుణాల్లో 15 శాతం, డిపాజిట్లలో 12 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 300 కొత్త బ్రాంచ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. వ్యవసాయ రుణాల మంజూరు విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. నిరర్థక ఆస్తుల విలువ క్రమంగా తగ్గుముఖం పడుతోందని.. వ్యవసాయ రుణాలు సకాలంలో చెల్లించే వారి సంఖ్య కూడా పెరుగుతోందని వెల్లడించారు. వ్యవసాయ రుణాల కోసం దేశవ్యాప్తంగా 56 ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో అమరావతి సర్కిల్ సీజీఎం నవీన్ చంద్ర ఝా, జనరల్ మేనేజర్ హేమంత్‌కుమార్, డీజీఎం పంకజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీ ఖరారు

- గతేడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి కొత్త పీఆర్సీ
- 8 శాతం ఫిట్‌మెంట్.. 12 వాయిదాల్లో పీఆర్సీ బకాయిలు



పీఆర్సీ పత్రాలతో యాజమాన్యాలు, ఉద్యోగులు

సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల్లోని 28,355 కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తూ.. ఉద్యోగుల పీఆర్సీ ఖరారైంది. కొత్తగా అమల్లోకి రా నున్న సింగిల్ మాస్టర్ స్కేలుతో కూడిన పీఆర్సీ ఒప్పందంపై ఏపీజెన్‌కో, ఏపీట్రాన్స్‌కో, ఏపీఈపీడీ సీఎల్, ఏపీ సీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారు లు, ఏపీఎస్‌పీఈజేఏసీ ప్రతినిధులు, పలు యూనియన్ల నాయకులు బుధవారం సంతకాలు చేసి పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్ర కారం కొత్త పీఆర్సీ గతేడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. పీఆర్సీ బకాయిలను విద్యుత్ సంస్థలు 12 వాయిదాల్లో ఉద్యోగులకు చెల్లిస్తాయి. వారికి 8% ఫిట్‌మెంట్ లభిస్తుంది. సింగిల్ మాస్టర్ స్కేలు అనే కొత్త విధానాన్ని అమల్లోకి తేనున్న నేపథ్యంలో అధికారులు లోతుగా అధ్యయనం చేసి కొత్త స్కేళ్లు రూపొందించారు. పేస్కేళ్లలో తేడాలు ఉంటే సరి చేసేందుకు ట్రాన్స్‌కో జేఎండీ నేతృత్వంలో మూడు డిస్కంల సీఎండీలతో హెచ్ఆర్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పడంతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేస్తూ పీఆర్సీ ఒప్పందంపై సంతకాలు చేశారు. యాజమాన్యాల తరఫున ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జేఎండీ మల్లారెడ్డి, డి స్కంల సీఎండీలు.. పృథ్వీతేజ్, పద్మా జనార్దనరెడ్డి, సంతోష్ రావు, ఉద్యోగ సంఘాల తరఫున 1104, 327, వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, జేఏసీ ప్రతినిధులు సంతకాలు చేసినవారిలో ఉన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ స్థాయి ఫలితాల్లోనే కనిపించింది. ఏపీకి సంబంధించి గతంలో మాదిరిగానే 24 నుంచి 25 ఎంపీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని తేలింది. కాగా, 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ 49.8 శాతం ఓట్లతో 22 స్థానాల్లో నెగ్గింది. ఈసారి 51.3 శాతం ఓట్లతో మొత్తం స్థానాలను తన ఖాతాలో వేసుకుంటుందని టైమ్స్ నౌ సర్వే తేల్చడం విశేషం. అంటే కిందటి ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు ఆ పార్టీ ఓట్ల శాతం 1.50 శాతం పెరుగనున్నట్టు స్పష్టమవుతోంది. వైఎస్సార్‌సీపీ పట్ల నానాటికీ పెరుగుతున్న ప్రజాదరణకు ఇదే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పేదలకు నిరంతరాయంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు, జనాభాలో దాదాపు 90 శాతం మందికి నేరుగా అందుతున్న నగదు సాయం, అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శక పాలన.. వైఎస్సార్‌సీపీకి జనాదరణను పెంచాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ నేపథ్యంలో 175 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయం సాధించడం అసాధ్యం కాదని ఆ పార్టీ తొలి నుంచి చెబుతోంది.

క్లుప్తంగా...

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం



సాక్షి, అమరావతి: ఈ నెల 18వ తేదీన బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం 18వ తేదీ నాటికి బలపడి అల్పపీడనంగా మారుతుందని పేర్కొంది. దీని ప్రభావం ఒడిశా – ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ రాష్ట్రాలపై ఎక్కువగా ఉండనుంది. మన రాష్ట్రంలో ఉత్తరాంధ్రపై స్వల్పంగా ప్రభావం పడే అవకాశం ఉండడంతో అక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. బుధవారం తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు వర్షాలు పడగా, మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఉత్తరాంధ్రతోపాటు మిగిలిన కోస్తా జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. 27వ తేదీ నాటికి మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అధికారుల అంచనా.

59 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ద్వారా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో 59 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీపీఎస్సీ ద్వారా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో పోస్టుల భర్తీ చేపట్టనున్నారు. భర్తీ చేసే పోస్టుల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌లో 21 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్స్, 18 గ్రేడ్–2 అనలిస్ట్, వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో 19 జూనియర్ అసిస్టెంట్, ఒక అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులు ఉన్నాయి.

వ్యవసాయవర్సిటీ తాత్కాలిక వీసీగా శారద జయలక్ష్మీదేవి



సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(అంగ్రూ) తాత్కాలిక వీసీగా డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవిని నియమిస్తూ వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత వీసీ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ప్లాంట్ పేథాలజీ విభాగం ముఖ్య శాస్త్రవేత్త శారద జయలక్ష్మీదేవిని తాత్కాలిక వీసీగా నియమిస్తూ ఆదేశాలిచ్చారు.

75 మంది వైద్యుల తొలగింపు

- అనుమతి లేకుండా నెలల తరబడి విధులకు గైర్హాజరు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య శాఖలోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో పనిచేస్తూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 75 మంది అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగిస్తోంది. ఏడాదికి పైగా విధులకు హాజరుకాని 78 మంది వైద్యులకు అధికారులు గత నెలలో నోటీసులిచ్చారు. వీరు ఈ నెల 10వ తేదీ లోపు నేరుగా డీఎంఈ కార్యాలయానికి వచ్చి తమ సంజాయిషీ అందజేయాలని సూచించారు. కేవలం ముగ్గురు వైద్యులు మాత్రమే నోటీసులకు స్పందించి డీఎంఈ కార్యాలయానికి వచ్చారు. మిగిలిన 75 మంది నుంచి ఎటువంటి స్పందన లేదు. దీంతో వీరిని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగించనున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క వైద్య పోస్టు కూడా ఖాళీగా ఉండకూడదని నిర్ణయించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటోంది. వైద్యశాఖలో ఇప్పటివరకూ 53 వేలకు పైగా పోస్టులు భర్తీ చేసింది. కొందరు వైద్యులు ముందస్తు అనుమతి లేకుండా నెలల తరబడి విధులకు హాజరుకాకపోవడంతో రోగులకు సేవలందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులను ఉద్యోగాల నుంచి తొలగించి, ఆ పోస్టులను కొత్తవారితో భర్తీ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఏపీవీవీపీలో కూడా 53 మంది వైద్యులకు ఇదే తరహాలో నోటీసులు ఇచ్చారు.


20 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

సాక్షి, నరసరావుపేట: భారత ఆర్మీ రిక్రూట్‌మెంట్(అగ్నిపథ్) ర్యాలీ పల్నాడు జిల్లా నరసరావుపేటలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆగస్టు 20–26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ శివశంకర్ చెప్పారు. నరసరావుపేట కలెక్టరేట్‌లో బుధవారం ఆర్మీ కల్నల్ పునీత్, జేసీ శ్యాంప్రసాద్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ షార్ట్‌లిస్ట్‌లో ఉన్న అభ్యర్థుల కోసం ర్యాలీ జరగనుందన్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, నెల్లూరు జిల్లాల యువత హాజరుకానున్నారని తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ 8,10 తరగతులు, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్, టెక్నికల్ విభాగాల ఎంపిక కోసం ర్యాలీ నిర్వహించనున్నట్లు కల్నల్ పునీత్ తెలిపారు.

అలవోకగా అబద్ధాలు రామోజీకే చెల్లు

ఈనాడు రామోజీ దిగజారుడుకు ఇది పరాకాష్ట

- సీఎం జగన్ స్వాతంత్ర్య దినోత్సవం సందేశంపై అక్కసు
- కనీస విలువలకు పాతర.. అనైతిక కథనంతో దుష్ప్రచారం
- మంత్రి పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 68 శాతం నిజం కాదా?
- 139 కులాలకు 56 కార్పొరేషన్ల ద్వారా సామాజిక న్యాయం కనిపించదా?
- బీసీలు రాజకీయంగా క్రియాశీలకంగా ఉండడం వల్లే మీకు కడుపు మంట
- గ్రామాల్లోనే పౌర సేవలు, పథకాలు గ్రామ స్వరాజ్యం కాదా?
- మీ బాబులాగా తిప్పించుకోవడం గ్రామ స్వరాజ్యమా?
- చంద్రబాబు ఊహాజనిత పరిశ్రమలు వెళ్లిపోయాయా?
- పోలవరం ప్రాజెక్టు ఆలస్యానికి అసలు కారణం ఎప్పుడైనా రాశావా?



ఏది నిజమో.. ఏది అబద్ధమో కళ్లెదుటే కనిపిస్తున్నప్పటికీ ఈనాడు రామోజీ మాత్రం వాస్తవాలకు గంతలు కడుతున్నారు. తన ఆత్మీయుడు చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రి కుర్చీపై కూర్చోబెట్టాలనే ఆత్రంతో అన్నీ విప్పేయడానికి ఏమాత్రం సందేహించడం లేదు. కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పడంలో విజనరీ అయిన చంద్రబాబును ఆదర్శంగా తీసుకుని తప్పుడు రాతలు రాయడంలో రామోజీ ఆరితేరిపోయారు. ప్రజలేమనుకుంటారనే విషయాన్ని ఎప్పుడో గాలికొదిలేశారు. ప్రతి కథనంలో సీఎం జగన్‌పై, ప్రభుత్వంపై అసూయ, కడుపు మంట స్పష్టంగా కనిపిస్తోంది. ఎంతగా బురద చల్లినా ఇవి 'వైస్రాయ్' నాటి రోజులు కావని తెలుసుకోండి రామోజీ!

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేసిన ప్రసంగంపై అలవోకగా అబద్ధాలంటూ ఈనాడు రామోజీ దుష్ప్రచారం ఆయన దిగజారుడు తనానికి పరాకాష్ట. ఒక పత్రికగా ఈనాడు ఎంతగా దిగజారిపోయిందో చెప్పేందుకు ఇదే కొలమానం. కనీస విలువలకు పాతర వేసి మరీ అనైతిక కథనంతో అక్కసు వెళ్లగక్కారు. నాలుగేళ్లలో వివిధ రంగాల్లో రాష్ట్రం సాధించిన ప్రగతిని, అందుకున్న లక్ష్యాలను వివరణాత్మకంగా, నిర్ధారిత గణాంకాలను ప్రస్తావిస్తూ సీఎం జగన్ ప్రసంగించారు. ఈ అంశాలను నిర్మాణాత్మకంగా ఎత్తిచూపే అవకాశం లేక గాలిని పోగుచేసి, చిల్లర మాటలతో, అసూయ, కడుపు మంటలను కలబోసి.. చంద్రబాబు కోసం తప్పుదన్నట్లు కథనాన్ని ప్రచురించారని ఇట్టే అర్థం అవుతోంది.

రామోజీ.. సూటిగా సమాధానం చెప్పండి

ముఖ్యమంత్రి ప్రసంగంలో చెప్పిన అంశాల్లో ఒక్కటైనా తప్పని, అవాస్తవమని చర్చకు రాగలరా? రాష్ట్ర మంత్రివర్గంలో 68 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందినవారేనని.. ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో నలుగురు ఆయా వర్గాలకు చెందినవారేనన్న దాంట్లో ఒక్క అక్షరమైనా అవాస్తవం ఉందా? ఈ వర్గాలకు ఇలా రాజకీయ అధికారం దక్కడమే మీ ద్వేషానికి కారణమా? వీరంతా స్వేచ్ఛగా పనిచేసుకుంటూ ప్రభుత్వ పాలనా యంత్రాంగంతో మమేకం అవుతుంటే, మునుపెన్నడూ లేని రీతిలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే మీకు వచ్చేది కడుపుమంటకాక మరేమిటి రామోజీ?

అసూయ, ద్వేషం..

మేనిఫెస్టోలో ఈ హామీలు ఇచ్చాం. వీటిని నెరవేర్చాం.. అని ఈ మంత్రులే కాదు, ఈ వర్గాలకు చెందిన వారు గడప గడపకూ భరోసాగా వెళ్తుంటే, వారికి ప్రజలు బ్రహ్మరథం పడుతుంటే, ఏమైనా చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని అక్కడికక్కడే సరిదిద్దుతుంటే మీకు నచ్చడం లేదు. ఇది వాస్తవం. అందుకే సీఎం జగన్ పట్ల మీకు అసూయ, ద్వేషం. మైనారిటీ, ఎస్టీలకు చివరి నెల వరకు మంత్రి పదవులు ఇవ్వకపోయినా నాటి బాబు పాలనలో మీకెందుకు కనిపించలేదు రామోజీ? నాడు సీఎం కుర్చీ మీద మీ బాబు ఉన్నాడనే కదా! బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ద్రోహి అయిన చంద్రబాబును భుజానికెత్తుకుని ఆ వర్గాలకు తీరని అన్యాయం చేసిన మాట వాస్తవం కాదా? 14 ఏళ్ల బాబు పాలనలో ఈ వర్గాలకు చేసిందేమిటి?

వీరందరూ కనిపించడం లేదా?

వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారాం ఉన్నారు. శాసనమండలి చైర్మన్‌గా ఎస్సీ కులానికి చెందిన మోషేన్‌రాజు, మండలి డిప్యూటీ చైర్మన్‌గా మైనార్టీకి చెందిన మహిళ జకియా ఖానమ్ ఉన్నారు. ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరు మహిళలు మేకతోటి సుచరిత, తానేటి వనితలు హోంమంత్రులయ్యారు. విద్యాశాఖ, మున్సిపల్ శాఖ లాంటి ఉన్నత శాఖలు ఎస్సీ అయిన ఆదిమూలపు సురేష్‌కు ఇచ్చారు. ఎస్టీ అయిన రాజన్నదొరకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారు. బీసీ కులానికి చెందిన బూడి ముత్యాలనాయుడుకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారు. బీసీ అయిన విడదల రజనికి కీలకమైన వైద్య, ఆరోగ్య శాఖ ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని ఈ ప్రభుత్వం గర్వంగా చెప్పగలదు.

రైతుల్లో భరోసాతో బాబు, రామోజీల బెరుకు

మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను ఉన్నది ఉన్నట్టుగా ఈ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇచ్చిన హామీకంటే మిన్నగా అమలు చేస్తోంది. విత్తనం నుంచి విక్రయం దాకా రైతుకు తోడుగా నిలుస్తుంటే, ఈ విధానాలతో రైతుల్లో భరోసా నింపితే సహజంగానే చంద్రబాబు, రామోజీరావుకు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఉచిత పంటల బీమా, ఏ సీజన్లో నష్టం జరిగితే అదే సీజన్లో పంట నష్టపరిహారం, ఆక్వా జోన్లలో రూ.1.5కే కరెంటు, పాడి రైతుకు పాల వెల్లువ ఇలా ప్రతి కార్యక్రమంలో ప్రగతి వీరికి కంటగింపే. అందుకే రైతు భరోసా విషయంలో పసలేని, పనికిమాలిన వాదనను లేవనెత్తారు. మేనిఫెస్టోలో సీఎం జగన్ ఇచ్చిన హామీ ఏడాదికి రూ.12,500, నాలుగేళ్లపాటు ఇస్తామని. కానీ ఇస్తున్నది రూ.13,500, నాలుగేళ్ల స్థానంలో ఐదేళ్లపాటు ఇస్తున్నారు. ఇచ్చిన హామీ కన్నా మిన్నగా ఇస్తే తప్పని రామోజీరావు సొంత భాష్యం చెబుతుండటం దుర్మార్గం. కేంద్ర నిధులు కలుపుకుని ఎలా చెబుతారని రామోజీ వింత ప్రశ్న వేశారు.

బాబు సొంత జేబు నుంచి ఖర్చు చేశాడా?

అసలు బడ్జెట్ అంటే ఏంటి రామోజీ? నిధులు ఎలా వస్తాయో.. ఎలా ఖర్చు చేస్తారో తెలియదా? ఏ రాష్ట్ర ప్రభుత్వం అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పన్నుల వాటా, గ్రాంట్లు, ఆర్థిక సహాయం, అలాగే రాష్ట్రానికి సొంతంగా వచ్చే ఆదాయాలు, వివిధ ఆర్థిక సంస్థల నుంచి తీసుకునే రుణాలు.. ఇవన్నీ కలిపి బడ్జెట్ అంటారు. ఏ స్కీమైనా అమలు చేసేది ఈ వనరులతోనే. అలాంటప్పుడు వేర్వేరుగా చూడ్డం అన్నది మీ సంకుచిత బుద్ధి కాదా? చంద్రబాబు హయాంలో ఇలా కాకుండా బడ్జెట్లు వేరేలా ఉండేవా? బాబు సొంత జేబు నుంచి ఖర్చు చేశాడా?

శాశ్వత ఉద్యోగులు కనిపించడం లేదా?

గ్రామాల్లో పరిపాలన నిర్వీర్యమైనట్టుగా మరో విచిత్ర వాదనను రామోజీ లేవనెత్తారు. గ్రామాలను పునరుజ్జీవింపచేసేలా ఈ ప్రభుత్వం తీసుకున్న చర్యలు గతంలో ఎప్పుడైనా, దేశంలో ఎక్కడైనా జరిగాయా? మన గ్రామంలోనే 10 నుంచి 11 మంది శాశ్వత ఉద్యోగులు సేవలందించడం ఎక్కడైనా జరిగిందా? ప్రతి 50 ఇళ్లకు ఇక వలంటీర్ చొప్పున వారి గడప వద్దకే సేవలు అందించడం ఎప్పుడైనా చూశారా? ఇంతగా ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుతుంటే పల్లెలు వెలిగినట్టా? నిర్వీర్యమైనట్టా? ఒక గ్రామ, వార్డు సచివాలయం, ఒక విలేజ్ క్లినిక్, నాడు– నేడు ద్వారా రూపు దిద్దుకున్న పాఠశాల, మెరుగులు దిద్దుకున్న అంగన్ వాడీ, రైతు భరోసా కేంద్రం.. ఇలా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి గ్రామాలకు ఉజ్వల భవిష్యత్తు అందిస్తుంటే.. వాటిని నిర్వీర్యంగా చూడ్డం మీ సంకుచిత బుద్ధికి నిదర్శనం.

బీసీలు క్రియాశీలకం కావడంతో కంటగింపు

కార్పొరేషన్లు ఉత్సవ విగ్రహాల్లా ఉన్నాయని రామోజీ అక్కసు వెళ్లగక్కారు. నిజానికి సామాజిక చైతన్యంలో భాగంగా 139 కులాలకు 56 కార్పొరేషన్లను వైఎస్ జగన్ సర్కారు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఆయా కులాలకు చెందిన 56 మంది చైర్మన్లుగా నియమింపబడ్డారు. మరో 672 మంది డైరెక్టర్లు అయ్యారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంత మంది బీసీలకు పదవులు దక్కడం, వారు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో మమేకమై ప్రజా ప్రయోజనాలకు కృషి చేయడం గతంలో ఎప్పుడైనా జరిగిందా? వివిధ ప్రభుత్వ పథకాలకు నిధులు ఈ కార్పొరేషన్ల ద్వారా వెళ్లి, ఆయా కులాలకు న్యాయం జరిగితే మీకు బాధ ఏమిటి రామోజీ? ఇంత ప్రక్రియ కనిపిస్తుంటే క్రియాశీలకంగా లేనట్టా? రూ.2.33 లక్షల కోట్ల డీబీటీలో ఈ కులాల పాత్ర లేదా?

పేద వాడికి భూమిపై హక్కు ఉండకూడదా?

చంద్రబాబు హయాంలో రైతులెవ్వరైనా కంటి నిండా నిద్రపోయారా? వెబ్‌ల్యాండ్ పేరు పెట్టి ఇష్టానుసారం రికార్డులు మార్చేసి రైతులకు నిద్ర లేకుండా చేసింది చంద్రబాబు కాదా? తరాల తరబడి సాగులో ఉన్నా, ఆ చిన్న, సన్నకారు రైతులపై ఆంక్షల కొరడాపెట్టి వారి జీవితాలను సుడిగుండంలో పెట్టిన దరిద్రమైన పాలన మీ చంద్రబాబుది కాదా రామోజీ? వీరికి పూర్తి ఊరట నిస్తూ ఈ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటే అది తప్పు అవుతుందా? అంటే పేదలకు, చిన్న, సన్నకారు రైతులకు మేలు చేయకూడదా? 19.17 లక్షల కుటుంబాలకు, 34.72 లక్షల ఎకరాలపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం. ఫిల్మ్ సిటీ రూపంలో వేల ఎకరాల భూములు మీకు ఉండొచ్చు. పేదవాడికి హక్కుతో కూడిన భూమి ఉండొద్దా?

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడేది మీరా!

ప్రజాస్వామ్యం, హక్కులను అణిచి వేసింది ఎవరు రామోజీ? అసలు చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం ఎక్కడుంది? 23 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, వారికి మంత్రి పదవులు ఇచ్చినప్పుడు ప్రజాస్వామ్యం ఎక్కడకు పోయింది? ఒక మహిళా శాసనసభ్యురాలిని నిబంధనలకు విరుద్ధంగా ఏడాది పాటు శాసనసభకు దూరం చేస్తే ప్రజాస్వామ్యం ఏమైపోయింది? అప్పుడు ఈ ఘోరాలు కనిపించలేదా? పత్రికా స్వేచ్ఛ నీడలో మీరు ఎన్ని దారుణాలకు పాల్పడుతున్నారో ఒకసారి గుర్తు చేసుకోండి. మొన్నటికి మొన్న పట్టాభిని కొట్టారంటూ తప్పుడు ఫొటో వేసి ప్రజలను తప్పుదోవపట్టించారు. ఎల్లో మీడియా మనుషులు ప్రతిరోజూ రాష్ట్రంలో ఉద్రిక్తతలను, హింసను ప్రేరేపించడానికి చేయని ప్రయత్నం లేదు. ఇలాంటి వాటిపై ప్రజా ప్రభుత్వం చట్టప్రకారం నడుచుకుంటుంది. నిజాయితీగా విలువలు పాటించే కోట్ల మంది ప్రజలు ఈ రాష్ట్రంలో స్వేచ్ఛగా ఉంటున్నారన్నది నూటికి నూరు శాతం నిజం.

పరిశ్రమలపైనా ఏడుపే..

రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలు ఏంటో రామోజీరావు చెప్పాలి. చంద్రబాబు ఊహాజనిత పరిశ్రమలు వెళ్లిపోయాయా? ఆయన పేపర్ల మీద కలలుగన్న పరిశ్రమలు వెళ్లిపోయాయా? 2019 జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 127 భారీ పరిశ్రమలు వచ్చాయి. వీటి ద్వారా రూ. 67,196 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. తద్వారా 84,607 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. మరి ఈ గణాంకాలతో విభేదించే ఆధారాలు మీ దగ్గర ఉన్నాయా రామోజీ? ఈ పరిశ్రమలు రాలేదని ఆధారాలు చూపించగలరా? రూ.18 లక్షల కోట్లు విలువైన పరిశ్రమలు వచ్చేశాయని కాగితాలపై కల్లబొల్లి ఒప్పందాలు చూపించి, పరిశ్రమలు వచ్చేసినట్టుగా చంద్రబాబు చెప్తే అవి నిజాలని మీరు ప్రజలను నమ్మించడానికి విఫలయత్నం చేయడం నిజం కాదా?

పోలవరం పాపం బాబుది కాదా?

పోలవరం ప్రాజెక్టు ఆలస్యానికి పాపం ఎవరిది? ఎప్పుడైనా దాని గురించి రాశావా? పోనీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా పని చేసిన తొమ్మిదేళ్లలో పోలవరం కోసం నువ్వు ఉద్యమాన్ని నడిపావా? ఒక్క వార్త అయినా ఈ ప్రాజెక్టు కోసం రాశావా? ఈ ప్రాజెక్టు పనులను నామినేషన్ పద్ధతిలో మీ వియ్యంకుడికి దోచిపెట్టిన చరిత్ర మీది కాదా? మీ బాబు కమీషన్ల కక్కుర్తి వల్లే డయాఫ్రం వాల్ దెబ్బతింది. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన, క్లిష్టమైన స్పిల్ వే, రేడియల్ గేట్లు, ఎగువ కాఫర్‌డ్యామ్ మిగిలిపోయిన పనులు, దిగువ కాఫర్‌డ్యామ్ పనులు, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్.. ఈ పనులన్నీ పూర్తి చేసింది వైఎస్ జగన్ ప్రభుత్వం కాదా?

యాతన ఎవరికి?

- సచివాలయాల ఉద్యోగులపై రామోజీ డ్రామాలు
- ఇన్నాళ్లూ వృథా వ్యవస్థ అంటూ బురద రాతలు
- ఇప్పుడు పనిభారం పెరిగిందంటూ మొసలి కన్నీళ్లు

సాక్షి, అమరావతి: దేశమంతా ప్రశంసిస్తున్న సచివాలయాల వ్యవస్థపై బురద చల్లేందుకు రామోజీ చేయని ప్రయత్నం లేదు! అవన్నీ బెడిసికొట్టడంతో ఈసారి రూటు మార్చి ఉద్యోగులపై ఎనలేని ప్రేమ నటిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల వ్యవధిలోనే 1.34 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం దేశ చరిత్రలోనే ఓ రికార్డు. ప్రతి 2,000 జనాభాకు ఒకటి చొప్పున గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి పౌర సేవలను ప్రజల వద్దకే చేర్చారు. ఒక్కో సచివాలయంలో 10–11 మంది శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇన్నాళ్లూ అసలీ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థే వృథా అంటూ కథనాలు అచ్చేసిన రామోజీ ఇప్పుడు వారిపై పని భారం పెరిగిందంటూ మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు!!

ఈనాడు ఆరోపణ: సచివాలయాల ఉద్యోగులు అరకొర జీతాలతో ఇబ్బందులు పడుతున్నారు.

వాస్తవం: మూడున్నర ఏళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు రెట్టింపు జీతాలు పొందుతున్నారు. అందరు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ప్రొబేషన్ ఖరారు చేయడంతో పాటు 2022 జనవరిలో ప్రకటించిన పే రివిజన్ (11 పీఆర్సీ) ప్రకారం పే స్కేళ్లను నిర్ధారించి ప్రభుత్వం ప్రతి నెలా జీతాలు చెల్లిస్తోంది. 2018లో పీఆర్సీ ఏర్పాటు నాటికి సచివాలయ ఉద్యోగుల కేడర్ లేదు. పీఆర్సీ కమిటీ కూడా ప్రొబేషన్ ఖరారు అనంతరం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు 2015 పే రివిజన్ ప్రకారమే వేతనాలు చెల్లించాలని సిఫార్సు చేసింది. ఆ ప్రకారం గ్రేడ్ –5 పంచాయతీ సెక్రటరీలు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల వేతనం డీఏ, హెచ్‌ఆర్ఏతో కలిపి రూ.19,241 ఉంటుంది. మిగిలిన 17 రకాల కేటగిరీ ఉద్యోగుల వేతనం డీఏ, హెచ్‌ఆర్ఏతో కలిపి రూ.18,691 ఉంటుంది. అయితే సచివాలయ ఉద్యోగులకు నోటిఫికేషన్‌లో పేర్కొన్న పాత పే స్కేళ్లకు బదులుగా అందరు ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న మాదిరే 11 పీఆర్సీ (2022 పే రివిజన్) ప్రకారం కొత్త పే – స్కేళ్లు అమలు చేయాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం తీసుకున్నారు. సీఎం తీసుకున్న నిర్ణయంతో ఒక్కో సచివాలయ ఉద్యోగి వేతనం దాదాపు రూ. పది వేలు పెరిగింది.

ఈనాడు ఆరోపణ: ప్రభుత్వం అన్ని పనులను సచివాలయాల ఉద్యోగులకే చెబుతోంది. జాబ్‌చార్ట్ కంటే అదనపు పనులు అప్పగిస్తోంది.

వాస్తవం: సచివాలయ ఉద్యోగులందరూ శాఖలవారీగా పనుల బాధ్యతను పంచుకుంటారు. అదనపు పని భారానికి అవకాశం లేదు. సచివాలయ ఉద్యోగులకు తమ పరిధిలో అందరూ తెలిసిన వారే ఉంటారనే ఉద్దేశంతో ఓటర్ల జాబితా ప్రక్రియలో తప్పులకు అవకాశం లేకుండా బీఎల్వో బాధ్యతలను కొన్ని చోట్ల అప్పగించారు. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సెక్రటరీలకు ఇంటి పన్ను వసూళ్ల బాధ్యత అప్పగించారన్న ఆరోపణల్లో నిజం లేదు. సచివాలయాల పరిధిలో పాఠశాలలను మాత్రం వారు సందర్శిస్తుంటారు. యూజర్ చార్జీల వసూలు శానిటేషన్ కార్యక్రమాల కిందకే వస్తుందని అధికారులు వెల్లడించారు.

ఈనాడు ఆరోపణ: సచివాలయాల ఉద్యోగులు పది వేల మంది రాజీనామా చేశారు.

వాస్తవం: అది పూర్తిగా అవాస్తవం. రాష్ట్రవ్యాప్తంగా 11,162 గ్రామ సచివాలయాల్లో 1,04,694 మంది, 3,842 వార్డు సచివాలయాల్లో 34,604 మంది ఉద్యోగులు కలిపి మొత్తం 1.39 లక్షల మంది (పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో కలిపి) ఉద్యోగులు పనిచేస్తుంటే 2019 నుంచి ఇప్పటి వరకు 6,830 మంది రాజీనామా చేశారు. రాజీనామా చేసిన ఉద్యోగులలో 90 శాతం మంది మంచి కంప్యూటర్ పరిజ్ఞానం, బీటెక్ లాంటి ఉన్నత కోర్సులు చదివినవారే. 5 – 10 రెట్లు ఎక్కువ జీతం రావడంతో ప్రభుత్వ ఉద్యోగం వదిలి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల వైపు వెళ్లినట్లు అధికారుల పరిశీలనలో తేలింది.

ఈనాడు ఆరోపణ: గ్రేడ్ –5 పంచాయతీ కార్యదర్శులకు అధికారాలు కల్పించకపోవడంతో ఉత్సవ విగ్రహాలుగా మారారు.

వాస్తవం: గ్రేడ్ –5 పంచాయతీ కార్యదర్శులు రోజువారీ నిర్వహించాల్సిన విధులకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ జీవోలు 149, 2 విడుదల చేసింది. ఈనాడు తన కథనంలో ఒకవైపు సచివాలయాల ఉద్యోగులపై అదనపు పనిభారం మోపారంటూ మరోవైపు అధికారాలు లేకపోవడంతో ఉత్సవ విగ్రహాలు మాదిరిగా మారారంటూ పరస్పర భిన్నాభిప్రాయాలను వెలువరించింది.

ఈనాడు ఆరోపణ: పలువురు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఇంకా ప్రొబేషన్ ఖరారు చేయలేదు.

వాస్తవం: 2019, 2020లో ఇచ్చిన నోటిఫికేషన్ల ద్వారా మొత్తం 1,18,334 మంది ఉద్యోగాలు పొందగా 548 మందిపై క్రమశిక్షణ కేసులు పెండింగ్‌లో ఉండడం, 751 మంది డిపార్ట్‌మెంట్ టెస్టులు పాస్ కాకపోవడం, 905మంది దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం లాంటి కారణాలతో రెండేళ్ల సర్వీసు పూర్తి కాకపోవడంతో ప్రొబేషన్ ఖరారు పొందలేకపోయారని సచివాలయాల శాఖ పేర్కొంది. మొత్తం ఉద్యోగుల్లో 98.14% మంది ప్రొబేషన్ ఖరారు ప్రక్రియ పూర్తవగా 1.86% మందే పైనపేర్కొన్న కారణాలతో ప్రొబేషన్ ఖరారు పరిధిలోకి రాలేకపోయారు.

నేరుగా ప్రభుత్వం నుంచే వైఎస్సార్ బీమా పరిహారం

సాక్షి, అమరావతి: అసంఘటిత కార్మికుడు మరణించడం లేదా శాశ్వత వైకల్యానికి గురైన సందర్భాల్లో ఆయా కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం కింద అందించే పరిహారాన్ని నేరుగా ప్రభుత్వమే చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కార్మిక శాఖ కార్యదర్శి డాక్టర్ హరిజవహర్‌లాల్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. 18–50 ఏళ్ల కార్మికులు సహజంగా మరణిస్తే రూ.లక్ష, 18–70 ఏళ్ల వారు ప్రమాదవశాత్తు మరణించినా/శాశ్వత వైకల్యానికి గురైనా రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నారు. గ్రూప్ యాక్సిడెంటల్ పాలసీ గడువు గత నెల 15తో ముగిసింది. ఈ క్రమంలో 2023–24కు టెండర్లు ఆహ్వానించగా.. మునుపటి ఏడాదితో పోలిస్తే ఎల్–1 సంస్థ 37.63 శాతం ఎక్కువ ప్రీమియంతో బిడ్ దాఖలు చేసింది. ఇంత ఎక్కువ మొత్తంలో ప్రీమియం చెల్లింపు ద్వారా ప్రజాధనం వృథాతో పాటు, ఆ కంపెనీ పరిహారం చెల్లింపు సమయంలో పెట్టే కొర్రీలతో నిరుపేదలకు నష్టం వాటిల్లుతున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. ఈక్రమంలో నేరుగా పరిహారాన్ని ప్రభుత్వం నుంచి చెల్లింపునకు నిర్ణయం తీసుకుంది. ఈ విధానంలో కార్మిక శాఖ నోడల్ ఏజెన్సీగా, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా ఉంటాయి. వలంటీర్లు, సచివాలయాల ద్వారా దరఖాస్తులను సేకరించి ఏపీ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు పంపిస్తే ఈ సంస్థ పరిశీలిస్తుంది. అనంతరం వైఎస్సార్ బీమా పోర్టల్ ద్వారా పరిహారాల చెల్లింపు ప్రక్రియను సచివాలయాల శాఖ చేపడుతుంది.

బొట్లపాలెం ఘటనలో నిందితుల అరెస్ట్

- నిమిషాల వ్యవధిలో ఘటన స్థలానికి వెళ్లి బాధితురాలిని కాపాడిన పోలీసులు
- రోజు గడవకు ముందే నిందితుల అరెస్ట్
- నిందితులకు ఈ నెల 29 వరకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మలికాగర్గ్



ఒంగోలు టౌన్/దర్శి: కులాంతర వివాహం కేసులో దళిత మహిళను బంధించి పెట్రోలు పోసి హతమార్చేందుకు ప్రయత్నించిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రకాశం జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ మలికా గర్గ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. దర్శి మండలం బొట్లపాలేనికి చెందిన గంగిరెడ్డి బ్రహ్మారెడ్డి, పుల్లమ్మల కుమార్తె భార్గవి.. అదే గ్రామానికి చెందిన దళితుడు జక్కుల సాయిరాంను ప్రేమించి పెళ్లి చేసుకుంది. తమ కుమార్తె కులాంతర వివాహం చేసుకోవడం ఇష్టంలేని బ్రహ్మారెడ్డి దంపతులు ఆ కుటుంబంపై కక్ష పెంచుకున్నారు. సోమవారం అర్ధరాత్రి మంచినీళ్లు పట్టుకునేందుకు కొళాయి వద్దకు వెళ్లిన సాయిరాం తల్లి అనురాధ, సోదరి కామునూరి మౌనిక మీద దాడి చేసి విచక్షణరహితంగా కొట్టారు. మౌనికను దుస్తులు చింపేసి ఈడ్చుకుంటూ తీసుకెళ్లారు. తమ ఇంటి వరండాలో ఆమెను తాళ్లతో కట్టేసి పెట్రోలు పోసి హతమార్చేందుకు యత్నించారు. అయితే ఈ లోపు అనురాధ స్థానికుల సాయంతో 100కు కాల్ చేయడంతో వెంటనే దర్శి ఎస్ఐ డి.రామకృష్ణ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని యువతిని కాపాడారు. చికిత్స నిమిత్తం పోలీస్ వాహనంలో దర్శి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఎస్పీ ఆదేశాల మేరకు ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేసిన దర్శి డీఎస్పీ టి.అశోక్‌వర్ధన్.. మంగళవారం మధ్యాహ్నం తూర్పు గంగవరం బస్టాండ్ సెంటర్‌లో నిందితులను అరెస్ట్ చేశారు. ఘటన జరిగిన నిముషాల్లోపే అక్కడికి చేరుకున్న పోలీసులు గంటలోపే కేసు రిజిస్టర్ చేశారు. వీలైనంత త్వరగా కోర్టులో చార్జిషీటు దాఖలు చేస్తామని, నిందితులకు శిక్ష పడేలా చేస్తామని ఎస్పీ వివరించారు. కాగా, దళిత మహిళలపై దాడి ఘటనలో నిందితులు గంగిరెడ్డి బ్రహ్మారెడ్డి, భార్య పుల్లమ్మలకు ఈ నెల 29 వరకు రిమాండ్ విధిస్తూ బుధవారం దర్శి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.



మూసుకొని ఉన్న నోరు ఈగలను పట్టలేదు.
- మిగెల్ సెర్వాంటిజ్

సాక్షి
గురువారం, 17 ఆగస్టు 2023

అభివృద్ధి అనకొండ!

విపరీతమైన వానలు, దాంతో వరదలు, విలయం. బీభత్సం ముగిసిందని అనుకొనే లోగానే నెల రోజుల్లో రెండోసారి హిమాచల్‌ప్రదేశ్‌పై ప్రకృతి పంజా విసిరింది. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నదులు, విరిగిపడుతున్న కొండచరియలు, పేకముక్కల్లా కూలుతున్న భవనాలు, నేలవాలుతున్న భారీ వృక్షాలు, కోసుకుపోయిన రోడ్లు, వంతెనలు, శిథిలాల్లో చిక్కుకున్న ప్రాణాలతో పర్వత ప్రాంత రాష్ట్రం అతలాకుతలమైంది. పెరుగుతున్న గంగమ్మ వరదలో ఉత్తరాఖండ్ ఉసూరుమంటోంది. ప్రమాదకర స్థాయిలో సాగుతున్న యమున మళ్ళీ ఢిల్లీ సహా పలు ప్రాంతాల్ని భయపెడుతోంది. జూన్ ద్వితీయార్ధం నుంచి జూలై చివరి వరకు వానలు, వరదలు ఒక్క హిమాచల్‌లోనే 150 మందిని బలిగొని, రూ. 10 వేల కోట్ల పైగా నష్టం కలిగిస్తే, తాజా విలయం ఇప్పటికే 60 మందిని పొట్టనబెట్టుకొంది.

హిమాలయాలు, దేశ కోస్తా ప్రాంతాలపై వాతావరణ పర్యవసానాలు గట్టి దెబ్బ కొట్టనున్నాయని 'ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్' (ఐపీసీసీ) 6వ నివేదిక పేర్కొంది. హిమాలయాల్లో సగటు ఉష్ణోగ్రత మిగతా దేశంతో పోలిస్తే వేగంగా పెరుగుతోంది. ఈ వర్షాకాలం అసాధారణ రీతిలో కురుస్తున్న వర్షాలు అందుకు తగ్గట్టే ఉన్నాయి. స్వల్పవ్యవధిలో భారీ వర్షం కురిపించే మేఘపతనం, ఆకస్మిక వరదలకు వాతావరణ మార్పులు కొంత కారణమే. అయితే, మనసును కుదిపేసే ఈ బీభత్సానికి మతి లేని అతి అభివృద్ధికి దిగిన మానవ తప్పిదాలే ప్రధాన హేతువు. పుడమి తల్లిని పట్టించుకోకుండా కొండల్ని తొలిచి, శిథిలావశేషాల్ని నదుల్లో పడేసి, ఇష్టారాజ్యంగా సాగిన అక్రమ గనుల తవ్వకాలు, సహజమైన నదీ ప్రవాహాల్ని నిరోధించిన నిర్మాణాలు, అశాస్త్రీయంగా చేపట్టిన భారీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు కలిసి హిమాచల్ మెడకు ఉరితాళ్ళయ్యాయి.

హిమాలయాల్లో వరదలు, విరిగిపడే కొండచరియలు కొత్త కాదు. అందులోనూ హిమాచల్‌లోని మొత్తం 12 జిల్లాల్లో కొండచరియల పతనం తరచూ తప్పదని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎప్పుడో తేల్చింది. అంత సున్నితమైన ఈ హిమాలయ పర్వతశ్రేణుల్లో ప్రగతి పేరుతో పాలకులు చేతులారా ప్రకృతి విధ్వంసం చేశారు. ఫలితంగా కొన్నేళ్ళుగా ఏటవాలు ప్రాంతాలు మరింత అస్థిరమయ్యాయి. కేవలం 2020 నుంచి 2022 మధ్య కొండచరియల పతనాల సంఖ్య ఆరు రెట్లు పెరిగిందని డేటా. ఈ పర్వతసానువుల్లో గత పదేళ్ళలో ఇష్టారాజ్యంగా రోడ్లు విస్తరించారు. ఏకంగా 69 నేషనల్ హైవే ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. నాలుగు లేన్ల హైవేలు వాటిలో అయిదున్నాయి. హిమాలయాల్లో ఇప్పటికే 168 జల విద్యుత్కేంద్రాలుంటే, 2030 నాటికి 1088 కేంద్రాలు రానుండడం శోచనీయం. పర్యావరణాన్ని పట్టించుకోని ఈ అంధ ఆర్థికాభివృద్ధి మంత్రం ఇక్కడికి తెచ్చింది. పద్ధతీ పాడూ లేకుండా కొండల తవ్వకాలు, మతి లేకుండా రోడ్ల నిర్మాణం, నిర్మాణ వ్యర్థాలను ఏమి చెయ్యాలనే ఆలోచనైనా లేకపోవడంపై హిమాచల్ హైకోర్ట్ నిరుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

గమనిస్తే – దాదాపు ప్రతి వర్షాకాలం ఉత్తరాదిలో అస్సామ్, ఒడిశా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లాంటి రాష్ట్రాలు వానలు, వరదలతో అతలాకుతలమవుతున్నాయి. గతంతో పోలిస్తే వరదల సంఖ్య, ఆస్తి, ప్రాణనష్టాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. వరదల నివారణకు సమర్థమైన ప్రణాళిక లోపిస్తోంది. ఈ తప్పు కూడా పాలకులదే తప్ప ప్రకృతిది కాదు. మన దేశంలో 4 కోట్ల హెక్టార్లకు పైగా ప్రాంతం, అంటే దేశ భూభాగంలో దాదాపు 12 శాతానికి వరదల ముప్పుందని లెక్క. భూకంపాల లాంటి ప్రకృతి వైపరీత్యాలతో పోలిస్తే వరదల్ని ముందే అంచనా వేయడం, అడ్డుకోవడం చేయదగిన పనే. కానీ ప్రభుత్వాలు ఆ పనీ చేయట్లేదు. అనేక రాష్ట్రాల్లో వరద ముంపునకు ఇష్టారాజ్యంగా అడవుల నరికివేత, నదీ పరివాహక ప్రాంతాల్లోని వృక్షచ్ఛాయల విధ్వంసం, పేరుకున్న పూడికలతో నదికి నీటిని నిల్వచేసే సామర్థ్యం తగ్గిపోవడం... ఇలా అనేక కారణాలు. దానికి తోడు నదీ తలాలు, నదీ మైదానాల ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. డ్యామ్‌ల వరద గేట్ల నిర్వహణలో సమన్వయ లోపాలు సరేసరి. ఈ స్వయంకృతాలన్నీ శాపాలవుతున్నాయి.

విచిత్రం ఏమిటంటే – వరద పరిస్థితుల్లో సత్వర చర్యలు పర్యవేక్షించేందుకు దేశంలో ఒకే విభాగమంటూ ఏదీ లేకపోవడం! ఆ మాటకొస్తే, వరదల నిర్వహణకు మన రాజ్యాంగంలో నిర్ణీత ఏర్పాటేదీ లేదు. వాతావరణ శాఖ వర్షసూచనలు చెబితే, వరద ముప్పు సూచనలు చెప్పే బాధ్యత కేంద్ర జల సంఘానిది. వరద ముంపునకు గురయ్యాక సహాయ, పునరావాస చర్యలు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో ప్రకృతి వైపరీత్యాల సహాయ సంస్థలున్నాయి. బాధితుల పునరావాసం, దెబ్బతిన్న ప్రాథమిక వసతుల పునరుద్ధరణ బాధ్యత స్థానిక సంస్థలది. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయం కీలకం. ఇంకా విడ్డూరం – నీరు, సాగునీటి పారుదల, తదితర అంశాలన్నీ రాష్ట్ర జాబితాలోవే కానీ, వరదల్లో సహాయ బాధ్యతల నిర్వహణ మాత్రం కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలు వేటిలోనూ లేకపోవడం!

పదే పదే వరదల ముప్పు తలెత్తుతున్న వేళ ఈ కీలక అంశాలపై కేంద్ర పెద్దలు తక్షణం సమగ్రంగా దృష్టి పెట్టాలి. 1970లలో నెలకొల్పిన 'వరదలపై జాతీయ కమిషన్' తరహాలో వరదల సమస్యలపై ఆచరణాత్మక వ్యూహాన్ని సూచించేలా ఉన్నత స్థాయి నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేయాలి. ఇకనైనా వరదలపై అన్ని విభాగాలనూ సమన్వయ పరిచే సమగ్ర విధానం అత్యవసరం. అదే సమయంలో సున్నితమైన పర్యావరణాన్ని గౌరవించాలి. లేకపోతే తలెత్తే దుష్పరిణామాలకు హిమాలయ బీభత్సం ప్రతీక. మరి, ఈ మాటైనా హిమాలయాల మాట చెవికెక్కించుకుంటారా?

చదరంగ విప్లవం ముంగిట్లో భారత్!

విశ్లేషణ



విశ్వనాథన్ ఆనంద్

దశాబ్ద కాలంలోనే భారత్‌లో యాభై మంది చెస్ గ్రాండ్‌మాస్టర్లు అవతరించారు. చెస్ ఒలింపియాడ్‌లలో మనవాళ్లు శక్తిమంతమైన స్థానాల్లో నిలిచారు. తాజాగా భారత చదరంగ క్రీడాకారుల హవా చెస్ వరల్డ్ కప్‌లోనూ కొనసాగుతోంది. ఎంతోమంది యువకులు ప్రపంచ యవనికపై తమదైన ముద్ర వేస్తున్నారు. చెస్‌కు ఇప్పుడు అనుకూలమైన వాతావరణం ఉంది. ప్రాయోజకత్వమూ లభిస్తోంది. అయితే దేశంలో చదరంగ విప్లవానికి ఇది నాంది మాత్రమే. ముందుముందు జరగాల్సింది చాలా మిగిలి ఉంది. దశాబ్ద కాలంలో ప్రపంచ చదరంగంలో భారత్ తిరుగులేని శక్తి అవుతుందా? ఇంకో భారతీయుడు ప్రపంచ ఛాంపియన్‌గా అవతరిస్తాడా? ఏమైనా, భారతీయ చదరంగం పక్వానికి వచ్చిందని మాత్రం తప్పక చెప్పవచ్చు.

బిందువు బిందువు సింధువైనట్లు... ముందు కొంతమంది యువ ప్రతిభావంతులు చెస్ గ్రాండ్ మాస్టర్లుగా ఎదిగారు. ఆ తరువాత పరిపక్వత లక్షణాలు స్పష్టంగా కనిపించడం మొదలైంది. చెస్ ఒలింపియాడ్‌లలో మనవాళ్లు శక్తిమంతమైన స్థానాల్లో నిలిచారు. తాజాగా భారత చదరంగ క్రీడాకారుల హవా చెస్ వరల్డ్ కప్‌లోనూ కొనసాగుతోంది. భారతీయ చదరంగ చరిత్రలో డి.గుకేశ్, ఆర్.ప్రజ్ఞానంద నేతృత్వంలో సువర్ణ అధ్యాయం మొదలైంది. వీరితోపాటు ఎంతోమంది యువకులు ప్రపంచ యవనికపై తమదైన ముద్ర వేస్తున్నారు. కొత్త కొత్త ఎత్తులను అధిరోహిస్తున్నారు.

గత ఏడాది చెస్ ఒలింపియాడ్ సందర్భంగా భారతీయ క్రీడాకారుల ఆటతీరును గమనించినప్పుడు ఇలాంటిది ఏదో జరగాలని మనం ఆశించాము. ఆ పోటీల్లో ఇండియా–బి బృందం ఓపెన్ కేటగిరిలో కాంస్య పతకం సాధించింది. మహిళా క్రీడాకారులు కూడా కాంస్య పతకం గెలుచుకున్నారు. అయితే ఫైడ్ చెస్ ర్యాంకింగ్‌లో గుకేశ్ టాప్–10లో ఒకడిగా ఎదగడంతో మిగిలిన వారు కూడా ఇప్పుడు మరింత శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చదరంగంలో అతితక్కువ కాలంలో వచ్చిన ఈ గుణాత్మక మార్పునకు కారణాలు ఎన్నో. చెస్‌కు అనుకూలమైన వాతావరణం ఉంది. ప్రాయోజకత్వమూ లభిస్తోంది. ఆటగాళ్లకూ, ఆటకూ ఎక్స్‌పోజర్ కూడా బాగుంది. అత్యున్నతస్థాయి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. నైపుణ్యానికి కొరతే లేదు. దేశంలో చదరంగం మరింత ఎదిగేందుకు ఈ నైపుణ్యమే కీలకం.

విస్తృతస్థాయిలో నైపుణ్యం ఉండటం పోటీతత్వాన్ని పెంపొందిస్తుంది. ఇది కాస్తా ఆటగాళ్లు మరింత రాటుదేలేందుకు ఉపయోగపడుతుంది. భారత్ తరఫున ఇప్పుడు చెస్ ఒలింపియాడ్ లేదా వరల్‌కప్ పోటీల్లో పాల్గొనాలంటే అత్యున్నత స్థాయి ఆట ఆడాల్సి ఉంటుంది. మనకేం ఫర్వాలేదు అనుకునే అవకాశం ఏ ఆటగాడికీ ఉండదు. అందరూ మునివేళ్లపై నుంచోవాల్సిందే. నిజాయితీగా ఉండాల్సిందే.

ఆటగాళ్లు కూడా ఒకరితో ఒకరు చాలా స్నేహపూర్వకంగా వ్యవహరిస్తుంటారు. మంచి మిత్రులే కానీ, ఆట విషయానికి వస్తే మాత్రం ఎవరి గుట్లు వారి వద్దే ఉంటాయి. ఎందుకంటే ఆ రహస్యాలే వారికి ఏదో ఒక రోజు విజయాన్ని సంపాదించి పెట్టవచ్చు. ఇక్కడ చాలామంది టాప్ ర్యాంకింగ్ ఆటగాళ్లను మాత్రమే చూస్తున్నారు. కానీ కింది స్థాయిలోనూ చాలా మంది ఆటగాళ్లు మంచి ప్రతిభ కనబరుస్తున్నారు.

నేను భారతదేశంలో నంబర్ వన్ (1986 జూలై ఒకటవ తేదీన 2405 ఎలో రేటింగ్‌తో ప్రవీణ్ థిప్సే కంటే ముందుకు వెళ్లినప్పుడు)గా



మారినప్పుడు దరిదాపుల్లో ఇంకో ఆటగాడు కనిపించలేదు. 1988లో ఇరవై ఏళ్ల వయసులో నేను గ్రాండ్‌మాస్టర్ అయినప్పుడు పోటీల గురించి కాకుండా, రానున్న మూడేళ్లలో ఉన్నత స్థానానికి చేరుకోవడం ఎలా అని ఆలోచించాను. నేనేం చేయాలో నేనే నిర్ణయించుకుని, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి! 1988లో నేను గ్రాండ్ మాస్టర్‌గా అవతరిస్తే, మూడేళ్ల తరువాత 1991లో దివ్యేందు బారువా ఆ ఘనత సాధించాడు. ప్రవీణ్ థిప్సే 1997 నాటికి గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు. అయితే ఇప్పుడు పరిస్థితిలో చాలామార్పు వచ్చింది. 2013 నుంచి ఇప్పటివరకూ సుమారు 50 మంది గ్రాండ్‌మాస్టర్లుగా ఎదిగారు. ఎలో రేటింగ్ 2700 కంటే ఎక్కువ ఉన్న భారతీయ గ్రాండ్ మాస్టర్లు (పాక్షికంగా రిటైరైన నాతో కలిపి) ఆరుగురు ఉన్నారిప్పుడు.

గ్రాండ్ మాస్టర్ కావడం చాలా గొప్పవిషయమే అయినప్పటికీ ప్రస్తుతం సాధారణమైపోయింది. మారుతున్న కాలానికి నిదర్శనం ఇది. ఈ తరానికి ఇంకో సానుకూల అంశమూ ఉంది. నాకున్న దశాబ్దాల అనుభవంపై వారు ఆధారపడవచ్చు. అలాగే ఎందరో చెస్ గురువుల ప్రస్థానాల నుంచి కూడా చాలా విషయాలు తెలుసుకోవచ్చు. ఇది చాలా కీలకం. కానీ మాలాంటివాళ్లం ఈ తరం ఆటగాళ్లకు మార్గదర్శనం మాత్రమే చేయించగలం.

టాప్ లెవల్ ఆటగాళ్లందరికీ ఇప్పుడు దాదాపు అన్ని రకాల పరికరాలూ అందుబాటులో ఉన్నాయి. అయితే మంచి ఆటగాళ్లను వేరు చేసే అంశాలు వారి ప్రవర్తన, నిత్యం ఉన్నతస్థాయి ఆటను కొనసాగించగలగడం, శారీరక దారుఢ్యం, ఒత్తిడికి లోనుకాకపోవడం. అంతేకాదు... ఆట విషయంలో సమగ్రత కూడా చాలా అవసరం. ప్రత్యర్థి ఎప్పుడు ఏ రకమైన సవాలు విసురుతాడో మనకు తెలియదు కాబట్టి అన్నింటికీ సిద్ధంగా ఉండటం అవసరం. కొంతమంది ప్రత్యర్థులు మీరు తయారైన దానికంటే భిన్నమైన రీతిలో దాడికి దిగవచ్చు. అప్పుడు మీరెలా స్పందిస్తారు? దేనిపై ఆధారపడతారు? మీ లెక్కకు చిక్కని విషయమని భావిస్తారా? వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుంటేనే బాగా శ్రమించడం అన్నదానికి ప్రాముఖ్యత ఏర్పడుతుంది. ఎలో రేటింగ్ 2700కు చేరుకోవడం కూడా ఈ క్రమంలో భాగమే.

అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఇంకోటి ఉంది. భారతీయ చదరంగం కేవలం పురుషులకు మాత్రమే చెందింది కాదు. దేశంలో చదరంగం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలంటే మహిళా క్రీడాకారులు కూడా బాగా రాణించాలి. దురదృష్టవశాత్తూ ఇప్పటికీ పురుషులు, మహిళా క్రీడాకారుల సంఖ్యలో చాలా అంతరం ఉంది. భారత్‌లోనే కాదు... ప్రపంచం మొత్తమ్మీద ఇదే పరిస్థితి. ఈ అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అకాడమీ ఏర్పాటు ద్వారా మేమీ ప్రయత్నం చేస్తున్నాం. విజయం సాధిస్తామన్న నమ్మకమూ ఉంది. కోనేరు హంపి, డి.హారిక, ఇతరుల స్థాయుల మధ్య చాలా అంతరం ఉంది. ఉన్నత స్థానంలో ఏళ్ల తరబడి కొనసాగేందుకు తగిన జ్ఞానం హారిక, హంపికి ఉంది. అయితే మిగిలిన వారు సమీప భవిష్యత్తులోనే వీరికి సవాలు విసరగలరని ఆశిస్తున్నా. ఒకే ఒక్క రెక్కతో ఎగరడం సాధ్యం కాదు కదా! అసలైన విప్లవం అందరినీ తోడుతీసుకునే మొదలవుతుంది.

గుకేశ్, ప్రజ్ఞానంద్ ఇద్దరూ చదరంగంలో మారుతున్న తరానికి ప్రతినిధులు. నా అనుభవం వారికి ఉపయోగపడుతుంది కానీ, వారు తమ సొంత మార్గంలో మరింత దూరం ప్రయాణించడం అలవర్చుకోవాలి. తమ సమస్యలకు వారే పరిష్కారాలు వెతుక్కోవాలి. కొత్త హోదా, హంగు ఆర్భాటాలకు వారిప్పుడిప్పుడే అలవాటు పడుతున్నారు. ఎదురుదెబ్బలూ వారికి ఎదురు కావచ్చు. ఉన్నత స్థానాన్ని చేరుకోవడం ఆషామాషీ వ్యవహారమేమీ కాదు. కాకపోతే వీరు అనుసరిస్తున్న మార్గం మాత్రం సరైందనే చెప్పాలి. మిగిలినవి ఎలా ఉన్నా ఇది చాలా ముఖ్యం.

ప్రస్తుతం భారత దేశ చదరంగం ఒక్కో అడుగే ముందుకేయాలి. ఎదుగుతున్నప్పటికీ అందుకోవాల్సింది ఇంకా చాలానే ఉంది. విస్తృతమైన, లోతైన వ్యవస్థ అక్కరకొచ్చే అంశం. కాలం గడుస్తున్న కొద్దీ ఒకదానికి ఒకటి పూరకంగా వ్యవహరిస్తాయి. దశాబ్ద కాలంలో ప్రపంచ చదరంగంలో భారత్ తిరుగులేని శక్తి అవుతుందా? ఈ యువ క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తారా? ఇంకో భారతీయుడు ప్రపంచ ఛాంపియన్‌గా అవతరిస్తాడా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలంటే వేచి చూడాల్సిందే. ఇప్పటికైతే ఒకే మాట చెప్పవచ్చు. భారతీయ చదరంగం పక్వానికి వచ్చిందీ అని!

వ్యాసకర్త ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఐదుసార్లు నెగ్గిన చదరంగ క్రీడాకారుడు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అభద్రతలో మైనారిటీలు



దైవదూషణ ఆరోపణలతో ఫైసలాబాద్, జరావాలాలోని ఒక క్రైస్తవ కుటుంబం మీద మూక దాడి జరిగింది. చర్చిని కూడా తగులబెట్టారు. ఇప్పటికే క్రైస్తవ సమాజం భయంలో బతుకుతోంది. వారి మీద మరో దారుణమైన దాడి జరిగింది. పాకిస్తాన్‌లో క్రైస్తవులు, హిందువులు సురక్షితంగా లేరు.

– వీంగాస్, పాకిస్తాన్ యాక్టివిస్ట్

అందరికీ సంఘీభావం



ఫైసలాబాద్ వీడియోలు భయానకంగా ఉన్నాయి. ఇరుగు పొరుగు సాయం చేసుకోవడానికి బదులుగా ఒకరినొకరు చంపుకొంటున్న దేశం కోసం బాధపడుతున్నాను. తన సొంత పిల్లలను సజీవంగా తింటున్న దేశం కోసం బాధపడుతున్నాను. మతంతో నిమిత్తం లేకుండా పాకిస్తానీయులందరికీ నా సంఘీభావం.

– జుల్ఫికర్ అలీ భుట్టో, పాక్ కళాకారుడు

పారిశుద్ధ్య సేనాని



బిందేశ్వర్ పాఠక్ ('సులభ్' సంస్థ వ్యవస్థాపకుడు) క్షేత్రస్థాయిలో దేశాన్ని నడిపిన సామాజికవేత్త. ఆయనకు ముందు దేశంలో పబ్లిక్ టాయ్‌లెట్స్ అనే మాట వినబడలేదు. ఎన్నో ప్రభుత్వాల కంటే ఆయనొక్కడు చేసిన పారిశుద్ధ్య సేవ ఎక్కువ.

– రవి కాంత్, వ్యాఖ్యాత

ప్రశ్నించాల్సిన కథనం



వెయ్యేళ్ల బానిసత్వం' కథనాన్ని తప్పక ప్రశ్నించాలి. బ్రిటిష్ వలస వాదుల్లా కాకుండా – మొఘలులు, తొలి ముస్లిం రాజులు భారత దేశాన్ని తమ స్వస్థలంగా మార్చుకున్నారు. భారత సంస్కృతి, కళలు, సాహిత్యం, సమాజాలకు ఎంతగానో తోడ్పడ్డారు. భారత సర్వాంగీకార వారసత్వం మీద వారు లోతైన ముద్ర వేశారు.

– అశోక్ కాంతా, హానరరీ ఫెలో

ప్రమాదంలో హిమాచల్



హిమాచల్ ప్రదేశ్ అపాయకరమైన స్థితిలో ఉంది. హిమాలయాలు కూలి పోతున్నాయి. కొద్దినెలల్లోనే ఇప్పటికి 257 మరణాలు, వేల కోట్ల ఆస్తి నష్టం సంభవించాయి. హిమాచల్ కోసం ప్రార్థించండి. (కుప్పకూలిపోతున్న ఇంటి నుంచి భీకరమైన అరుపులు వినబడుతున్న వీడియోను షేర్ చేశారు.)

– సృష్టి, జర్నలిస్ట్

ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం...

మన దేశంలో ప్లాస్టిక్ వినియోగం అంతకంతకు పెరుగుతోంది. సంచులు, కుర్చీలు మొదలు మనం పని చేసే కంప్యూటర్ల వరకు ఎన్నో రకాల వస్తువులు ప్లాస్టిక్‌తో తయారవుతున్నాయి. అయితే వీటి వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతుండటంతో పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను సురక్షిత విధానాల్లో పునర్వినియోగంలోకి తేవాలి. ఇలాంటి పద్ధతులను అనుసరించే పరిశ్రమలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ భూగోళం మొత్తాన్ని మెల్లమెల్లగా మింగేస్తోంది. వాతావరణంలో మార్పులకు కారణమవ్వడమే కాదు, మానవ మనుగడకే పెను సవాలును విసురుతోంది. ప్రతి ఏటా దాదాపు కోటికి పైగా జీవులు దీనివల్ల మరణిస్తున్నాయి. కొన్ని వేల సంవత్సరాలైనా ఇది మట్టిలో కలవకుండా వాయు కాలుష్యాలకు దారి తీస్తుందని పర్యావరణ వేత్తలు అంటున్నారు.

ముఖ్యంగా పునర్వినియోగానికి పనికి రాకుండా ఉంటున్న ప్లాస్టిక్ వ్యర్థాలు పెరగడం మొత్తం ప్రపంచానికే పెను సవాలుగా మారుతోంది. మనం ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల నుంచి కంటికి కనిపించని ప్రమాదకర అతి చిన్న సూక్ష్మ రేణువులు మన శరీరంలోకి క్రమంగా చేరుతున్నాయి. ఇందువల్ల ప్రాణాంతకమైన క్యాన్సర్ వంటి వివిధ వ్యాధులు వస్తున్నాయి. అలాగే మూత్రపిండ రుగ్మతలు, శ్వాసకోశ సమస్యలు, చర్మ వ్యాధుల వంటి వ్యాపిస్తున్నాయి. స్త్రీ – పురుషుల్లో వంధ్యత్వం సంభవిస్తోంది. పిల్లల్లో బుద్ధి మాంద్యం కలుగుతోంది.

విపరీతమైన ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవుడి సగటు జీవిత కాలం తగ్గే అవకాశాలు ఉన్నాయని ఇటీవలే పలు అధ్యయనాలు తమ నివేదికల్లో వెల్లడించాయి. జనావాసాలతో పాటుగా పర్యావరణానికి కూడా ప్లాస్టిక్ గొడ్డలి పెట్టుగా మారింది. పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాల్లో కూడా కలిసిపోయి అందులో ఉండే జీవుల ఉసురు తీస్తున్నాయి. కొన్ని సముద్ర జీవులు గుడ్లు పెట్టే ఆవాసాలపై ప్లాస్టిక్ పేరుకుపోతోంది. సముద్ర జీవుల సంతానోత్పత్తిపై కూడా ఇది ప్రభావాన్ని చూపుతోంది.

ఇంత ప్రమాదకరమైన ప్లాస్టిక్ వాడకాన్ని ఇకనైనా తగ్గించాలి. ప్లాస్టిక్ సంచులు, డబ్బాలకు బదులు, జనపనార, ఆకులతో, బట్టతో తయారు చేసిన సంచులనూ, బుట్టలనూ వినియోగించడానికి ప్రాముఖ్యం ఇవ్వాలి. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ కవర్లు, స్ట్రాల, వంటివి కొనుగోలు చేసినా, అమ్మినా నేరంగా భావిస్తూ వివిధ దేశాలు ఇప్పటికే కఠిన చర్యలు తీసుకొంటున్నాయి. మన దగ్గర కూడా ఇలాంటి చర్యలు సత్వరమే చేపట్టాలి. ప్రజా చైతన్యం పెరగడం అత్యంత కీలకం.

– కూరపాటి శ్రావణ్, జనగాం జిల్లా

ఉమ్మడి పౌరస్మృతికి తగిన వాతావరణం ఏదీ?

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చకుండా, ప్రాథమిక హక్కులను దెబ్బతీయకుండా యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) లేదా ఉమ్మడి పౌర స్మృతిని రూపొందించి అమలు చేయడం సాధ్యమా? విచిత్ర మేమంటే 90 శాతం మందికి యూనిఫామ్ సివిల్ కోడ్ అంటే తెలియదు. తెలియాల్సిన అవసరం కూడా వారికి లేదన్నట్టున్నారు. చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలకు కూడా దీనిపై అంతగా అవగాహన లేదని చెప్పవచ్చు. మంత్రులలో ఒక్క డజన్ మందికి తెలుస్తే తెలువవచ్చేమో? టీవీల్లో డిబేట్ పేరుతో ఓ నలుగురు గంటా గంటన్నర గొంతు నొప్పెట్టేదాకా ఏవేవో వాదించడం చూస్తున్నాం. అనేక మతాలు, కులాలు, వర్గాల వాళ్లు ఎవరి ధోరణిలో వాళ్లు మాట్లాడుతున్నారు.

కానీ ఉమ్మడి పౌరస్మృతి స్వరూప స్వభావాలు, విధి విధానాలు ఎలా ఉంటాయో వివరిస్తున్నారా? ఇక ప్రభుత్వం చిత్తు బిల్లు రూపంలోనైనా ఏదీ వివరించకుండానే పార్లమెంటుకు యూసీసీ బిల్లును సమర్పించాలని అనుకుంటున్నదా? నెల రోజుల్లో లక్షలు, కోట్ల మంది ఈ బిల్లుపై అభిప్రాయాలు చెప్పారని అధికారులు అన్నంత మాత్రాన ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆ బిల్లును ప్రవేశపెట్టి దాన్ని నెగ్గేలా చేసుకుంటుందా? రాజ్యాంగ బద్ధ స్థానాల్లో ఉన్నవారు ముందు ఒక విధాన పత్రాన్ని కూడా ఇవ్వరా? దాని మీద చర్చలు, సంప్రదింపులు జరిగాక అందరికీ ఆమోదయోగ్యమైన ఒక పౌరస్మృతిని తయారు చేయడం కదా ప్రభుత్వం చేయవలసింది!

అదృష్టవశాత్తు 1860 సంవత్సరంలో బ్రిటిష్‌వారు ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ)ను తయారుచేశారు కాబట్టి సరిపోయింది కానీ లేకపోతే ప్రస్తుత పాలకులు పెద్ద ఉపద్రవాన్ని కలిగించేలా దాన్ని తయారుచేసి ఉండేవారే! బ్రిటిష్ వాళ్లకు ఈ ఐడియా రాకపోతే ఈ పాటికి ప్రతి జిల్లాల్లో వివిధ మతాల వాళ్లు కొట్టుకుని చనిపోయేవారు. 1860కి ముందు హత్యకో చట్టం, రేప్‌కో చట్టం, దొంగతనానికి వగైరాకు ఒక చట్టం చొప్పన వందల చట్టాలు చేసే వాళ్లు. థామస్ బాబింగ్‌టన్ మెకాలే ఐపీసీని రూపొందించి చాలా గొప్పపని చేశారు. ఐపీసీ లేకపోతే ఒక్కో చట్టం రావడం సమస్య అయ్యేది. అందరికీ ఒకటే క్రిమినల్ లా లేకపోతే, హిందువులకు చంద్రగుప్తుడి కాలంలో దొంగ తనానికి 'అర్థశాస్త్రం' కింద విధించిన శిక్ష, ఔరంగజేబు కాలంలో రేప్‌కు విధించిన రాళ్ళతో కొట్టే శిక్ష విధించి ఉండేవారు. ఐపీసీ లేకపోతే పరిస్థితులు ఎలా ఉండి ఉండేవో చెప్ప డానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే!

భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి పవిత్ర గ్రంథాలు చదువుకోవడం ఆ యా మతాలవారు ఎంత పవిత్రంగా భావిస్తారో... ఈ దేశంలో ఉన్న ప్రతి పౌరుడూ ముందు భారత రాజ్యాంగం ఏమిటో తెలుసుకోవాలి. దాన్ని చదవాలి. అప్పుడే యూసీసీ వంటి వాటి అవసరం ఉందా, లేదా అనేది అర్థమవుతుంది. దేశం, ప్రభుత్వం సరైన మార్గంలో నడవడాన్ని నిర్దేశించే రాజ్యాంగాన్ని చదవడం ఎవరికీ అవసరం లేని వ్యవహారమయ్యింది. ఇంటర్మీడియట్ తరువాత ఉద్యోగం రావడానికి అవసరమైన కోర్స్‌లో సీటు కోసం ఎంట్రన్స్ రాయడం లక్ష్యంగా చదువులు సాగుతున్నాయి. ఈ ప్రవేశ పరీక్షల్లో రాజ్యాంగానికి సంబంధించిన విషయాలు ఉండవు. అందువల్ల రాజ్యాంగ పఠనం వారి చదువులో భాగం కావడం లేదు. ఇప్పుడు యువతకు కంప్యూటర్ డిగ్రీ ఉంటే చాలు ఉద్యోగం రావడానికి! అటువంటి వారికి యూసీసీ ఎలా తెలుస్తుంది? యూపీఎస్‌సీ పరీక్షలో ఒక లా పేపర్ ఉంటే దానిలో రాజ్యాంగం అనే ఒక పార్ట్ ఉంటుంది. అలా పాస్ అయిన వారికి యూసీసీ వంటివి తెలుస్తాయి. మా లా కాలేజీలో కూడా రాజ్యాంగం పేపర్ కాకుండా మరో పేపర్ చదువుకొనే వాళ్లు లేకపోవడమూ గమనార్హమే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బల్బీర్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని 21వ లా కమిషన్ ఉమ్మడి పౌరస్మృతిపై 2018 లోనే ఒక పత్రాన్ని విడుదల చేసింది. యూసీసీని ఈ పత్రంలో లా కమిషన్ స్పష్టంగా తిరస్కరించింది. ప్రముఖ ముంబై హైకోర్టు న్యాయవాది దుష్యంత్ అరోరాతో సహా ప్రసిద్ధ వ్యక్తులు నీలాంజన రాయ్, టిఎమ్ కృష్ణ, మేజర్ జనరల్ ఓమ్ బాత్కెరే, గుల్ పనాగ్, బెజవాడ విల్సన్, ముకుల్ కేశవన్‌లతో కూడిన ప్రముఖ పౌరుల బృందం 2017లో 'ప్రగతిశీల ఉమ్మడి పౌర స్మృతి' రూపొందించారు. మాజీ అటార్నీ జనరల్ సోలి సొరాబ్జీ దాన్ని అంగీకరించారు. రెండుసార్లు ప్రజల అభిప్రాయాలను కూడా సేకరించి, లా కమిషన్ నివేదికను కూడా విడుదల చేసింది.

2018లో వద్దన్న లా కమిషన్ ఇప్పుడు యూసీసీపై ప్రజాభిప్రాయాన్ని అడుగుతున్నది ఎందుకు? రాజ్యాంగంలో ఆర్టికల్ 44 'ఆదేశం' కాదు. మార్గదర్శక ఆదేశం వలె కనిపించే 'సూత్రం' మాత్రమే. అట్లా అని దాన్ని పనికి రాదనడానికి లేదు. సుప్రీంకోర్టు పలు సందర్భాలలో 'మరణించిన అధికరణం' కాదని చెప్పింది.


ఇప్పుడు కేంద్రం అతి వేగంగా యూసీసీని అమలు చేయాలని ఎందుకంటున్నదో ఆలోచించాల్సిన విషయం. యూసీసీని అమలు చేయడానికి ముందు చేయవలసిన పనులు చాలా ఉన్నాయి. ముందస్తుగా పౌరులందరినీ సమానంగా చూసే చట్టాలు చేయకుండా, యూసీసీ అమలు చేయడం సాధ్యమేనా? యూసీసీని ప్రవేశ పెట్టడానికి ఒక్క బిల్లు కూడా తయారు చేయకుండా వివిధ రాజకీయ పార్టీలతో పోటా పోటీగా వాదనలు మాత్రం చేస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఒక నోటీస్ ద్వారా నెలరోజుల్లో యూసీసీ వద్దని చెబుతారా?

వ్యాసకర్త డీన్, స్కూల్ ఆఫ్ లా, మహీంద్రా యూనివర్సిటీ



శివ కేశవులకు ప్రీతికరం

శ్రావణమాసం అంతా ఉదయం, సాయంత్రం భగవన్నామ స్మరణతో హిందూ గృహాలు మారు మోగుతాయి. ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు 'శ్రవణా' నక్షత్రంలో సంచరించడం వలన ఈ మాసానికి ఆ పేరు వచ్చింది. సనాతన ధర్మంలో చంద్రమానం ప్రకారం మనకున్న పన్నెండు మాసాల్లో ఐదవది పవిత్రత కలిగినదీ శ్రావణ మాసం. శ్రావణంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా పవిత్రత ఉందంటున్నారు విజ్ఞులు. అంతటి పవిత్ర మాసం అధిక శ్రావణం అనంతరం, నిజ శ్రావణం నేటి (17వ తేదీ గురువారం) నుంచి మొదలయ్యింది.



జ్యోతిర్మయం

ఈ మాసం శివ కేశవులకు ప్రీతికరం. ఈ మాసంతో అసలు వర్ష రుతువు ప్రారంభమవుతుంది. ముఖ్యంగా భగవదారాధనలో శివ, కేశవ భేదం లేకుండా పూజించడానికి విశేషమైనది ఈ మాసం. ఈ నెలలో చేసే ఏ చిన్న దైవ కార్యమైనా కొన్ని వేల రెట్లు శుభ ఫలితాన్నిస్తుందని ప్రతీతి. సోమవారాల్లో శివుని ప్రీత్యర్థం ఉపవాస దీక్ష చేస్తే, అనేక శుభ ఫలితాలు కలుగుతాయంటారు. వీటికి తోడు శ్రావణ శుక్ల పక్షంలో గల పదిహేను రోజులు ఎంతో విశేషమైన రోజులనీ, ఒక్కో రోజు ఒక్కో దేవుడికి పూజలు చేయాలనీ వేదాలు చెబుతున్నాయి.

త్రిమూర్తుల్లో స్థితికారుడు, దుష్ట శిక్షకుడు, శిష్ట రక్షకుడు అయిన మహావిష్ణువుకు, ఆయన దేవేరి మహాలక్ష్మికి కూడా అత్యంత ప్రీతికరమైనది శ్రావణమాసం అంటారు. మహావిష్ణువు జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రం. శ్రావణ మాసంలో అన్ని మంగళవారల్లో చేసే వ్రతం 'మంగళగౌరీ' వ్రతం. దీన్ని శ్రావణ మంగళవార వ్రతం అనీ, మంగళగౌరీ నోము అని పిలుస్తుంటారు. ఇదే మాసంలో పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం 'వరలక్ష్మి' వ్రతం చేయాలి. ఒకవేళ అప్పుడు వీలు కాకుంటే శ్రావణ మాసంలో మరొక శుక్రవారమైనా ఈ వ్రతం ఆచరిస్తారు. ముత్తయిదువులకు వాయినాలిచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు.

శుక్లపక్ష ద్వాదశి, దామోదర ద్వాదశి అని ఈ మాసంలో రెండు శుభ దినాలున్నాయి. శుక్ల పక్ష ఏకాదశి నాడు ఉపవాసం ఉండి మహావిష్ణువును పూజించినట్లయితే మోక్షం లభిస్తుందంటారు. శ్రావణ పౌర్ణమి, రాఖీ పౌర్ణమిగా జరుపుకొనే శుక్ల పక్ష పౌర్ణమి రోజు సోదర, సోదరీ సంబంధానికి సూచికగా రక్షా బంధనం జరుపుకొంటున్నాం. అంతే కాక కొందరు ఈ రోజున నూతన యజ్ఞోపవీతం ధరించి, వేదభ్యాసాన్ని ప్రారంభిస్తారు. కృష్ణపాడ్యమి, హయగ్రీవ జయంతి, కృష్ణపక్ష విదియ, రాఘవేంద్ర స్వామి ఆరాధన వంటివి సైతం ఈ నెలలోనే రావడం విశేషం. కృష్ణాష్టమి, పోలాల అమావాస్య వంటివి కూడా ఈ నెలలోనే వస్తాయి.

– నందిరాజు రాధాకృష్ణ

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.పాడ్యమి ప.3.50 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** మఖ రా.7.31 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ఉ.6.11 నుండి 7.59 వరకు, తిరిగి తె.4.20 నుండి 6.04 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.9.59 నుండి 10.47 వరకు, తదుపరి ప.3.01 నుండి 3.51 వరకు, **అమృతఘడియలు:** సా.4.50 నుండి 6.34 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.46, **సూర్యాస్తమయం:** 6.21.

క్లుప్తంగా...

వలలో చిక్కిన టైగర్ షార్క్



చీరాల టౌన్: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు భారీ టైగర్ షార్క్ చేప చిక్కిన ఘటన చీరాల వాడరేవులో బుధవారం జరిగింది. వివరాల్లోకెళితే.. వాడరేవు గ్రామానికి చెందిన ఐదుగురు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లారు. తీరానికి 70 కిలో మీటర్ల అవతల వలలను విసరగా బరువుగా అనిపించింది. వెంటనే తీరానికి చేరి వలను పరిశీలించగా, అందులో 800 కిలోల బరువు కలిగిన టైగర్ షార్క్ దర్శనమిచ్చింది. అది తమకు పనికిరాదని తెలిసి మత్స్యకారుల ముఖాలు ఒక్కసారిగా వాడిపోయాయి. ఆ చేప బతికే ఉండటంతో రెండు గంటల పాటు అష్టకష్టాలు పడి తిరిగి సముద్రంలో వదిలివేశారు. వల నుంచి చేపను తీయడానికి రూ.40 వేలు విలువ చేసే వలకు నష్టం వాటిల్లిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఈ టైగర్ షార్క్ చేప వలకు చిక్కడంతో పర్యాటకులు సెల్ఫీలు దిగి సందడి చేశారు.

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి 'మారిషస్' పురస్కారం



కడప ఎడ్యుకేషన్: విద్యారంగానికి చేసిన సేవలకు, వేలమంది విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన సాయిబాబా విద్యాసంస్థల చైర్మన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డికి మారిషస్ ప్రభుత్వం విద్యాశాఖ సహకారంతో ఇంటెలిజెంట్స్ మైండ్ ట్రస్ట్ సంస్థ 2023 సంవత్సరానికిగాను 'ఎక్స్‌లెన్స్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్' అవార్డుకు ఎంపిక చేసింది. ఆగస్టు 23న మారిషస్ సెక్రటేరియేట్‌లో ఆ దేశ అధ్యక్షుడు పృథ్వీరాజ్ సింగ్ రూపన్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటారని ఎమ్మెల్సీ కార్యాలయం బుధవారం తెలిపింది. ఈ కార్యక్రమంలో మారిషస్ విద్యాశాఖ మంత్రి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపింది. పురస్కారం లభించడంపై ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను ముందుంటానని చెప్పారు.

వాజ్‌పేయి జీవితం కార్యకర్తలకు దిక్సూచి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

సాక్షి, అమరావతి: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం బీజేపీ కార్యకర్తలకు దిక్సూచి అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. బీజేపీని కేంద్రంలో మొదటి సారి అధికారంలోకి తెచ్చిన ఘనత వాజ్‌పేయిదేనని తెలిపారు. దేశంలో సుపరిపాలన అంటే ఆయనే గుర్తుకువస్తారని చెప్పారు.

జనసేన పార్టీ కార్యాలయంలో..

మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పూలమాల వేసి అంజలి ఘటించారు.

అనుమానాస్పదస్థితిలో చిరుత మృతి



మడకశిర రూరల్: శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం మెళవాయి సమీపంలోని కాకుల కొండ వద్ద ఆడ చిరుత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బుధవారం ఉదయం అటువైపు వెళ్లిన వారు గమనించి..ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ డివిజనల్ అధికారి ఆనంద్, రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అమర్ ఘటనా స్థలానికి చేరుకుని చిరుత కళేబరాన్ని పరిశీలించారు. చిరుత మృతి చెందిన సమయంలో మల, మూత్ర విసర్జన చేసింది. అందులో ఏదో ద్రవ పదార్థం ఉందన్న అనుమానంతో నమూనాలను సేకరించారు. చిరుత కళేబరాన్ని మడకశిరలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. చిరుతకు రెండేళ్ల వయస్సు ఉంటుందని, శవపరీక్ష తర్వాత మృతికి గల కారణాలు వెల్లడిస్తామని అటవీశాఖ డివిజనల్ అధికారి ఆనంద్ తెలిపారు.

22 నుంచి తిరుమలలో కారీరిష్టి యాగం

తిరుమల: రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమాలను టీటీడీ నిర్వహించనుంది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్తపండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ నెల 26న మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు.

రాష్ట్రంలో పలు రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్



గుంటూరు-బీబీనగర్ రైల్వే లైన్ డబ్లింగ్‌కు పచ్చజెండా

- 239 కి.మీ. పనులకు రూ.2,853.23 కోట్లు కేటాయింపు
- ముద్ఖేడ్- డోన్‌ల మధ్య డబ్లింగ్ పనులకు రూ.4,686.09 కోట్లు
- ఖుర్దా రోడ్-విజయనగరం మధ్య మూడో లైన్ నిర్మాణానికి రూ.5,618 కోట్లు
- మొత్తం రూ.32,512 కోట్ల విలువ చేసే 7 మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: పీఎం గతిశక్తిలో భాగంగా రైళ్ల రాకపోకలను క్రమబద్ధీకరించడంతోపాటు రద్దీని తగ్గించడం కోసం గుంటూరు – బీబీనగర్, ముద్ఖేడ్-డోన్ మధ్య రైల్వే లైన్ల డబ్లింగ్ పనులు సహా దేశంలో ఏడు రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టు పనులకు కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ ఏడు ప్రాజెక్టుల కోసం మొత్తం రూ.32,512.39 కోట్ల అంచనాకు ఆమోదం తెలిపింది. ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం అనంతరం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వివరించారు. కాగా తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు – బీబీనగర్, ముద్ఖేడ్- డోన్ (కర్నూలు జిల్లా) రైల్వే లైన్ల డబ్లింగ్ ప్రాజెక్టులకు మొత్తం రూ.7,539.32 కోట్లు కేటాయించింది. ఇందులో గుంటూరు – బీబీనగర్ మధ్య 239 కి.మీ. రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు రూ.2,853.23 కోట్లు, ముద్ఖేడ్ – డోన్ మధ్య 417.88 కి.మీ. మేర డబ్లింగ్ పనులకు రూ.4,686.09 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే ఈ లైన్లలో కొత్త రైళ్లు ప్రవేశపెట్టడంతో పాటు గూడ్స్ రైళ్ల ద్వారా సరుకు రవాణా మరింత ఊపందుకుంటుంది. దీంతో ఆ పరిధిలో పారిశ్రామిక, వ్యవసాయోత్పత్తుల వాణిజ్యం గణనీయంగా పెరుగుతుంది.

కర్నూలు జిల్లా నుంచి సరుకు రవాణాకు మరింత సౌలభ్యం

ముద్ఖేడ్ – డోన్ రైల్వే లైన్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లాను తెలంగాణలోని పలు జిల్లాలు, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాతో మరింతగా అనుసంధానిస్తుంది. దీంతో ప్రస్తుతం అత్యంత రద్దీగా ఉన్న బలార్షా- ఖాజీపేట- సికింద్రాబాద్ మార్గం, కాజీపేట- విజయవాడ మార్గానికి ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి వస్తుంది. అంతేకాకుండా ఈ మార్గంలో బొగ్గు, ఆహార, వాణిజ్య పంటల ఉత్పత్తులు, ఇతర ఉత్పత్తుల రవాణాకు మరింత సౌలభ్యంగా ఉంటుంది.

ఖుర్దా రోడ్-విజయనగరం మధ్య మూడో లైన్

కాగా భద్రక్-విజయనగరం సెక్షన్‌లోని ఖుర్దా రోడ్-విజయనగరం మధ్య 363 కిలోమీటర్ల మేర మూడో లైన్ నిర్మాణానికి రూ.5,618 కోట్లకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఒడిశాలోని భద్రక్, జాజ్‌పూర్, ఖుర్దా, కటక్, గంజాం జిల్లాల్లో, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో మూడో లైన్ పనులు జరగనున్నాయి.

గుంటూరు, పల్నాడు జిల్లాలకు ప్రయోజనం

గుంటూరు – బీబీనగర్ మధ్య రైల్వే లైన్ గుంటూరు, పల్నాడు ప్రాంతాలను అటు ఒడిశా, ఇటు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలతో అనుసంధానిస్తుంది. అంతేకాకుండా గుంటూరు– సికింద్రాబాద్ మధ్య ప్రత్యామ్నాయ రైలు మార్గాన్ని కూడా అందుబాటులోకి తెస్తుంది. ప్రస్తుతం అత్యంత రద్దీగా ఉన్న గుంటూరు–విజయవాడ–కాజీపేట– సికింద్రాబాద్ మార్గంలో రైళ్ల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా తక్కువ ప్రయాణ దూరంతో గుంటూరు– సికింద్రాబాద్ లైన్ అందుబాటులోకి వస్తుంది. తద్వారా ఈ ప్రాంతం గుండా ఇనుము, సిమెంట్, ఆహార, వాణిజ్య పంటల ఉత్పత్తుల రవాణాకు మరింత సౌలభ్యం ఏర్పడుతుంది.

29 నుంచి శ్రీరాఘవేంద్రుల సప్తరాత్రోత్సవాలు

సెప్టెంబర్ 2న మహా రథోత్సవం ● పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు

మంత్రాలయం(కర్నూలు): సద్గురు శ్రీరాఘవేంద్రస్వామి 352వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఆరాధన సప్తరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు తెలిపారు. స్థానిక మఠంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆరాధనోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నదీ తీరంలో పుణ్యస్నానాలకు షవర్లు, పీఆర్వో, అన్నదాన సత్రంలో తాగునీటి వసతి కల్పించామన్నారు. పార్కింగ్ కోసం నదీతీరం, హెలిప్యాడ్ గ్రౌండ్, సుయతీంద్రతీర్థుల 200 గదుల సముదాయం, బృందావన గార్డెన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాలను సిద్ధం చేశామని తెలిపారు. పూర్వారాధన, మధ్యారాధనతోపాటు ఉత్తరారాధనలో భాగంగా సెప్టెంబర్ 2వ తేదీ మహా రథోత్సవం ఉంటుందన్నారు. ఏటా మాదిరి రథంపై హెలికాప్టర్‌తో పుష్పవృష్టి గావిస్తామని చెప్పారు. భక్తుల కోసం పరిమళ ప్రసాదాలు సిద్ధంగా ఉంచామన్నారు. అన్నదానం నిరంతరాయంగా చేపడతామన్నారు. శ్రీమఠం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, బంగారు పూత రంగులో కారిడార్, శ్రీమఠం ప్రాకారాల ఎత్తు పెంపు, వసతి నిలయాలు నిర్మిస్తున్నామని వివరించారు. ప్రతిరోజూ సాయంత్రం భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



శ్రీరాఘవేంద్ర స్వామి మఠం (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న పీఠాధిపతి

రాజధాని గ్రామాలను నాశనం చేసిన చంద్రబాబు

1,053వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: రాజధాని అమరావతి పేరుతో 29 గ్రామాలను నాశనం చేసి అడవిలా మార్చిన బాబు ఆయన కుమారుడు లోకేశ్.. ఇప్పుడు ఎన్నికల కోసం తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,053వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. 5 సంవత్సరాలు అధికారమిస్తే ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం చేస్తానని చెప్పిన బాబు మూడు పంటలను నాశనం చేసి కార్పొరేట్లకు దొడ్డిదారిన తాకట్టు పెట్టాడని ధ్వజమెత్తారు. 29 గ్రామాల ప్రజలు ఛీకొట్టి గత ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించినా సిగ్గుఎగ్గ లేకుండా మళ్లీ వస్తున్నారన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా విశాఖ కేంద్రంగా పరిపాలనా రాజధాని ఏర్పడడం ఖాయమని చెప్పారు. అమరావతితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసి అందరికీ సమాన ఫలాలు అందించాలనేదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. విజన్ 2047 పేరుతో చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్న మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, గతంలో విజన్ 2020 పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూసిన బాబును రాజకీయాల నుంచి ప్రజలు ఈడ్చికొట్టారని గుర్తు చేశారు. నాయకులు బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి పాల్గొన్నారు.

రోజుకొక పెగ్గేసినా.. అనర్థమే

- ప్రతిరోజూ తక్కువ మోతాదులో మద్యం సేవించినా అధిక రక్తపోటు
- అమెరికా, దక్షిణ కొరియా, జపాన్‌లో అధ్యయనం
- 1997–2021 మధ్య 19 వేల మంది డేటా విశ్లేషణ
- రక్తపోటు స్థాయిల్లో నిరంతర పెరుగుదల నమోదు



సాక్షి, అమరావతి: ప్రతిరోజూ ఒక పెగ్గు చొప్పున తక్కువ మోతాదులో మద్యం తీసుకుంటే ఏం కాదు అనుకుంటే.. అది పొరపాటేనని ఓ అధ్యయనం హెచ్చరించింది. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురించిన ఇటలీ, అమెరికాకు చెందిన ఓ మల్టీ నేషనల్ టీమ్ అధ్యయనం ప్రకారం.. తక్కువ మోతాదులో మద్యం సేవించే వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని, అధిక రక్తపోటు బారినపడుతున్నారని వెల్లడైంది. 1997 నుంచి 2021 మధ్య కాలంలో జపాన్, అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో మద్యపానం వల్ల సంభవించే పర్యవసానాలపై ఏడు అధ్యయనాలు నిర్వహించారు. 20 నుంచి 70 ఏళ్ల వయసుతో పాటు అధిక రక్తపోటు లేని 19,548 మందిపై అధ్యయనం చేపట్టారు. ఈ సందర్భంగా 4 నుంచి 12 ఏళ్ల అనంతరం వీరి రక్తపోటు స్థాయిల్లో నిరంతర పెరుగుదలను కనుగొన్నారు. రోజుకు సగటున 12 గ్రాముల మద్యం సేవించే వ్యక్తుల్లో ఐదేళ్లలో సిస్టోలిక్ రక్తపోటు 1.25 ఎంఎం హెచ్‌జీ పెరిగినట్టు గుర్తించారు. రోజుకు సగటున 48 గ్రాముల మద్యం సేవించే వ్యక్తుల్లో సిస్టోలిక్ రక్తపోటు 4.9 ఎంఎం హెచ్‌జీ పెరిగినట్లు తేలింది..

ఒక్క రక్తపోటే కాదు.. అనేక సమస్యలు



మద్యాన్ని ఎక్కువా.. తక్కువా.. అని కాదు.. ఏ పరిమాణంలో తీసుకున్నా ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. ఎక్కువ పరిమాణంలో తాగే వారిలో వేగంగా, తక్కువ పరిమాణంలో తాగేవారిలో ఆలస్యంగా ప్రభావాలుంటాయి. రక్తపోటుతో పాటు కాలేయం, గుండె, మెదడుతో పాటు శరీరంలో మద్యపానానికి ప్రభావమవ్వని భాగం ఉండదు. ఆధునిక జీవనశైలి వల్ల మధుమేహం, రక్తపోటు, ఊబకాయం ఇలా అనేక రకాల సమస్యలు చుట్టుముడుతున్నాయి. వీటికి మద్యపానం తోడైతే వేగంగా అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. మితంగా మద్యపానం ఆరోగ్యానికి మంచిదేనని గతంలో కొన్ని అధ్యయనాలు వచ్చినా.. అవి అవాస్తవమని తర్వాతి రోజుల్లో కొట్టిపడేశారు.

– డాక్టర్ కె.సుధాకర్, ప్రిన్సిపల్, సిద్ధార్థ వైద్య కళాశాల విజయవాడ

శ్రీగోసలైట్స్ మెడికో గ్రాండ్ రీ యూనియన్ వేడుకలు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): నీట్ 2022లో విజయకేతనం ఎగురవేసి వివిధ రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించిన శ్రీ గోసలైట్స్ మెడికో గ్రాండ్ రీ యూనియన్ వేడుకలు పోరంకి–నిడమానూరు రోడ్‌లో గల ఒక రిసార్ట్‌లో బుధవారం ఉత్సాహంగా జరిగాయి. శ్రీగోసలైట్స్ చైర్మన్ నరేంద్రబాబు, డైరెక్టర్లు మెడికోలతో ముచ్చటించారు. కాగా.. గత ఫలితాల రికార్డులన్నీ తిరగరాస్తూ నీట్–23 ఫలితాల్లో లక్ష్మీ ప్రవర్ధన్‌రెడ్డి జెన్–ఈడబ్ల్యూఎస్ ఆలిండియా ఫస్ట్ ర్యాంక్, ఓపెన్ కేటగిరీలో ఏపీలో సెకండ్ ర్యాంక్, రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడవ ర్యాంక్, ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 25వ ర్యాంక్ సాధించాడు. మరో విద్యార్థి వేగేశ్న రోహిత్ వర్మ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 61వ ర్యాంక్ పొందారు. 22 మంది శ్రీగోసలైట్స్ విద్యార్థులు 1,000 లోపు ఆలిండియా ర్యాంక్‌లు సాధించారు. నీట్–23 పరీక్షకు హాజరైన విద్యార్థులలో 99 శాతం మంది అర్హత సాధించటం ఆల్ టైం రికార్డ్‌గా చెప్పుకోవచ్చు. నీట్ 2022లో ప్రతిభ చూపి ప్రముఖ కాలేజీలలో సీట్లు పొందిన మెడికోలను సత్కరించారు.

వైఎస్సార్‌సీపీలో చేరారని.. ఐదు కుటుంబాల వెలి

- చిత్తూరు జిల్లా చెర్లోపల్లిలో టీడీపీ మద్దతుదారుల అరాచకం
- బుధవారం 'గడపగడపకు' అనంతరం ఓ కుటుంబంపై దాడి
- మహిళలను జుట్టుపట్టి లాగి కొట్టిన టీడీపీ మూక
- గ్రామంలో పికెట్ ఏర్పాటు చేసిన పోలీసులు

సాక్షి, తిరుపతి: తమ సామాజిక వర్గం వారు వైఎస్సార్‌సీపీలో చేరడం వారికి నచ్చలేదు. తాము మద్దతిస్తున్న పార్టీని కాదని వేరే పార్టీలో చేరిన తమ సొంత బంధువులను సైతం వెలివేశారు. బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఓ కుటుంబంపై దాడి చేసి గాయపరిచారు. ఈ దారుణ ఘటన చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గం పులికల్లు పంచాయతీ పరిధిలోని చెర్లోపల్లిలో జరిగింది. ఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే ఆయన పరిపాలన నచ్చి మక్కిలి హేమాద్రినాయుడు కుటుంబం వైఎస్సార్‌సీపీలో చేరింది. ఆ తరువాత కె.మురళీనాయుడు, చంద్రశేఖరనాయుడు, బాబునాయుడు, సుకుమార్‌నాయుడు కూడా వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. దీంతో రగిలిపోయిన టీడీపీ మద్దతుదారులు పార్టీ మారిన ఐదు కుటుంబాల వారిని వెలివేసి సామాజికంగా దూరం పెట్టారు. కాగా, చెర్లోపల్లి గ్రామంలో నాలుగు వందల ఓట్లు ఉన్న కమ్మ సామాజిక వర్గం వారే పెత్తనం చెలాయిస్తారు. స్థానిక ఎస్టీ కాలనీపై కూడా వారిదే పెత్తనం. ఈ నేపథ్యంలో తమ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాల వారే పార్టీ మారడం జీర్ణించుకోలేక తమకు బంధుత్వం ఉన్నా సరే వారిని వేధింపులకు గురిచేస్తున్నారు.

ఉపముఖ్యమంత్రి దృష్టికి..

బుధవారం ఆ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉందని తెలుసుకున్న టీడీపీ బ్యాచ్.. గ్రామానికి తాగునీరు సరఫరా కాకుండా ఉదయం విద్యుత్ వైర్లు, ఫ్యూజు క్యారియర్లు పీకి పడేశారు. ఈ విషయం తెలుసుకున్న హేమాద్రినాయుడు ఫ్యూజులు వేయించి తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. గడపగడపకు కార్యక్రమంలో పాల్గొనడానికి గ్రామానికి వచ్చిన ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి దృష్టికి ఈ వెలి విషయాన్ని హేమాద్రినాయుడు తీసుకొచ్చారు. ఇదే సమయంలో నీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ వైర్లు, ఫ్యూజులు పీకివేసిన వివరాలు స్థానికులు నారాయణస్వామికి చెప్పారు. ఈ వివరాలు తెలుసుకునేందుకు ద్వారా సంఘమిత్ర రాధికా రాణిని నారాయణస్వామి పిలిపించారు.



చెర్లోపల్లిలో బాధితులపై దాడికి తెగబడుతున్న టీడీపీ బ్యాచ్

రెచ్చిపోయిన టీడీపీ బ్యాచ్

రాధికారాణి ఇంటికి వెళ్లి వివరాలన్నీ భర్తకు చెప్పడంతో అతను తమ సామాజికవర్గానికే చెందిన హేమాద్రినాయుడుకు వ్యతిరేకంగా టీడీపీ బ్యాచ్‌ను రెచ్చగొట్టారు. ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి గ్రామం నుంచి వెళ్లిపోయిన వెంటనే టీడీపీకి చెందిన 25 మంది మూకుమ్మడిగా హేమాద్రినాయుడు ఇంటిపై దాడికి తెగబడ్డారు. అతన్ని కొట్టి ఇంట్లో ఉన్న మహిళలను జుట్టుపట్టుకుని ఈడ్చుకొచ్చారు. బాధతో అరుస్తున్నా వినిపించుకోలేదు. సంఘటన విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన చెర్లోపల్లికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

'ఎన్‌ఆర్‌ఐ మెడికల్' విద్యార్థి ఆత్మహత్య

మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి ఎన్ఆర్ఐలో వైద్య విద్యనభ్యసిస్తున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. విజయవాడ గాయత్రి నగర్‌కు చెందిన కామేపల్లి వెంకటప్రణవ్ యశ్వంత్ ఎన్ఆర్ఐలో ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈ నెల 14న విజయవాడలోని తన అమ్మమ్మ, తాతయ్య నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 2019లో ఎన్ఆర్ఐ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించేందుకు మేనేజ్‌మెంట్ కోటాలో చేరిన యశ్వంత్.. అప్పటి నుంచి ఏటా గడువులోగా కళాశాల నిర్ణయించిన రూ.33 లక్షలు చెల్లిస్తున్నట్లు సూసైడ్ లెటర్‌లో తెలిపాడు. ఈ ఏడాదికి సంబంధించి ఫీజు రూ.33 లక్షలు ఏప్రిల్ 12న చెల్లించినా, అదనంగా మరో రూ.12 లక్షలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని లేఖలో పేర్కొన్నాడు. ఇప్పటికే తన కుటుంబం అప్పులు చేసి ఫీజులు చెల్లించిందని, అదనంగా తాను చెల్లించలేనని ఎన్ఆర్ఐ యాజమాన్యానికి యశ్వంత్ లేఖ రాశాడు. ఇదే అదనుగా అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధనరావు, ప్రిన్సిపల్ ఇద్దరూ యశ్వంత్‌ను పలుమార్లు డబ్బులు కట్టలేని నీకెందుకు వైద్య విద్య అంటూ హేళనగా మాట్లాడుతుండటం యశ్వంత్ మనస్సును నొప్పించింది. దీంతో మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. కళాశాల నిర్వాహకులు మాత్రం అతని మానసిక స్థితి బాగాలేని కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని చెబుతున్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో 'స్టెమీ'పై శిక్షణ

ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్



గుంటూరు మెడికల్: గుండెపోటు మరణాలు నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్ (స్టెమీ) అనే నూతన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. బుధవారం గుంటూరు జీజీహెచ్‌లో గుండెపోటు మరణాల నివారణపై స్టెమీ కార్యక్రమంలో భాగంగా కార్డియాలజిస్టులతో శిక్షణ కార్యక్రమం జరిగింది. వేంకటేశ్వర్ మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వారికి గోల్డెన్ అవర్‌లో చికిత్సకు తరలిస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చన్నారు. కర్నూలు, గుంటూరు, విశాఖ జిల్లాల్లో స్టెమీపై తొలివిడతగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 1 కల్లా స్టెమీ శిక్షణ పూర్తి చేసి 3 జిల్లాల్లో మాక్ డ్రిల్ నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 29న వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. డిసెంబరు 21కల్లా రాష్ట్రమంతా స్టెమీపై శిక్షణ కార్యక్రమం అమలు చేస్తామన్నారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ప్రసంగించారు.

క్లుప్తంగా...

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా: రాజస్థాన్‌లో కోచింగ్ సెంటర్ హబ్‌గా పేరు పొందిన కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. బిహార్‌లోని గయకు చెందిన 18 ఏళ్ల వయసున్న వాల్మీకి ప్రసాద్ మంగళవారం రాత్రి అద్దెకి ఉంటున్న ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. వాల్మీకి పక్క గదిలోనే ఉంటున్న విద్యార్థులు రాత్రి అతని తలుపు కొడితే తియ్యకపోయే సరికి అనుమానం వచ్చి ఇంటి యజమానికి చెప్పారు. తలుపులు బద్దలు కొట్టి చూడగా అతను శవమై కనిపించాడు. వెంటనే వారంతా కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంజనీరింగ్ ఎంట్రన్స్ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్న వాల్మీకి రెండేళ్లుగా కోటాలోనే ఉంటున్నాడు. కోటాలో విద్యార్థి ఆత్మహత్యల్లో ఈ నెలలో ఇది నాలుగోది. ఇక ఈ ఏడాది ఇప్పటివరకు 20 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. నిరుపేద కుటుంబాల నుంచి పిల్లలు చదువుల ఒత్తిడి తట్టుకోలేకపోవడమో, తల్లిదండ్రులు చేసిన అప్పు వేధిస్తూ ఉండడంతో ఆత్మహత్యలు ఎక్కువైపోతున్నాయన్న అంచనాలున్నాయి. విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతూ ఉండడంతో జిల్లా యంత్రాంగం ఆందోళన చెందుతోంది. ప్రతీ విద్యార్థికి సైక్రియాటిస్ట్‌తో కౌన్సెలింగ్ ఇప్పించడానికి సన్నాహాలు చేస్తోంది.

బీజేపీతో కలిసేదే లేదు: పవార్



ఔరంగాబాద్: బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ కుండబద్దలు కొట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో జాతీయస్థాయిలో మార్పు కోసం పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తామని ప్రకటించారు. ఎన్నికల్లో మహారాష్ట్రలో ఎన్సీపీని కాదని మహా వికాస్ అగాఢీలోని ఇతర భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, శివసేన (యుబిటి) మాత్రమే కలిసి పనిచేయనున్నయనే వార్తలను కొట్టిపారేశారు. ఎన్సీపీ చీలిక వర్గం నాయకుడైన అజిత్ పవార్‌తో తన భేటీకి ప్రాధాన్యమేమీ లేదన్నారు. ఆ వర్గం ఇప్పటికి తన ఫోటోలను వాడుకుంటుండటంపై త్వరలో కోర్టుకు వెళ్తామని చెప్పారు. ఎన్సీపీ గుర్తు విషయమై ఎన్నికల కమిషన్ లేఖకు బదులు పంపినట్టు చెప్పారు. మణిపూర్‌తో పాటు ఈశాన్య భారతంలో జరుగుతున్న పరిణామాలు ప్రమాదకరంగా ఉన్నాయంటూ ఆందోళన వెలిబుచ్చారు. మణిపూర్ హింసపై మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం మూగ నోము పట్టిందని దుయ్యబట్టారు. మోదీ ఈశాన్య భారతంలో పర్యటించి అక్కడ వారికి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వర్షం ఇంక లేదు.. వరదైంది..!

స్పాంజ్ సిటీస్‌పై నీలి మేఘాలు

వరదలతో అతలాకుతలమవుతున్న చైనా

ఇప్పటివరకు 30 నగరాలు స్పాంజ్ సిటీలుగా రూపాంతరం

రోజుకి 20 సెంటీ మీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిస్తే తట్టుకోవడం కష్టమే



స్పాంజ్ సిటీల నిర్మాణం ఇలా!

- నగరంలో రెయిన్ గార్డ్స్ నిర్మాణం
- వర్షం నీరు రహదారులపై నిలవకుండా నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా రహదారుల నిర్మాణం
- వాన నీరు రిజర్వాయర్లలోకి వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థ పునర్నిర్మాణం
- రోడ్డుకిరువైపు పేవ్‌మెంట్ల మీద, ప్రతీ భవనంలోనూ వాన నీరు భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతల ఏర్పాటు
- నీరు నిల్వ చేయడానికి కొత్తగా కాలువలు, చెరువుల తవ్వకం
- చిత్తడి నేలల పునరుద్ధరణ
- ప్రతీ భవనంపైనా రూఫ్ గార్డెన్స్ ఏర్పాటు
- వర్షం నీరుని శుద్ధి చేస్తూ తిరిగి వాడుకోవడానికి ఉపయోగపడేలా ఎక్కడికక్కడ ప్లాంట్ల నిర్మాణం

చైనా వరద బీభత్సంతో అల్లాడిపోతోంది. నగరాలు నదుల్లా మారిపోయాయి. వరద ముంపుని ఎదుర్కోవడానికి చైనా కొన్నేళ్ల క్రితం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన స్పాంజ్ సిటీస్ పై నీలి మేఘాలు కమ్ముకున్నాయి. పట్టణ ప్రాంతాల్లో వరదల్ని ఎదుర్కోవడానికి ఇప్పటివరకు 30 నగరాలను స్పాంజ్ నగరాలుగా మార్చింది. మరి ఈ స్పాంజ్ సిటీస్ సమర్థంగా పని చేయడం లేదా ? ఈ ఏడాది చైనాలో ఎందుకీ వరద బీభత్సం?

వాతావరణ మార్పులు ప్రపంచ దేశాలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అయితే భారీ వర్షాలు, వరదలు లేదంటే రికార్డు స్థాయి ఎండలు, ఉక్కబోత.. ఇప్పుడివే కనిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో రికార్డు స్థాయి వర్షాలతో చైనా తడిసి ముద్దవుతోంది. కేవలం జులై నెలలో కురిసిన వర్షాలకే 150 మంది మరణిస్తే, వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. 250 కోట్ల డాలర్ల వరకు ఆస్తి నష్టం సంభవించింది. ఈ వరదల్ని ఎదుర్కోవడం కోసమే చైనా కొన్నేళ్ల క్రితం స్పాంజ్ సిటీల నిర్మాణానికి నడుం బిగించింది.

ఏమిటీ స్పాంజ్ సిటీస్

వాతావరణ మార్పుల ప్రభావం ఎంత తీవ్ర స్థాయిలో ఉంటుందో అంచనా వేసిన చైనా 2015లో స్పాంజ్ సిటీస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. చైనాలో 654 నగరాల్లో 641 నగరాలకి వరద ముప్పు పొంచి ఉంది. ప్రతీ ఏడాది 180 పట్టణాలు వరదలతో అతలాకుతలమవుతున్నాయి. జనాభాతో కిటకిటలాడుతూ ప్రతీ నగరం ఒక కాంక్రీట్ జంగిల్‌గా మారిపోవడంతో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నానాటికీ పెరిగిపోతున్నాయి. వర్షపు నీరు నగరాన్ని ముంచేయకుండా బొట్టు బొట్టు సద్వినియోగం చేసుకోవడమే ఈ స్పాంజ్ సిటీస్ లక్ష్యం. ఏ ప్రాంతంలో కురిసిన వాన నీరు అదే ప్రాంతంలో పూర్తిగా వాడుకునేలా సహజసిద్ధమైన ఏర్పాట్లు చేయడం స్పాంజ్ సిటీస్. ఒక్క మాటలో చెప్పాలంటే వర్షపు నీటిని ఒక స్పాంజ్‌లా పీల్చుకునేలా నగరాల రూపురేఖలు మార్చడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం.

చైనా ఈ ప్రాజెక్టుని అత్యంత ఘనంగా ప్రకటించింది కానీ ఆచరణలో ఇంకా వేగం పుంజుకోలేదు. 2015లో పైలెట్ ప్రాజెక్టుగా మొదలు పెట్టి 30 నగరాలను స్పాంజ్ సిటీలుగా మార్చింది. ఒక్కో నగరం మీద వెయ్యి కోట్ల యువాన్‌లకు పైనే ఖర్చు పెట్టింది. గత ఏడాది మొత్తం 654 నగరాలకు గాను 64 నగరాలకు స్పాంజ్ సిటీ మార్గదర్శకాలు పాటించాలని నిబంధనలు విధించారు.

ఈ ప్రాజెక్టు ఎంతవరకు అమలైంది?

1978 నుంచి గణాంకాలను పరిశీలిస్తే చైనా పట్టణ ప్రాంత జనాభా అయిదు రెట్లు పెరిగింది. చైనా జనాభాలో 90 కోట్ల మంది పట్టణాల్లోనే నివసిస్తున్నారు. ఉత్తర చైనా మినహాయించి మిగిలిన పట్టణ ప్రాంత జనాభా అంతా వరద ముప్పులో ఉంది. అందుకే స్పాంజ్ సిటీస్ నిర్మాణం వేగవంతం చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. స్పాంజ్ సిటీస్ పై ఒక చట్టాన్ని తీసుకువస్తేనే త్వరితగతిన వీటి నిర్మాణం పూర్తి అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

స్పాంజ్ సిటీలకూ పరిమితులున్నాయ్..!

చైనా ప్రభుత్వం పూర్తి స్థాయిలో స్పాంజ్ సిటీలను నిర్మించినప్పటికీ ఈ ఏడాది వరద బీభత్సాన్ని ఎదుర్కోవడం సులభం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హెనాన్ ప్రావిన్స్‌లోని జెంగ్‌జూ నగరాన్ని పూర్తి స్థాయిలో స్పాంజ్ సిటీగా మార్చేసింది. 2016 నుంచి 2021 మధ్య కేవలం ఈ ఒక్క నగరంపైనే 6 వేల కోట్ల యువాన్‌లు ఖర్చు పెట్టింది. అయినప్పటికీ వరదల్ని ఎదుర్కోలేక జెంగ్‌జూ నగరం నీట మునిగింది. దీనికీ కారణాలున్నాయి. చైనా తలపెట్టిన స్పాంజ్ సిటీలు రోజుకి 20 సెంటీ మీటర్ల వర్షం కురిస్తే తట్టుకోగలవు. అలాంటిది గత జులైలో జెంగ్‌జూలో ఒక గంటలో 20 సెంటీ మీటర్ల వాన కురిసింది. ఇక బీజింగ్ పరిసరాల్లో మూడు రోజుల్లో 75 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అంతే కాకుండా ఉత్తర చైనాలో సాధారణంగా వర్షలు అంతగా కురవవు. అందుకే ఆ ప్రాంతంలో ఇంకా స్పాంజ్ సిటీల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించలేదు.. ఈ ఏడాది వాతావరణ మార్పుల ప్రభావంతో ఉత్తర చైనాలో రికార్డు స్థాయిలో వర్షాలు కురిసాయి. అక్కడ స్పాంజ్ సిటీల నిర్మాణం జరగకపోవడంతో వరదలు పోటెత్తాయి. చైనా ఎన్ని చర్యలు చేపట్టి కోట్లాది యువాన్‌లు ఖర్చు చేసినా ప్రకృతి ముందు తలవంచక తప్పలేదు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మళ్లీ ఎన్డీయేనే..

- ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే జాతీయ స్థాయిలో బీజేపీ కూటమి ఘన విజయం
- 296 నుంచి 326 స్థానాల్లో ఎన్డీయే గెలుపు
- బీజేపీకి సొంతంగానే 288 నుంచి 314 సీట్లు
- విపక్ష 'ఇండియా'కు 160 నుంచి 190 స్థానాలే
- తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు 9 నుంచి 11 స్థానాలు
- 'టైమ్స్ నౌ' సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే జాతీయ స్థాయిలో అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) వరుసగా మూడోసారి అధికారంలో రావడం ఖాయమని ప్రఖ్యాత 'టైమ్స్ నౌ' సర్వే తేల్చిచెప్పింది. మొత్తం 543 స్థానాలకు గాను ఎన్డీయేకు 296 నుంచి 326, విపక్ష ఇండియా కూటమికి 160 నుంచి 190 స్థానాలు లభిస్తాయని వెల్లడించింది. ఎన్డీయేలోని ప్రధానపక్షమైన బీజేపీ సొంతంగానే 288 నుంచి 314 సీట్లు గెలుచుకుంటుందని స్పష్టం చేసింది. ఇక విపక్ష ఇండియా కూటమిలో ప్రధాన పార్టీ అయిన కాంగ్రెస్ 62 నుంచి 80 స్థానాలకే పరిమితం అవుతుందని పేర్కొంది. ఓట్ల శాతంపరంగా చూస్తే ఎన్డీయేకు 42.60 శాతం, ఇండియాకు 40.20 శాతం ఓట్లు లభిస్తాయని సర్వే వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేస్తుందని తేల్చింది. రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలకు గాను దాదాపు మొత్తం స్థానాలు కైవసం చేసుకుంటుందని వెల్లడించింది. వైఎస్సార్‌సీపీకి 24 నుంచి 25 సీట్లు లభిస్తాయని తేల్చిచెప్పింది. అంతే కాకుండా ఆ పార్టీ ఓట్ల శాతం కూడా పెరుగనున్నట్లు గుర్తించింది. 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ 49.8 శాతం ఓట్లతో 22 స్థానాల్లో నెగ్గింది. ఈసారి 51.3 శాతం ఓట్లతో మొత్తం స్థానాలను తన ఖాతాలు వేసుకుంటుందని టైమ్స్ నౌ సర్వే తేల్చడం విశేషం. అంటే కిందటి ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు ఆ పార్టీ ఓట్ల శాతం 1.50 శాతం పెరుగనున్నట్లు తేటతెల్లమవుతోంది. వైఎస్సార్‌సీపీ పట్ల నానాటికీ పెరుగుతున్న ప్రజాదరణకు ఇది నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు తెలంగాణలో అధికార భారత రాష్ట్ర సమితికి(బీఆర్‌ఎస్) 9 నుంచి 11 లోక్‌సభ స్థానాలు లభిస్తాయని సర్వే తెలియజేసింది. బీజేపీకి 2 నుంచి 3, కాంగ్రెస్‌కు 3 నుంచి 4 స్థానాలు దక్కుతాయని పేర్కొంది. ఇతరులు ఒక సీటు గెలుచుకోనున్నట్లు అంచనావేసింది.

జాతీయ స్థాయిలో ఏ కూటమికి ఎన్ని సీట్లు (మొత్తం సీట్లు 543)

కూటమి	సీట్లు
ఎన్డీయే	296-326 (ఓట్ల శాతం 42.60)
ఇండియా	160-190 (ఓట్ల శాతం 40.20)

జాతీయ స్థాయిలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు

పార్టీ	సీట్లు
బీజేపీ	288-314
కాంగ్రెస్	62-80
వైఎస్సార్‌సీపీ	24-25
డీఎంకే	20-24
టీఎంసీ	22-24
బీజేడీ	12-14
బీఆర్‌ఎస్	9-11
ఆమ్ ఆద్మీ పార్టీ	5-7
ఇతరులు	70-80

ఆంధ్రప్రదేశ్‌లో ఎవరికెన్ని సీట్లు

పార్టీ	సీట్లు
వైఎస్సార్‌సీపీ	24-25
తెలుగుదేశం	0-1
ఇతరులు	0

ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల శాతం

పార్టీ	ఓట్ల శాతం
వైఎస్సార్‌సీపీ	51.3
తెలుగుదేశం	36.2
ఇతరులు	-

తెలంగాణలో ఎవరికెన్ని సీట్లు

పార్టీ	సీట్లు
బీఆర్‌ఎస్	9-11
బీజేపీ	2-3
కాంగ్రెస్	3-4
ఇతరులు	1

తెలంగాణలో ఓట్ల శాతం

పార్టీ	ఓట్ల శాతం
బీఆర్‌ఎస్	38.40
బీజేపీ	24.30
కాంగ్రెస్	29.90
ఇతరులు	7.40

పంది కిడ్నీ పని చేసింది

న్యూయార్క్: కిడ్నీ మార్పిడి చరిత్రలో పెద్ద ముందడుగు. అమెరికాలో న్యూయార్క్ లోని ఎన్ వైయూ లాంగ్ వన్ హెల్త్ సంస్థ వైద్యులు ఓ బ్రెయిన్ డెడ్ రోగికి పంది కిడ్నీ అమర్చగా అది ఏకంగా నెల రోజుల పాటు చక్కగా పని చేసింది. మనిషికి పంది కిడ్నీ ఇన్ని రోజుల పాటు పని చేయడం ఇదే తొలిసారి. గతంలో న్యూయార్క్ వర్సిటీ, అలబామా వర్సిటీ చేసిన కిడ్నీ మార్పిడులు రెండు మూడు రోజుల పాటు మాత్రమే పని చేశాయి. అన్నీ కుదిరితే త్వరలో సాధారణ రోగులకు కూడా పంది కిడ్నీ అమర్చుతామని వైద్య బృందం అంటోంది. అయితే మనిషి వ్యాధి నిరోధకతకు పంది కిడ్నీ ఎలా పని చేస్తుందో కూడా చూస్తామని చెబుతోంది. అందు కోసం రెండో నెల కూడా కిడ్నీని అలాగే ఉంచి చూడనున్నారు.

'పీఎం విశ్వకర్మ'కు మంత్రివర్గం ఆమోదం

రూ.13,000 కోట్లతో పథకం అమలు

- వచ్చే ఐదేళ్లలో 30 లక్షల కుటుంబాలకు లబ్ధి
- సంప్రదాయ వృత్తుల్లో ఉన్నవారికి రూ.2 లక్షల దాకా రుణ సాయం
- లబ్ధిదారులకు నైపుణ్య శిక్షణ, మార్కెటింగ్ సదుపాయం
- దేశవ్యాప్తంగా 169 నగరాల్లో 10,000 ఎలక్ట్రిక్ బస్సులు
- 'ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ' సమావేశంలో కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన 'ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ' సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రానున్న ఐదేళ్లలో అమలు చేయనున్న 'పీఎం విశ్వకర్మ' పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కింద రూ.13,000 కోట్లు ఖర్చు చేస్తారు. దేశవ్యాప్తంగా 30 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. చేనేత కార్మికులు, స్వర్ణకారులు, వడ్రంగులు, లాండ్రీ కార్మికులు, క్షురకులు, కుమ్మరులు, శిల్ప కళాకారులు, రాళ్లు కొట్టేవారు, తాపీ మేస్త్రీలు, బుట్టలు అల్లేవారు, చీపుర్లు తయారుచేసేవారు, తాళాలు తయారుచేసేవారు, బొమ్మల తయారీదారులు, పూలదండలు తయారుచేసేవారు, మత్స్యకారులు, దర్జీలు, చేపల వలలు అల్లేవారు తదితర సంప్రదాయ వృత్తుల్లో ఉన్నవారికి ప్రయోజనం కల్పించాలని నిర్ణయించారు. పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రధాని మోదీ మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. విశ్వకర్మ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 17న ఈ పథకాన్ని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన వారికి 'పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్, గుర్తింపు కార్డు' అందజేస్తారు. రూ.2 లక్షల దాకా రుణ సదుపాయం కల్పిస్తారు. వడ్డీ రేటు 5 శాతం చెల్లించాల్సి ఉంటుంది. లబ్ధిదారులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోపాటు ఇతర ప్రోత్సాహకాలు అందజేస్తారు. మార్కెటింగ్ మద్దతు సైతం ఉంటుంది. అంటే ఉత్పత్తులను విక్రయించుకోవడానికి ప్రభుత్వం సహకరిస్తుంది.

శిక్షణ కాలంలో రోజుకి రూ.500 స్టైపెండ్

పీఎం విశ్వకర్మ పథకంలో బేసిక్, అడ్వాన్స్‌డ్ అనే రెండు రకాల నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. లబ్ధిదారులకు శిక్షణ కాలంలో రోజుకి రూ.500 చొప్పున స్టైపెండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే ఆధునిక యంత్రాలు, పరికరాలు కొనుక్కోవడానికి రూ.15,000 వరకూ ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. మొదటి ఏడాది 5 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో మొత్తం 30 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతాయని వివరించారు. గురు–శిష్య పరంపరను, కుటుంబ ఆధారిత సంప్రదాయ నైపుణ్యాలను బలోపేతం చేయడమే పథకం ఉద్దేశమని స్పష్టం చేశారు. తొలుత 18 రకాల సంప్రదాయ నైపుణ్యాలకు పథకాన్ని వర్తింపజేస్తామని అన్నారు.

నగరాల్లో 'పీఎం ఈ-బస్ సేవ'

పర్యావరణ హిత రవాణా సాధనాలకు పెద్దపీట వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. ఎలక్ట్రిక్ వాహనాలకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని భావిస్తోంది. ఇందులో భాగంగా 'పీఎం ఈ–బస్ సేవ'కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలియజేసింది. రవాణా సేవలు వ్యవస్థీకృతంగా లేని నగరాల్లో ఎలక్ట్రిసిటీ బస్సులను ప్రవేశపెట్టడమే ఈ కార్యక్రమ లక్ష్యమని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) విధానంలో 169 నగరాల్లో 10,000 ఈ–బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పథకం అంచనా వ్యయం రూ.57,613 కోట్లు కాగా, ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.20,000 కోట్లు సమకూరుస్తుందని వివరించారు. హరిత పట్టణ రవాణా కార్యక్రమాల్లో భాగంగా 181 నగరాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.

7 మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

రైల్వే శాఖలో 7 మల్టీ–ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.32,500 కోట్లు. ఈ భారాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మొత్తం 35 జిల్లాలు ఈ ప్రాజెక్టుల పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం ఉన్న లైన్ కెపాసిటీ పెంచుతారు.

మన కళాకారులకు మరింత ప్రోత్సాహం: మోదీ

పీఎం విశ్వకర్మ పథకంతో మన సంప్రదాయ కళాకారులకు, చేతి వృత్తిదారులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. మన దేశంలో నైపుణ్యాలకు, సాంస్కృతి వైవిధ్యానికి కొదవ లేదన్నారు. మన విశ్వకర్మల్లోని వెలకట్టలేని నైపుణ్యాలను ముందు తరాల కోసం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

నెహ్రూ మ్యూజియం కాదు.. ఇక ప్రధానమంత్రి మ్యూజియం

- అధికారికంగా పేరు మార్పు
- నెహ్రూ పేరును తొలగించడానికేనన్న కాంగ్రెస్
- ప్రధానమంత్రులందరికీ చోటు కల్పించామన్న బీజేపీ



న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీ తీన్‌మూర్తి భవన్‌లో అంతర్జాతీయ ప్రఖ్యాతి వహించిన నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ (ఎన్‌ఎంఎంఎల్)ని ప్రధానమంత్రి మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ (పీఎంఎంఎల్) అని అధికారికంగా పేరు మార్చడం వివాదస్పదమవుతోంది. కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటలు మంటలు చెలరేగాయి. నెహ్రూ పేరుని చరిత్ర పుటల్లోంచి తొలగించడానికి ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారంటూ కాంగ్రెస్ మండిపడుతూ ఉంటే, ప్రధానమంత్రులందరికీ సమ ప్రాధాన్యం ఇచ్చామని బీజేపీ ఎదురుదాడికి దిగింది. నెహ్రూ మ్యూజియం పేరు మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినప్పుడే దీనిపై వివాదం రేగింది. కాగా మ్యూజియం పేరు మారుస్తూ సోమవారం నాడు అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. "నెహ్రూ మెమోరియల్ మ్యూజియం లైబ్రరీ ఇక నుంచి ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీగా మారింది. ప్రజాస్వామ్యానికి అనుగుణంగా వైవిధ్యాన్ని చాటి చెప్పడానికే ఈ పేరు మార్పు జరిగింది. ఈ నెల 14 నుంచి ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి" అని పీఎంఎంఎల్ వైస్ చైర్మన్ సూర్యప్రకాశ్ వెల్లడించారు. తీన్‌మూర్తి భవనంలో 16 ఏళ్లపాటు నెహ్రూ అధికారిక నివాసంగా ఉంది. 1966 , ఏప్రిల్1న అందులో నెహ్రూ మ్యూజియంను ఏర్పాటు చేశారు.

నెహ్రూని అప్రతిష్టపాల్జేయడమే మోదీ ఎజెండా: కాంగ్రెస్

నెహ్రూ వారసత్వాన్ని అప్రతిష్టపాల్జేయడమే ప్రధాని మోదీ ఎజెండా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఆరోపించారు. ఈ మేరకు ట్విటర్‌లో ఒక పోస్టు పెట్టారు. "ప్రధాని మోదీ అభద్రతా భావం, భయాందోళనల మధ్య నెహ్రూ మ్యూజియం పేరు మార్చారు. నెహ్రూ వారసత్వాన్ని విధ్వంసం చేయాలని ఆయన భావిస్తున్నారు. మ్యూజియం పేరులో ఎన్ స్థానంలో పీ అని మార్చారు. అందులో "పీ" అంటే చిన్నతనం, ఇబ్బంది పెట్టడం" అని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. నెహ్రూ పేరు మార్చారు కానీ స్వాతంత్య్ర సంగ్రామంలో ఆయన పోషించిన పాత్రను, భారత్‌ను లౌకిక, ప్రజాస్వామ్య దేశంగా ఆయన నడిపించిన విధానాన్ని చెరిపేయలేరని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

ప్రధానమంత్రులందరి ఘనత చాటడానికే: బీజేపీ

కాంగ్రెస్ చేసిన ఆరోపణల్ని బీజేపీ కొట్టిపారేసింది. దేశ ప్రధానమంత్రులందరి ఘనతలు ప్రపంచానికి చాటి చెప్పడానికే మ్యూజియం పేరుని మార్చినట్టు స్పష్టం చేసింది. లాల్‌బహదూర్ శాస్త్రి, పీ.వీ.నరసింహారావు, హెచ్.డి.దేవెగౌడ, ఐకే గుజ్రాల్ ఇలా ఎందరో భారత దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దారని, ఈ మ్యూజియం ఏ ఒక్కరికో, ఒక కుటుంబానికో చెందినది కాదని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అన్నారు.

బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీ

న్యూఢిల్లీ: బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ బుధవారం నాడిక్కడ సమావేశమై మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించింది. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో పాటు కమిటీ సభ్యులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా తదితరులు పాల్గొన్నారు. ఆయా రాష్ట్రాల్లో నెలకొన్న పరిస్థితులను రాష్ట్ర నాయకత్వం ఎలక్షన్ కమిటీకి వివరించింది. సాధారణంగా ఎన్నికల తేదీలు ప్రకటించాక సమావేశమయ్యే సెంట్రల్ ఎలక్షన్ కమిటీ.. ముందుగానే భేటీ కావడం ఈ ఏడాది చివర్లో ఐదు రాష్ట్రాలకు జరిగే ఎన్నికలకు ఇస్తున్న ప్రాముఖ్యతను తెలియజెపుతోందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. గట్టి పోటీ ఎదురయ్యే స్థానాలపై బీజేపీ ప్రధానంగా దృష్టి సారిస్తోంది. తగిన వ్యూహం, గట్టి అభ్యర్థులను ఎంపిక చేయడం ద్వారా పరిస్థితులను అనుకూలంగా మలచుకోవచ్చని పార్టీ నాయకత్వం భావిస్తోంది.

జాబిల్లి వైపు వడివడిగా..

- ఐదోసారి చంద్రయాన్–3 కక్ష్య తగ్గింపు విజయవంతం
- నేడు ప్రపొల్షన్ మాడ్యూల్ నుంచి వేరుకానున్న ల్యాండర్ మాడ్యూల్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చందమామపై పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్ కక్ష్య దూరాన్ని ఐదోసారి పెంచే ప్రక్రియను బుధవారం విజయవంతంగా నిర్వహించారు. దీంతో కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియలన్నీ పూర్తయ్యాయి. చంద్రుడి ఉపరితలంపై దిగే కీలక ఘట్టానికి చంద్రయాన్–3 మరింత చేరువైంది. ఇక ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్, రోవర్‌తో కూడిన ల్యాండర్ మాడ్యూల్ వేరుకావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ మిషన్ చంద్రుడి సమీప కక్ష్యలోకి(లూనార్ ఆర్బిట్) ఎలాంటి అవరోధాలు లేకుండా చేరుకుంది. చంద్రయాన్–3 ఇప్పుడు చంద్రుడి చుట్టూ 153 కిలోమీటర్లు, 163 కిలోమీటర్ల స్వల్ప దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరుగుతోంది. అలాగే చంద్రుడి ఉపరితలం నుంచి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న కక్ష్యలోకి చేరుకుంది. ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్‌ను వేరుచేసే విన్యాసాన్ని ఈ నెల 17న చేపట్టనున్నట్లు ఇస్రో తెలియజేసింది.



నేటి నుంచే ముఖ్యమైన ఆపరేషన్

బెంగళూరులోని మిషన్ ఆపరేటర్ కాంప్లెక్స్(ఎంఓఎక్స్), ఇస్రో టెలీమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్(ఇస్ట్రాక్), బైలాలులో ఉన్న ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ (ఐడీఎస్ఎన్) లాంటి భూ నియంత్రిత కేంద్రాల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు గురువారం నుంచి ముఖ్యమైన ఆపరేషన్లు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్ విడిపోయిన తర్వాత ల్యాండర్‌లో వున్న ఇంధనాన్ని మండించి ఈ నెల 19, 21న రెండుసార్లు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టనున్నారు. ఈ నెల 23న సాయంత్రం 5.47 గంటలకు ల్యాండర్‌ను చంద్రుడి ఉపరితలంపై దక్షిణ ధృవ ప్రాంతంలో మృదువైన ప్రదేశంలో దించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు.

తీర్పుల్లో మహిళల పట్ల అనుచిత పదాలు వాడొద్దు

హ్యాండ్ బుక్ విడుదల చేసిన సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్

ఢిల్లీ: న్యాయస్థానాల్లో కేసుల విచారణ, తీర్పులు వెల్లడించే సమయంలో మహిళలపై వివక్షకు తావు లేకుండా కీలక ముందడుగు పడింది. వేశ్య, పతిత, ఎఫైర్, హౌస్‌వైఫ్, ట్రాన్స్‌సెక్సువల్, వ్యభిచారం వంటి పదాలు ఇక ఉపయోగించకూడదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు నిర్దేశించింది. ఈ మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ బుధవారం ఒక హ్యాండ్‌బుక్‌ను విడుదల చేశారు. "హ్యాండ్‌బుక్ ఆన్ కంబాటింగ్ జెండర్ స్టీరియో టైప్స్" పేరుతో ఉన్న ఈ హ్యాండ్‌బుక్‌లో న్యాయస్థానాలు గతంలో ఇచ్చిన తీర్పుల సమయంలో మహిళల పట్ల అనుచితంగా ఉండే 100కి పైగా పదాలు అందులో ఉన్నాయి. ఆ పదాలకు బదులుగా ఏం వాడాలో కూడా అందులో వివరంగా రాశారు. రెచ్చగొట్టే దుస్తులు, పెళ్లి కాకుండానే తల్లి, ఎఫైర్, వేశ్య వంటి పద ప్రయోగాలకు చేయకూడదని, వాటికి బదులుగా దుస్తులు, తల్లి, వివాహేతరం సంబంధం, సెక్స్ వర్కర్ అని మాత్రమే రాయాలని ఆ హ్యాండ్‌బుక్ స్పష్టంగా చెబుతోంది. ఈవ్‌టీజింగ్ బదులుగా స్ట్రీట్ సెక్సువల్ హెరాజ్‌మెంట్, హౌస్ వైఫ్ బదులుగా హోమ్‌మేకర్ అన్న పదాలు వాడాలని నిర్దేశించింది.

మూస పదాలు వద్దు

ఈ హ్యాండ్‌బుక్ విడుదల చేసిన సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ మాట్లాడుతూ న్యాయ ప్రక్రియల్లో మహిళలపై మూస పద్ధతుల్లో ఎలాంటి పదాలు ఉపయోగిస్తారో ఈ పుస్తం చెబుతుందని అన్నారు. "తీర్పులు రాసే సమయంలో న్యాయమూర్తులు మహిళల పట్ల అనాలోచితంగా అనుచిత పదాలు వాడుతున్నారు. మూసపద్ధతుల్లో ఉండే పద ప్రయోగాలు చేస్తున్నారు. గతంలో వచ్చిన తీర్పుల్ని విమర్శించడం ఉద్దేశం కాదు. భవిష్యత్‌లో న్యాయమూర్తులు ఆ పదాలు ఉపయోగించకుండా ఈ హ్యాండ్‌బుక్ ఉపయోగపడుతుంది. ఏ పదాలకు గుర్తింపు ఉందో స్పష్టంగా తెలుస్తుంది. భవిష్యత్‌లు ఇచ్చే తీర్పుల్లో న్యాయమూర్తులు సరైన పదాలు వాడితే వారిచ్చే తీర్పులపై అపోహలకు కూడా తావుండదు" అని జస్టిస్ చంద్రచూడ్ వివరించారు.

రక్షణ శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘంలో రాహుల్ గాంధీ!

న్యూఢిల్లీ: రక్షణ శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం(స్టాండింగ్ కమిటీ) సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ బుధవారం నామినేట్ అయ్యారు. కాంగ్రెస్ మరో ఎంపీ అమర్‌సింగ్ కూడా ఇదే కమిటీకి నామినేట్ అయ్యారు. ఈ మేరకు లోక్‌సభ ఒక బులెటిన్ విడుదల చేసింది. పరువు నష్టం కేసులో అనర్హత వేటు పడకముందు రాహుల్ గాంధీ రక్షణ శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘంలో సభ్యుడిగా వ్యవహరించారు. ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని ఆగస్టు 7న పునరుద్ధరించిన సంగతి తెలిసిందే. ఎన్సీపీ ఎంపీ ఫైజల్ పి.పి.మొహమ్మద్ లోక్‌సభ సభ్యత్వాన్ని కూడా పునరుద్ధరించారు. ఆయనను వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ స్టాండింగ్ కమిటీకి నామినేట్ చేశారు.



దుర్గమ్మ సేవలో స్పీకర్ దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు బుధవారం దర్శించుకున్నారు.



సఫాయి కర్మచారి కమిషన్ పర్యటన

జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా బుధవారం కృష్ణాజిల్లాలో పర్యటించారు.

-8లో▸



యార్డులో మిర్చి బస్తాల విక్రయం

కొరిటెపాడు(గుంటూరు):గుంటూరు మార్కెట్ యార్డు కు బుధవారం 40,484 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 41,997 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

నేడు హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను విజయవాడ వన్ టౌన్‌లోని కేబీఎన్ కాలేజీలో ఈ నెల 17వ తేదీ గురువారం ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్. వంశీకృష్ణప్రసాద్ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు మధ్యాహ్నం మూడు గంటలకు ప్రాంగణంలో రిపోర్ట్ చేయాలన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు ఒంగోలులో జరిగే ఎనిమిదో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

ప్లంబర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ కోర్సుల్లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థల అధికారులు నరేష్‌కుమార్, పవన్‌కుమార్ బుధవారం సంయుక్తంగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటో సెన్సార్, సీపీపీవీసీ పైప్స్, ఫిటింగ్స్, వాటర్ ట్యాంక్ కనెక్షన్లపై ట్రైనింగ్ ఇచ్చి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఈనెల 23వ తేదీలోపు విజయవాడ విద్యాధరపురం బీసీ హాస్టల్ ప్రాంగణంలో నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్స్ (ఎన్‌ఏసీ) కార్యాలయంలో అర్జీలు అందజేయాలని, వివరాలకు 96667 71746, 98667 95010 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.2.28 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.2.28 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులు, ముడుపులను బుధవారం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 14 రోజులకు గాను రూ.2,28,24,147 నగదుతో పాటు 557 గ్రాముల బంగారం, 5.210 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. రోజుకు సరాసరిన రూ.16.3 లక్షలు హుండీల ద్వారా దేవస్థానానికి ఆదాయం వచ్చిందని వివరించారు. ఇక ఈ–హుండీ ద్వారా దేశంలోని వివిధ ప్రదేశాల నుంచి భక్తులు రూ.82,018 విరాళాలను దేవస్థానానికి సమర్పించారు. కానుకల లెక్కింపును చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు చింకా శ్రీనివాసులు, దేవస్థాన అధికారులు అనురాధ, జి. శ్రీనివాస్ పర్యవేక్షించారు.

20న ఏపీ, తెలంగాణ ఓపెన్ టెన్నిస్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఓపెన్ ప్రైజ్ మనీ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఈ నెల 20వ తేదీన విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని స్టార్ టెన్నిస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ కె.డి.గోపాల్ తెలిపారు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, మాన్వి ఇంటీరియర్ కాన్సెప్ట్, స్టార్ టెన్నిస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అండర్–12, 14, 16 విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 18వ తేదీ లోపు పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు, ట్రోఫీలు, సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 99899 94099, 70750 66789ను సంప్రదించాలని సూచించారు.

జేజేఎం పనుల పరిశీలన




గంపలగూడెం: గంపలగూడెం మండలం కనుమూరు, మేడూరు, గొల్లపూడి గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో చేపట్టిన పనులను కేంద్ర బృందం సభ్యులు బుధవారం పరిశీలించారు. బృంద సభ్యులు దేవేంద్రసింగ్ భజ్వా, రాజేష్‌కుమార్ భన్సాల్ ఆయా గ్రామాల్లో ట్యాప్ కనెక్షన్లు, మురుగునీటి పారుదల సౌకర్యం, వాటర్ ట్యాక్స్ వసూలు, రక్షిత మంచినీటి సరఫరా, జేజేఎంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. సచివాలయాలలో రికార్డులను తనిఖీ చేశారు.

పటిష్టంగా మునేరు ఆనకట్ట

రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు పక్షపాతి అని మరోసారి నిరూపించుకుంది. గత నెలలో వచ్చిన వరదలకు దెబ్బతిన్న మునేరు కరకట్ట, కాలువలకు పడిన గండ్ల విషయం ఎమ్మెల్యే ఉదయభాను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లగానే ఆయన తక్షణం స్పందించి గండ్ల పూడ్చివేతకు రూ.1.80 కోట్లు మంజూరు చేశారు. అధికారులు యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చివేత పనులు ప్రారంభించారు. ప్రభుత్వ స్పందనకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- తువ్వకాలువకు గండ్లు పూడ్చివేత పనులు ప్రారంభం
- ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు
- యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చేందుకు రూ.1.80 కోట్లు మంజూరు
- రైతులు ఇక నిరభ్యంతరంగా వరినాట్లు వేసుకోవచ్చు

మంజూరు చేసిన నిధులు ఇలా...	
మునేరు ఆనకట్ట మరమ్మతులకు	: రూ.40 లక్షలు
శనగపాడు మేజర్ కాలువ	: రూ.28 లక్షలు
పెనుగంచిప్రోలు బ్రాంచి కెనాల్ మరమ్మతులు	: రూ.కోటి
కాచవరం బ్రాంచి కెనాల్ మరమ్మతులు	: రూ.3.05 లక్షలు



దెబ్బతిన్న మునేరు ఆనకట్ట





తువ్వకాలువకు పడిన గండ్లు పూడుస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి,విజయవాడ: మునేరు ఆయకట్టు రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చే పనులను ప్రారంభించింది. గత నెల 26, 27 తేదీల్లో తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం జిల్లాలో అధిక వర్షాలు కురవటంతో పాటు, కొన్ని చెరువులు తెగిపోవటం వలన 2 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చింది. దీంతో మునేరు ఆనకట్ట కోతకు గురై, మునేరు నది పరివాహక ప్రాంతంలో కాలువలకు 38 చోట్ల గండ్లు పడ్డాయి. మునేరులో నీటి నిల్వ సామర్థ్యం 0.13 టీఎంసీలు కాగా, దీని పరిధిలో 26వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే ప్రస్తుతం రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధం చేసుకుంటున్న తరుణంలో వారికి ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. మునేరు ఆనకట్టతో పాటు, దెబ్బతిన్న పెనుగంచిప్రోలు, శానంపాడు, కాచవరం బ్రాంచి కాలువలకు 38 చోట్ల గండ్లు పడ్డాయి. మునేరుకు బ్రిటీషు వారి హయాంలో 200 మీటర్ల మేర ఆనకట్ట నిర్మించారు. అయితే మూడు మీటర్ల మేర 100 మీటర్ల వరకు గోడ కొట్టుకు పోయింది. ప్రస్తుతం ఆనకట్టను మరమ్మతులు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఉదయభాను అక్కడ వరదకు దెబ్బతిన్న మునేరు ఆనకట్ట, కాలువలకు గండ్ల విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం వెంటనే మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేయాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును ఆదేశించారు. ఆయన వెంటనే నీటిపారుదల శాఖ అధికారులను మరమ్మతులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. నీటిపారుదల శాఖ అధికారులు రూ.1.80 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయగా, వాటికి వెంటనే అనుమతులు మంజూరు చేసి, పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు తువ్వకాలువ కాలువకు సంబంధించి గండ్లు పూడ్చివేత పనులను ప్రారంభించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ప్రభుత్వం అండ



అధిక వర్షాల వలన పోలంపల్లి మునేరు వద్ద, తువ్వ కాలువ వద్ద సుమారు 38 గండ్లు పడ్డాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. ఆయన వెంటనే నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతు పనులు ప్రారంభం అయ్యాయి. రైతులు నిరభ్యంతరంగా వరినాట్లు వేసుకోవచ్చు.

–ఉదయభాను, విప్,ఎమ్మెల్యే జగ్గయ్యపేట

కాలువలకు మరమ్మతులు చేస్తున్నాం



గత నెలలో తెలంగాణలో కురిసిన అధిక వర్షాలకు మునేరు ఆనకట్టతో పాటు, దాని పరిధిలో ఉన్న బ్రాంచి కెనాల్‌లకు గండ్లు పడ్డాయి. ఆయకట్టు రైతులకు ఇబ్బంది కలుగకుండా వెంటనే నీటిపారుదల శాఖ అధికారులతో అంచనాలు సిద్ధం చేసి, నిధులు మంజూరు చేశాం. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేస్తున్నాం. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–ఢిల్లీరావు, కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

తడాఖా చూపిన సెక్రటరీస్ ఆటగాళ్లు

54 పరుగులతో సరిపెట్టుకున్న ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు





హాఫ్ సెంచరీ సాధించిన పి.హాసిని, ఎస్.అర్షియా

మంగళగిరి: ఏసీఏ అండర్–19 ఉమెన్ ఇంటర్ జోనల్ వన్డే మ్యాచ్‌లో ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టుపై సెక్రటరీస్ లెవెన్ జట్టు 99 పరుగుల తేడాతో విజయం సాధించింది. నవులూరు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సెక్రటరీస్ లెవెన్ జట్టు 50 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 184 పరుగులకు చేసింది. జట్టు బ్యాట్స్ ఉమెన్ పి.హాసిని 66 బంతుల్లో అయిదు ఫోర్లతో 60 పరుగులు సాధించింది. మరో బ్యాట్స్ ఉమెన్ ఎస్. అర్షియా 111 బంతుల్లో 4 ఫోర్లతో 59 పరుగులు చేసింది. ప్రెసిడెంట్స్ లెవెన్ బౌలర్ కె.అక్షిత 9 ఓవర్లలో 30 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టగా మరో బౌలర్ జెహ్రా మేహక్ మూడు ఓవర్లలో 13 పరుగులిచ్చి రెండు వికెట్లను తీసింది. అనంతరం 185 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు 34.4 ఓవర్లలో 54 పరుగులు మాత్రమే సాధించి ఆలౌట్ అయింది. సెక్రటరీస్ లెవెన్ జట్టు బౌలర్ ఎ.విష్ణుప్రియ 8 ఓవర్లలో 14 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టగా బి.పుష్ప 6 ఓవర్లలో 9 పరుగులు ఇచ్చి 3 వికెట్లు సాధించింది.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 519.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 862.00 అడుగుల వద్ద ఉంది.

మోగింది కల్యాణ వీణ

- నేటి నుంచి నిజ శ్రావణమాసం ప్రారంభం
- పెళ్లి పనులకు శ్రీకారం చుడుతున్న ప్రజలు
- ఇక వరుసగా నాలుగు నెలల పాటు బాజాభజంత్రీలే



పామర్రు: గత రెండు నెలలుగా పెళ్లిళ్లకు ముహూర్తాలు లేక వధూవరుల తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులకు వచ్చే శ్రావణమాసం చెక్ పెట్టింది. ఇప్పటివరకు ఆషాఢ మాసం, అధిక శ్రావణ మాసాలు శూన్య మాసాలు కావడంతో వివాహాలకు ముహూర్తాలు లేక శుభ కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఈనెల 17 నుంచి నిజ శ్రావణ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో బాజాభజంత్రీలు మోగనున్నాయి. ఈనెల 19 నుంచి డిసెంబర్ వరకు వరుస ముహూర్తాలు ఉండటంతో పెళ్లి సందడి మొదలైంది. ఆగస్టు 16 అమావాస్య అనంతరం నిజ శ్రావణ మాసం వస్తుండటంతో ఈనెల 19 నుంచి దాదాపు పది రోజుల పాటు వరుసగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఇవి డిసెంబర్ వరకు కొనసాగనున్నాయి. ఈ ఏడాది నిజ శ్రావణ మాసం నుంచి డిసెంబర్ నెల వరకు దాదాపు 50 సుముహూర్తాలు ఉన్నాయి. జిల్లాలో పలు పట్టణాలు, గ్రామాల్లో సైతం కల్యాణ మండపాలకు డిమాండ్ ఏర్పడింది.

అనుబంధ వర్గాలకు చేతి నిండా పని

శుభ ముహూర్తాలు ప్రారంభం కావడంతో వివాహాలతో ముడిపడి ఉండే వివిధ వర్గాల వారికి చేతి నిండా పని దొరుకుతుంది. పురోహితులు, మంగళ వాయిద్యాలు, వంట మనుషులు, డెకరేషన్స్, పూల అలంకరణలు, ట్రావెల్స్, షామియానాలు, క్యాటరింగ్, బ్యూటీషియన్లు, బ్యాండ్ మేళాలు, డీజేలతో పాటు కూలీలకు మంచి డిమాండ్ ఏర్పడింది.

మంచి ముహూర్తాలు



ఏప్రిల్ నెల నుంచి శుభ కార్యాలు లేవు. జూలైలో ఆషాఢమాసం రావడంతో పెళ్లిళ్లకు బ్రేక్ పడింది. ఆగస్టు నెలలో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఆగస్టు 19, 20, 21, 23, 27, 31, సెప్టెంబర్‌లో 1, 3, 10 తేదీలలో వివాహ ముహూర్తాలు ఉన్నాయి.

–బి.ఫణికుమార్ శర్మ, పురోహితుడు, పామర్రు

పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన

- రాజకీయ పార్టీలు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు విజ్ఞప్తి



రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాలో ఓటర్ల జాబితా పరిశీలన పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఇందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు విజ్ఞప్తిచేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఓటర్ల జాబితా పరిశీలన 65 శాతానికి పైగా పూర్తి చేశామన్నారు. ఈనెల 21వ తేదీ లోగా నూరు శాతం సర్వే పూర్తి చేస్తామన్నారు. రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్లను బీఎల్వోలతో సమన్వయం చేసుకుని గడువులోగా పూర్తి చేసేందుకు సహకారం అందించాలన్నారు. అర్హత ఉన్న యువతను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలని ఆదేశించామన్నారు. నగరంలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల జాబితా పరిశీలన మరింత వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఓటర్లు, జనాభా నిష్పత్తి నిర్దేశించిన విధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎటువంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితా నూరు శాతం స్వచ్ఛీకరణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు జిల్లాలో జరుగుతున్న ఓటర్ల జాబితా పరిశీలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో డీఆర్వో కె.మోహన్ కుమార్, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గడువులోగా ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి డాక్టర్ పి.సంపత్‌కుమార్ బీఎల్వోలను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలన ప్రగతిపై బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా చేపట్టిన ఓటర్ల జాబితా పరిశీలన ఈనెల 21న ముగియనుందని, తక్కువ వ్యవధి ఉన్నందున ఓటర్ల జాబితా పరిశీలన వేగవంతం చేసి నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా 18 నుంచి 19 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరినీ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉంచేలా చూడాలన్నారు. 100 సంవత్సరాలు దాటిన, వలస వెళ్లిన ఓటర్ల జాబితా పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో విజయవాడ పశ్చిమ తహసీల్దార్ కె.లక్ష్మి, డెప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ దరియా, బీఎల్వోలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15 నాటికి ఈ–క్రాప్ నమోదు పూర్తి

జిల్లా వ్యవసాయాధికారి నాగమణెమ్మ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ నాగమణెమ్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వచ్చే నెల 15 నాటికి ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.నాగమణెమ్మ అన్నారు. విజయవాడ కొత్తవంతెన సెంటర్‌లోని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకుల సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖలో ప్రభుత్వ ప్రాధాన్యతలను అనుసరించి డివిజన్, మండల, రైతు భరోసా కేంద్రాల వారీగా పథకాలపై సమీక్ష చేశారు. సమావేశంలో నాగమణెమ్మ మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదులో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. పూర్తి పారదర్శకంగా కచ్చితమైన సమాచారం నమోదు చేయాలని సూచించారు. సెప్టెంబరు 19వ తేదీ నుంచి 24 వరకు ఈ–క్రాప్ నమోదు జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు. సెప్టెంబరు 25 నుంచి 28వ తేదీ వరకు ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దాలన్నారు. సెప్టెంబరు 30వ తేదీ నాటికి తుది జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శించాలన్నారు. పంట కాలంలో రైతులకు ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ముందుగా సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఈ–క్రాప్ నమోదులో ఎదురవుతున్న ఇబ్బందులను గ్రామ వ్యవసాయ సహాయకులు డీఏఓ దృష్టికి తీసుకురాగా, వాటికి ఆమె తగిన సూచనలు, సలహాలు అందించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యవసాయ శాఖలో మెరుగైన పనితీరు కనబరిచిన వివిధ స్థాయిల అధికారులకు, గ్రామ వ్యవసాయ, ఉద్యానవన శాఖ సహాయకులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు. సమావేశంలో జిల్లా వనరుల కేంద్ర ప్రాజెక్టు డైరెక్టర్ యు.నరసింహారావు జిల్లా శిక్షణ కో ఆర్డినేటర్ టి.మాధవీలత, డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు, భూసార పరీక్ష కేంద్రం, జీవ నియంత్రణ ప్రయోగశాలల్లో పనిచేసే సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలి

రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ అమర్లపూడి శేఖర్‌బాబు



కంచికచర్ల: పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులైన యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అమర్లపూడి శేఖర్‌బాబు అన్నారు. కంచికచర్లలో డెవలప్‌మెంట్ కమిషనర్ హస్తకళలు, న్యూఢిల్లీ వారి సహకారంతో మెగా క్లస్టర్ పథకంలో భాగంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన కోసం ఉన్నత చదువులు చదివిన యువత ముందుకు వస్తే ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ ట్రస్టీ బెన్‌హర్, హస్తకళల అభివృద్ధి అధికారి ఎం.సువర్చల, ఆప్టికో ప్రోగ్రామింగ్ అధికారి పి.సుధీర్‌కుమార్, కేవీ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కరస్పాండెంట్ కేవీ కృష్ణారావు, సెంట్రల్ బ్యాంకు మేనేజర్ మైఖేల్, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు మరింత విస్తృతం

- మాతా, శిశు మరణాలు తగ్గించాలి
- వైద్యాధికారులకు కృష్ణా కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసాయం పొందే కేసులను పెంచాలని, మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు సమన్వయంతో పనిచేయాలని కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో బుధవారం వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు పెంచాలన్నారు. ఇటీవల ఇద్దరు గర్భిణులు ప్రైవేటు ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు పొందుతూ చివరి నిమిషంలో ప్రభుత్వాసుపత్రికి వచ్చి మరణించటం బాధాకరమని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేయాలన్నారు. ఎవరైనా ప్రైవేటు ఆసుపత్రుల్లో హైరిస్క్ గర్భిణులు వైద్య సహాయం పొందుతుంటే అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారా లేదా, వసతులు, పరికరాలు ఉన్నాయా లేదా అని పరిశీలించాలన్నారు. కేవలం డబ్బుల కోసం ప్రైవేటు ఆసుపత్రుల వాళ్లు చేర్చుకుని చివరి నిమిషంలో తాము ప్రసవం చేయలేమని పంపివేయటం సరికాదని ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలకు హెచ్చరిక చేయాలన్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రాంతీయ ఆసుపత్రులు, సర్వజన ఆసుపత్రుల్లో వైద్యాధికారులు సమన్వయంతో పని చేసి ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్యసేవలు అందించాలన్నారు. గర్భిణులు ప్రభుత్వాసుపత్రికి ప్రసవం కోసం వచ్చినప్పుడు ఆరోగ్యశ్రీ కార్డు లేదని తిరస్కరించకుండా తెల్లరేషన్ కార్డు ఉన్నా వెంటనే వైద్యసహాయం అందించాలన్నారు. సీహెచ్‌సీ పరిధిలో ప్రసవాలు జరగాలని ఏవైనా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉంటే అప్పుడు సర్వజన ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. మహిళలు గర్భవతి అయిన మూడు నెలల తరువాత పీహెచ్‌సీలలో చేసిన వైద్య పరీక్షలతో సాధారణమా లేదా హైరిస్క్ ఉందా అని గుర్తించి సీహెచ్‌సీ వైద్యాధికారులతో సంప్రదించాలన్నారు. వైద్యాధికారుల సమన్వయం కొరవడిందని తెలిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులకు ప్రభుత్వాసుపత్రిలో సజావుగా ప్రసవం జరుగుతుందనే నమ్మకాన్ని ప్రజలకు కలిగించాలన్నారు. సమావేశంలో డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయి, డీసీహెచ్‌ఎస్ ఇందిరాదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌కుమార్, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

10 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 2023–24 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సంబంధించి విద్యార్థులు రెన్యూవల్ రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎం.విజయభారతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ఈబీసీ, ఓసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు వసతి, విద్యా దీవెన పథకానికి జ్ఞానభూమి కాలేజీ లాగిన్‌లో సెప్టెంబర్ పదో తేదీలోగా రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

మహిళ అనుమానాస్పద మృతి

ఉంగుటూరు(గన్నవరం): మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని తరిగొప్పల గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తరిగొప్పల ఎస్సీ కాలనికి చెందిన పైడిముక్కల సుధీర్, లావణ్యకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. సుధీర్ తాపీ కార్మికుడు. మద్యానికి బానిసైన సుధీర్ తాగినప్పుడల్లా లావణ్యతో ఘర్షణ పడుతుండేవాడు. దీంతో ఆమె మనస్తాపం చెంది ఈ నెల 15న ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. లావణ్య తల్లి నాగరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉంగుటూరు ఎస్‌ఐ జి.రాజు బుధవారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని అధికారులకు కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. తన చాంబర్‌లో బుధవారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ ద్వారా అమలయ్యే కార్యక్రమాల పర్యవేక్షణ గురించి సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యవంతమైన సమాజం లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా జిల్లాలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. గర్భిణులు, బాలింతలకు ఇటీవల టేక్ హోం రేషన్ విధానం కూడా అమలు చేస్తోందని వివరించారు. అయినప్పటికీ జిల్లాలో ఎనీమియా కేసులు నమోదవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. పాఠశాలకు వెళ్లే పిల్లలు, పుట్టుకతో బలహీనంగా ఉన్న పిల్లలు, ఆరోగ్య లోపాలు ఉన్న వారు తదితర కారణాలతో ఎక్కువగా పోషకాహార లోపం కనబడుతోందన్నారు. ఇటువంటి కుటుంబాలను గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సక్రమంగా తీసుకునేలా గృహాలను సందర్శించి పర్యవేక్షించాలన్నారు. పిల్లల్లో పోషకాహారలోపం, వయసు తగిన ఎత్తు, బరువు లోపాలు లేకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు పర్యవేక్షణ పకడ్బందీగా చేయాలన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టం పటిష్టంగా అమలు చేయాలన్నారు. 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 181 ఉమెన్ హెల్ప్‌లైన్ గురించి మరింత అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం తస్మాత్ జాగ్రత్త పోస్టర్లను, స్టిక్కర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ, సమగ్ర శిక్ష సంరక్షణ పథకం జిల్లా కో–ఆర్డినేటర్ జాన్సన్, పలువురు సీడీపీఓలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారుతో టీడీపీ కార్యకర్తల హల్‌చల్


ప్రమాదానికి కారణమైన కారు

మంగళగిరి: లోకేష్ యాత్రలో పాల్గొనేందుకు విజయవాడ నుంచి కారులో వచ్చిన నలుగురు యువకులు మద్యంమత్తులో హల్‌చల్ చేశారు. ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ప్రమాదానికి కారణమయ్యారు. ఈ దుర్ఘటన బుధవారం జరిగింది. తాడేపల్లి పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ నుంచి కలకాల తేజశ్రీ విష్ణు వర్ధన్ చౌదరి మరో ముగ్గురితో కలిసి లోకేష్ బస చేస్తున్న నగరంలోని యర్రబాలెంకు చేరుకున్నారు. మద్యం పూటుగా తాగి కారులో టీడీపీ జెండాలతో తిరుగుతూ చక్కర్లు కొట్టారు. తాడేపల్లి నులకపేట వద్ద విజయవాడకు చెందిన ఏసీ మెకానిక్‌లు బి.గోపి, పి.రాఘవేంద్ర ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చౌదరి తమ కారుతో వేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఫలితంగా గోపి, రాఘవేంద్ర గాయపడ్డారు. స్థానికులు ఘటనాస్థలికి చేరుకునేలోపు చౌదరి అతని స్నేహితులు కారు వదిలి పరారయ్యారు. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారును స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్పా ముసుగులో వ్యభిచారం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న స్పా సెంటర్‌పై భవానీపురం పోలీసులు దాడి చేశారు. నిర్వాహకురాలిని అరెస్ట్‌చేసి, 11 మంది యువతులను హోంకు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. భవానీపురం బైపాస్ రోడ్డు దియాస్ బార్ సమీపంలోని ఓ భవనంలో నగరానికి చెందిన సంపర శ్రీవిద్య తనిష్క బ్యూటీ వరల్డ్ అండ్ స్పా నిర్వహిస్తోంది. స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో స్పా సెంటర్‌పై పోలీసులు దాడిచేశారు. సంపర శ్రీవిద్య, ఆమె భర్త సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. దాడి సమయంలో స్పా సెంటర్‌లో 11 మంది యువతులు, ముగ్గురు విటులు ఉన్నారు. స్పా సెంటర్ నిర్వాహకురాలు శ్రీవిద్య, ఆమె భర్త సత్యనారాయణపై కేసు నమోదు చేశారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ సలాం తెలిపారు. 11 మంది యువతులను కౌన్సెలింగ్ నిమిత్తం హోంకు తరలించినట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.


దిశ ఏసీపీ వి.వి.నాయుడు, నార్త్ ఏసీపీ రవికాంత్, ఎస్‌ఐ కృష్ణారావు, సీఎస్‌ఐ ఆర్‌ఎస్‌ఐ రామనాథంను అభినందిస్తున్న సీపీ రాణా

విశిష్ట సేవలకు అరుదైన పురస్కారం

విజయవాడ స్పోర్ట్స్: పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి ప్రతిష్టాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్‌ను సాధించిన దిశ ఏసీపీ వి.వి.నాయుడు, నార్త్ ఏసీపీ సీహెచ్.రవికాంత్, సీసీఎస్ ఎస్‌ఐ జి.కృష్ణారావు, సీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఎస్‌ఐ ఆర్. రామనాథంను ఎన్టీఆర్ జిల్లా పోలీస్‌కమిషనర్ టి.కె. రాణా బుధవారం అభినందించారు. మెడల్ సాధించిన నలుగురు అధికారులు పోలీస్ కమిషనరేట్‌లో సీపీ రాణాను మర్యాదపూర్వకంగా కలిశారు. 77వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్స్ అందుకోవడం అభినందనీయమని సీపీ రాణా అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు సేవలందించి పోలీస్ శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని పోలీసు అధికారులకు సూచించారు.

సఫాయి కర్మచారుల సమస్యలు పరిష్కరిస్తాం

జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు వావా


మాట్లాడుతున్న డాక్టర్ పీపీ వావా
చిత్రంలో కలెక్టర్ రాజాబాబు తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): సమాజం ఆరోగ్యంగా ఉండాలని కష్టపడే సఫాయి కర్మచారులకు ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సాయం, బ్యాంకు రుణాలు ఉదారంగా అందించి వారి అభ్యున్నతికి తోడ్పడాలని అధికారులకు జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి.వావా సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కమిషన్ సభ్యులు, కమిషన్ సామాజిక సలహాదారు గిరింద్రనాథ్, కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వావా మాట్లాడుతూ.. సఫాయి కర్మచారులను మానవులుగా పరిగణించి వారికి సమాజంలో స్వేచ్ఛ, సామాజిక సమానత్వం కలగజేసి న్యాయం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. మాన్యువల్‌గా స్కావెంజర్ వృత్తి చేయకూడదని స్పష్టం చేశారు. అలా ఎవరైనా చేయిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మురికివాడలను శుభ్రం చేస్తూ సమాజ ఆరోగ్యాన్ని కాపాడుతున్న సఫాయి కర్మచారులకు భూమి కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. పిల్లల చదువుల కోసం రాయితీలు కల్పించాలన్నారు. వారు ప్రస్తుతం చేస్తున్న వృత్తిని వీడేందుకు వీలుగా వివిధ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించి వ్యాపారాల ఏర్పాటు, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. బ్యాంకులు నాలుగుశాతం వడ్డీతో రుణాలు విరివిగా అందించేలా చూడాలన్నారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల్లో సఫాయి కర్మచారుల సంక్షేమం కోసం అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. వారికి ఆర్థిక సాయం అందించి ఎదుగుదలకు తోడ్పాటు అందిస్తున్నామన్నారు. పారిశుద్ధ్య వృత్తిలో చేతులకు బదులుగా వివిధ రకాల యంత్రాలను వినియోగించేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కనీస విద్యార్హత ఉన్న సఫాయి కర్మచారులకు జేసీబీ వంటి యంత్రాలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పరికరాల కొనుగోలు కోసం కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తోందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీహరిరావు, సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షాహిద్‌బాబు, వివిధ శాఖల అధికారులు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలోని వివిధ మునిసిపాలిటీలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న సఫాయి కర్మచారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా అన్నారు. జెడ్పీ సమావేశపుహాలులో సఫాయి కర్మచారుల సమస్యలను తెలుసుకునేందుకు నిర్వహించిన సమావేశంలో ఆయన అధికారులతో కలిసి పాల్గొన్నారు. సఫాయి కర్మచారులకు వివిధ మునిసిపాలిటీల్లో ఎదురవుతున్న సమస్యలను పీపీ వావా అడిగి తెలుసుకున్నారు. ఉయ్యూరు మునిసిపాలిటీకి సంబంధించిన ఓ కార్మికుడు మాట్లాడుతూ.. తమకు రావాల్సిన సదుపాయాలకు మునిసిపల్ కార్యాలయంలో గుమాస్తాలు అడ్డం పెడుతున్నారని, అందాల్సిన సదుపాయాలకు సంబంధించిన నిధులను స్వాహా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేస్తే వివరాలు ఇవ్వటం లేదని పేర్కొన్నారు. పట్టణ పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ కొడాలి శర్మ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కనీస వేతనం ఇప్పించాలని కోరారు. సీఐటీయూ నాయకుడు బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. మచిలీపట్నం మునిసిపాలిటీలో 2019 నుంచి ఇప్పటి వరకు ఏడుగురు కార్మికులతో పాటు కరోనా సమయంలో ఓ కార్మికుడు చనిపోయాడని, వారికి ఇంత వరకు రావాల్సిన సదుపాయాలు అందలేదన్నారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికులు పదవీవిరమణ చేస్తే కుటుంబ సభ్యుల్లో ఒక్కరికైనా ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వీటన్నింటిపై పీపీ వావా మాట్లాడుతూ.. జిల్లా యంత్రాంగంతో చర్చించి సఫాయి కర్మచారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. మూడు నెలలకోసారి మెడికల్ క్యాంపులు నిర్వహించాల్సిన ఉందన్నారు. కార్మికులకు మాస్క్, గ్లౌజ్‌లు, సరుకులను ఇవ్వాల్సి ఉందన్నారు. గుర్తింపుకార్డులు అందజేయటంతో పాటు కార్మికులకు ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ద్వారా బీమా చేయాలని పేర్కొన్నారు. దీనిలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ప్రీమియం చెల్లిస్తుందన్నారు. ఈ సదుపాయాలను సఫాయి కర్మచారులకు అందేలా చూడాలని ఆయా మునిసిపల్ కమిషనర్లకు సూచించారు. జాతీయ సఫాయి కర్మచారి అభివృద్ధి సంస్థ సోషల్ అడ్వయిజర్ గిరేంద్రనాథ్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ షాహెద్ బాబు, మచిలీపట్నం మునిసిపల్ కమిషనర్ జి.చంద్రయ్య, సఫాయి కర్మచారి లేబర్ స్టేట్ జనరల్ సెక్రటరీ ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసం టీడీపీ తాపత్రయం

ప్రభుత్వ విప్ ఉదయభాను



జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు ఏనాడూ అన్యాయం జరగదని, దేశంలో ఎక్కడా లేని విధంగా వారి కోసం అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ నాయకులు ఉనికి కోసం అసత్యాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పోలంపల్లి మునేరు వద్ద, తువ్వ కాలువ వద్ద రెండింటికి కలిపి సుమారు 38 గండ్లు పడ్డాయని, వాటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఇప్పటికే ఇరిగేషన్ శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. గండ్లు పూడ్చివేసే పనులు కూడా జరుగుతున్నాయని వివరించారు. ప్రజల్లో ఉనికి కోల్పోతున్న ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు మునేటి సమస్యను రాజకీయంగా వాడుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైతులను తప్పుదారి పట్టించాలని పుకార్లు చేస్తున్నారని దుయ్యబట్టారు. లేని సమస్యను ఉన్నట్లుగా చూపించి ధర్నాలు, అఖిలపక్ష సమావేశాలు అంటూ ప్రభుత్వంపై బురదజల్లాలని చూస్తున్నారని పేర్కొన్నారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల పరిధిలోని మునేటి ఆయకట్టు కింద 26 వేల ఎకరాల రైతులు నిరభ్యంతరంగా వరి నాట్లు వేసుకోవచ్చని సూచించారు. పంట చేతికి వచ్చేంత వరకు సాగునీరు పుష్కలంగా అందిస్తామని ఎమ్మెల్యేగా తాను రైతులకు స్పష్టమైన హామీ ఇస్తున్నానని ప్రకటించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు పెద్దపీట వేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదని పేర్కొన్నారు.

అప్పటికప్పుడే రైతులకు పరిహారం

తమ ప్రభుత్వ హయాంలో అధిక వర్షాలు, వర్షాభావంతో పంటలు దెబ్బతింటే అప్పటికప్పుడే సర్వే చేయించి, రైతులకు నష్టపరిహారం అందజేస్తూ రికార్డు సృష్టించామని ఉదయభాను తెలిపారు. గత టీడీపీ పాలనలో పంట నష్టపోయిన రైతన్నలకు పరిహారం ఇచ్చే విషయంలో నెలలు, సంవత్సరాల పాటు జాప్యం జరిగేదని గుర్తుచేశారు.

ఎమ్మెల్యే ఆర్కే అభినందనీయులు


రోడ్డును ప్రారంభిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే

- డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి
- సర్దార్ వల్లభాయ్ పటేల్ రోడ్డు ప్రారంభం

మంగళగిరి: నగరంలో నిర్మిస్తున్న రోడ్లకు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెడుతున్న ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి(ఆర్కే) అభినందనీయులని డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి కొనియాడారు. నగరంలోని ఆరో ఏపీఎస్పీ బెటాలియన్‌కు వెళ్లే రహదారిని రూ.2.30 కోట్లతో సెంటర్ డివైడర్ లైటింగ్‌తో అభివృద్ధి చేసి సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు పెట్టిన బీటీ రోడ్డును డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఎమ్మెల్యే ఆర్కేతో కలిసి ప్రారంభించారు. అక్కడే ఏర్పాటు చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే ఆవిష్కరించారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ బెటాలియన్‌కు వెళ్లే శ్రీరామనగర్ రోడ్డు గోతులమయమై ఉండడంతో ఎమ్మెల్యే ఆర్కే వెంటనే బీటి రోడ్డును అభివృద్ధి చేయించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ స్థానికులు వినతి మేరకు ఈ రోడ్డుకు నగరపాలక సంస్థ నుంచి రూ 2.30 కోట్లు కేటాయించి పనులు పూర్తిచేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఉషారాణి, నగర కమిషనర్ యు.శారదాదేవి, ఐజీ పాలరాజు, కమాండెంట్ కేవీఎస్‌వీ సుబ్బారెడ్డి, ఎస్పీ అరిఫ్ హఫీజ్, నగర పాలక సంస్థ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు జీజీహెచ్‌లో ప్రత్యేక ఓపీ

ఎమ్మెల్యే ముస్తఫా

గుంటూరు మెడికల్: ట్రాన్స్‌జెండర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బుధవారం జీజీహెచ్‌లో ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓపీని ట్రాన్స్‌జెండర్స్ ప్రొటెక్షన్ సెల్ నోడల్ అధికారి, ఎస్పీ కె.జి.వి.సరిత, ఎమ్మెల్యే ముస్తఫా ప్రారంభించారు. ముస్తఫా మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్ సమస్యలను పరిష్కరిస్తామని వివరించారు. సమాజంలో వీరంతా అనేక అవమానాలకు గురవుతున్నారని, వీరు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని వెల్లడించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్ విషయంలో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. వారికి అవసరమైన రేషన్ కార్డులు అందించేలా కృషి చేస్తోందన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని వస్తే తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. ఎస్పీ సరిత మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు చదువుకుని ఉన్నత స్థానాన్ని చేరుకోవాలన్నారు. ఓపీలో ఒక మెడిసిన్ డాక్టర్, నర్సు, సిబ్బంది ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బి కిరణ్ రాజు, ఆర్‌కే ఫౌండేషన్ చైర్ పర్సన్ రమ కిరణ్ పాల్గొన్నారు.

ఆమెగా మారిన అతను

- కృష్ణలంకలో వెలుగుచూసిన ఇద్దరు యువకుల ప్రేమకథ
- ప్రేమికుడి కోసం యువతిగా మారిన యువకుడు
- పెళ్లి చేసుకోనంటూ ఇంటి నుంచి గెంటేసిన ప్రియుడు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇద్దరు యువకులు ప్రేమలో పడ్డారు. ఇద్దరూ సహజీవనం ప్రారంభించారు. ఇరుగు పొరుగువారి నుంచి ఛీత్కారం ఎదురైంది. తమలో ఒకరు అమ్మాయిగా మారితే ఇరుగుపొరుగువారి నుంచి ఇబ్బందులు ఉండవని ఓ యువకుడు భావించాడు. జీవితాంతం స్నేహితుడితోనే కలిసి ఉండొచ్చని ఆశపడ్డ అతను లింగమార్పిడి ఆపరేషన్ చేయించుకున్నాడు. అయితే ఆపరేషన్ చేయించుకుని ఆమెగా మారిన అతడిని స్నేహితుడు మోసగించాడు. పెళ్లి చేసుకోనంటూ ఇంటి నుంచి గెంటేశాడు. మోసపోయిన ఆమె ఫిర్యాదు చేయడంతో కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..
పెనమలూరుకు చెందిన ఎ.పవన్, కృష్ణలంకకు చెందిన ఇ.నాగేశ్వరరావు 2017–19 మధ్య కాలంలో బీఈడీ చేసే రోజుల్లోనే ఒకరినొకరు ఇష్టపడ్డారు. కొన్ని నెలల తరువాత ఆ ఇష్టం ప్రేమగా మారడంతో కలిసి జీవించాలని నిర్ణయించుకున్నారు. బీఈడీ పూర్తయ్యాక 2019 నుంచి కృష్ణలంకలోని సత్యంగారి హోటల్ సమీపంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని సహజీవనం ప్రారంభించి, బతుకుదెరువు కోసం అక్కడే ట్యూషన్ సెంటర్ నిర్వహించారు. ఇద్దరి కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారి మాటలు తట్టుకోలేక, విడిపోయి ఉండలేక మానసిక వేదన అనుభవించారు. తమలో ఒకరు అమ్మాయిగా మారితే కలిసి జీవించేందుకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవనే నిర్ణయానికి వచ్చారు. పవన్ ఢిల్లీ వెళ్లి రూ.లక్షలు వెచ్చించి లింగమార్పిడి ఆపరేషన్ చేయించుకుని యువతిగా మారి భ్రమరాంబికగా సమాజంలోకి అడుగుపెట్టాడు. అయితే భ్రమరాంబిక సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. ప్రేమికుడు ఆమెను మోసగించి పరారయ్యాడు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన కథ

నాగేశ్వరరావు కోసం తన జీవితాన్నే త్యాగం చేశానని, అతను తనను వదిలించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడంటూ భ్రమరాంబిక ఈ నెల పదో తేదీన కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకుంటాడని నమ్మి నాగేశ్వరరావుకు పలు విడతలుగా రూ.26 లక్షల నగదు, 11 సవర్ల బంగారం ఇచ్చానని, 2022 డిసెంబర్‌లో తనను పెళ్లి చేసుకోనని నాగేశ్వరరావు తేల్చిచెప్పి, ఇంటి నుంచి గెంటేసి, మంగళగిరికి మకాం మార్చాడని ఫిర్యాదులో పేర్కొంది. తనను మోసగించి, తన నగదులో పరారైన నాగేశ్వరరావు, అందుకు కారణమైన అతని తల్లి విజయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని కోరింది. నాగేశ్వరరావు, అతని తల్లి విజయలక్ష్మిపై చీటింగ్, నమ్మకద్రోహం, ట్రాన్స్‌జెండర్ హక్కుల రక్షణ చట్టం సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలకు ప్రతిభ పురస్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అత్యుత్తమ పనితీరుతో పాటు నాక్ ఏ గ్రేడ్ సాధించినందుకు కలెక్టర్ ఢిల్లీరావు చేతులమీదుగా ఉత్తమ కళాశాల ప్రతిభ పురస్కారం అందజేశారు. మంగళవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మికి పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో సిబ్బంది, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను అభినందించారు. సమష్టి కృషితోనే కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ ప్రతిభ పురస్కారం అందుకోగలిగామని ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి చెప్పారు.

ప్రజలకు మరిన్ని సేవలందించాలి



విజయవాడ స్పోర్ట్స్: ప్రజలకు విశేష సేవలందించి పోలీస్ ప్రతిష్టను పెంచాలని పోలీస్ కమిషనర్ టి.కె.రాణా అన్నారు. ఆర్ఎస్ఐ నుంచి ఆర్ఐగా ఉద్యోగోన్నతి పొందిన డి.అర్జునరావు, ఎస్.బ్రహ్మానందం సీపీ రాణాను బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి ప్రజలకు మరింత సేవలందించాలని సీపీ రాణా వారికి సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లోని కరెంట్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈఈ పి.హరిబాబు తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు చౌదరిపేట, అశోక్‌నగర్, ధనేకులవారి వీధి, కాకతీయ రోడ్డు, యార్లగడ్డ అప్పారావు స్ట్రీట్‌వరకు, మళ్లీ 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫరూక్‌నగర్, పప్పుల మిల్లు రోడ్డు, పండరీపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ



ఆటోనగర్(విజయవాడతూర్పు): మెస్సీయ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో బుధవారం 50 మందికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.1,500 విలువ చేసే నిత్యావసర వస్తువులను పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ అందజేశారు. రత్నకుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా వృద్ధులకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సజ్జా జ్యోతి, క్రైస్తవులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు



కృష్ణలంక(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని కృష్ణలంకలోని ఐడియల్ పబ్లిక్ స్కూల్‌లో ఎల్‌కేజీ చిన్నారులకు రైమ్స్, డ్రాయింగ్, స్టోరీ రీడింగ్ కాంపిటీషన్స్ నిర్వహించారు. వీటిలో విజేతలకు స్కూల్ ఆవరణలో బుధవారం మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో లీడ్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ గంగాభవాని, ప్రధానోపాధ్యాయుడు రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు కనక మహాలక్ష్మి, గాయత్రి, భారతి, సంధ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధికి కృషి

కంకిపాడు: ఆర్థికాభివృద్ధి, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వీఓఏ, గ్రామైక్య సంఘాల ప్రతినిధులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

పుస్తకాల పూదోట

- హనుమంతరాయ గ్రంథాలయం
- పుస్తక ప్రేమికులకు వరం
- 50 వేలకు పైగా పుస్తకాలు
- గ్రంథాలయానికి 90 సంవత్సరాల చరిత్ర



గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం

విజయవాడ కల్చరల్: సమాచార సాంకేతిక విజ్ఞానరంగం విస్తృతమైనా పుస్తకం తన ఉనికిని కోల్పోలేదు. జ్ఞాన కేంద్రాలైన పుస్తకాల్లోనే ప్రపంచం పొదిగి ఉంటుంది. వేల, లక్షల సంవత్సరాల చరిత్ర, సంస్కృతిని, ఇతహాసాలు, పురాణాలన వివరించే గ్రంథాల సమాహారం గ్రంథాలయం. అంతటి ముఖ్యమైన గ్రంథాలయాల్లో నగరంలోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం ఒకటి. దీనికి 90 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇది పుస్తకాల పూదోట. దీనికి ఇటీవల అనేక హంగులు సమకూర్చి ఆధునికీకరించారు.

చైతన్యం కలిగించడానికి

విజయవాడలో 15పైగా గ్రంథాలయాలున్నాయి. వీటిలో ప్రధానమైంది హనుమంతరాయ గ్రంథాలయం. నాడు సమాజంలోని ప్రతి వ్యక్తి విద్య అవసరాన్ని గుర్తించి వారిని సమాజంలో ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్ది, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చైతన్యం కలిగించాల్సిన అవసరమేర్పడింది. దీంతో నగర ప్రముఖుడు స్వాతంత్ర్య సమరయోధుడు వెలిదండ్ల హనుమంతరావు పేరుతో దేశ భక్తులు గెల్లి రాజగోపాలం, కృతివెంటి కుటుంబరావు, నండూరి వెంకటేశ్వరరావు ప్రేరణతో 1934 డిసెంబర్ 2వ తేదీన కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు పాతబస్తీ రథం సెంటర్‌లోని ఒక చిన్న గదిలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు.

విలువలు కాపాడుకుంటూ..

పాతబస్తీలోని గ్రంథాలయం ఇరుగ్గా ఉండేది. దీంతో 1944వ సంవత్సరంలో దాతల సహకారంతో గాంధీనగర్‌లో 619 చదరపు గజాల్లో సొంత భవనం ఏర్పాటుచేసుకున్నారు. ఈ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో హనుమంతరాయ కళావేదిక, మొదటి అంతస్తులో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశారు. దీన్ని గాడిచర్ల హరిసర్వోత్తమరావు ప్రారంభించారు. నాటినుంచి తన విలువలను కాపాడుకుంటూ వస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గ్రంథాలయాన్ని ఆధునికీకరించి కంప్యూటరైజ్ చేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చారు.

వదాన్యుల సహకారంతో

సినీ నటులు అక్కినేని నాగేశ్వరరావు, మహానటి సావిత్రి, దాసరి నారాయణరావు తదితరులు గ్రంథాయానికి, కళావేదికకు పూర్తి స్థాయిలో సాయం చేశారు. పఠన మందిరాన్ని మహానటి సావిత్రి, కళావేదికను అక్కినేని నాగేశ్వరరావు, పారిశ్రామిక వేత్త ముప్పవరపు వెంకటేశ్వరరావు పేర్లతో పిలుస్తున్నారు.

గ్రంథాలయం ఆధునికీకరణ

గ్రంథాలయానికి 8 నెలల క్రితం నూతన కమిటీ ఏర్పాటైంది. తర్వాత దీన్ని దాతల సాయంతో.. రూ.25 లక్షలతో ఆధునికీకరించారు. నాలుగు నెలలు దీన్ని తెరవలేదు. రెండు నెలలుగా గ్రంథాలయం పని చేస్తోంది. కంప్యూటరైజ్ చేసిన ఈ గ్రంథాలయం అన్ని వసతులతో గురువారం నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. గ్రంథాలయంతోపాటు కళావేదికకు కూడా కొత్త హంగులు అమర్చారు.



నృత్య సంబంధిత పుస్తకాలను పరిశీలిస్తున్న నృత్యకళాకారులు(ఫైల్)



గ్రంథాలయంలో లోపల..

సాహిత్య కార్యక్రమాలకు ప్రోత్సాహం

గ్రంథాలయంలో చరిత్ర, పరిశోధన, సాహిత్యం, కథా, నవల, బాల సాహిత్యం, అనువాదం, పోటీ పరీక్షల పుస్తకాలు, ఆంగ్ల, తెలుగు దినపత్రికలు ఉన్నాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుంది. గ్రంథాలయానికి అనుబంధంగా హనుమంతరాయ కళావేదిక, కళా, సంగీత, సాహిత్య కార్యక్రమాలను ప్రోత్సహిస్తోంది.

పూర్తిస్థాయిలో అందుబాటులోకి



1934లో వన్‌టౌన్ రథం సెంటర్‌లో గ్రంథాలయం ప్రారంభించారు. తర్వాత గాంధీనగర్‌కు మార్చారు. ఆధునికీకరించి పాఠకులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చాం. త్వరలో నిరుద్యోగుల శిక్షణ తరగతులకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

–దోగిపర్తి శంకరరావు, అధ్యక్షుడు, హనుమంతరాయ గ్రంథాలయం

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాలను కల్పించడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. న్యూరాజరాజేశ్వరిపేటలో కొత్తగా ఏర్పడుతున్న కాలనీలో ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవితో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. అపార్ట్‌మెంట్ల వెనుక వైపు ఉన్న మసీదు రోడ్లను పరిశీలించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత శివారు ప్రాంతాలు మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలతో ఆయా ప్రాంతాల్లో నివసించడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారని వివరించారు. నూతన కాలనీలోనూ ప్రజలకు తాగునీరు, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, రోడ్ల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ప్రజావసరాలను గుర్తించి పరిష్కరించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరెవరూ సాటిరారని స్పష్టంచేశారు. డీఈ(ఇంజినీరింగ్) గురునాథం, నాయకులు ఇసరపు రాజా రమేష్, కాళ్ల ఆదినారాయణ, పఠాన్ నజీర్ ఖాన్, ప్రేమ్ కుమార్, చెన్నారెడ్డి, శ్రీనివాస రెడ్డి, అలీభాయ్ పాల్గొన్నారు.

78 మందికి కంటి వైద్య పరీక్షలు

కంకిపాడు: కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని నెప్పల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 78 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. శుక్లాలు ముదిరినట్లు గుర్తించిన వృద్ధులకు శస్త్రచికిత్స నిమిత్తం రిఫర్ చేశారు. కంటి సమస్యలపై రాజేష్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఎం.శ్రీధర్, సీహెచ్ఓ ఎస్.బిందు మాధవి, వీహెచ్ఎస్ విక్టోరియా, ఆశ కార్యకర్తలు ఝాన్సీరాణి, జ్యోతి, స్థానికులు పాల్గొన్నారు.

కార్యకర్తలే కీలకం

- ‘తూర్పు’లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం..
- 700 కోట్లతో అభివృద్ధి పనులు..
- దేవినేని అవినాష్



సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి, బొప్పన భవకుమార్

గుణదల (విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే కీలకమని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. గురునానక్ నగర్‌లోని ఎన్ఏసీ కల్యాణ మంటపంలో బుధవారం కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో 700 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని స్పష్టం చేశారు. అన్ని డివిజన్లలో తాగునీరు, యూజీడీ, విద్యుత్ వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యకర్తలందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో శ్రమించే కార్యకర్తలు, నాయకులకు పార్టీలో సరైన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. గెలుపే లక్ష్యంగా పాటుపడాలని కోరారు. టీడీపీ హయాంలో కాల్‌మనీ, సెక్స్ రాకెట్ వంటి కుంభకోణాలతో ప్రజా ధనాన్ని లూటీ చేశారని విమర్శించారు. కార్యక్రమంలో భాగంగా జేసీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, కలపాల అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు కడియాల బుచ్చిబాబు, కొరివి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గద్దె నీచరాజకీయాలు మానుకోవాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నీచ రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ ‘తూర్పు’ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ హితవు పలికారు. స్థాయిలేని నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను విమర్శించడం హాస్యాస్పదమని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గురునానక్‌నగర్‌లోని ఎన్ఏసీ మంటపంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్థాయిలేని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు తానే చేస్తున్నట్లు చెప్పుకునే స్థాయికి గద్దె రామ్మోహన్ దిగజారిపోయారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



పేరంటాలమ్మ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో బుధవారం చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 12 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు హోమగుండం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి, ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ పాల్గొన్నారు. గురువారం నుంచి పేరంటాలమ్మకు పరోక్షంగా గోత్ర నామాలతో పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తెలిపారు. గోత్రనామాలతో పూజ చేయించుకోవాలనుకునే భక్తులు ఆలయ కౌంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెదపులిపాకలో..

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న విజయరాజరాజేశ్వరి, విజయసుందరేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక శ్రావణ మాస అమావాస్య సందర్భంగా వాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తుల గోత్ర నామాలతో సామూహిక అర్చన చేశారు. భక్తులచే చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పుష్పార్చన చేసి పల్లకీ సేవ, పవలింపు సేవ చేవారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న స్వరూప

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలు వృత్తి విద్యా కోర్సులు నేర్చుకుని చిన్నతరహా పరిశ్రమలను స్థాపించి రాష్ట్ర, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షురాలు వై.స్వరూప అన్నారు. స్థానిక రావి చెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో బుధవారం ఆజాది భారత్ అంశంపై పెయింటింగ్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో స్వరూప మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులపై యువత దృష్టి పెట్టాలన్నారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్న మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వివిధ వృత్తి విద్యా కోర్సులను ఉపయోగించుకుని స్వయం ఉపాధితో పాటుగా చిన్నతరహా పరిశ్రమలు స్థాపించి మరి కొంత మందికి ఉపాధి కల్పించవచ్చునని చెప్పారు. పెయింటింగ్ పోటీల్లో కె.శ్రావణి, టి.గానమాధురి, సత్యవేణి వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. వీరికి బహుమతులు అందజేశారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ, సంస్థ సిబ్బంది, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సమరయోధులకు స్వరాంజలి



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన స్వరాంజలి ఆకట్టుకుంది. పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సాంస్కృతిక సేవా సంస్థ, తెలుగు కళా వాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీకళాభారతి సంస్థల ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత మహోత్సవ్, 77 స్వాతంత్ర్య దినోత్సవ ముగింపు వేడుకల సందర్భంగా సమరయోధులకు గాయని చల్లా నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో దేశభక్తి గీతాలు పాడారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని సూచించారు. పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు చల్లా బాలకొండయ్య, వివిధ సంస్థల ప్రతినిధులు డేవిడ్‌రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్, న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు ఫ్యాన్ల బహూకరణ



ఫ్యాన్లు బహూకరిస్తున్న శారద, క్లబ్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వాసవి క్లబ్ విజయవాడ విద్యాధరపురం జిల్లా గవర్నర్ అధికార పర్యటనలో భాగంగా భవానీపురంలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌కు నాలుగు ఫ్యాన్లు, కుర్చీలు బహూకరించారు. వాసవి ఆలంబన పెన్షన్, హాస్టల్‌లో ఉన్న సిబ్బందికి చీరెలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య నేస్తం కింద పేద ఆర్యవైశ్య కుటుంబానికి బియ్యం, పప్పు దినుసులు అందజేశారు. ముఖ్యఅతిథి క్లబ్ జిల్లా గవర్నర్ వీ212ఏ మిత్తింటి శారద వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆర్య వైశ్యులు ప్రతీకలుగా నిలిచారన్నారు. ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకుంటున్న క్లబ్ సభ్యులు అభినందనీయులని తెలిపారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంకాయల పూర్ణచంద్రరావు, కందెపు ప్రవీణ్‌కుమార్, కోశాధికారి సముద్రాల పుల్లారావు, జిల్లా కోశాధికారి ఇమ్మిడిశెట్టి సురేష్, వైస్ గవర్నర్ కేఎల్‌వీ సతీష్ కుమార్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పొట్టి శివకుమార్, రీజినల్ చైర్‌పర్సన్ వెంకట జై కిషోర్ పాల్గొన్నారు.

డీఎస్సీ-98 అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డీఎస్సీ–98 అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం 4,072 మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించిందని, మిగిలిన 2,326 మందికి కూడా ఇవ్వాలని కోరారు. డీఎస్సీ –98లో అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో బుధవారం ఉద్యోగాల సాధన పోరాట కమిటీ మహాధర్నా చేసింది. పోరాట కమిటీ నాయకుడు పాదిలి రమణ, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న గణనాథులు





వినాయక చవితి పండుగకు గణనాథులు సిద్ధమవుతున్నారు. దీనికి వినాయక విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు. గణేశ్ ప్రతిమ మోడల్స్‌ను హైదరాబాద్ నుంచి తెప్పిస్తున్నారు. వీటి మాదిరిగా నున్న పరిసర ప్రాంతాల్లో విగ్రహ తయారీదారులు ముస్తాబు చేస్తున్నారు. మట్టితో తయారుచేసే విగ్రహాలు తక్కువ ధరకే అందుబాటులో ఉంటాయని తయారీదారులు చెబుతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



భర్త అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందులతో తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాలప్రాజెక్టు సమీపంలోని గంగానమ్మ గుడి ప్రాంతానికి చెందిన ముత్యాల రజనికుమారి, వెంకట రమణ భార్యభర్తలు. వెంకట రమణ పాలప్రాజెక్టు పాలవ్యాన్‌లో కలెక్షన్ ఏజెంట్. ఈ నెల 14వ తేదీ డ్యూటీ నుంచి తిరిగి వచ్చిన వెంకట రమణ నగదు బ్యాగ్‌ను భార్యకు ఇచ్చి బుజ్జి అనే వ్యక్తి వస్తాడు... అతనికి ఇవ్వాలని చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువులను ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో ఆందోళన చెందిన రజనీకుమారి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బాలిక కనిపించడం లేదని ఫిర్యాదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురంలో ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న బాలిక అదృశ్యంపై కేసు నమోదైంది. భవానీపురం పోలీసుల కథనం మేరకు.. విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధికి చెందిన ఓ బాలిక ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. నిత్యం కాలేజీకి వెళ్లి వచ్చి ఇంట్లో అమ్మమ్మ గదిలో నిద్రిస్తుంది. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంది. రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి 12.30 వరకు టీవీ చూసి అమ్మమ్మ గదిలోకి వెళ్లి నిద్రించింది. బుధవారం 5.30 గంటల ప్రాంతంలో తల్లిదండ్రులు ఆ గదికి వెళ్లి చూడగా బాలిక కనిపించలేదు. చుట్టు పక్కల వారిని అడిగిన బాలిక ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా...

ఏఎంవీఐ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఈ నెల 31 వరకు గడువు

సాక్షి, అమరావతి: రవాణా శాఖలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి గతేడాది ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఏపీపీఎస్సీ బుధవారం అనుబంధ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో పేపర్1లో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ పరీక్షా ప్రశ్నాపత్రాన్ని ద్విభాషా (తెలుగు, ఇంగ్లిష్)రూపంలో ఇవ్వనున్నట్లు తెలిపింది. సబ్జెక్ట్ ప్రశ్నాపత్రం మాత్రం ఆంగ్లంలోనే ఉంటుందని పేర్కొంది. కొత్త అభ్యర్థులకు ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

కేజీబీవీల్లో సాంకేతిక విద్యాబోధన అవసరం

సమగ్ర శిక్షా రాష్ట్ర పీడీ శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల(కేజీబీవీ)లో విద్యార్థినులకు ఇంటిని తలపించేలా సౌకర్యాలు కల్పించి, సాంకేతిక విద్యాబోధన అందించాలని సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సూచించారు. విజయవాడలో కేజీబీవీ ఆధ్వర్యాన బుధవారం ఏర్పాటు చేసిన ఐదు రోజుల 'ఇండక్షన్ ట్రైనింగ్- మాడ్యూల్ డెవలప్‌మెంట్ వర్క్ షాపు'లో శ్రీనివాసరావు మాట్లాడారు. ఉపాధ్యాయులు ఆధునిక టెక్నాలజీని జోడించి సరికొత్త విద్యా బోధన అందించాలని చెప్పారు. కేజీబీవీ సెక్రటరీ డి.మధుసూదన రావు, సమగ్ర శిక్షా ఏఎస్పీడీ కేవీ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుకు అధికార పిచ్చి పరాకాష్టకు చేరింది

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు అధికార పిచ్చి పరాకాష్టకు చేరిందని ఆయన మాటలు వెల్లడిస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్ ఆవరణలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు మంగళవారం ఒక కార్యక్రమంలో ఇంజనీర్ కావాలంటే బైపీసీ చదవాలని చెప్పడంతో ఆయనకు మతి భ్రమించిందని అర్థం అవుతోందన్నారు. ప్రజలను మోసగించడానికి చంద్రబాబు రోజుకొక వేషం వేస్తున్నారన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంపై పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

నవంబర్ 26న అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి సురేష్ తదితరులు

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా నిర్మితమవుతున్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని భారత రాజ్యాంగం ఆమోదం పొందిన రోజైన నవంబర్ 26న సీఎం వైఎస్ జగన్ ప్రారంభిస్తారని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. ఆయన బుధవారం విజయవాడ స్వరాజ్ మైదానంలోని అంబేడ్కర్ స్మృతివనం, 125 అగుడుల విగ్రహ నిర్మాణ పనులను ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మితో కలిసి పరిశీలించారు. అతిపెద్ద విగ్రహ పనులు దాదాపు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్, కాలేజీల్లో చాలా వెధవ పనులు చేశా: లోకేశ్



సాక్షి ప్రతినిధి, గుంటూరు: స్కూలు ,కాలేజీ టైంల్లో చాలా వెధవ పనులు చేశా.. చేయాలి కదా ఏమంటారు అని టీడీపీ నేత నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని యర్రబాలెంలో నిర్వహించిన హలో లోకేశ్ కార్యక్రమంలో యువత అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. మీ ఫస్ట్ క్రష్ ఎవరు అని ఒక విద్యార్థిని ప్రశ్నించగా, లోకేశ్ 'నాకు చాలా క్రష్‌లు ఉన్నాయి. పేర్లు చెబితే ట్రోల్ చేస్తారు. కానీ ఒక్క విషయం చెప్పగలుగుతా. కాలేజీలో ఉన్నప్పుడు చేయాల్సిన వెధవ పనులన్నీ చేశాను' అని చెప్పారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తాయని చెప్పారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ప్రజారాజధాని అమరావతిని పూర్తిచేస్తామని తెలిపారు.

గబ్బు మాటలెందుకు?.. 'దిబ్బలు' సేఫ్

'వారసత్వ సంపద'ని సంరక్షిస్తూ.. అభివృద్ధి

- నిజాలకు 'ఎర్రమట్టి' పూస్తున్న టీడీపీ, జనసేన
- 262.92 ఎకరాల ఎర్రమట్టి దిబ్బల రక్షణకు ప్రత్యేక బఫర్ జోన్ ఏర్పాటు
- డీ-పట్టా భూముల్నే సమీకరించి అభివృద్ధి
- టీడీపీ హయాంలోనే భూ సమీకరణకు జీవో
- 2016 నవంబర్ 25న జీవో జారీ చేసిన టీడీపీ ప్రభుత్వం
- ఇప్పుడు అదే పూలింగ్ చేపడితే విధ్వంసం అంటూ గగ్గోలు
- అదే బాటలో పవన్ అర్థరహిత పర్యటనలు
- విధ్వంసం అని ఎలా అంటారంటూ టీడీపీ రైతులే ఎదురు ప్రశ్నలు



ఎర్రరంగులో ఉన్నది ఎర్రమట్టి దిబ్బల జియో హెరిటేజ్ సైట్. పింక్ రంగులో ఉన్నది పూలింగ్ చేసిన భూమి



ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టిన భూమి



బఫర్ జోన్‌గా ప్రకటించి విడిచి పెట్టిన ప్రాంతం


సాక్షి, విశాఖపట్నం: తాను చేస్తే ఒప్పు.. మరొకరు చేస్తే తప్పు అనడం చంద్రబాబుకు రివాజు. చంద్రబాబు పాడే ప్రతి పాటకు డ్యాన్స్ చేయడం పవన్ అలవాటు. ఇదే విధానాన్ని విశాఖలోని ఎర్రమట్టి దిబ్బల పైనా చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు ఇదే తప్పాట ఆడుతున్నారు. భౌగోళిక వారసత్వ సంపద అయిన ఎర్రమట్టి దిబ్బలకు ప్రస్తుతం, భవిష్యత్తులోనూ ఎటువంటి నష్టం కలగకుండా, రక్షణగా బఫర్ జోన్ పెట్టి, వాటికి దూరంగా అభివృద్ధి పనులు చేపట్టడం వీరిద్దరికీ కంటగింపుగా మారింది. ఎర్రమట్టి దిబ్బలకు నష్టం జరిగిపోతోందంటూ ఇద్దరూ వీరంగాలు వేస్తున్నారు. అసలు ప్రభుత్వం ఇప్పుడు అభివృద్ధి చేస్తున్న కొత్తవలసలో భూసమీకరణ చేపట్టిందే చంద్రబాబు సర్కారు. ఆ విషయాన్ని దాచిపెట్టి, ప్రజలను పక్కదోవ పట్టించడానికి ఎర్రమట్టి దిబ్బలకు నష్టం చేస్తున్నారంటూ నీచ రాజకీయాలకు ఒడిగట్టారు. దశాబ్దాలుగా జీడితోటలు సాగు చేసుకుంటూ 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం నుంచి డీ-పట్టాలు పొందిన రైతుల భూములనే ప్రభుత్వం సమీకరించింది. ఈ భూములు ఎర్రమట్టి దిబ్బలైతే వాటికి డీ-పట్టాల్ని ప్రభుత్వం ఎలా ఇస్తుందన్న కనీస అవగాహన టీడీపీ నేతలకు, పవన్‌కు లేదు. వీరి తీరును టీడీపీకి చెందిన రైతులే ప్రశ్నిస్తున్నారు. తమకు ప్రభుత్వం మంచి పరిహారం ఇస్తోందని, అది రాకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బఫర్ జోన్ ఆవలే అభివృద్ధి

సర్వే నం.49లో నేరెళ్లవలస గ్రామం ఉంది. సర్వే నం.49/1లో మొత్తం 1067 ఎకరాలు ఉంది. ఇందులో 525 ఎకరాల్లో ఐఎన్ఎస్ కళింగ విస్తరించి ఉంది. మరో 287 ఎకరాలు ఓ బిల్డింగ్ సొసైటీకి చెందినవి. ఈ రెండింటి మధ్యలో ఎర్ర మట్టి దిబ్బలు విస్తరించి ఉన్న 262.92 ఎకరాలను జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తించారు. నేరెళ్లవలసను ఆనుకొనే ఉన్న కొత్తవలస గ్రామం సర్వే నం 75, 86, 87లో సుమారు 80 ఎకరాల్లో 80 ఏళ్లుగా రైతులు జీడి తోటలు, తాటిచెట్లు పెంచుకుంటూ జీవిస్తున్నారు. వీరికి 1982లో అప్పటి ప్రభుత్వం డీ-పట్టాలిచ్చింది. ఈ ప్రాంతంలోనే ప్రస్తుతం అభివృద్ధి జరుగుతోంది. ఇందు కోసం సర్వే నంబర్ 86ని ప్రభుత్వం సబ్ డివిజన్ చేసింది. 86/3ని ఎర్రమట్టి దిబ్బల రక్షణ కోసం బఫర్ జోన్‌గా ఏర్పాటు చేసింది. 148 అడుగుల మేర ఉన్న ఈ బఫర్ జోన్‌కు అవతల అభివృద్ధి జరుగుతోంది. అభివృద్ధి చేస్తున్న ప్రాంతానికి, ఎర్రమట్టి దిబ్బలకు ఎలాంటి సంబంధం లేదు. ఎర్రమట్టి దిబ్బలకు ఎటువంటి నష్టం కలిగించడంలేదన్నది 100 శాతం వాస్తవం.

2016లోనే జీవో ఇచ్చిన టీడీపీ..

టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రభుత్వం కూడా వుడా (ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ) ఆధ్వర్యంలో అభివృద్ధి పనుల కోసం 2016 నవంబర్ 25న జీవో ఎంఎస్ నం.304ని జారీ చేసింది. తొలుత పెందుర్తి మండలం సౌభాగ్య రాయపురంలో 128.94 ఎకరాలు, దబ్బందలో 114.23 ఎకరాలు, కొమ్మాదిలో 116.64 ఎకరాల్ని, ఆ తర్వాత నేరెళ్లవలసలో సర్వే నం.49/1పీలో 114.34 ఎకరాల అసైన్డ్ భూములు, గండిగుండంలో 69 ఎకరాలు లాండ్ పూలింగ్‌కు ఉత్తర్వులిచ్చింది. ఆ తర్వాత కొత్తవలసలోని సర్వే నం.75లో భూముల వివరాలు కోరింది. అప్పటి వుడా ప్రత్యేక తహశీల్దార్ సర్వే నం.75, 85, 86లో ఉన్న అసైన్డ్ భూములు, సరిహద్దులతో నోట్ పంపారు. వీటిని పూలింగ్‌లోకి తెచ్చింది. ఇలా భూ సమీకరణ కీలక ప్రక్రియ మొత్తం టీడీపీ హయాంలోనే జరిగింది. ఇప్పుడు అవే భూములను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే టీడీపీ, పవన్ గగ్గోలు పెడుతున్నారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Municipal Administration & Urban Development Department- Andhra Pradesh Metropolitan Region and Urban Development Authorities Act, 2016(AP Act No.5 of 2016) - Implementation of Development Schemes - Authorization to Visakhapatnam Urban Development Authority – Orders - Issued.

G.O.MS.No. 304 — Dated: 25-11-2016
Read the following:

1. AP Metropolitan Region & Urban Development Authorities Act, 2016 (Act 5 of 2016)
2. G.O.Ms.No.290, MA & UD Department, Dated : 14.11.2016
3. From the V.C, Visakhapatnam Urban Development Authority, Lr.Roc.No.56/2011/Estate/I-1, dated 13-11-2016

&&&

ORDER:
In the reference 2nd read above, Government have issued orders formulating Visakhapatnam Urban Development Authority Land Pooling Scheme (Formulation and implementation), Rules, 2016" and the Vice-Chairman, Visakhapatnam Urban Development Authority was directed to initiate the land pooling process and furnish the individual land pooling scheme proposals in detail to the Government for taking further necessary action in the matter.

TOTAL	65.68	175.13	119.00	359.81

b) Proposals to be taken up in the second spell:

Sl. No	Name of the Village & Mandal	Sy.No.	Zeroyit hi land Ac.Cts	Assigned land Ac.Cts	Govt land Ac.Cts	Total Ac.Cts
1	2	3	5	6	7	8
1	Nerellavalasa (V) Bheemunipatnam (M)	49/1p	--	114.34	--	114.34
2	Gandigundam (V) Anandapuram(M)	16/2 to 25/6 and 36/1 to 4	--	69.00	--	69.00
TOTAL			--	183.34	--	183.34

టీడీపీకి చెందిన రైతు ఏమంటున్నారంటే..



ఎర్రమట్టి దిబ్బల విధ్వంసమంటూ టీడీపీ, జనసేన చేస్తున్న ఆందోళనల్ని టీడీపీకి చెందిన రైతులే ఖండిస్తున్నారు. అసలు ఈ ప్రక్రియ మొత్తం టీడీపీ హయాంలో జరిగితే.. ఏదో కొత్తగా చేస్తున్నట్లు మాట్లాడటంపై టీడీపీకి చెందిన పాసి నర్సింగరావు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. 'మా టీడీపీ హయాంలోనే దీనిపై జీవో వచ్చింది. అప్పుడే మేము పూలింగ్‌కి భూములు ఇచ్చెయ్యాలని నిర్ణయించుకున్నాం. మాకు కొత్తవలస దగ్గర 5 ఎకరాలు ఉంది. 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం మా పేరుతో డీ-పట్టాలిచ్చింది. రైతులంతా కూర్చొని పూలింగ్‌లో భూములిస్తే ఎంత పరిహారం అడగాలో మాట్లాడుకున్నాం. గ్రామ సభలకు రైతులందరం హాజరయ్యాం. అందరికీ మంచి పరిహారం ఇస్తామన్నారు. అప్పట్లో ప్రక్రియ ఆలస్యమైంది. దాని ప్రకారమే పరిహారం ఇస్తున్నారు. ఇదంతా అప్పుడే జరిగింది. ఇప్పుడు పవన్ వచ్చి విధ్వంసం చేస్తున్నారని మాట్లాడటం సరికాదు' అని అన్నారు.

చంద్రబాబు విజన్ 2047 ఒక నాటకం

- 2024 ఎన్నికల కోసం బాబు వేసిన ఎర
- విజన్ – 2020 తో బాబు పొడిచేసిందేమీ లేదు
- ఆయన ఏం చేశారో ప్రజలు చూశారు
- ఇప్పుడు ఆయన్ని నమ్మే స్థితిలో ప్రజలు లేరు
- వందేళ్ళ వయసులోనూ పాలన చేస్తానని బాబు భావిస్తున్నట్లున్నారు
- ఆయనకు ప్రజలంటే ఎంత చులకనో ఇదే చెబుతోంది
- పవన్ ఓ తిక్క మేళం
- సీఎం అవుతానంటాడు.. ఎన్ని సీట్లలో పోటీ చేస్తాడో తెలియదు
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: చంద్రబాబు విజన్ – 2047 ప్రజలను మభ్యపెట్టడానికి ఆడుతున్న మరో నాటకమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి దుయ్యబట్టారు. జనం అంటే ఏమీ తెలియని అమాయకులు, పిచ్చోళ్ళని చంద్రబాబు నమ్మకమని చెప్పారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 40 ఏళ్ల రాజకీయ జీవితం అని చెప్పుకొనే చంద్రబాబు.. నాడు ఆర్భాటంగా ప్రకటించిన విజన్ – 2020తో పొడిచేసిందేమిటని ప్రశ్నించారు. ఆయన విజనేమిటో ప్రజలు చూశారని అన్నారు. ఇప్పుడు విజన్ – 2047 అంటూ 2024 ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజలకు మరో ఎర వేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని అన్న వారే.. ఇంకా ఎక్కువ పథకాలు ఇస్తామనటం ప్రజల్ని మభ్యపెట్టడం కాదా అని ప్రశ్నించారు. బాబు నైజం బాగా తెలుసు కాబట్టి ఆయన్ని నమ్మే స్థితిలో ఓటర్లు లేరని తెలిపారు. వందేళ్ళ వయసులో కూడా పాలన చేస్తానని చంద్రబాబు భావిస్తున్నట్లున్నారని అన్నారు. పైకి పోయినా శాశ్వతంగా పరిపాలిస్తాను అని బాబు అనుకుంటున్నారని, ప్రజలంటే ఆయనకున్న చులకన భావన దీనిలో వ్యక్తమవుతోందని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబుకు ప్రజలు అధికారమిచ్చారని, ఇప్పుడు చెప్పిన అంశాల్లో ఆ ఐదేళ్లలో ఒక్కటైనా చేశారా అని నిలదీశారు. బాబుకి పిచ్చి స్థాయిని దాటిపోయి ఒక ట్రాన్స్‌లో ఉన్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలేమిటో చెప్పి ఓట్లు అడుగుతోందని, అదే చంద్రబాబు, లోకేశ్ ప్రజలకు చేసిన మేలేమిటో చెప్పలేని స్థితిలో ఉన్నారన్నారు. చంద్రబాబు పాలన వల్ల రాష్ట్రానికి నష్టమే తప్ప లాభం ఇసుమంతైనా లేదని తెలిపారు. కుమారుడు లోకేశ్ వల్ల కావడంలేదు కాబట్టే పవన్‌కు మద్దతిస్తున్నానని చంద్రబాబు చెప్పగలరా అని ప్రశ్నించారు. సీఎం సీటు స్వీకరించడానికి సిద్ధమని అంటున్న పవన్ కళ్యాణ్ అసలు రాష్ట్రంలో ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తారో ప్రకటించగలడా అని నిలదీశారు. ప్రజలకు ఏం చేస్తారో పవన్ క్లారిటీ ఇవ్వాలన్నారు. చంద్రబాబైనా, పవన్ అయినా రాజకీయాల్లో సీరియస్‌గా, చిత్తశుద్ధితో ఉండాలనే కోరుకుంటున్నామని చెప్పారు. పవన్ తిరిగి చంద్రబాబును సీఎంగా కూర్చోబెట్టడానికి అహంకారంతో మాట్లాడుతున్నారని తెలిపారు. పవన్ తిక్కమేళమని, ఆయనవి తలా తోక లేని ఆలోచనలని వ్యాఖ్యానించారు. పవన్ చేష్టలు సినిమాల్లో చెల్లుతాయి కానీ, ప్రజా క్షేత్రంలో చెల్లవని చెప్పారు. ఎన్నికలే ప్రజా కోర్టు అని, పవన్ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని స్పష్టంచేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలు సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదిస్తారని, వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి పవన్‌కు ఇష్టంలేదు

- ప్రభుత్వ స్థలాలను ఉపయోగించుకుంటే తప్పేంటి?
- మంత్రి అమర్‌నాథ్ ధ్వజం



సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందడం పవన్ కల్యాణ్‌కు ఏమాత్రం ఇష్టంలేదని ఆయన మాటలనుబట్టి అర్థమవుతోందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. ఎర్రమట్టి దిబ్బలపై పవన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. ఎర్రమట్టి దిబ్బలు ఆక్రమిస్తున్నారంటూ పవన్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అభివృద్ధి చేస్తున్న ప్రాంతానికి, ఎర్రమట్టి దిబ్బలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. కొత్తవలసలో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ నిర్మాణాలు చేపట్టడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రలో భూ కుంభకోణాలు బయట పెడతానంటూ నాలుగైదు రోజులుగా ఈ ప్రాంతంలో పర్యటిస్తున్న పవన్ వాటిని నిరూపించలేక బొక్కబోర్లా పడ్డారని వ్యాఖ్యానించారు. 'మీ దత్త తండ్రి ఇచ్చిన స్క్రిప్ట్ చదవకుండా, వాస్తవాలు తెలుసుకొని, అవగాహన పెంచుకుని ఇక్కడికి వచ్చి ఉంటే బాగుండేది.' అని హితవు పలికారు. చంద్రబాబు హయాంలో ఈ ప్రాంతంలో వేలాది ఎకరాలు కబ్జాకు గురైతే పెదవి విప్పని పవన్ ఇప్పుడు ఎందుకు అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఆయన పర్యటించిన ప్రాంతంలో ఎక్కడా లోపాలు దొరక్కపోవడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కీ, మోదీకి చెప్తానంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని వ్యాఖ్యానించారు. పవన్ ఇక్కడ ఉండే ఒకట్రెండు రోజుల్లోనైనా ప్రజలకు ఏం చేస్తారో చెప్పుకోవాలని, అవాస్తవాలను మాత్రం మాట్లాడొద్దని సూచించారు.

ప్రజా కోర్టులో మొదట విచారించాల్సింది పవన్‌నే

- బాబు, బాలకృష్ణ, లోకేశ్, నారాయణను విచారించగలరా?
- ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



మహారాణిపేట: మహిళల మీద అఘాయిత్యాలు చేస్తే నాలుగు బెత్తం దెబ్బలు వేసి వదిలేయాలన్న పవన్ కళ్యాణ్‌నే మొదట ప్రజా కోర్టులో విచారించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి చెప్పారు. ఆమె బుధవారం విశాఖలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆడపిల్ల పుట్టుకనే అవహేళన చేసిన చంద్రబాబును, అత్యాచారాలకు పాల్పడిన జనసేన కార్యకర్తలను, అరకులో ఓ మహిళను రెండు రోజులు చిత్రహింసలు పెట్టి చంపేసిన మీ అధికార ప్రతినిధిని, ఆడపిల్ల పట్ల చులకన భావంతో మాట్లాడిన బాలకృష్ణను పవన్ ప్రజాకోర్టులో విచారిస్తారా అని ప్రశ్నించారు. స్వయానా పవన్ అభిమాని అయిన మరదలిని వేధించి, కాలేజీలో ఆడబిడ్డలకు అన్యాయం చేసిన నారాయణను మీ ప్రజాకోర్టులో విచారించగలరా.. ఇంటికొచ్చిన టీచర్‌తోనే అసభ్యకరంగా ప్రవర్తించిన లోకేశ్‌ను, మహిళా కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఆయన పీఏను విచారించగలరా.. అని పవన్‌ను నిలదీశారు. ప్రజాకోర్టు అంటే.. సినిమా సెట్టింగ్‌లో వేసే ప్రజా కోర్టా.. అని ఎద్దేవా చేశారు. జనసేన చంద్రబాబుకు బానిససేనలా ఉందని చెప్పారు. పవన్ పార్టీ పెట్టి 9 ఏళ్లయినా మహిళా సమస్యల మీద ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో మహిళలకు సొంత అన్నలా అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు.

ప్రభుత్వం స్పందించకపోతే ఎన్జీటీకి ఫిర్యాదు చేస్తా

ఎర్రమట్టి దిబ్బల సందర్శనలో పవన్



సాక్షి, విశాఖపట్నం/తగరపువలస: విశాఖ జిల్లా భీమిలి సమీపంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బల సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం 48 గంటల్లో స్పందించకపోతే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)కు ఫిర్యాదు చేస్తామని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చెప్పారు. ఎర్రమట్టి దిబ్బల సమీపంలో వీఎంఆర్డీఏ లేఅవుట్ ప్రాంతాన్ని ఆయన బుధవారం సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆ ప్రాంతంలో లేఅవుట్ వల్ల 20 వేల ఏళ్ల క్రితం సహజసిద్ధంగా ఏర్పడిన ఎర్రమట్టి దిబ్బలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఒకప్పుడు 1,200 ఎకరాల్లో ఉండే ఈ దిబ్బలు ఇప్పుడు 292 ఎకరాలకు కుదించుకుపోయాయని చెప్పారు. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలని, ఇందుకు పర్యాటక శాఖ మంత్రి బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఎర్రమట్టి దిబ్బలకు బఫర్ జోన్ వదిలి పూర్తి స్థాయిలో కంచె వేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్తరాంధ్రను దోచుకుంటున్నారని ఆరోపించారు. కాగా, పవన్ ఎర్రమట్టి దిబ్బల సందర్శనలో ఇద్దరు గాయపడ్డారు. బీచ్ రోడ్డులో కె.నగరపాలెం వద్ద జన సైనికులు అత్యుత్సాహంతో ఊపిన జెండా కర్రలు తగిలి బందోబస్తులో ఉన్న ఏఆర్ మహిళా కానిస్టేబుల్ ఉషకు తలకు గాయమైంది. జేవీ అగ్రహారం వేదిక వద్ద టెంట్ ఐరన్ రాడ్లు పడిపోవడంతో హేమంత్‌కుమార్ అనే వ్యక్తి గాయపడ్డాడు.





గాయపడిన కానిస్టేబుల్ ఉష, హేమంత్‌కుమార్

అప్పుడు విజన్-2020.. ఇప్పుడు విజన్-2047

మండపేటలో 'భవిష్యత్‌కు గ్యారంటీ' డిక్లరేషన్‌ను ప్రారంభించిన చంద్రబాబు





చంద్రబాబు మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న టీడీపీ శ్రేణులు

సాక్షి అమలాపురం/మండపేట: విజన్-2020 తానే రచించానని.. ఇప్పుడు విజన్-2047 ప్రణాళిక రచిస్తున్నానని టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పారు.'భవిష్యత్‌కు గ్యారంటీ.. అది బాబు గ్యారంటీ' పేరిట టీడీపీ డిక్లరేషన్‌ను మండపేట నుంచి ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. బుధవారం మండపేట మండలం ఏడిద గ్రామంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధ్యక్షతన రైతులతో రచ్చబండ నిర్వహించారు. అనంతరం మండపేటలో బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. పవన విద్యుత్, సోలార్ విద్యుత్, మోటార్ విద్యుత్ రానున్నాయన్నారు. వాటిద్వారా విద్యుత్ ఉత్పత్తి పెంచుతానని చెప్పుకొచ్చారు. తాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచనన్నారు. 'మీకు ఇచ్చేది రూ.10.. దోచేది రూ.100. ఇదా పేదలకు.. పెత్తందారులకు మధ్య పోటీ అంటే' అని ప్రశ్నించారు. అప్పు చేసిన డబ్బు ఎక్కడకు పోతోందని, ఎనిమిది సార్లు కరెంట్ చార్జీలు పెంచారన్నారు. తన మీద దాడి చేసి.. తనపైనే కేసులు పెడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రైతును రాజును చేస్తానని, వాణిజ్య, ఉద్యాన పంటలకు ప్రోత్సాహం ఇస్తానని చెప్పారు. ఐదేళ్లుగా రైతు సంతోషంగా లేరని, వరి పండించిన రైతుకు లాభం లేదని, కొబ్బరికి కనీస మద్దతు ఇవ్వడం లేదని, ఆక్వా రంగం వెంటిలేటర్ మీద ఉందని విమర్శించారు. ఒక్క గంజాయి దొంగలకు లాభసాటిగా ఉందని ఎద్దేవా చేశారు. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరాన్ని బలి చేశారన్నారు. మద్య నిషేధం అంటూ విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారని.. మరో 30 ఏళ్లు మగవాళ్లు తాగకపోతే మద్యంపై చేసిన అప్పు తీరదని చెప్పారు.

జనాభా పెరిగేలా చూస్తా

'దేశంలో జనాభా తగ్గిపోతోంది. జనాభా పెరిగేలా చూస్తాను' అని చంద్రబాబు చెప్పడంతో సభికులు అవాక్కయ్యారు. మండపేట సభలో బాబు ప్రసంగం ప్రారంభించగానే పలువురు వెనుతిరిగి వెళ్లిపోయారు. అనుకున్న స్థాయిలో జనం రాకపోవడంతో గంటన్నర ఆలస్యంగా సభ ప్రారంభించారు. అయినా అనుకున్న స్థాయిలో జనం రాలేదు. వరుసగా మూడుసార్లు పార్టీ గెలిచినా ఆ స్థాయిలో జనం రాలేదని పార్టీ నాయకులే పెదవి విరిచారు. టీడీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, తదితరులు పాల్గొన్నారు.

మోసం, దగా.. ఇవే చంద్రబాబు విజన్

విజన్-2047ను ఏకిపారేసిన మాజీ మంత్రి పేర్ని నాని

సాక్షి, అమరావతి: ఎన్నికలు ముంచుకొస్తున్న నేపథ్యంలో ఓట్ల కోసం విజన్-2047 పేరుతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రజలకు మళ్లీ ఎర వేస్తున్నారని మాజీ మంత్రి పేర్ని నాని (వెంకట్రామయ్య) విమర్శించారు. మోసం, దగా.. ఇవే చంద్రబాబు విజన్ అంటూ దుయ్యబట్టారు. ఓట్ల కోసం ముసలి పూతన వేషంలో వస్తున్న చంద్రబాబుకు తగిన శాస్తి ఖాయమని తేల్చి చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'విజన్-2047 అనే కాగితాల కట్టలను ప్రజలపై చిమ్మి.. తద్వారా తెలుగు ప్రజలను ప్రపంచ పటంలో నిలపడమే తన లక్ష్యమని చంద్రబాబు చెబుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇదే చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు.. విద్యుత్ చార్జీలు తగ్గించమని కోరితే హైదరాబాద్ నడిబొడ్డున ముగ్గురిని పిట్టలు కాల్చినట్లు కాల్చి చంపారు. అలాంటి విజనరీ విద్యుత్ చార్జీలు తగ్గిస్తానంటే జనం నమ్మాలా? రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తానని 2004 ఎన్నికల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి చెబితే.. కరెంటు తీగలపై బట్టలారేసుకోవాల్సిందేనని ఎగతాళి చేసిన విజనరీ చంద్రబాబు' అని మండిపడ్డారు. మీడియాతో పేర్ని నాని ఇంకా ఏమన్నారంటే..

విజన్-2020తో ఏం సాధించారు?

- విద్యుత్ శాఖపై 2014లో ఉన్న రూ.20 వేల కోట్ల అప్పును రూ.80 వేల కోట్లకు తీసుకెళ్లిన చంద్రబాబు.. 2019 నాటికి విద్యుత్ కొనుగోళ్ల బకాయిలు రూ.22 వేల కోట్లను ప్రజలపై మోపారు. తనది 40 ఏళ్ల రాజకీయ జీవితం అని చెప్పే చంద్రబాబు.. విజన్-2020తో పొడిచేసిందేంటి? వ్యవసాయం దండగ అని చెప్పిన విజనరీ.
- 14 ఏళ్లు సీఎంగా ఉండీ.. ఒక్క ప్రాజెక్టు అయినా కట్టావా? కుప్పానికి అయినా నీళ్లిచ్చావా? చంద్రబాబు వయసు 75 ఏళ్లు. ఆయన విజన్-2047 అంటున్నాడు. అప్పటికి ఆయన విజన్ ఉంటుందా? జయంతి, వర్ధంతులు ఉంటాయా.. అనేది భగవంతుడికే తెలియాలి. బాబు విజన్ పబ్లిసిటీ మాత్రమే.

ఇదీ విజన్ అంటే..

- 108.. 104.. ఆరోగ్యశ్రీ.. ఇవన్నీ డాక్టర్ వైఎస్సార్ విజన్. 1,540 కొత్త అంబులెన్స్‌లను కొని ప్రజలకు అందించడం వైఎస్ కుమారుడు సీఎం జగన్ విజన్. 2014-19లో 108 అంబులెన్స్‌లను షెడ్లలో పెట్టడం చంద్రబాబు మార్కు విజన్. ఆరోగ్యశ్రీ కింద వెయ్యి జబ్బులు ఉంటే చంద్రబాబు ఒక్క జబ్బు కూడా పెంచలేదు. పైగా రూ.900 కోట్లు బకాయి పెట్టాడు. జగన్ అధికారంలోకి వచ్చాక 3,600 జబ్బులకు వైద్యం చేయించేందుకు ఆరోగ్య శ్రీలో చేర్చారు.
- బాబు ఒక్క మెడికల్ కాలేజీ నిర్మించలేదు. సీఎం జగన్ మూడేళ్లలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం మొదలు పెట్టారు. 53 వేల మంది సిబ్బందిని వైద్య ఆరోగ్య శాఖలో నియమించారు. ఇదీ విజన్ అంటే.
- విద్యా వ్యవస్థలో మీ దార్శనికత ఎక్కడుంది చంద్రబాబూ? కనీసం నారావారిపల్లె పాఠశాలను కూడా బాగు చేయలేదే? నారాయణ, చైతన్య స్కూళ్ల ఎదుగుదల చూసి మురిసిపోయావు. విజన్-2020 పూర్తయ్యేసరికి అక్షరాస్యతలో రాష్ట్రానిది చివరి స్థానం. స్కూల్ డ్రాపవుట్స్‌లో నంబర్ వన్. ప్రభుత్వాస్పత్రుల్లో యూజర్ చార్జీల మోత మోగించడం, బ్యాంకుల్లో మహిళల బంగారం విడిపిస్తానని మోసం చేయడం మీ దివాళా కోరు విజన్. చంద్రబాబు వల్ల డ్వాక్రా సంఘాలు కేవలం 19 శాతం మాత్రమే ఏ,బీ గ్రేడ్లలో ఉంటే నేడు ఆ శాతం 91కి పెరగడం, ఉచిత విద్య సీఎం జగన్ విజన్.

కాపీ కొట్టడమే ఆయన విజన్

- ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించాలి.. కాంట్రాక్టు ఉద్యోగులను పెంచాలనేది బాబు విజన్-2020. కారుణ్య నియామకాలను ఒప్పుకోని విజన్ కూడా ఆయనదే. 2014లో తెలంగాణను కాపీ కొట్టడం తప్ప చంద్రబాబు చేసిందేమిటి? నాడు పింఛన్ల కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు నడిబజార్లో పడిగాపులుగాసేలా చేయడమే బాబు విజన్.
- 2014లో బీసీలకు 143 హామీలు ఇచ్చి, ఒక్కటీ నెరవేర్చలేదు. నాడు ఎస్టీ వర్గానికి, మైనార్టీలకు మంత్రి పదవే ఇవ్వలేదు. అధికారం ఉంటే ఇక్కడ నివాసం.. లేదంటే ప్రవాసం. వలస పక్షులకు.. చంద్రబాబు, పవన్‌లకు తేడా లేదు.
- చంద్రబాబు మోసగాడైతే.. పవన్ గజమోసగాడు. 2014లో బాబుకు ఓటేయండని పవన్ అడిగాడు. ప్రజలకు క్షవరమైంది. రేపు మళ్లీ అదే చెబుతాడు. వీళ్లకు తోడు రామోజీ. నిజాయితీగా ఒక్క వార్త రాయలేని మీదీ జర్నలిజమా?

పూర్తి వివరాలకు స్కాన్ చేయండి

చదువులపై ఈనాడు చిత్తు కథ

విద్యా రంగం కోసం నాలుగేళ్లలో ఖర్చు చేసింది రూ.68,607 కోట్లు

చంద్రబాబు స్కీములోని ప్రైవేటు స్కూళ్లలో ఈ సౌకర్యాలున్నాయా?

నాణ్యమైన విద్య అందరికీ అందడం ఇష్టంలేకే అసత్య కథనాలు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లలకు ఉచితంగా అందిస్తున్న నాణ్యమైన విద్యపై ఈనాడు సంస్థల అధిపతి రామోజీరావు మరోసారి విషం కక్కారు. పేదల చదువులపై పూర్తి వక్రీకరణలు, అభూత కల్పనలతో ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈనాడు పత్రికలో కథనాన్ని ప్రచురించారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతున్న రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడంలో భాగంగానే ఈ కథనం ప్రచురించారు. ఈ కథనంలోని డొల్లతనాన్ని, రామోజీ ఏడుపుగొట్టుతనాన్ని ప్రభుత్వం బట్టబయలు చేసింది.

- బెస్ట్ అవైలబుల్ పథకంలో ఎంపిక చేసిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.20 వేల నుంచి రూ. 30 వేల వరకు అందేదని ఈనాడు రాసింది. కానీ, వైఎస్ జగన్ ప్రభుత్వం పలు పథకాల ద్వారా విద్యార్థులకు మేలు చేస్తోంది. అత్యుత్తమ విద్యను అందిస్తోంది. ఒక్క అమ్మ ఒడి పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి విద్యార్థి తల్లికీ ఏడాదికి రూ.15 వేలు అందిస్తోంది. ఇవికాక ప్రభుత్వ విద్యా రంగంలో ప్రతి విద్యార్థి మీద ఏడాదికి అదనంగా చేస్తున్న ఖర్చు రూ.30 వేల పైనే.
- బెస్ట్ అవైలబుల్ పథకం కొందరికే అందేది. అంటే మిగిలిన విద్యార్థులకు నాసిరకం చదువులు అందినా పర్వాలేదనేది ఈనాడు అభిప్రాయమా? ఇది పేదలు, ఎస్సీ, ఎస్టీలు బడుగు, బలహీనవర్గాల వారికి అన్యాయం చేసినట్టుగా కాదా? అందరికీ నాణ్యమైన విద్య అందడం ఈనాడుకి ఇష్టంలేదా?
- మంచి చదువులు ఏ ఒక్కరికో కాదు.. అందరికీ సమానంగా అందాలన్నదే ఈ ప్రభుత్వ ధ్యేయం. అందుకే కార్పొరేట్ స్కూళ్లకంటే మెరుగ్గా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతోంది. మన బడి నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. తొలి దశలో రూ.3,699 కోట్లతో 15,715 స్కూళ్లలో సదుపాయాలు కల్పించింది. రెండో దశలో మరో 22,344 స్కూళ్లను రూ.8,000 కోట్లతో బాగుచేస్తోంది. ఇందులో ఇప్పటికే రూ.2,949 కోట్లు ఖర్చు చేసింది. నాడు – నేడు పథకం ద్వారా ప్రభుత్వ స్కూళ్లలో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రైవేటు స్కూళ్లలో కూడా లేవన్నది నిజం.
- పిల్లలను బడికి పంపేలా తల్లులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందు కోసం విప్లవాత్మక మార్పుగా అమ్మ ఒడి పథకాన్ని తీసుకొచ్చింది. కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకే కాకుండా, ప్రైవేటు స్కూళ్లకు వెళ్తున్న వారికీ వర్తిస్తోంది. అమ్మ ఒడి ద్వారా ఈ నాలుగేళ్లలో సుమారు 45 లక్షల మంది తల్లులు అందుకున్న మొత్తం రూ.26,067.28 కోట్లు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చే ఏడాదికి రూ.100 కోట్లు ఎక్కడ? ఒక్క అమ్మ ఒడి ద్వారా ఈ నాలుగేళ్ల కాలంలో ఇచ్చిన రూ.26,067.28 కోట్లు ఎక్కడ? ఈ పథకం ద్వారా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేదల పిల్లలు ఎంతగానో లబ్ధిపొందారు.
- విద్యా రంగంలో ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల వల్ల 14,28,568 మంది ఎస్సీ విద్యార్థులు, 5,19,116 మంది ఎస్టీ విద్యార్థులు లబ్ధి పొందారు. మరోవైపు 10వ తరగతి, ఇంటర్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 22,761 మంది విద్యార్థులను జగనన్న ఆణిముత్యాల పేరుతో ప్రభుత్వం సత్కరించింది.
- జగనన్న గోరుముద్ద ద్వారా ప్రభుత్వ స్కూళ్ల పిల్లలకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తోంది. దీనికి రాగిజావను కూడా ఇటీవల అదనంగా చేర్చింది. ఈ నాలుగేళ్లలో కేవలం జగనన్న గోరుముద్ద పథకం మీద పెట్టిన ఖర్చు అక్షరాలా రూ.4,286.7 కోట్లు. ఇలాంటి ఆహారాన్ని ఉచితంగా ఏ ప్రైవేటు పాఠశాలలైనా అందిస్తున్నాయా?
- బడికి వెళ్లే పిల్లలకు జగనన్న విద్యా కానుక కింద వారికి కావాల్సిన యూనిఫాం, పుస్తకాలు, షూ, బెల్టు, సాక్సులు, ఇంగ్లిష్ డిక్షనరీ, వర్క్ బుక్స్ లాంటివాటిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. దీని కోసం నాలుగేళ్లలో చేసిన ఖర్చు అక్షరాలా రూ.3,366.53 కోట్లు. చంద్రబాబు అమలు చేసిన స్కీమ్‌లో ప్రైవేటు పాఠశాలలు ఇలాంటివి అందించాయా?
- అందరికీ ఇంగ్లిష్ మీడియం, మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్, బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, టోఫెల్‌లో శిక్షణ, పరీక్షలు ఇవన్నీ ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో ఈ సదుపాయాలన్నీ ఉన్నాయా?
- కార్పొరేట్ పాఠశాలలు పోటీ పడలేనంతగా ప్రభుత్వ పాఠశాలలను అత్యున్నత స్థాయిలో ఉంచే మరో అంశం డిజిటలీకరణ. గ్లోబల్ సిటిజన్లను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. దీనిపై గణనీయంగా ఖర్చు చేస్తోంది. ఆరు, ఆపై తరగతుల వారికి ప్రతి తరగతి గదిలో ఒక ఐఎఫ్‌పీ ప్యానెల్ ఏర్పాటు చేస్తోంది. తొలి దశలో రూ.440 కోట్లతో 30,213 తరగతి గదుల్లో ఐఎఫ్‌పీల ఏర్పాటు చేసింది. రెండో దశలో మరో రూ.520 కోట్లు ఖర్చు చేస్తోంది. 5వ తరగతి లోపు 10,038 తరగతి గదుల్లో తొలిదశలో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసింది. ఇలాంటి ఏర్పాటు ఉన్న ప్రైవేటు స్కూళ్లు ఎన్నో ఈనాడు చెప్పగలదా?
- డిజిటల్ విద్యలో భాగంగా 4 నుంచి 10వ వతరగతి వరకు సుమారు 16 లక్షల మంది విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌ను ప్రభుత్వం అందిస్తోంది. అంతేకాక 8వ తరగతి చదువుకునే ప్రతి విద్యార్థికి బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌ను ఉచితంగా ఇస్తోంది. ఇందుకోసం 5.18 లక్షల మంది విద్యార్థులకు ఏడాదికి రూ.686 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇలా సౌకర్యాలు, డిజిటల్ ఎడ్యుకేషన్ ఉన్న ప్రైవేటు పాఠశాలలు ఎన్ని ఉన్నాయి? లక్షల మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వీటిద్వారా మేలు పొందడంలేదా? ఇలా గడచిన 50 నెలల్లో ప్రభుత్వ విద్యా రంగం మీద చేసిన ఖర్చు అక్షరాలా రూ.68,607 కోట్లు.

విద్యార్థులకు మేలు జరిగేలా చర్యలు

బెస్ట్ అవైలబుల్ స్కీంలో చేరిన విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 9, 10 తరగతులు వారిని అదే పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తోంది. మిగిలిన విద్యార్థులు వారు కోరుకున్న ప్రభుత్వ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేరే అవకాశాన్ని కల్పించింది. వీరికి ప్రభుత్వ పరంగా మిగిలిన విద్యార్థుల మాదిరిగానే అన్ని పథకాలు, సదుపాయాలు కల్పిస్తోంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారనేది పూర్తిగా అవాస్తవం.

ప్రభుత్వ పరిశీలనలో తేలింది ఏంటంటే

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లుగా గుర్తించిన చాలా పాఠశాలల్లో కనీస ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు లేవు. వరుసగా ఐదేళ్లపాటు పదో తరగతిలో 90 శాతానికిపైగా ఉత్తీర్ణత సాధించాలి. అందులో 50% విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలి. ఈ ఫలితాలు సాధించిన స్కూళ్లే ఈ స్కీంకు అర్హత పొందుతాయి. ఈ నిబంధనలేవీ ఎంపిక చేసిన స్కూళ్లలో లేవు అని ప్రభుత్వం వివరించింది.

అంతా 'సార్' చెప్పినట్లే..

▶ మొదటి పేజీ తరువాయి

ఇతని డ్రైవర్ కలకడ నవీన్‌కుమార్, మరో ఇద్దరు నిందితులు దోవల అమర్‌నాథ్, సి.పెద్దన్నలను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. చల్లా బాబు డ్రైవర్‌ను పోలీసులు విచారించగా ఈ కుట్రలకు సంబంధించిన పూర్తి ప్లాన్‌ను విస్పష్టంగా వివరించినట్లు తెలుస్తోంది. నిందితుడి నేర ఒప్పుదల వాంగ్మూలంలో పలు విషయాలను పూస గుచ్చినట్లు చెప్పేశాడని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

1వ తేదీ: కుట్రకు రూపం

ఈ నెల 4వ తేదీ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పర్యటన పుంగనూరు బైపాస్ మీద వెళ్లాల్సి ఉండగా.. అనుమతి లేకున్నా పుంగనూరు పట్టణంలోకి వెళ్లడానికి టీడీపీ నేతలు పట్టుపట్టడం, ఆపై పోలీసులను చంపాలని విధ్వంసకాండ సృష్టించగా ఓ పోలీసు కంటిచూపు పోగొట్టుకోగా, పదుల సంఖ్యలో పోలీసులకు తలలు పగిలి రక్త గాయాలైన విషయం తెలిసిందే. ఈ కుట్రకు ఈనెల 1వ తేదీనే టీడీపీ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఆ రోజు ఉదయం చల్లా బాబు, ఇతని పీఏ గోవర్ధన్‌రెడ్డి, డ్రైవర్ నవీన్‌కుమార్ ముగ్గురూ రొంపిచెర్ల నుంచి పుంగనూరుకు కారులో బయలుదేరారు. కొద్ది దూరం వెళ్లగానే చల్లా బాబు ఫోన్‌లో మాట్లాడటం మొదలుపెట్టాడు. 'సరే సార్.. సరే సార్.. మీరు చెప్పినట్లే చేస్తాను. బీరు బాటిళ్లు, కర్రలు, రాళ్లు అన్నీ అక్కడ డంప్ చేస్తాం. మిమ్మల్ని టౌన్‌లోకి రానివ్వమంటూ పోలీసులు చెప్పగానే మనవాళ్లు దాడి చేస్తారు. పోలీసులను కానీ, అవసరమైతే వైసీపీ వాళ్లపై దాడి చేసి చంపైనా సరే మీరు చెప్పినట్లే పోగ్రాం పెట్టిస్తా సార్..' అని మాట్లాడినట్లు సమాచారం. మరుసటి రోజు తన ఇంటి వద్ద జరిగే అతి ముఖ్యమైన సమావేశానికి పిలవాల్సిన కొందరి పేర్లను గోవర్ధన్‌రెడ్డి, నవీన్‌కుమార్‌కు చల్లా బాబు అప్పగించాడు.

2వ తేదీ: వ్యూహ రచన

రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారి పల్లె పంచాయతీ, గర్నిమిట్టవారి పల్లెలోని చల్లా బాబు ఇంటి వద్ద టీడీపీలోని ముఖ్యమైన నాయకులతో రహస్య సమావేశం నిర్వహించారు. టీడీపీకి చెందిన హేమంత్‌రెడ్డి, మోహన్‌నాయుడు, నగేష్, రమేష్‌రెడ్డి ఇంకా పలువురు ముఖ్య నేతల్ని పిలిపించిన చల్లా బాబు మాట్లాడటం మొదలుపెట్టాడు. ఇందులో రాళ్లు, మద్యం బాటిళ్లు, టపాకాయ బాంబులు, కర్రలు ఎక్కడ డంప్ చేయాలో చెప్పాడు. పోలీసులు కాల్పులు ఓపెన్ చేసేలా ఎలా రెచ్చగొట్టాలో ఆదేశాలిచ్చాడు. ఒకరిద్దరు ఖాకీల ప్రాణాలు పోతే.. టీడీపీ కార్యకర్తలు చేసే బలిదానం వల్ల పార్టీ మైలేజ్ పెరుగుతుందని నమ్మబలికాడు. ఇదే జరిగితే రాష్ట్రంలో అధికార పార్టీకి జరిగే డ్యామేజ్, టీడీపీకి వచ్చే మైలేజ్ గురించి వివరించాడు. ఎవరెవరు ఏ పనులు చేయాలో అప్పగించి, అంతా అనుకున్న ప్లాన్ ప్రకారం జరగాలని చల్లా బాబు ఆదేశించాడని సమాచారం.

3వ తేదీ: ప్లాన్- వర్క్ షేర్

చల్లాబాబు మరికొంత మంది టీడీపీ నాయకుల్ని తన ఇంటి వద్దకు పిలిపించాడు. పుంగనూరు విధ్వంసకాండ ఎలా చేయాలి? పోలీసులను ఎలా చంపాలి? ఖాకీలు ఫైర్ ఓపెన్ చేసేలా రెచ్చగొట్టే విధానం? ఆపై జరిగే అల్లర్లలో ఎవరెవరి పాత్ర ఏమిటనే ప్లాన్ గురించి చెప్పాడు.

4వ తేదీ: వ్యూహం అమలు

ఉదయం 10 గంటలు కావస్తోంది. చల్లా బాబు అంగళ్లుకు వెళ్లారు. అక్కడ చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యాడు. ఇద్దరూ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఆపై చల్లా బాబు, అతని పీఏ గోవర్ధన్‌రెడ్డి, డ్రైవర్ నవీన్‌కుమార్‌తో కలిసి కారులో పుంగనూరు బయలుదేరారు. కారు మదనపల్లె దాటిన తర్వాత.. 'వీఐపీ కంటే మనం ముందుండాలి.. అక్కడ ఏం చేయాలో ముందుగా అనుకున్నట్లే అంతా జరగాలి' అని గోవర్ధన్‌రెడ్డిని చల్లా బాబు ఆదేశించాడు. 'అన్నా.. ఇదే జరిగితే పెద్ద గొడవలు జరుగుతాయి. పోలీసులు మనపై కేసులు పెడతారు. ఎట్లా అన్నా..' అని గోవర్ధన్‌రెడ్డి, చల్లా బాబును ప్రశ్నించినట్లు తెలిసింది. 'పోలీసులు పెట్టే కేసుల్ని కోర్టులో మన 'సార్' చూసుకుంటాడు..' అని చల్లా బాబు భరోసా ఇచ్చాడు. ఆపై జరిగిన విధ్వంసకాండలో చల్లా బాబు దగ్గరుండి మరీ టీడీపీ నేతల్ని రెచ్చగొట్టి.. పోలీసులను చంపేయండ్రా అంటూ, వాళ్ల వాహనాలను తగులబెట్టాలంటూ ఆదేశాలు ఇచ్చాడు.

మెడికల్ సీట్లు ఏటా పెంపు

- వైఎస్సార్ సీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు
- నీట్ రాసిన వారిలో 2.6% మందికే అవకాశమా అని ఎంపీ ఆవేదన
- 2013–14లో 51,348 సీట్లుంటే ఇప్పుడు 1,07,948కు పెంచామన్న కేంద్రం

సాక్షి, అమరావతి: దేశంలో మెడికల్ సీట్లు (ఎంబీబీఎస్) ఏటా పెంచుతున్నామని, వైద్య విద్య అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. లోకసభలో వైఎస్సార్సీపీ సభ్యుడు వైఎస్ అవినాశ్‌రెడ్డి వైద్య విద్య, నీట్, మెడికల్ సీట్ల అంశాలపై అడిగిన ప్రశ్నలకు కేంద్రం లిఖిత పూర్వక సమాధానమిస్తూ పలు అంశాలను వివరించింది. 2022 విద్యా సంవత్సరంలో నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు (నీట్) పరీక్షకు దేశవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులు హాజరవగా 2.6 శాతం మందికే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు దక్కాయని ఎంపీ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. దీనివల్ల లక్షలాది మంది విద్యార్థినీ విద్యార్థులు ఎంబీబీఎస్ వంటి ఉన్నత విద్యావకాశాలను అందుకోలేక తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎంపీ ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ.. 'ఎంబీబీఎస్‌లో ప్రవేశాల కోసం 2022లో దేశవ్యాప్తంగా 17,64,571 మంది నీట్ (యూజీ) పరీక్షకు హాజరయ్యారు. నేషనల్ మెడికల్ కమిషన్ సమాచారం ప్రకారం వీరిలో 95,313 మంది ఎంబీబీఎస్ సీట్లు పొందారు. వీరిలో 48,929 (2.77 శాతం) మంది ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశాలు పొందారు' అని వివరించింది. '2013–14 విద్యా సంవత్సరం నుంచి 2023–24 వరకు ఎంబీబీఎస్ సీట్లు 110 శాతం మేర పెరిగాయి. 2013–14 లో దేశవ్యాప్తంగా 51,348 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉన్నాయి. 2023–24 విద్యా సంవత్సరంలో వీటి సంఖ్య 1,07,948కు చేరింది. ఇందుకోసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపునుపెంచుతున్నాం బడ్జెట్‌లో విద్యకు 2021–22లో రూ.93,224.31 కోట్లు కేటాయించగా 2022–23లో 1,04,277.72 కోట్లు, 2023–24లో 1,12,899.47 కోట్లు కేటాయించినట్లు కేంద్రం పేర్కొంది.



మన మోడల్.. పీఎం శ్రీకారం!

సర్కారు బడుల్లో సాంకేతిక సొబగులకు కేంద్రం ఊతం

- పీఎంశ్రీ పథకంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి
- మొదటి దశకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో 44 స్కూళ్లు ఎంపిక
- మూడేళ్లలో దశలవారీగా రూ. 2 కోట్ల వరకూ నిధులు
- జిల్లాలోని పాఠశాలల్లో ఇప్పటికే కొనసాగుతున్న నాడు–నేడు పనులు





పీఎం శ్రీ పథకానికి ఎంపికైన విజయవాడలోని ఏకేటీపీఎం స్కూల్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏ సమాజమైన అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే విద్య అనేది ప్రధానమైన సాధనం. దేశంలో బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యక్తులను నిలబెట్టే దేవాలయం పాఠశాల. ఆ పాఠశాలల దశ, దిశను మార్చేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ (ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని తీసుకొచ్చింది. అందులో భాగంగా దేశవ్యాప్తంగా తొలిదశలో ఎంపిక చేసిన పాఠశాలలను ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంలో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో సిలబస్ మార్పుతో పాటు బోధనా పద్ధతులలో మార్పులు చేయనున్నారు. ప్రాథమిక, మాధ్యమిక, సెకండరీ లెవల్స్‌లో విద్యార్థులకు చదువు చెప్పే విధానంలో మార్పులు తీసుకొచ్చి, వారి భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

ఏపీ ప్రభుత్వ విధానాలే ప్రేరణ..

రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాడు –నేడు, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద వంటి పథకాలతో విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలు, ఖర్చు చేస్తున్న నిధులు దేశంలో మరే రాష్ట్రంలోనూ కనపడటం లేదు. ఇక్కడ అమలు చేస్తున్న ఈ పథకాలను ప్రేరణగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు చేపట్టిందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 44 పాఠశాలలు ఎంపిక

ఉమ్మడి కృష్ణాజిల్లాలో తొలి దశలో 44 పాఠశాలలను ఈ పథకంలో ఎంపిక చేశారు. కృష్ణాజిల్లాలో 27 పాఠశాలలు ఎంపిక చేయగా ఎన్టీఆర్ జిల్లాలో 17 పాఠశాలలను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. వీటికి సంబంధించి ఇప్పటికే జాయింట్ అకౌంట్లను ఓపెన్ చేశారు. ఈ వారంలో తొలి విడతగా రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరవుతాయని అధికారులు వివరించారు. అంతేకాకుండా రెండో దశకు దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెలాఖరు వరకూ కేంద్రం అవకాశమిచ్చింది. తదనుగుణంగా విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష అభియాన్ విభాగ అధికారులు దీనిపై దృష్టి సారించి ఆయా పాఠశాలలు దరఖాస్తు చేసుకునే విధంగా పరిశీలన చేస్తున్నారు.

ఆధునిక పాఠశాలలుగా మార్పు

ఈ పథకంలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో నాడు–నేడు పథకంలో జరిగిన అభివృద్ధితో పాటుగా మ్యాథ్స్‌ల్యాబ్, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే అటల్‌టింకరింగ్ ల్యాబ్‌లు లేని పాఠశాలల్లో వాటిని సైతం ఏర్పాటు చేస్తారు. వాటితో పాటుగా ఆధునిక తరగతి గదులు, స్పోర్ట్స్ ఎన్విరాన్‌మెంట్, ఆర్ట్ స్టూడియోస్‌ను ఏర్పాటు చేయనున్నారు. పర్యావరణ హితంగా ఈ పనులు జరగాలని కేంద్రం సూచించింది. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా పాఠశాలల్లో సిలబస్ మార్పులకు తగ్గట్లు పీఎం శ్రీ పథకం ద్వారా ఆధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. అంతేకాకుండా ఏడాదికొక తరగతి చొప్పున క్రమంగా విద్యార్థులకు ట్యాబ్‌లను సైతం పంపిణీ చేయనున్నారు. తదనుగుణంగా బోధనను ఆధునికీకరిస్తారు. ప్రతి ఏడాది ఒక తరగతికి చెందిన విద్యార్థులను స్టడీ టూర్లు తీసుకెళ్లటానికి కూడా ఇందులో నిధులు విడుదల చేస్తారు. అలాగే ఉపాధ్యాయులకు ప్రత్యేక బోధన సాగించేందుకు అవసరమైన శిక్షణను అందిస్తారు.

మూడేళ్లలో రెండు కోట్ల వరకూ నిధులు..

కేంద్ర ప్రభుత్వం ఎంపిక పాఠశాలల అభివృద్ధికి మూడేళ్ల పాటు ప్రణాళికాబద్ధంగా నిధులను మంజూరు చేస్తుంది. ఒక్కో పాఠశాలకు సుమారు రూ.60 లక్షల నుంచి రెండు కోట్ల వరకూ అందిస్తుంది. ఆయా పాఠశాలల అవసరాలు, సదుపాయాల కల్పన తదితర అంశాలను ప్రాధాన్యతా క్రమంలో నిధులను మంజూరు చేయనున్నారు.

పీఎంశ్రీ పథకంతో ఆధునిక వసతులు



పీఎం శ్రీ పథకంతో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆధునిక వసతులు సమకూరనున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలతో పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది. వాటికి తోడు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంతో మరిన్ని వసతులు రానున్నాయి. జిల్లాలో ఉన్న పాఠశాలలను ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవటానికి ప్రోత్సాహిస్తున్నాం. ఈ పథకంలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలలకు తొలి ప్రాధాన్యతగా ఎంపిక చేస్తున్నారు. రానున్న రోజుల్లో అధిక సంఖ్యలో పాఠశాలలు ఎంపికయ్యే అవకాశముంది.

– జి. మహేశ్వరరావు, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, సమగ్రశిక్ష, ఎన్టీఆర్‌జిల్లా

పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు రజతోత్సవం

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు–సికింద్రాబాద్‌ల మధ్య ఆరంభమైన పల్నాడు ఎక్స్‌ప్రెస్ నేటికి 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందని రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. స్థానిక గుంటూరు రైల్వే స్టేషన్‌లో బుధవారం తెల్లవారు జామున పల్నాడు ఎక్స్‌ప్రెస్ వద్దకు డీఆర్ఎం సంబంధిత అధికారులతో కలిసి స్వయంగా 25 కేజీల కేక్ కట్ చేసి ప్రయాణికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలు వంటివి అనేకం ఉన్నాయన్నారు. వాటిల్లో పల్నాడు రైలు ప్రధానంగా ప్రయాణికులకు అన్ని విధాల సౌకర్యంగా ఉందన్నారు. తెల్లవారు జామున 5.30 గంటలకు గుంటూరు–సికింద్రాబాద్‌కు బయలుదేరి రైలు తిరిగి సాయంత్రం 3.30 గంటలకు తిరుగు ప్రయాణం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ ప్రత్యేక కుంకుమార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ప్రతిరోజు ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించేందుకు దేవస్థాన వైదిక కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఈవో భ్రమరాంబ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు ప్రతి రోజు కొనసాగుతుందన్నారు. రూ. 1000 టికెట్టు కొనుగోలు చేసిన భక్తులు పూజలో పాల్గొనవచ్చన్నారు. ఈ పూజలో పాల్గొనే ఉభయదాతలకు అమ్మవారి డాలర్‌తో పాటు కుంకుమ ప్రసాదం, శేషవస్త్రం, రవిక, పెద్ద లడ్డూతో పాటు ఇద్దరికి రూ. 300 టికెట్ క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు.

గూడూరు గోడు.. తీరింది చూడు

- ఎనిమిదేళ్లుగా వేధిస్తున్న భూముల రిజిస్ట్రేషన్ సమస్యకు మోక్షం
- మంత్రి జోగి రమేష్ చొరవతో జీఓ జారీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



తహసీల్దార్ బీవీ ప్రసాద్‌ను సన్మానిస్తున్న కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణారావు

గూడూరు: రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ చొరవతో గూడూరులోని భూముల రిజిస్ట్రేషన్ సమస్యకు మోక్షం లభించింది. సుమారు ఎనిమిదేళ్లుగా తాము పడుతున్న ఇబ్బందులు తొలగిపోవడంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. గూడూరు గ్రామంలోని సర్వే నంబర్ 393/1లో సుమారు 260 ఎకరాల భూమిలో ఊరంతా విస్తరించి ఉంది. ఈ పరిధిలో 6,500 మంది నివసిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్‌లో ఉన్న మొత్తం భూమిని గ్రామ కంఠంగా నమోదు చేశారు. దీనిలోనే ప్రజల ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, గుడులు, మసీదులు, చర్చిలు, రోడ్లు అన్నీ ఉన్నాయి. అయితే అదే నంబర్‌లో ఉన్న దేవదాయ, వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకూడదన్న ఉద్దేశంతో సర్వే నంబర్ మొత్తాన్ని గత తెలుగుదేశం ప్రభుత్వం 22ఏలో చేర్చింది. దీంతో గ్రామంలోని ఇళ్ల, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఫలితంగా సుమారు ఎనిమిదేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిలిచిపోయిన క్రయవిక్రయాలు..

ఊళ్లో ఉన్న తమ ఆస్తులను అవసరం కోసం విక్రయించాలన్నా, పిల్లలకు రాయాలన్నా అవకాశం లేకుండా పోయింది. పిల్లల చదువులకు, పెళ్లిళ్లు చేయడానికి, రోగం వస్తే చికిత్స చేయించుకునేందుకు ఆస్తులు అక్కరకు రాకుండా పోయాయి. జాతీయ రహదారికి అనుకుని మంచి రేటు పలికే స్థలాలే అయినప్పటికీ కాగితాలు తనఖా పెట్టుకుని రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు కూడా ముందుకు రాలేదు. దీంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి చాలా మంది అప్పుల ఊబిలో కూరుకుపోయి తీవ్ర మానసిక క్షోభ అనుభవించారు.



గూడూరు మొయిన్ సెంటర్

ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి..

గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి జోగి రమేష్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే కలెక్టర్, ఎండోమెంట్ కమిషనర్, మైనార్టీ శాఖ కమిషనర్‌ల వద్దకు స్వయంగా వెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. దేవదాయ శాఖాధికారుల నుంచి సానుకూల స్పందన వచ్చినా.. వక్ఫ్‌బోర్డులో సమస్య పరిష్కారానికి కొంత సమయం పట్టింది. జోగి రమేష్ మంత్రి అయ్యాక సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు మైనార్టీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న పూర్వ కృష్ణా కలెక్టర్ ఏఎండీ ఇంతియాజ్ చొరవ తీసుకుని వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన ఆస్తులను సబ్ డివిజన్ చేసి మిగిలిన భూమిపై ఆంక్షలను ఎత్తివేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సంబరాలు చేసుకున్న ప్రజలు..

ఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కావడంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దార్ బి.వి జయప్రసాద్, డీటీ శివశంకర్‌లను సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, నాయకులు గొరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, లింగం సులోచనారాణి మంత్రి జోగి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పండగ - అలంకరణ









శ్రావణం.. పర్యావరణహితం

సంప్రదాయ వేడుకలకు వేదిక శ్రావణం. కళ కళలాడే వెలుగులను మోసుకువచ్చే మాసం. తీరైన శోభను తీర్చడానికి శ్రమతోపాటు డబ్బునూ ఖర్చు పెడతారు. ఎక్కువ కష్టపడకుండా పర్యావరణ స్నేహితంగా శ్రావణ మాస వ్రతాలకు, పూజలకు ఎకోఫ్రెండ్లీ థీమ్‌తో ఇంటిని అందంగా ఎలా తీర్చిదిద్దుకోవచ్చో హైదరాబాద్ వాసి డెకార్ నిపుణులు కల్పనా రాజేష్ ఇస్తున్న సూచనలు ఇవి..

ఆకులు అల్లుకున్న గోడ

ఎక్కడైతే వ్రతం పీట పెడతారో ఆ చోట గోడకు తమలపాకులు, విస్తరాకులు, మర్రి ఆకులను ఒక దానికి ఒకటి కుట్టి, సెట్ చేయవచ్చు. మధ్య మధ్యలో బంతిపూలు లేదా గులాబీలు అమర్చవచ్చు. లేదంటే, ఇరువైపులా దండ కట్టి వేలాడదీయవచ్చు. ఏది సహజంగా ఉంటుందో దానిని ఎంపిక చేసుకోవాలి. బ్యాక్‌డ్రాప్‌లో వెదురు బుట్టలను ఉపయోగించవచ్చు. ఈ బుట్టలకు పూల అలంకారం చేస్తే కళగా కనిపిస్తుంది. ఇప్పుడు చాలావరకు బ్యాక్ డ్రాప్‌లో వాడే కర్టెన్స్ ప్రింటెడ్‌వి వచ్చినవి వాడుతుంటారు. వాటిని ఎంపిక చేసుకుంటే మనం అనుకున్న థీమ్ రాదు. ఇక వీటిలో పాలియస్టర్‌వి వాడకపోవడం మంచిది. ఎకో థీమ్‌లో ఎంత పర్యావరణ హితంగా ఆలోచనను అమలు చేస్తే అంత కళ ఉట్టిపడుతుంది. రంగు రంగుల హ్యాండ్లూమ్ శారీస్‌ను కూడా బ్యాక్ డ్రాప్‌కి వాడచ్చు. వట్టివేళ్లతో తయారుచేసే తెరలు కూడా వాడచ్చు.







అందమైన తోరణం...

మామిడి ఆకులు చెట్టు నుంచి కోసిన తర్వాత కూడా ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. ఎలాగూ మామిడి ఆకులు తోరణం కడతారు. అలాగే, ఇప్పుడు వరికంకులతో తోరణాన్ని కట్టచ్చు. వీటిని వేడుక పూర్తయ్యాక మరుసటి రోజు బయట గుమ్మానికి అలంకారంగా వాడచ్చు. ఆ తర్వాత మట్టిలో వేస్తే ఎరువుగా మారిపోతుంది. అమ్మవారికి కట్టే చీర కూడా నారాయణ్‌పేట, ఇక్కత్ వంటి హ్యాండ్లూమ్ పట్టు చీర ఎంపిక చేసుకోవచ్చు. బ్యాక్ డ్రాప్ ఫ్రేమ్ చేసుకోవాలంటే మూడు వెదురు కర్రలు తీసుకొని, క్లాత్, అరటి ఆకులతో సెట్ చేయవచ్చు.

అతిథులకు ఎకో కానుక

మార్కెట్లో వెదురు బుట్టలు దొరుకుతున్నాయి. పండ్లు, పూలు వంటివి ఈ బుట్టల్లో సెట్ చేయవచ్చు. అతిథులకు అందజేయడానికి ఇవి బాగుంటాయి. రసాయనాలు కలపని ఆర్గానిక్ పసుపు, కుంకుమ ఎంచుకోవాలి. చేనేత బ్లౌజ్ పీస్ పెడితే గిఫ్ట్ ప్యాక్ రెడీ అవుతుంది. మన దగ్గర ఉన్న పర్యావరణ వస్తువులను సరిచూసుకొని, వాటితో ఎలా అలంకరణను పెంచుకోవచ్చనేది ముందుగా ఆలోచించి, ఆ విధంగా సిద్ధంగా చేసుకుంటే సంతృప్తికరమైన డిజైన్ వస్తుంది. పువ్వులు ఎక్కువ సేపు తాజాగా ఉండటానికి కెమికల్ స్ప్రే చేస్తుంటారు. థర్మోకోల్ మీద ఆకులు పెట్టి చాలా మంది ఎకో ఫ్రెండ్లీ అంటుంటారు. కానీ, మనం ఎంచుకునే థీమ్ మొత్తం తిరిగి మట్టిలో కలిసిపోయే విధంగా ఉంటేనే అది పర్యావరణ హితం అవుతుంది.



– కల్పనా రాజేశ్,
డెకార్‌బై కృష్ణ నిర్వాహకురాలు









ఇత్తడి బిందెలు .. గంటలు

ఇంట్లో బిందెలు ఉంటాయి కదా... వాటిలో మట్టిని నింపి, అరటి చెట్లను సెట్ చేసుకోవచ్చు. స్టీల్ బిందె అయితే నచ్చిన క్లాత్ చుట్టి, మట్టి నింపితే చాలు. కుందులు జత అడుగు పొడవు ఉన్నవి ఎంచుకొని, రెండు వైపులా అమర్చుకోవచ్చు. ఒక వెడల్పాటి పాత్రలో బియ్యం నింపి, మధ్యలో కొబ్బరిపువ్వు సెట్ చేసి పెడితే ఎంతో అందంగా వచ్చేస్తుంది. అమ్మవారికి మల్లెపూల దండ, కలువపువ్వు మంచి కాంబినేషన్. లేదంటే గులాబీలు పెట్టుకోవచ్చు. గుమ్మం దగ్గర రెండు వైపులా పాత కాలం నాటి ఇత్తడి పాత్రలు ఉంటే వాటిలో మొక్కలు పెట్టవచ్చు. ఇత్తడి గంటలు ఉంటే వాటిని డెకార్ ప్లేస్‌లో అలంకారంగా వేలాడదీయవచ్చు. అరటిగెల పెట్టచ్చు.

ప్లాస్టిక్‌కు నో ఛాన్స్

ప్లాస్టిక్ పువ్వులతో వచ్చే అనర్థాలు ఎన్నో. వీటి బదులుగా బంతి, చామంతి, గులాబీ, కొబ్బరి ఆకుతో చేసిన దండలను, కాటన్ దారాలు ఉపయోగించవచ్చు. రంగవల్లికల కోసం రసాయన రంగులు వాడకుండా పువ్వులతో ముగ్గులు వేయచ్చు. ఆర్గానిక్ కలర్స్ వాడుకోవచ్చు. కింద కూర్చోవడానికి కోరాగ్రాస్ చాపలు, కలంకారీ, షోలాపూర్ బెడ్‌షీట్స్ వాడచ్చు.

బొమ్మలతో భలే..

తెలుగు రాష్ట్రాల్లో మనవైన బొమ్మలు ఉన్నాయి. కొండపల్లి, నిర్మల్, చేర్యాల మాస్క్స్... ఆ బొమ్మలు పెట్టి కూడా అలంకారం చేసుకోవచ్చు. బ్రాస్ ఖరీదు ఎక్కువ అనుకుంటే టెర్రకోట ప్లాంటర్స్, గుర్రపు బొమ్మలు, మట్టి ప్రమిదలు, రంగురంగు గాజులు... వాడవచ్చు.

మెంటల్ హెల్త్

మానసిక అనారోగ్యం వెంటనే తెలియదు. తమకు మానసిక అనారోగ్యం ఉంది అని చాలామంది తామే అంగీకరించరు. కుటుంబ సభ్యులు గమనించినా నామోషి వల్ల వైద్యుని దగ్గరకు తీసుకెళ్లరు. 'వైద్యులే ఇంటింటికి వెళ్ళి చెక్ చేస్తే చాలా సమస్యలు తెలుస్తాయి' అంటుంది ఇరా ఖాన్. ఆమిర్ ఖాన్ కూతురైన ఇరా ఖాన్ మానసిక సమస్యలతో బాధ పడుతూ తనలా బాధ పడేవారి కోసం 'అగత్సు ఫౌండేషన్' స్థాపించి మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతను ప్రచారం చేస్తోంది.



తండ్రి ఆమిర్‌ఖాన్‌తో ఇరా ఖాన్

మనసు కలతకు మందు ఉంది

బాంద్రాలోని పాలీ విలేజ్‌లో ఉంటుంది రెండంతస్తుల అగత్సు ఫౌండేషన్. ముంబైలో ముఖ్యంగా బాంద్రాలో ఉన్న మానసిక సమస్యల బాధితులు అక్కడికి వచ్చి సహాయం పొందవచ్చు. చుట్టుపక్కల బస్తీల్లో ఉన్నవారు కూడా వచ్చి అందులోని కమ్యూనిటీ సెంటర్‌లో వైద్య సహాయం పొందవచ్చు. నిజానికి మానసిక వైద్యం, కౌన్సిలింగ్, థెరపీ కొంచెం ఖరీదుతో కూడినవి. కాని ఇక్కడ 50 రూపాయల నుంచి 750 రూపాయల లోపు ఎంతైనా ఫీజు కట్టవచ్చు. ఇక్కడ నలుగురు సైకియాట్రిస్ట్‌లు ఉంటారు. వైద్యసూచనలు చేస్తారు. దీనికి తోడు నిర్ణీత రోజులలో బాంద్రాలో డోర్ టు డోర్ తిరిగి ఇళ్లల్లో ఉన్నవాళ్ల మానసిక సమస్యలను తెలుసుకుని వైద్య సహాయం ఎంత అవసరమో చెబుతారు. ఈ పనులన్నీ మంచి ఫలితాలను ఇస్తున్నాయి. అగత్సు ఫౌండేషన్ స్థాపించి ఈ పనంతా చేస్తున్న వ్యక్తి ఇరా ఖాన్. ఆమిర్ ఖాన్– రీనా దత్తా (మొదటి భార్య)ల కుమార్తె. 'శరీరానికే కాదు.. మనసుకూ గాయాలవుతాయి. ఆ గాయాల వల్ల మనసు ప్రభావితం అవుతుంది. దానికి సరైన వైద్య సహాయం అందాలి' అంటుంది ఇరా ఖాన్.



● ఇరా ఖాన్

స్వయంగా బాధితురాలు

'మా కుటుంబంలో మానసిక సమస్యలు ఉన్నాయి. నా మానసిక సమస్యకు అనువంశికత కొంత కారణం అనుకుంటాను. నాకు 12వ ఏట స్కూల్లో ఉన్నప్పటి నుంచే డిప్రెషన్ సూచనలు కనిపించాయి. అయితే గుర్తించలేదు. ఇంటర్ తర్వాత నెదర్లాండ్స్‌లో లిబరల్ ఆర్ట్స్ చదవడానికి వెళ్లినప్పుడు నేను తీవ్ర డిప్రెషన్‌తో బాధ పడ్డాను. రోజంతా ఏడుస్తూ... నిద్రపోతూ ఉండేదాన్ని. నా డిప్రెషన్‌కు నా తల్లిదండ్రుల విడాకులు వేసిన ప్రభావం కూడా కారణం కావచ్చు. అక్కడ నేను చదువు డిస్కంటిన్యూ చేసి ఇండియా వచ్చి ఒక సంవత్సరం బ్రేక్ తీసుకున్నాను. మళ్లీ వెళ్లి జాయిన్ అయినా చదవలేకపోయాను. 2018లో చదువు మానేసి ఇండియా వచ్చేశాను. ఇక్కడకు వచ్చాక నా బాధ లోకానికి చెప్పాలనిపించింది. 2019లో మొదటిసారి నా డిప్రెషన్ గురించి చెప్పాను. ఇందుకు నా తల్లిదండ్రులు అడ్డు చెప్పలేదు. నాకు వారెంతో సపోర్ట్‌గా నిలిచారు. అంతేకాదు మానసిక ఆరోగ్యం విషయంలో చాలా మంది చూపే నిర్లక్ష్యానికి ముగింపు పలికే చైతన్యం కోసం పని చేయాలంటే అందుకూ సపోర్ట్ చేశారు. అలా ఈ అగత్సును మొదలెట్టాను' అని తెలిపింది ఇరా ఖాన్.

మానసిక శుభ్రత

'మనందరికీ శారీరక శుభ్రత తెలుసు. అలాగే మానసిక శుభ్రత కూడా ఉండాలి. భావోద్వేగాల శుభ్రత ఉండాలి. నా విషయమే చూడండి... డబ్బుంది.. తల్లిదండ్రుల సపోర్ట్ ఉంది... మంచి వైద్య సహాయం ఉంది... అయినా సరే డిప్రెషన్ నన్ను చావగొట్టింది. అలాంటిది పై మూడింటిలో ఏది లేకపోయినా అలాంటి వారు ఎంత బాధ పడుతుంటారో అర్థం చేసుకోవాలి. ప్రభుత్వ పరంగా, ప్రయివేటుగానూ ప్రజల మానసిక ఆరోగ్యం గురించి చేయవలసిన పని చాలా ఉంది. యాంగ్జయిటీ, డిప్రెషన్ వంటి వాటిని మనసును శుభ్రం చేసుకోవడం వల్ల తొలగించుకోవాలి. ఇందుకు చేయవలసిన పనులతో పాటు మందులు కూడా తీసుకోవాల్సి రావచ్చు. మేం ఏం చేస్తామంటే ఒక మానసిక సమస్యతో బాధపడుతున్నవారిని అలాంటి సమస్యతోనే బాధ పడుతున్నవారితో కలుపుతాము. వారంతా ఒక కమ్యూనిటీ అవుతారు. ఒకరికొకరం సాయంగా దీనిపై పోరాడవచ్చనే ధైర్యం తెచ్చుకుంటారు. ఆ విధంగా మేము పని చేస్తాం' అంటుంది ఇరా ఖాన్.

గమనించుకోవాలి

'మానసిక సమస్యలు పునరావృత్తం అవుతుంటాయి. మీరు ఏం చేస్తే సమస్య అధికమవుతుంది, ఏం చేయకపోతే సమస్య తక్కువ అవుతుంది గమనించుకోవాలి. ఎన్ని రోజులకొకమారు సమస్య కనపడుతూ ఉంది... ఎన్నాళ్లకు దూరమవుతుంది ఇదంతా గమనించుకుని మనకు మనమే సమస్యపై పోరాడాలి. మంచి నిద్ర అలజడి తగ్గిస్తుంది. నిద్ర సరిగా పట్టేలా చూసుకోవాలి' అంటుంది ఇరా ఖాన్.

మానసిక సమస్యలను దాచుకోవద్దని, అవి శారీరక సమస్యల్లాంటివేనని చెబుతోంది ఇరా ఖాన్. 'సెలబ్రిటీ కూతురినై ఉండి నేను బయటకు చెప్పినప్పుడు మీరు కూడా చెప్పండి. సహాయం పొందండి' అని కోరుతోందామె.

బ్యూటిప్

దానిమ్మ తొక్క పారేయకండోయ్!

దానిమ్మ గింజలు తిని తొక్క పారేస్తుంటాం. దానిమ్మ గింజల్లో కంటే తొక్కలోనే యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే తొక్కను ఎలా వాడుకోవచ్చో చూద్దాం...

- దానిమ్మ తొక్కలను ఎండలో ఆరబెట్టాలి. చక్కగా ఎండిన తరువాత పొడిచేసి నిల్వచేసుకోవాలి.
- టేబుల్‌స్పూను దానిమ్మ పొడిలో అరటేబుల్ స్పూను నిమ్మరసం, అరటేబుల్ స్పూను తేనె వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు స్క్రబ్బర్‌లా రుద్ది కడగాలి. ఈ స్క్రబర్ వల్ల మృతకణాలు , ట్యాన్ తొలగి ముఖ చర్మం మృదువుగా మారుతుంది.



- దానిమ్మ తొక్కలో అధికంగా యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి కాబట్టి...తొక్కలను శుభ్రంగా కడిగి రసం తీసి తాగితే , ఆరోగ్యానికి మంచిది.
- కప్పు నీటిలో టీస్పూను దానిమ్మ పొడి, అరచెక్క నిమ్మరసం వేసి తాగినా మంచిదే.

సైబర్ టాక్



సర్కారు డబ్బులు వచ్చాయా?

ఇదో రకం సైబర్ మోసం

'సరోజిని ఇంట్లో పని చేసుకుంటుంటే ఫోన్ మోగింది. చేస్తున్న పని వదిలేసి, ఫోన్ అందుకుంది. గవర్నమెంట్ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నామనగానే తమ పొదుపు సంఘం గురించే అని, అవతలి వాళ్లు చెప్పేది వినడానికి చెవులు రిక్కించింది. 'ప్రభుత్వం నుంచి వచ్చే పథకం మొత్తం డబ్బులు బ్యాంకులో జమ అయ్యాయా' అని అడిగారు అవతలి నుంచి. 'ఇంకా రాలేదు సార్! వచ్చాక చెబుతా!' అంది సరోజిని. 'అంటే, మీరు వడ్డీ డబ్బులు కట్టలేదు. వడ్డీ వెంటనే కడితే వచ్చే మొత్తం జమ అవుతుంది, లేదంటే లేదు' అని చెప్పడంతో కంగారు పడింది. 'మా సంఘం వాళ్లందరినీ అడిగి చెబుతాను' అంటే 'అంత టైమ్ లేదు ఇప్పుడే కట్టేయాలి. అనడంతో తన ఖాతా నెంబర్, ఫోన్‌కి వచ్చిన నెంబర్ చెప్పింది. ఆ తర్వాత ఫోన్ కట్ అయ్యింది. అంతలో అదే బృందంలో ఉండే కమల పరిగెత్తుకుంటూ వచ్చి, 'బ్యాంక్ వాళ్లు ఫోన్ చేశారు, ఆ తర్వాత వాళ్లేదో ఓటీపీ అని అడిగారు. చెప్పగానే నా ఖాతాలో పన్నెండు వేల రూపాయలు కట్ అయ్యాయి. అవి మళ్లీ వస్తాయా?!' అని అడిగింది. అప్పుడే సరోజిని అకౌంట్ నుంచి పదివేల రూపాయలు కట్ అయినట్టు మెసేజ్ వచ్చింది.

చూశారుగా... సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసాలు ఇవి. అమాయక మహిళలను లక్ష్యంగా చేసుకుని ఖాతాలో ఉన్నదంతా దోచుకుంటున్న ఈ నేరగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలంటే ఏం చేయాలో చెబుతున్నారు సైబర్ నిపుణులు.

అనుమానం రాకుండా దోపిడీ..

- సైబర్ నేరగాళ్లు తాము ప్రభుత్వ కార్యాలయం నుండి మాట్లాడుతున్నామంటారు.
- ప్రభుత్వ పథకాల పేరిట పొదుపు సంఘాల మహిళలకు ఫోన్ చేసి తెలుగు భాషలో మాట్లాడుతుంటారు.
- వెంటనే వడ్డీ చెల్లిస్తే ఆ మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందని చెబుతారు.
- మీ ఖాతాలో కొంత నగదు నిల్వ ఉండాలని పొదుపు సంఘాల మహిళలకు ఫోన్లు చేస్తుంటారు.
- 'తమ ఖాతాలో నగదు నిల్వ లేదు' అని మహిళలు చెబితే 'ప్రభుత్వం డబ్బులు ఇస్తామన్నా.. మీ ఖాతాలో డబ్బులు లేకపోవడం ఏంటని, బ్యాంకులో తగినంత నగదు లేకపోతే పథకం డబ్బులు రావని చెబుతుంటారు.
- నేరగాళ్ల మాటలు నమ్మి, మహిళలు తమ స్మార్ట్ ఫోన్‌లోని మనీ యాప్స్ ద్వారా డబ్బులు చెల్లిస్తుంటారు.

ఇలాంటి ఫోన్ కాల్స్ వస్తే ఏ మాత్రం నమ్మకూడదు. మోసగాళ్ల బారిన పడి మీ కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దు. బ్యాంక్ ఖాతా, వ్యక్తిగత వివరాలు, ఓటీపీ వంటివి ఎవరికీ చెప్పకూడదు. ఈ సైబర్ మోసాల పట్ల గ్రామీణ మహిళలు అవగాహన పెంచుకోవాలి. తెలిసిన వారు గ్రామీణ మహిళలను సైబర్ నేరాల పాలిటపడకుండా అప్రమత్తంగా ఉండాలనే విషయాలను తెలియజేయాలి.

వెబ్‌సైట్ అయితే..

ప్రభుత్వ సైట్‌లు.. అంటే, ఆయుష్మాన్ యోజన, కిసాన్ యోజన, జన్ ధన్ యోజన వంటి పోర్టల్‌లు, అనేక నకిలీ వెబ్‌సైట్‌లు ప్రజలను మోసగించడానికి స్కామర్‌లకు సాధారణ పద్ధతిగా మారాయి. ఈ మోసపూరిత వెబ్‌సైట్‌లు తరచుగా అధికారిక ప్రభుత్వ పోర్టల్‌ల రూపకల్పన, కంటెంట్‌ను అనుకరిస్తాయి. వారు ప్రభుత్వ పథకాలపై ప్రజల నమ్మకాన్ని క్యాష్ చేసుకుంటారు.

అటువంటి స్కామ్‌ల బారిన పడకుండా ఉండటానికి, మీరు తీసుకోవలసిన కొన్ని చర్యలు:

- అధికారిక ప్రభుత్వ డొమైన్‌తో సరిపోలుతుందని నిర్ధారించుకోవడానికి వెబ్‌సైట్ యుఆర్‌ఎల్‌ని చెక్ చేయాలి. ప్రభుత్వ వెబ్‌సైట్‌లు సాధారణంగా భారత దేశంలో ".gov.in" వంటి స్థిరమైన డొమైన్ నిర్మాణాన్ని కలిగి ఉంటాయి. డొమైన్‌లో అక్షరదోషాలు లేదా వైవిధ్యాలు ఉన్న వెబ్‌సైట్‌ల పట్ల జాగ్రత్తగా ఉండండి.
- వినియోగదారుల డేటాను రక్షించడానికి చట్టబద్ధమైన వెబ్‌సైట్‌లు సురక్షిత కనెక్షన్‌లను (HTTP) ఉపయోగిస్తాయి. సైట్ సురక్షితంగా ఉందని నిర్ధారించుకోవడానికి అడ్రస్ బార్ లో ప్యాడ్‌లాక్ చిహ్నాన్ని తనిఖీ చేయాలి.
- అధికారిక మూలాలు: అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్‌లు లేదా అధికారిక కమ్యూనికేషన్ ఛానెల్‌లలో అందించిన సమాచారం, లింక్‌లను మాత్రమే నమ్మాలి. లింక్‌లపై క్లిక్ చేయడం లేదా అనుమానాస్పద ఈ-మెయిల్స్, మెసేజ్‌లు లేదా సోషల్ మీడియా పోస్ట్‌ల నుండి సమాచారాన్ని షేర్ చేయడం మానుకోవాలి.
- మీకు ఆసక్తి ఉన్న ప్రభుత్వ పథకాన్ని అధికారిక మూలాల నుండి నేరుగా పరిశోధించాలి. ఇది మీకు అర్హత ప్రమాణాలు, ప్రయోజనాలు, దరఖాస్తు ప్రక్రియపై స్పష్టమైన అవగాహనను ఇస్తుంది. తెలియని వెబ్‌సైట్‌ల సమాచారంపై మాత్రమే ఆధారపడకూడదు.
- పథకం లేదా ఆఫర్ ప్రామాణికత గురించి మీకు ఖచ్చితంగా తెలియకుంటే, వివరాలను ధృవీకరించడానికి సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారిక హెల్ప్‌లైన్ లేదా కస్టమర్ సేవను సంప్రదించాలి.
- ప్రభుత్వ పథకాలకు సాధారణంగా రిజిస్ట్రేషన్ లేదా దరఖాస్తు కోసం ఎలాంటి ముందస్తు చెల్లింపులు అవసరం లేదు. ఏదైనా ప్రయోజనాన్ని అందించే ముందు ఫీజు చెల్లించమని వెబ్‌సైట్ మిమ్మల్ని అడిగితే జాగ్రత్త పడాలి.
- ఆఫర్ నిజం కానంత మంచిగా అనిపిస్తే, అది బహుశా అలానే ఉంటుంది. స్కామర్‌లు బాధితులను తమ ఉచ్చులోకి లాగేందుకు తరచుగా మనోహరమైన వాగ్దానాలను ఉపయోగిస్తారు.
- ఈ మోసాల గురించి మీ స్నేహితులు, కుటుంబ సభ్యులు కూడా బాధితులుగా పడకుండా వారికి అవగాహన కల్పించండి.
- మోసపోయామని గ్రహిస్తే బాధితులు వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు తెలియజేయాలి. 1930కి కాల్ చేయవచ్చు. https://www.cybercrime.gov.in ద్వారా రిపోర్ట్ చేయవచ్చు.



ఇన్‌పుట్స్:
అనిల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



అంతర్జాతీయ క్రికెట్‌కు వహాబ్ రియాజ్ గుడ్‌బై

ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచైజీ టి20 లీగ్‌లపై మరింత దృష్టి సారించేందుకు... పాకిస్తాన్ సీనియర్ పేస్ బౌలర్ వహాబ్ రియాజ్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. 38 ఏళ్ల వహాబ్ పాకిస్తాన్ తరఫున 27 టెస్టులు ఆడి 83 వికెట్లు, 91 వన్డేలు ఆడి 120 వికెట్లు, 36 టి20లు ఆడి 34 వికెట్లు పడగొట్టాడు. 2008లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన వహాబ్ పాక్ తరఫున చివరిసారి 2020 డిసెంబర్‌లో న్యూజిలాండ్‌పై ఆడాడు. మొహాలీలో భారత జట్టుతో జరిగిన 2011 వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో వహాబ్ ఐదు వికెట్లతో ఆకట్టుకున్నాడు.

పృథ్వీ షాకు గాయం... వన్-డే కప్ నుంచి అవుట్



ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో భారత క్రికెటర్ పృథ్వీ షా ఆట కేవలం 10 రోజుల్లోనే ముగిసింది. 23 ఏళ్ల పృథ్వీ షా వన్-డే కప్ టోర్నీలో నార్తంప్టన్‌షైర్ క్లబ్ తరఫున బరిలోకి దిగాడు. నాలుగు మ్యాచ్‌లు (125 నాటౌట్, 244, 26, 34) ఆడి 429 పరుగులు సాధించాడు. డర్హమ్ జట్టుతో జరిగిన నాలుగో మ్యాచ్ సందర్భంగా పృథ్వీ షా ఫీల్డింగ్ చేస్తూ మోకాలి గాయానికి గురయ్యాడు. గాయం తీవ్రత దృష్ట్యా ఈ సీజన్‌లోని మిగతా మ్యాచ్‌లకు దూరమయ్యాడు.

మోహిత్‌కు స్వర్ణం



అమ్మాన్ సిటీ (జోర్డాన్): ప్రపంచ అండర్-20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. బుధవారం జరిగిన పురుషుల ఫ్రీస్టయిల్ 61 కేజీల విభాగంలో మోహిత్ కుమార్ పసిడి పతకాన్ని సాధించాడు. ఫైనల్లో మోహిత్ 9-8 పాయింట్ల తేడాతో ఎల్దర్ అఖమదునినోవ్ (రష్యా)పై గెలుపొందాడు. పల్వీందర్ చీమా (2001), రమేశ్ కుమార్ (2001), దీపక్ పూనియా (2019) తర్వాత ప్రపంచ అండర్-20 చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలిచిన నాలుగో భారతీయ రెజ్లర్‌గా మోహిత్ గుర్తింపు పొందాడు. భారత్‌కే చెందిన జైదీప్ (74 కేజీలు), దీపక్ చహల్ (97 కేజీలు) కాంస్య పతకాలు నెగ్గగా... సాగర్ (79 కేజీలు) రజతం సాధించారు. మహిళల 76 కేజీల విభాగంలో భారత రెజ్లర్ ప్రియా ఫైనల్లోకి దూసుకెళ్లింది.

రెండో గేమ్‌లో అర్జున్ ఓటమి



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో భారత్‌కు ఒక పతకం ఖరారైంది. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్, తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మధ్య క్వార్టర్ ఫైనల్ టైబ్రేక్‌కు దారి తీసింది. వీరిద్దరిలో ఒకరు సెమీఫైనల్ చేరనుండటంతో భారత్‌కు కనీసం కాంస్య పతకం ఖరారైంది. అర్జున్‌తో తొలి గేమ్‌లో ఓడిపోయిన ప్రజ్ఞానంద బుధవారం జరిగిన రెండో గేమ్‌లో నల్ల పావులతో ఆడుతూ 75 ఎత్తుల్లో నెగ్గాడు. దాంతో వీరిద్దరు 1-1తో సమఉజ్జీగా నిలిచారు. వీరిద్దరి మధ్య విజేతను నిర్ణయించేందుకు నేడు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహిస్తారు. భారత గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, విదిత్ సంతోష్ గుజరాతి పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) 1.5-0.5తో గుకేశ్‌పై, నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్) 1.5-0.5తో విదిత్‌పై, కరువానా (అమెరికా) 1.5-0.5తో లీనియర్ (అమెరికా)పై గెలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించారు.

పసిడి పోరుకు భారత జట్లు



అదితి స్వామి, పర్ణీత్ కౌర్, జ్యోతి సురేఖ



ప్రథమేశ్, ఓజస్ దేవ్‌తలే, అభిషేక్ వర్మ

- ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4 టోర్నీ
- సెమీస్‌లో బ్రిటన్‌పై పాయింట్ తేడాతో నెగ్గిన జ్యోతి సురేఖ బృందం
- దక్షిణ కొరియాపై షూట్ ఆఫ్‌లో గెలిచిన ఓజస్ త్రయం

పారిస్: ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో కనబరిచిన జోరును భారత ఆర్చర్లు ప్రపంచకప్ స్టేజ్-4 టోర్నీలోనూ కొనసాగించారు. బుధవారం జరిగిన కాంపౌండ్ విభాగం టీమ్ ఈవెంట్స్‌లో భారత మహిళల, పురుషుల జట్లు స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించాయి. ఆంధ్రప్రదేశ్ స్టార్ ప్లేయర్ వెన్నం జ్యోతి సురేఖ, ప్రపంచ చాంపియన్ అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు సెమీఫైనల్లో 234-233తో ఎల్లా గిబ్సన్, లేలా అనిసన్, ఇసాబెల్ కార్పెంటర్‌లతో కూడిన బ్రిటన్ జట్టును ఓడించింది. శనివారం జరిగే ఫైనల్లో మెక్సికో జట్టుతో భారత్ బృందం తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో మెక్సికో 234-233తో దక్షిణ కొరియాపై గెలిచింది. క్వాలిఫయింగ్‌లో అగ్రస్థానంలో నిలిచి టాప్ సీడ్ హోదాలో నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన భారత జట్టు 233-230 ఎస్తోనియా జట్టును ఓడించింది.

మరోవైపు ప్రపంచ చాంపియన్ ఓజస్ దేవ్‌తలే, అభిషేక్ వర్మ, ప్రథమేశ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కూడా బంగారు పతకంపై గురి పెట్టింది. తొలి రౌండ్‌లో భారత జట్టు 239-235తో ఇటలీపై గెలిచింది. క్వార్టర్ ఫైనల్లో టీమిండియా 237-235తో మెక్సికో జట్టును ఓడించింది. భారత్, టాప్ సీడ్ దక్షిణ కొరియా జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్లో నాలుగు సిరీస్‌ల తర్వాత రెండు జట్లు 235-235తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు 'షూట్ ఆఫ్' అనివార్యమైంది. 'షూట్ ఆఫ్'లోనూ రెండు జట్లు 30-30తో సమంగా నిలిచాయి. అయితే కొరియా ఆర్చర్లతో పోలిస్తే భారత ఆర్చర్ ఓజస్ దేవ్‌తలే కొట్టిన బాణం కేంద్ర బిందువుకు అతి సమీపంలో ఉండటంతో భారత జట్టును విజేతగా ప్రకటించారు. రెండో సెమీఫైనల్లో అమెరికా 238-234తో డెన్మార్క్‌పై గెలిచి శనివారం జరిగే స్వర్ణ పతక మ్యాచ్‌లో భారత్‌తో పోటీపడేందుకు సిద్ధమైంది.

రెండో రౌండ్‌లో ధీరజ్

బుధవారం జరిగిన పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్‌తోపాటు అతాను దాస్ రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్‌లో ధీరజ్ 6-2తో ఇమాదిద్దీన్ బాక్రి (అల్జీరియా)పై, అతాను దాస్ 6-0తో ఎలైన్ వాన్ స్టీన్ (బెల్జియం)పై గెలుపొందారు. భారత్‌కే చెందిన మృణాల్ చౌహాన్ 3-7తో ఫ్లోరియన్ ఫాబెర్ (స్విట్జర్లాండ్) చేతిలో, తుషార్ ప్రభాకర్ 2-6తో పీటర్ బుకువాలస్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయారు. రికర్వ్ క్వాలిఫయింగ్ టీమ్ ర్యాంకింగ్ రౌండ్‌లో భారత జట్టు 2034 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. దాంతో భారత జట్టుకు నేరుగా రెండో రౌండ్‌లోకి 'బై' లభించింది.

రూ. 832 కోట్లు!

సౌదీ క్లబ్ 'అల్ హిలాల్'తో నెమార్ ఒప్పందం

రియాద్: ప్రపంచ స్టార్ ఫుట్‌బాల్ ఆటగాళ్ల కోసం కోట్లాది డాలర్లతో సౌదీ అరేబియా క్లబ్‌లు క్యూ కడుతున్నాయి. ఎంత భారీ మొత్తమైనా చెల్లించి సొంతం చేసుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే క్రిస్టియానో రొనాల్డో (అల్ నాసర్) ఇక్కడి లీగ్‌లో ఆడుతుండగా ఇప్పుడు మరో టాప్ ప్లేయర్ నెమార్ ఈ జాబితాలో చేరాడు. ఈ బ్రెజిల్ ఆటగాడితో తాజాగా సౌదీ క్లబ్ 'అల్ హిలాల్' ఒప్పందం కుదుర్చుకుంది. ఇందు కోసం నెమార్‌కు వార్షిక వేతనంగా 100 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 832 కోట్లు) చెల్లించనున్నట్లు సమాచారం. దీంతో పాటు ఇతర సౌకర్యాలూ నెమార్‌కు లభిస్తాయి.



గత ఆరు సీజన్లుగా పారిస్ సెయింట్ జర్మయిన్ (పీఎస్‌జీ) క్లబ్ తరఫున నెమార్ ఆడాడు. తాజా పరిణామాల్లో భాగంగా ట్రాన్స్‌ఫర్ ఫీ కింద పీఎస్‌జీ క్లబ్‌కు అల్ హిల్ మరో 98 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 819 కోట్లు) కూడా చెల్లించనుంది. గాయాలతో ఇబ్బంది పడుతూ గత కొంత కాలంగా ఫామ్ కోల్పోయిన నెమార్‌కు ఇంత భారీ మొత్తం చెల్లించేందుకు అల్ హిలాల్ ముందుకు రావడం విశేషం.

విజేత వ్రిత్తి అగర్వాల్



భువనేశ్వర్: జాతీయ సబ్ జూనియర్, జూనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు తెలంగాణకు ఒక స్వర్ణం, రెండు కాంస్య పతకాలు లభించాయి. బాలికల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో తెలంగాణ అమ్మాయి వ్రిత్తి అగర్వాల్ విజేతగా నిలిచింది. వ్రిత్తి 17 నిమిషాల 44:33 సెకన్లలో గమ్యానికి చేరి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. గ్రూప్-2 బాలికల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో సాగి శ్రీనిత్య (తెలంగాణ), గ్రూప్-2 బాలికల 50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో మిట్టపల్లి రిత్విక (తెలంగాణ) కాంస్య పతకాలు సాధించారు.

తొలిసారి ఫైనల్లో ఇంగ్లండ్



సిడ్నీ: మహిళల ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో ఈసారి కొత్త జట్టు చాంపియన్‌గా అవతరించనుంది. బుధవారం జరిగిన రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్ 3-1 గోల్స్ తేడాతో ఆతిథ్య ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. తద్వారా మూడో ప్రయత్నంలో ఆ జట్టు తొలిసారి ఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. 2015, 2019 టోర్నీల్లో ఇంగ్లండ్ జట్టు సెమీఫైనల్లో ఓడిపోయింది. ఇంగ్లండ్ తరఫున ఎల్లా టూన్ (36వ ని.లో), లౌరెన్ హెంప్ (71వ ని.లో), అలెసియా రుసో (90+4వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... ఆస్ట్రేలియా జట్టుకు సామ్ కెర్ (63వ ని.లో) ఏకైక గోల్‌ను అందించింది. ఆదివారం జరిగే ఫైనల్లో స్పెయిన్‌తో ఇంగ్లండ్ తలపడుతుంది. మంగళవారం జరిగిన తొలి సెమీఫైనల్లో స్పెయిన్ 1-0తో స్వీడన్ జట్టును ఓడించింది. ఇప్పటి వరకు ఎనిమిదిసార్లు ప్రపంచ కప్ టోర్నీ జరగ్గా... నాలుగుసార్లు అమెరికా (1991, 1999, 2015, 2019)... రెండుసార్లు జర్మనీ (2003, 2007), ఒక్కోసారి నార్వే (1995), జపాన్ (2011) జట్లు టైటిల్ సాధించాయి.

కోస్టల్ రైడర్స్ శుభారంభం



విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ రెండో సీజన్ తొలి మ్యాచ్‌లో కోస్టల్ రైడర్స్ జట్టు 12 పరుగుల తేడాతో బెజవాడ టైగర్స్ జట్టుపై గెలిచి శుభారంభం చేసింది. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. మన్యాల ప్రణీత్ (31; 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ షేక్ రషీద్ (20; 4 ఫోర్లు), మద్దిల హర్షవర్ధన్ (32; 2 ఫోర్లు, 1 సిక్స్), మిట్టా లేఖజ్ రెడ్డి (26; 5 ఫోర్లు), పాథూరి మనోహర్ (24 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. బెజవాడ టైగర్స్ బౌలర్లలో లలిత్ మోహన్ మూడు వికెట్లు, సాయితేజ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 150 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన బెజవాడ టైగర్స్ 19.4 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఓపెనర్ మున్నంగి అభినవ్ (57; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కోస్టల్ జట్టు బౌలర్లలో చీపురపల్లి స్టీఫెన్, సుదర్శన్, ఆశిష్, మనోహర్ రెండు వికెట్ల చొప్పున తీసి బెజవాడ జట్టును దెబ్బ తీశారు.

స్టోక్స్ పునరాగమనం

ఇంగ్లండ్ వన్డే జట్టులో చోటు



లండన్: ఏడాది క్రితం వన్డే క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేయడంలో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) సఫలమైంది. 2019 వరల్డ్ కప్ ఫైనల్ హీరో స్టోక్స్ తమ బోర్డు విజ్ఞప్తి మేరకు మళ్లీ వన్డేలు ఆడేందుకు సిద్ధమయ్యాడు. దాంతో న్యూజిలాండ్‌తో వచ్చే నెలలో జరిగే వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేశారు. 15 మందితో కూడిన టీమ్‌ను ఈ సిరీస్ కోసం ఈసీబీ ప్రకటించింది. వరల్డ్ కప్ కోసం టీమ్‌ను ప్రకటించేందుకు మరింత సమయం ఉన్నా... సెలక్టర్ ల్యూక్ రైట్ చెప్పిన దాని ప్రకారం మార్పుల్లేకుండా ఇదే బృందం వరల్డ్ కప్‌కూ కొనసాగే అవకాశం ఉంది.


సినిమా



విజయ్ దేవరకొండ, సమంత



ప్రభాస్



నాగ చైతన్య

లవ్ టైమ్

సినిమాల్లో ఒక్కోసారి ఒక్కో ట్రెండ్ నడుస్తుంది. ఒకసారి హారర్‌ది హవా అయితే ఇంకోసారి కామెడీది.. మరోసారి యాక్షన్ ఇరగదీస్తుంది.. అయితే ట్రెండ్‌తో సంబంధం లేని జానర్ ఏదంటే అది 'లవ్'. అందుకే ఏడాది పొడవునా 'ఇట్స్ లవ్ టైమ్' అంటూ లవ్‌స్టోరీస్ రూపొందుతుంటాయి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవాటిలో, ఆన్ సెట్‌కి వెళ్లనున్న చిత్రాల్లో చాలా ప్రేమకథలు ఉన్నాయి. కొన్ని చిత్రాల గురించి తెలుసుకుందాం.

ఖుషీగా ప్రేమలో...

హీరో విజయ్ దేవరకొండకి ప్రేమకథలు కొత్తేమీ కాదు. 'అర్జున్ రెడ్డి, గీత గోవిందం, డియర్ కామ్రేడ్, వరల్డ్ ఫేమస్ లవర్' వంటి ప్రేమ కథా చిత్రాల్లో నటించారు. ఆ తర్వాత లవ్ స్టోరీస్ చేయకూడదనుకుని యాక్షన్ బాట పట్టారు. అయితే డైరెక్టర్ శివ నిర్వాణ చెప్పిన ప్రేమ కథ నచ్చడంతో 'ఖుషి' సినిమా చేశారు విజయ్. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా పలుమార్లు చెప్పారు. ఈ మూవీలో సమంత హీరోయిన్. విప్లవ్ (విజయ్ దేవరకొండ), ఆరాధ్య (సమంత) ప్రేమించుకుంటారు. అయితే ఇంట్లో వాళ్లు ఒప్పుకోకపోవడంతో బయటకి వచ్చి పెళ్లి చేసుకుని కొత్త జీవితం మొదలెడతారు. ఆ తర్వాత తమ మధ్య తలెత్తిన మనస్పర్థలు, గొడవలను తట్టుకొని మళ్లీ ఎలా కలిశారు? అనే కథాంశంతో 'ఖుషి' రూపొందినట్లు టాక్. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదల కానుంది. ఇదిలా ఉంటే... 'గీత గోవిందం' (2018) వంటి ప్రేమకథా చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్న హీరో విజయ్ దేవరకొండ-దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమాకి శ్రీకారం జరిగింది. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ప్రేమకథ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోందని టాక్.

టిల్లు లవ్

అట్లుంటది మనతోని అంటూ రాధిక (నేహా శెట్టి) ప్రేమ కోసం వెంట పడి హిట్ సాధించారు సిద్ధు జొన్నలగడ్డ. విమల్ కృష్ణ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ-నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'డీజే టిల్లు'. ఇప్పుడు ఆ ప్రేమని రెండు రెట్లు ఎక్కువగా అందించేందుకు సిద్ధమవుతున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన హీరోగా మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. ఈ సినిమా వచ్చే నెల 15న రిలీజ్ కానుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమాకి సంబంధించిన 'టికెటే కొనకుండా..' పాట లిరికల్ వీడియోలో హీరోయిన్‌ని ప్రేమలో పడేయడానికి హీరో పడే పాట్లు నవ్వులు తెప్పిస్తాయి. 'డీజే టిల్లు' కంటే 'టిల్లు స్క్వేర్'లో నవ్వులు, ప్రేమ రెట్టింపు ఉంటాయని చిత్ర యూనిట్ ఇప్పటికే స్పష్టం చేసింది. మరి టిల్లు కొత్త ప్రేమ కహానీ ఏంటో తెలియాలంటే సెప్టెంబర్ 15 వరకూ వేచి చూడాలి.



సిద్ధు, అనుపమ

పీరియాడికల్ లవ్...

యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ వరుసగా పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నారు. అందులోనూ ఎక్కువగా యాక్షన్ సినిమాలే. జస్ట్ ఫర్ చేంజ్ అన్నట్టు అప్పుడప్పుడు ప్రేమకథలు ఒప్పుకుంటారు. ఆయన కెరీర్‌లో 'వర్షం, డార్లింగ్, మిస్టర్ పర్‌ఫెక్ట్' వంటి పలు హిట్ ప్రేమకథా చిత్రాలున్నాయి. తాజాగా మరో లవ్ స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట ప్రభాస్. ప్రేమకథా చిత్రాలను తనదైన శైలిలో ఆవిష్కరించే హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ ఓ సినిమా చేయనున్నారని టాక్. రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో పీరియాడికల్ లవ్‌స్టోరీగా ఈ సినిమా ఉంటుందట. అయితే ప్రభాస్ ప్రస్తుత కమిట్‌మెంట్స్ వల్ల హనుతో చేసే సినిమాకి ఇంకా టైమ్ పడుతుందట.

గ్రామంలో ప్రేమ

శ్రీకాకుళంలోని ఒక మారుమూల గ్రామం అది. ఓ అమ్మాయి-అబ్బాయి ప్రేమలో పడ్డారు. ఎవరెన్ని చేసినా విడదీయలేని ప్రేమ బంధం వారిది. అయితే అనుకోకుండా ఓ విపత్తు ఎదురవుతుంది. ఆ తర్వాత ఈ ప్రేమ జంట కథ ఎలాంటి మలుపు తీసుకుంది? అనే నేపథ్యంలో నాగచైతన్య హీరోగా ఓ చిత్రం రూపొందనుంది. ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకత్వం వహించనున్నారు. మత్స్యకారుల నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రం ఉంటుంది. 2018లో గుజరాత్ వెరావల్ నుండి వేటకు వెళ్లి పాక్ కోస్ట్ గార్డ్‌కు చిక్కిన 21 మంది భారతీయుల్లో ఒక వ్యక్తి జీవితం నేపథ్యంలో ఈ చిత్రం ఉండనుందట. ఈ చిత్రం కోసం శ్రీకాకుళం యాస, భాషలు నేర్చుకుంటున్నారు నాగచైతన్య. ఈ సినిమా షూటింగ్ అక్టోబర్ చివర్లో లేదా నవంబరులో ఆరంభం కానుంది.


సుట్టంలా సూసి పోకలా...



నేహా శెట్టి, విశ్వక్ సేన్

విశ్వక్ సేన్, నేహా శెట్టి జంటగా కృష్ణచైతన్య దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 8న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'అద్దాల ఓణీలా ఆకాశ వాణీలా గోదారి గట్టుపై మెరిశావు మణీలా..' అంటూ మొదలై 'సుట్టంలా సూసి పోకలా.. సుట్టేసుకోవే చీరలా..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ బుధవారం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కాలేజీలో విడుదల చేసింది. మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్ రాజా స్వరకల్పనలో శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. ఈ పాట విడుదల వేడుకలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ – ''సుట్టంలా..' పాట మృదువుగా ఉన్నప్పటికీ.. సినిమా మాత్రం మాస్‌లా ఉంటుంది'' అన్నారు. ''యువన్‌గారికి పెద్ద అభిమానినైన నాకు ఆయనతో కలిసి పని చేసే అవకాశం కల్పించిన నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు కృష్ణచైతన్య.

విలన్ భైర



సైఫ్ అలీఖాన్

'దేవర' కోసం భైరగా మారారు బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'దేవర'. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, విలన్ పాత్రలో సైఫ్ అలీఖాన్ నటిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా బుధవారం (ఆగస్టు 16) సైఫ్ అలీఖాన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'దేవర' చిత్రంలోని భైర పాత్రలో సైఫ్ నటిస్తున్నారని వెల్లడించి, ఫస్ట్ లుక్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు ఎన్టీఆర్. కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న థియేటర్స్‌లో విడుదల కానుంది.

ఆత్మాభిమానం.. అహంభావం కాదు



క్లాక్స్, కార్తికేయ, రామ్‌చరణ్, నేహాశెట్టి, రవీంద్ర బెనర్జీ

''2012 డిసెంబరు 21.. ప్రపంచం అంతా యుగాంతం వస్తుందని భయపడిన రోజు. కానీ ఎక్కడా ఏం జరగలా.. ఒక్క మా ఊర్లో తప్ప... (అజయ్ ఘోష్)' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'బెదురులంక 2012' ట్రైలర్. కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి జంటగా రూపొందిన చిత్రం 'బెదురులంక 2012'. క్లాక్స్ దర్శకత్వంలో సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రామ్ చరణ్ విడుదల చేసి, మాట్లాడుతూ – ''కొత్త కాన్సెప్ట్‌లను సెలక్ట్ చేసుకుని సినిమాలు చేస్తుంటారు కార్తికేయ. 'బెదురులంక 2012' ట్రైలర్, ఇందులో చెప్పిన కథ బాగుంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. 'నేను నమ్మనిది నేను చేయను.. అది నా సెల్ఫ్ రెస్పెక్ట్.. ఈగో కాదు' (ఆత్మాభిమానం.. అహంభావం కాదు) అంటూ కార్తికేయ చెప్పిన డైలాగ్స్ కూడా ట్రైలర్‌లో ఉన్నాయి ''చిరంజీవిగారికి వీరాభిమాని అయిన కార్తికేయ ఈ సినిమాలో తన అభిమాన హీరో అసలు పేరు.. శివ శంకర వరప్రసాద్ పాత్రలో నటించారు. యుగాంతం వస్తుందని ఆంధ్రప్రదేశ్‌లోని బెదురులంక గ్రామంలో కొందరు కేటుగాళ్లు ప్రజల్లో ఉన్న భక్తిని ఆసరాగా చేసుకుని దేవుడి పేరుతో ఎలా దోపిడీ చేశారు? వారికి శివశంకర వరప్రసాద్ ఏ విధంగా బుద్ధి చెప్పాడు? అన్నదే ఈ సినిమా కథ'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ.

రీల్స్

ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్



నవీన్ చంద్ర హీరోగా తెలుగు-తమిళ భాషల్లో రూపొందుతున్న 'ఎలెవెన్' సినిమా బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. లోకేశ్ అజ్లస్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో రేయా హరి కథానాయిక. అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. ''ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు లోకేశ్ అజ్లస్.

నవీన్ చంద్ర

హారతందుకో..

'అమ్మా దంగురు దంగురు దంగురుమా... అమ్మా అమ్మోరు దంగురు దంగురుమా... హారతందుకో... మమ్ము ఆదుకో..' అంటూ మొదలవుతుంది 'గణ గణ మెగాలిరా..' పాట లిరికల్ వీడియో. అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందిన 'మంగళవారం' చిత్రంలోనిదీ పాట. పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో, శ్రీ తేజ్, చైతన్య కృష్ణ, అజయ్ ఘోష్, లక్ష్మణ్ కీలక పాత్రల్లో నటించారు. అజయ్ భూపతి నిర్మాణ భాగస్వామిగా, స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'గణ గణ మెగాలిరా..' పాట లిరికల్ వీడియోను బుధవారం విడుదల చేశారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ పాటకు భాస్కర భట్ల సాహిత్యం అందించగా వీఎం మహాలింగం పాడారు. ''కొన్నేళ్లపాటు జాతరలలో ఈ పాట వినిపిస్తుంది'' అన్నారు అజయ్ భూపతి. ''ఓ కీలక సందర్భంలో ఈ పాట వస్తుంది'' అన్నారు నిర్మాతలు.



పాయల్

మంచి సినిమాగా పేరొస్తుంది

సయ్యద్ సోహైల్, రూపా కొడవయూర్ జంటగా శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్టర్ ప్రెగ్నెంట్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ వింజనంపాటి మాట్లాడుతూ– ''నా వ్యక్తిగత జీవితంలోని ఘటనల ఆధారంగా, మేల్ ప్రెగ్నెంట్ అనే వార్తను పేపర్‌లో చదివి ఈ కథ రాసుకున్నాను. అమ్మాయి కోసం అబ్బాయి, అబ్బాయి కోసం అమ్మాయి చూడాల్సిన చిత్రం ఇది. తెలుగు పరిశ్రమలో ఓ మంచి సినిమా చేశామనే పేరు వస్తుంది'' అన్నారు.



శ్రీనివాస్

సైన్స్‌కు ఆధారం ఆధ్యాత్మికతేనా?



గంగాధర్, శేర్

శేర్ (సిరాజ్) నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'హర ఓం హర'. అశోక్ కుల్హార్, దేవేంద్ర మదన్ సింగ్ నేగి నిర్మిస్తున్న ఈ చిత్రంలో గంగాధర్, కర్ణిక ఇతర ముఖ్య తారాగాణం. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించిన ఓ షెడ్యూల్ తూర్పు గోదావరి జిల్లాలో ముగిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ''ఆధ్యాత్మికత అంతా సైన్స్‌తోనే ముడిపడి ఉందని, సైన్స్‌కు ప్రధాన వనరు ఆధ్యాత్మికతేనని నిరూపిస్తూ రూపొందిస్తున్న సినిమా ఇది. తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో సుమన్, ఆమని కీలక పాత్రధారులు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
138	30
65,539	19,465

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,567	▽	64
డోజోన్స్	34,931	▽	15
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,357	▽	33
డాక్స్	15,789	▲	22
షాంఘై	3,150	▽	26
నికాయ్	31,767	▲	472

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

డిజిటల్ ఇండియా ప్రాజెక్టు పొడిగింపు

రూ. 14,903 కోట్ల కేటాయింపు

న్యూఢిల్లీ: డిజిటల్ ఇండియా ప్రాజెక్టును పొడిగించే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇందు కోసం 2021–22 నుంచి 2025–26 మధ్య కాలానికి రూ. 14,903 కోట్లు కేటాయించినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దీని కింద 6.25 లక్షల మంది ఐటీ నిపుణులకు కొత్త నైపుణ్యాల్లోను, 2.64 లక్షల మందికి ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీలోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పొడిగించిన డిజిటల్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా మరో తొమ్మిది సూపర్ కంప్యూటర్లను నేషనల్ సూపర్‌కంప్యూటింగ్ మిషన్‌కు (ఎన్‌సీఎం) జోడించనున్నట్లు మంత్రి చెప్పారు. ఇప్పటికే ఎన్‌సీఎం కింద 18 సూపర్ కంప్యూటర్స్ ఉన్నట్లు వివరించారు. డిజిటల్ ఇండియా పథకం 2015లో ప్రారంభమైనప్పుడు రూ. 4,500 కోట్లతో 2022 నాటికి ఎన్‌సీఎం కింద 70 సూపర్‌కంప్యూటర్స్‌ను నెలకొల్పే ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. వాటికి అదనంగా మరో తొమ్మిది సూపర్‌కంప్యూటర్లకు తాజాగా ఆమోదముద్ర వేసిందని మంత్రి చెప్పారు.



12 కోట్ల మంది విద్యార్థులకు కోర్సులు..

డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద 12 కోట్ల మంది కాలేజీ విద్యార్థుల కోసం సైబర్ అవగాహన కోర్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని 1,200 స్టార్టప్‌లకు ఆర్థిక తోడ్పాటు అందించే వెసులుబాటు కూడా ఉందని వైష్ణవ్ చెప్పారు. 1,787 యూనివర్సిటీలు, పరిశోధన సంస్థల నెట్‌వర్క్ అయిన నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్‌ను డిజిటల్ ఇండియా ఇన్ఫోవేస్‌గా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, ఆరోగ్యం తదితర రంగాల్లో కృత్రిమ మేధను వినియోగించేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పా రు. డిజిలాకర్ యాప్‌ను లఘు, చిన్న, మధ్య తరహా సంస్థలకూ అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.

భారత్ బ్యాంకింగ్ పటిష్టమవుతోంది: ఫిచ్

న్యూఢిల్లీ: కోవిడ్ తీవ్రత తగ్గుముఖం పట్టడంతో భారతీయ బ్యాంకుల నిర్వహణా పరిస్థితులు గణనీయంగా మెరుగుపడుతున్నట్లు రేటింగ్ ఏజెన్సీ– ఫిచ్ తన తాజా ప్రకటనలో పేర్కొంది. బ్యాంకింగ్‌కు సంబంధించి పలు సూచీలు కోవిడ్ ముందుస్తు పరిస్థితులకన్నాసైతం ముందంజలో ఉన్నట్లు వివరించింది. కొన్ని రంగాల విషయంలో బ్యాంకుల రుణ బకాయిలూ తగ్గుతున్నట్లు తెలిపింది. 'ఆర్థిక వ్యవస్థ భారీ పరిమాణం, డిమాండ్ పరిస్థితులు లాభదాయకమైన వ్యాపారాన్ని సృష్టించడానికి అలాగే ఆదాయాలు పెరగడానికి, ఇబ్బందులను తగ్గించడానికి బ్యాంకింగ్‌కు మరిన్ని అవకాశాలను అందించాల్సి ఉంది'' కూడా ఫిచ్ పేర్కొంది.



అదానీ పవర్‌లో 8.1% వాటా విక్రయం

- జీక్యూజీ, ఇతర ఇన్వెస్టర్ల పెట్టుబడి
- రూ. 9,000 కోట్లతో కొనుగోలు
- సెకండరీ మార్కెట్లో భారీ డీల్స్‌లో ఒకటి

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం జీక్యూజీ పార్ట్‌నర్స్, ఇతర ఇన్వెస్టర్లు తాజాగా అదానీ పవర్‌లో 8.1 శాతం వాటాలు కొనుగోలు చేశాయి. ఇందుకోసం 1.1 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 9,000 కోట్లు) వెచ్చించాయి. సెకండరీ మార్కెట్‌లో అత్యంత భారీ ఈక్విటీ డీల్స్‌లో ఇది కూడా ఒకటని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. స్టాక్ మార్కెట్ డేటా ప్రకారం.. 31.2 కోట్ల షేర్లను



ప్రమోటర్ అదానీ కుటుంబం విక్రయించగా, సగటున షేరుకు రూ. 279.17 రేటుతో జీక్యూజీ పార్ట్‌నర్స్, ఇతర ఇన్వెస్టర్లు కొనుగోలు చేశారు. జీక్యూజీ ఇప్పటికే అదానీ గ్రూప్‌నకు చెందిన పలు సంస్థల్లో ఇన్వెస్ట్ చేసిన నేపథ్యంలో.. ఒక ఇన్వెస్టరు, ప్రమోటరు గ్రూప్ మధ్య ఈ తరహా లావాదేవీ జరగడం భారత్‌లో ఇదే తొలిసారని సంబంధిత వర్గాలు వివరించాయి.. అదానీ గ్రూప్ వ్యాపార ప్రమాణాలను, బలాన్ని ఇది సూచిస్తోందని తెలిపాయి. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ దెబ్బతో అదానీ గ్రూప్ అతలాకుతలం అయిన పరిస్థితుల్లో, ఈ ఏడాది మార్చి నుంచి ఆ గ్రూప్ సంస్థల్లో జీక్యూజీ క్రమంగా ఇన్వెస్ట్ చేస్తూ వస్తోంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో 5.4 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీలో 6.54%, అదానీ ట్రాన్స్‌మిషన్‌లో 2.5 శాతం వాటాలు కొనుగోలు చేసింది.

జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీలోనూ..

మరో స్టాక్ మార్కెట్ డీల్‌లో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీలో జేఎస్‌డబ్ల్యూ ఇన్వెస్ట్‌మెంట్స్ 1.27 శాతం వాటాలను రూ. 717.57 కోట్లకు విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా జీక్యూజీ పార్ట్‌నర్స్, వాషింగ్టన్ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ తదితర సంస్థలు కొనుగోలు చేశాయి. జేఎస్‌డబ్ల్యూ ఇన్వెస్ట్‌మెంట్స్.. షేరు ఒక్కింటికి రూ. 341.7 రేటు చొప్పున 2.10 కోట్ల షేర్లను విక్రయించింది. డీల్ అనంతరం జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీలో జేఎస్‌డబ్ల్యూ ఇన్వెస్ట్‌మెంట్స్ వాటా 20.22 శాతం నుంచి 18.95 శాతానికి తగ్గింది. ఇటీవలే జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీలో జీక్యూజీ పార్ట్‌నర్స్ ఎమర్జింగ్ మార్కెట్స్ ఈక్విటీ ఫండ్ రూ. 411 కోట్లతో 1.19 కోట్ల షేర్లను కొనుగోలు చేసింది.



చకాన్ ప్లాంటులో 2 లక్షల ఈవీలు

2029 నాటికి ఎంఅండ్‌ఎం వార్షికోత్పత్తి లక్ష్యం

కేప్‌టౌన్ (దక్షిణాఫ్రికా): మహారాష్ట్రలోని చకాన్‌లో నెలకొల్పుతున్న ప్లాంటు నుంచి వార్షికంగా 2 లక్షల ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిని సాధించాలని మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్‌ఎం) నిర్దేశించుకుంది. 2027–29 మధ్య కాలంలో దీన్ని సాధించగలమని సంస్థ ప్రెసిడెంట్ (ఆటోమోటివ్ విభాగం) వీజే నక్రా తెలిపారు. 2030 నాటికల్లా తమ మొత్తం వాహన విక్రయాల్లో 30 శాతం వాటా ఎలక్ట్రిక్ వాహనాలదే ఉంటుందని అంచనా వేస్తున్నట్లు ఆయన వివరించారు. బీఈ శ్రేణిలో తొలి వాహనాన్ని వచ్చే ఏడాది ఆఖర్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అంతకన్నా 4–5 నెలల ముందు నుంచే చకాన్ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభం కాగలదని నక్రా వివరించారు. చకాన్‌లో రూ. 10,000 కోట్లతో విద్యుత్ వాహనాల ప్లాంటును నెలకొల్పేందుకు కంపెనీకి ఈ ఏడాది జనవరిలో అనుమతులు లభించాయి. బార్న్ ఎలక్ట్రిక్ (బీఈ) మోడల్స్ తయారీ కోసం ఈ ప్లాంటుపై వచ్చే 7–8 ఏళ్లలో కంపెనీ భారీగా ఇన్వెస్ట్ చేస్తోంది. ఎక్స్‌యూవీ, కేవలం విద్యుత్ వాహనాల కోసమే ఉద్దేశించిన బీఈ బ్రాండ్‌ల కింద మొత్తం అయిదు ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడల్స్‌ను ప్రవేశపెట్టడంపై కంపెనీ కసరత్తు చేస్తోంది.



సెన్సెక్స్ 507 పాయింట్ల రికవరీ

- నిఫ్టీకి 30 పాయింట్ల లాభం
- మిడ్ సెషన్ నుంచి కొనుగోళ్లు
- ఐటీ, ఆటో, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు డిమాండ్

ముంబై: మిడ్‌సెషన్ నుంచి ఐటీ, ఆటో, ఎఫ్‌ఎంసీజీ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు బుధవారం కనిష్టస్థాయిల నుంచి రికవరీ అయ్యాయి. అధిక వెయిటేజీ ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టీ, ఎస్‌బీఐ షేర్లు 2 శాతం వరకు రాణించి సూచీల దన్నుగా నిలిచాయి. ఉదయం సెషన్‌లో 369 పాయింట్లను కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 138 పాయింట్ల లాభంతో 65,539 వద్ద స్థిరపడింది. కనిష్టం నుంచి మొత్తంగా 507 పాయింట్లు రికవరీ అయ్యింది. నిఫ్టీ సైతం 118 పాయింట్ల పతనం నుంచి తేరుకొని 30 పాయింట్ల లాభంతో 19,465 వద్ద ముగిసింది.

దేశీయంగా ద్రవ్యోల్బణం పెరగడం, చైనా ఆర్థిక వ్యవస్థ మాంద్య ఆందోళనలు, అమెరికాకు బ్యాంకులకు ఫిచ్ డౌన్‌గ్రేడ్ రేటింగ్ హెచ్చరికలు పరిణామాల నేపథ్యంలో తొలిసెషన్‌లో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే బ్రిటన్‌లో ద్రవ్యోల్బణ తగ్గుముఖం పట్టినట్లు డేటా గణాంకాలు వెల్లడి కావడం, యూఎస్ ఫెడ్ మినిట్స్, పారిశ్రామికోత్పత్తి డేటా వెల్లడి ముందు షార్ట్ కవరింగ్ కొనుగోళ్లతో అనూహ్యంగా సెంటిమెంట్ మెరుగుపడింది. మెటల్, ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మధ్య, చిన్న తరహా షేర్లు రాణించడంతో బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.50%, 0.25 శాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 723 కోట్ల విలువైన షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,406 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. పార్సీ కొత్త ఏడాది సందర్భంగా ఫారెక్స్, మనీ మార్కెట్లు బుధవారం పనిచేయలేదు.



మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ఇండిగో ప్రమోటర్ శోభ అగర్వాల్ ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 2.9% వాటాను రూ.2,802 కోట్లకు అమ్మారు. దీంతో కంపెనీ షేరు 3.56% నష్టపోయి రూ.2458 వద్ద ముగిసింది.
- క్యూ1లో రూ.7,840 నష్టాన్ని ప్రకటించడంతో టెలికం ఆపరేటర్ వొడాఫోన్ ఐడియా 3% నష్టపోయి రూ.7.82 వద్ద స్థిరపడింది.
- ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా బర్మన్ ఫ్యామిలీ రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్‌లో 7.5% వాటాను రూ.534 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో బీఎస్ఈలో రెలిగేర్ షేరు 6% పెరిగి రూ.233 వద్ద స్థిరపడింది.

ఎస్‌బీఎఫ్‌సీ బంపర్ లిస్టింగ్

బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ షేరు లిస్టింగ్‌లో అదరగొట్టింది. ఇష్యూ ధర రూ.57తో పోలిస్తే 44% ప్రీమియంతో రూ.82 వద్ద లిస్టయ్యింది. మరింత కొనుగోళ్ల మద్దతు లభించడంతో 67% ఎగిసి రూ.95 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి రూ.61% లాభంతో రూ.92 వద్ద స్థిరపడింది. కంపెనీ విలువ రూ.9,813 కోట్లుగా నమోదైంది.

పీఎఫ్‌సీ సీఎండీగా పర్మిందర్ చోప్రా బాధ్యతలు

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద ఎన్‌బీఎఫ్‌సీ, ప్రభుత్వరంగ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) చైర్మన్, ఎండీగా (సీఎండీ) పర్మిందర్ చోప్రా బాధ్యతలు స్వీకరించారు. సంస్థకు తొలి పూర్తి స్థాయి మహిళా చైర్మన్ అని పీఎఫ్‌సీ తెలిపింది. జూన్ 1 నుంచి పీఎఫ్‌సీ సీఎండీగా అదనపు బాధ్యతలను ఆమె నిర్వహిస్తుండగా, ఇప్పుడు పూర్తి స్థాయిలో ఆ బాధ్యతల్లోకి వచ్చారు. అంతక్రితం వరకు పీఎఫ్‌సీ డైరెక్టర్ (ఫైనాన్స్)గా పనిచేశారు. డైరెక్టర్ (ఫైనాన్స్)గా పర్మిందర్ చోప్రా ఎన్‌పీఏలను కనిష్టానికి తగ్గించి, సంస్థ లాభదాయకతను పెంచడంలో, మహారత్న హోదా పొందడంలో కీలకంగా పనిచేశారు. విద్యుత్, ఫైనాన్షియల్ రంగాల్లో 35 ఏళ్ల అనుభవం ఉంది.



వీఈ కమర్షియల్‌కు 550 బస్సుల ఆర్డర్

బెంగళూరు: వీఈ (వోల్వో అండ్ ఐషర్) కమర్షియల్ వెహికల్స్‌కు విజయానంద్ ట్రావెల్స్ నుంచి 550 ఇంటర్ సిటీ బస్సుల సరఫరా ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ విలువ దాదాపు రూ.500 కోట్లు. ''విజయానంద్ ట్రావెల్స్ నుంచి ఆర్డర్ పొందడం సంతోషంగా ఉంది. వీలైనంత తొందర్లో బస్సులను డెలివరీ చేస్తాము'' అని వీఈసీవీ కంపెనీ ఎండీ వినోద్ అగర్వాల్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాలకు పరిమితమైన విజయానంద్ ట్రావెల్స్ ప్రస్తుత ఆర్డర్ ద్వారా పాన్ ఇండియా బ్రాండ్‌ను సొంతం చేసుకుంటుందని కంపెనీ ఎండీ శివ శంకేశ్వర్ అన్నారు.



కళ్లజోళ్లపై టైటాన్ ప్లస్ 25% ఆఫర్

హైదరాబాద్: టైటాన్ అనుబంధ సంస్థ టైటాన్ ప్లస్ ప్రతి రెండు కళ్లజోళ్ల కొనుగోలుపై 25% ఆఫర్ ప్రకటించింది. రూ.4,999 విలువైన రెండు 'బ్లూటెక్' కళ్లజోళ్లను రూ.3,700కు.., రూ.10,500 విలువైన రెండు 'ప్రోగ్రెసివ్' కళ్లజోళ్లను రూ.8,499కు పొందవచ్చు. టైటాన్ ప్లస్ అవుట్‌లెట్లలో ఆగస్టు 18 వరకు ఆఫర్ అందుబాటులో ఉంటుంది.



విద్య, ఉద్యోగ సమాచారం

కడప గవర్నమెంట్ మెడికల్ కాలేజ్‌లో 45 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

కడప గవర్నమెంట్ మెడికల్ కాలేజ్.. సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 45
- » **విభాగాలు:** గైనకాలజీ, అనెస్తీషియా, రేడియో డయాగ్నోసిస్, సైకియాట్రీ, ఎమర్జెన్సీ మెడిసిన్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్,అనాటమీ తదితరాలు.
- » **అర్హత:** మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(డీఎం/ఎంసీహెచ్/ఎండీ/ఎంఎస్ /డీఎన్‌బీ).
- » **ఎంపిక విధానం:** పీజీలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
- » **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.08.2023.
- » **రిక్రూట్‌మెంట్ వాక్ ఇన్ తేది:** 21.08.2023.
- » **కౌన్సెలింగ్ స్థలం:** కౌన్సెలింగ్ హాల్, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, కడప.
- » **వెబ్‌సైట్:** https://kadapa.ap.gov.in

డా.వైఎస్సార్ ఏఎఫ్‌ఏయూ, కడపలో బీఆర్క్ ప్రవేశాలు

కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీలోని ప్రభుత్వ/ప్రైవేట్/మైనారిటీ /అన్‌ఎయిడెడ్ విద్యా సంస్థల్లో బీఆర్క్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **అర్హత:** మ్యాథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయాలజీ తదితర ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. నాటా–2023/జేఈఈ(మెయిన్) బీఆర్క్ పేపర్–2ఎ 2023 ఎగ్జామ్‌లో వ్యాలిడ్ స్కోరు సాధించి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** నాటా–2023/జేఈఈ(మెయిన్) బీఆర్క్ పేపర్–2ఎ 2023 స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 24.08.2023.
- » **సర్టిఫికేట్ వెరిఫికేషన్ తేది:** 25.08.2023 నుంచి 28.08.2023 వరకు.
- » **వెబ్ ఆప్షన్స్ తేదీలు:** 04.09.2023,05.09.2023.
- » **మొదటి విడత ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది:** 07.09.2023.
- » **వెబ్‌సైట్:** https://apsche.ap.gov.in

కాళోజీ హెల్త్ యూనివర్శిటీ, వరంగల్‌లో ఎంపీహెచ్ కోర్సులో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రం, వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయంలో.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- » **కోర్సు వ్యవధి:** రెండేళ్లు(నాలుగు సెమిస్టర్లు).
- » **సీట్ల సంఖ్య:** 60 సీట్లు(కాంపిటెంట్ అథారిటీ కోటా–30 సీట్లు, మేనేజ్‌మెంట్ కోటా–24 సీట్లు, ఫారెన్ నేషనల్స్ కోటా–06 సీట్లు).
- » **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ఎంట్రన్స్ టెస్ట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.08.2023.
- » **వెబ్‌సైట్:**www.knruhs.telangana.gov.in

నేషనల్ లా యూనివర్శిటీ ఢిల్లీలో ఎల్‌ఎల్‌ఎం(ప్రొఫెషనల్) కోర్సులో ప్రవేశాలు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్శిటీ, ఢిల్లీ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎల్‌ఎల్‌ఎం(ప్రొఫెషనల్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- » **స్పెషలైజేషన్:** క్రిమినల్ లా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ స్టడీస్,ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, కమర్షియల్ లా, ఇన్విరాన్‌మెంటల్ లా అండ్జస్టిస్, కన్జ్యూమర్ లా,హెల్త్ లా అండ్ పాలసీ, టాక్సేషన్ లా. » **అర్హత:** కనీసం 50శాతం మార్కులతో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతోపాటు కనీసం మూడేళ్ల పాటు వృత్తిపరమైన పని అనుభవం ఉండాలి.
- » **ఎంపిక విధానం:** డిగ్రీ మార్కుల ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.08.2023.
- » **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in

నేషనల్ లా యూనివర్శిటీ ఢిల్లీలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్శిటీ, ఢిల్లీ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు, సీట్ల వివరాలు

- » **ఐదేళ్ల బీఏ ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్:** 120 సీట్లు. అర్హత: సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులవ్వాలి.» **ఏడాది ఎల్‌ఎల్‌ఎం ప్రోగ్రామ్:** 80 సీట్లు. **అర్హత:** ఎల్‌ఎల్‌బీ లేదా తత్సమానమైన లా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **పీహెచ్‌డీ(లా, సోషల్ సైన్సెస్) ప్రోగ్రామ్:** 31 సీట్లు. **అర్హత:** ఎల్‌ఎల్‌ఎం/మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానమైన డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **ఎంపిక విధానం:**ఆల్ ఇండియా లా ఎంట్రన్స్ టెస్ట్ –2024 ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.
- » **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.11.2023.
- » **అడ్మిట్ కార్డుల జారీ తేది:** 20.11.2023.
- » **ప్రవేశపరీక్ష నిర్వహణ తేది:** 10.12.2023.
- » **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in

అవుతారా.. బ్యాంక్ ఆఫీసర్

» 3,049 పీవో/ఎంటీ పోస్టులకు ఐబీపీఎస్ ప్రకటన
» ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు
» ప్రిలిమ్స్, మెయిన్స్,ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక

బ్యాంకింగ్ రంగ ఉద్యోగాల్లో అత్యంత క్రేజీ కొలువు.. పీవో(ప్రొబేషనరీ ఆఫీసర్). డిగ్రీ అర్హతతోనే పీవోగా ఉద్యోగంలో చేరి.. సీజీఎం, బ్యాంక్ చైర్మన్ స్థాయికి కూడా ఎదిగే అవకాశముంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టే ఐబీపీఎస్.. తాజాగా 3,049 పీవో/ఎంటీ(మేనేజ్‌మెంట్ ట్రైనీస్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ పీఓ/ఎంటీ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..



ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్.. సంక్షిప్తంగా ఐబీపీఎస్. ప్రతి ఏటా.. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ మొదలు స్పెషలిస్ట్ ఆఫీసర్ల వరకూ.. వివిధ ఉద్యోగాలకు నియామక ప్రక్రియ చేపడుతున్న సంస్థ. తాజాగా.. 2024–25 సంవత్సరంలో ఆయా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి ప్రక్రియ ప్రారంభించింది.

మొత్తం 3,049 పీఓ పోస్టులు

ఐబీపీఎస్ తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం అయిదు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 3,049 పీఓ పోస్టులను భర్తీ చేయనుంది. ఆ వివరాలు..

- బ్యాంక్ ఆఫ్ ఇండియా–224 పోస్టులు, కెనరా బ్యాంకు–500 పోస్టులు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–2,000 పోస్టులు, పంజాబ్ నేషనల్ బ్యాంకు– 200 పోస్టులు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు–125 పోస్టులు. ఇవే కాకుండా..ఎంపిక ప్రక్రియ పూర్తి అయ్యే సమయానికి బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, యూకో బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలలో కూడా పోస్టులు ఏర్పడే అవకాశం ఉంది.

అర్హతలు

- ఆగస్టు 21, 2023 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** ఆగస్టు 1, 2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ(నాన్ క్రీమీ లేయర్) అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఐబీపీఎస్ చేపట్టనున్న పీఓ/ఎంటీ నియామకాలకు సంబంధించి.. ఎంపిక ప్రక్రియ మూడు దశల్లో ఉంటుంది. అవి..ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ. ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్‌లను ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఈ రాత పరీక్షల్లో విజయం సాధించి నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించిన వారికి పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. అందులోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిస్తే.. ప్రొవిజనల్ అలాట్‌మెంట్ లెటర్ అందజేస్తారు.

ప్రిలిమినరీ 100 మార్కులు

ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ రాత పరీక్ష మూడు విభాగాల్లో 100 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 ప్రశ్నలు –35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు. ప్రిలిమినరీలో పొందిన మార్కులు.. సెక్షన్ల వారీగా నిర్దేశిత కటాఫ్‌లు అనుసరించి.. మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆ తర్వాత ఒక్కో పోస్ట్‌కు పది మందిని చొప్పున రెండో దశ మెయిన్స్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు.

200 మార్కులకు మెయిన్స్

రెండో దశ మెయిన్ పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 45 ప్రశ్నలు–60 మార్కులు, జనరల్ /ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలు –40 మార్కులు, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 35 ప్రశ్నలు–60 మార్కులు.. ఇలా మొత్తం 155 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

డిస్క్రిప్టివ్ టెస్ట్ కూడా

మెయిన్ పరీక్షలో భాగంగానే ఆబ్జెక్టివ్ టెస్ట్‌తో పాటు అదనంగా ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్(లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే)లో ఒక ఎస్సే,ఒక లెటర్ రైటింగ్ రాయాల్సి ఉంటుంది. దీనికి కేటాయించిన మార్కులు 25. సమయం 30 నిమిషాలు. మెయిన్ పరీక్షతోపాటే అదే రోజు ఈ డిస్క్రిప్టివ్ టెస్ట్ జరుగుతుంది.

చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలో చివరి దశ.. పర్సనల్ ఇంటర్వ్యూ. మెయిన్‌లో పొందిన మార్కుల ఆధారంగా.. సెక్షన్ వారీ కటాఫ్, ఓవరాల్ కటాఫ్‌లను నిర్దేశించి ఆ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు చివరగా ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 100. ఇందులో జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి.

వెయిటేజీ విధానం

మెయిన్ పరీక్షలో మార్కులకు 80 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులకు 20 శాతం వెయిటేజీని నిర్దేశించారు. ఇలా మొత్తం వంద మార్కులకు గాను మెయిన్, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులను క్రోడీకరించి తుది విజేతలకు నియామకాలు ఖరారు చేస్తారు.

ప్రిపరేషన్ ఇలా

రీజనింగ్

ప్రిలిమ్స్, మెయిన్స్‌లో కీలకంగా నిలిచే రీజనింగ్‌పై అభ్యర్థులు పట్టు సాధించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

అర్థమెటిక్‌పై పట్టుతో ఈ విభాగంలో రాణించొచ్చు. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా సాధన చేయాలి. తద్వారా ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందొచ్చు.

డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్

డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్‌లో రాణించేందుకు కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా సాధన చేయాలి.

జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్

ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో మార్పులు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. బ్యాంకింగ్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు గట్టిగా కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 21.08.2023
- **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్(ఆన్‌లైన్) తేదీలు:** సెప్టెంబర్/అక్టోబర్‌లో.
- **మెయిన్ ఆన్‌లైన్ ఎగ్జామినేషన్ తేదీ:** నవంబర్‌లో
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** 2024 జనవరి/ఫిబ్రవరి నెలల్లో
- **వెబ్‌సైట్:** https://www.ibps.in

క్లుప్తంగా...

జర్మనీలో భాషా శిక్షణకు కేవీఎస్ విద్యార్థి ఎంపిక



సాక్షి, అమరావతి: జర్మన్ భాషలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విజయవాడ సత్యనారాయణపురం కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కేవీఎస్)–1 పదో తరగతి విద్యార్థి చారుగుండ్ల ధ్రువ జర్మనీలో శిక్షణ పొందేందుకు ఎంపికయ్యారు. జర్మన్ భాషలో గోథే ఇన్‌స్టిట్యూట్ (చెన్నై) నిర్వహించిన పోటీల్లో దేశ వ్యాప్తంగా ముగ్గురు విద్యార్థులను శిక్షణకు ఎంపిక చేసింది. ఇందులో రాష్ట్రానికి చెందిన ధ్రువ జర్మనీలోని మ్యూనిక్ గోథే ఇన్‌స్టిట్యూట్‌లో జర్మన్ భాషలో 3 వారాల శిక్షణకు అర్హత సాధించారు.

యూఎన్‌వో సదస్సుకు కేజీబీవీ 9వ తరగతి బాలిక



మనస్వినిని అభినందిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: ఐక్యరాజ్యసమితి (యూఎన్‌వో) సదస్సులో పాల్గొనేందుకు పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ 9వ తరగతి విద్యార్థిని సామల మనస్విని ఎంపికైంది. న్యూయార్క్‌లోని యూఎన్‌వో కేంద్ర కార్యాలయంలో సెప్టెంబర్ 18, 19 తేదీల్లో జనరల్ అసెంబ్లీ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధిపై ఉన్నత స్థాయి రాజకీయ ఫోరంలో పాల్గొని 'నాడు–నేడు' పాఠశాల విద్యా కార్యక్రమాలపై మనస్విని ప్రసంగించనుంది. ఈ సదస్సుకు రాష్ట్రం నుంచి పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అయితే ఇటీవల కురుపాంలో అమ్మఒడి నిధుల విడుదల కార్యక్రమంలో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తోన్న కృషిని వివరిస్తూ మనస్విని ప్రసంగించి సీఎం జగన్‌ను ఆకట్టుకుంది. సీఎం ప్రత్యేక సిఫార్సుతో 9వ తరగతి చదువుతున్న మనస్వినిని కూడా యూఎన్‌వో సదస్సుకు ఎంపిక చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

మైదాన ప్రాంతాలకు దీటుగా గిరిజనుల అభివృద్ధి



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల అభివృద్ధికి పాటుపడ్డారని, ఆయన ఆశయ సాధన కోసం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. పాడేరులో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైదాన ప్రాంతాలకు దీటుగా గిరిజనులు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ పని చేస్తున్నారని చెప్పారు. పాడేరులో రూ.500కోట్లతో మెడికల్ కళాశాల, పార్వతీపురం మన్యం జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల, గిరిజన యూనివర్సిటీలను నిర్మించడం గిరిజన ప్రజలకు శుభపరిణామమని చెప్పారు. తొలుత వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వంతాడపల్లి చెక్‌పోస్టు నుంచి పాడేరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, పార్టీ నేతలు ఫరూఖీ, డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, విశ్వేశ్వరరాజు, లిల్లి పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయానికి స్వల్పంగా వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్వల్పంగా వచ్చి చేరుతోంది. జూరాల ప్రాజెక్ట్‌లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సుమారు ఏడు వేల క్యూసెక్కుల నీటిని శ్రీశైలంకు విడుదల చేశారు. మంగళవారం నుంచి బుధవారం వరకు ఎడమ గట్టు కేంద్రంలో 6.639 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి సాగర్‌కు 12,887 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు ద్వారా 12 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 112.4632 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కేశవరెడ్డి విద్యార్థులకు ప్రథమ స్థానం

సాక్షి, అమరావతి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన సంబరాలలో కేశవరెడ్డి విద్యార్థుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకున్న ఆర్ఆర్ఆర్ సినిమా కథాంశం నేపథ్యంతో 550 మందికి పైగా విద్యార్థులతో సాగిన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ చేతుల మీదుగా కేశవరెడ్డి విద్యార్థులు షీల్డ్, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.


ఆధునిక సాంకేతికతను ప్రవేశపెట్టినా నేరమేనా?

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పాత టెక్నాలజీని మార్చినా తప్పుడు రాతలేనా?

రిజిస్ట్రేషన్ల శాఖలో అత్యాధునిక టెక్నాలజీ ప్రవేశపెడితే ఈ పెడబొబ్బలు ఎందుకు?



సాక్షి, అమరావతి: 'కుక్క పిల్ల, అగ్గిపుల్ల, సబ్బు బిళ్ల కాదేదీ కవితకు అనర్హం' అన్నట్టు తనకు గిట్టని ప్రభుత్వంపై తప్పుడు రాతలు రాయడంలో, విష ప్రచారం చేయడంలో ఈనాడు రామోజీరావుది కూడా ఇదే తీరు. ఇందులో భాగంగానే బుధవారం తన విష పుత్రిక 'ఈనాడు'లో 'ఉచిత సాఫ్ట్‌వేర్ మాకొద్దు.. రూ.34 కోట్లిచ్చి కొంటాం' అనే శీర్షికతో ఒక తప్పుడు కథనం వండివార్చారు. మారుతున్న ఆధునిక అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల శాఖలో ఆధునిక టెక్నాలజీని ప్రవేశపెడుతున్నా రామోజీ ఓర్వలేకపోతున్నారు. ప్రజలకు సరికొత్తగా అత్యాధునిక సేవలు అందించడం కోసం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పాత టెక్నాలజీకి స్వస్తి పలకడం 'ఈనాడు'కు కంటగింపుగా మారింది. కొత్త టెక్నాలజీ ముందుకు వస్తుంటే పాత టెక్నాలజీని వదిలించుకోవడం ఎక్కడైనా జరిగే సర్వ సాధారణమైన విషయం. అయితే ఇది ఘోర తప్పిదంలాగా కళ్ల నిండా పచ్చవిషం నింపుకున్న రామోజీరావుకు కనిపించింది. అందుకే ఆధునిక అవసరాలకు అనుగుణంగా మారకుండా... కేంద్రం ఉచితంగా సాఫ్ట్‌వేర్ ఇస్తోంది కాబట్టి దాన్నే వాడాలంటూ ఈనాడు తన కథనంలో వితండ వాదానికి దిగింది.



కార్డు ++ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించి అమలు చేయలేకపోవడంతో రూ. 6.20 కోట్ల మొత్తాన్ని ఆర్టీజీఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు వెనక్కు పంపిన ఎన్ ఐ సి. అందుకు సంబంధించిన మెయిల్

అప్‌గ్రేడ్ చేసే స్థాయి వనరులు తనకు లేవన్న ఎన్‌ఐసీ

1999 నుంచి రిజిస్ట్రేషన్ల శాఖ ఐటీ ఆధారిత సేవలు అందిస్తోంది. అప్పటి అవసరాలకనుగుణంగా నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ).. సీఏఆర్‌డీ (కార్డ్) అప్లికేషన్‌ను రూపొందించినా ఆ తర్వాత ఎప్పటికప్పుడు మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోలేకపోయింది. అప్పట్లో సంవత్సరానికి కేవలం 2 లక్షల రిజిస్ట్రేషన్లు చేసేందుకు మాత్రమే ఈ అప్లికేషన్‌ను రూపొందించారు. ప్రస్తుతం ఏటా 25 లక్షల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఈ స్థాయిలో డాక్యుమెంట్లు రిజిస్టర్ చేసే సామర్థ్యం లేక రెండు దశాబ్దాల నాటి కార్డ్ సాఫ్ట్‌వేర్ చతికిలపడింది. సర్వర్లు మొరాయించడం, రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడడాన్ని ఈనాడు పలుసార్లు ప్రచురించింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులను తప్పించడానికి కార్డ్ అప్లికేషన్‌ను అప్‌గ్రేడ్ చేయడం అనివార్యంగా మారింది. ఈ క్రమంలోనే రిజిస్ట్రేషన్ల శాఖ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కార్డ్‌ను కార్డ్ ++ గా అప్‌గ్రేడ్ చేయాలని కోరింది. ఇందుకు అంగీకరించిన ఎన్‌ఐసీ 2017లో అందుకు ప్రతిపాదనలు ఇవ్వడంతో ప్రభుత్వం దాని అమలుకు రూ.13.14 కోట్లను మంజూరు చేసింది. ఆ అప్లికేషన్ కోసం రూ.11.82 కోట్లను ఎన్‌ఐసీ ఢిల్లీకి చెల్లించింది. డబ్బు తీసుకున్నా టెక్నాలజీ అప్‌గ్రేడ్ చేయడంలో ఎన్‌ఐసీ విఫలమైంది. అనేకసార్లు రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు ఎన్‌ఐసీతో చర్చలు జరిపినా తమకు ఆ స్థాయి వనరులు లేవని చెబుతూ వచ్చింది. దీంతో రిజిస్ట్రేషన్ల సేవల్లో తరచూ అంతరాయాలు, ఇబ్బందులు తలెత్తేవి. మరోవైపు వైఎస్ జగన్ ప్రభుత్వం 15,004 గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు సేవలు ప్రారంభించాలని నిర్ణయించింది. ఇప్పటికే 2 వేల సచివాలయాల్లో ఆ సేవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో కార్డ్ అప్లికేషన్‌ను అవసరాలకు తగ్గట్టు అత్యవసరంగా ఆధునికీకరించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కార్డ్ ++ అప్లికేషన్‌ను అప్‌గ్రేడ్ చేయలేకపోయిన ఎన్‌ఐసీకి తాము ఇచ్చిన సొమ్మును తిరిగి వెనక్కి ఇచ్చేయాలని, కొత్త టెక్నాలజీ పార్టనర్‌ను చూసుకుంటామని రిజిస్ట్రేషన్ల శాఖ ఆ సంస్థకు స్పష్టం చేసింది. దీంతో ఎన్‌ఐసీ రూ.6.20 కోట్లు వెనక్కి ఇచ్చేసింది.



REAL TIME GOVERNANCE SOCIETY (RTGS)
1st Block, AP Secretariat, VELAGAPUDI, Guntur District

Short Tender Notice for Selection of Implementation Vendor for Modernization and Upgradation of IGRS CARD Application (Stabilize, Design, Develop, Integrate and Maintain the application for the transformation of the Registration Process for IGRS Department, Govt of Andhra Pradesh.

Bid Calling Date	8th Nov, 2022
Bid Closure Date	22nd Nov 2022, 04:00 pm
Contact Person	Sriram Cherukuvada, Ph: [illegible] Email: dir-analytics-rtgs@ap.gov.in
Reference	APRTGS/IGRS/CARD/RFP/22 dated 8th Nov 2022

For further details regarding detailed tender notification, RFP Details & Digital Certificate please visit [illegible]

కొత్త టెక్నాలజీ పార్టనర్ కోసం ఆర్టీజీఎస్ ద్వారా పిలిచిన టెండర్

పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ..

ఎన్‌ఐసీ చేతులెత్తేయడంతో గతేడాది రిజిస్ట్రేషన్ల కోసం ఆర్టీజీఎస్ ద్వారా కొత్త టెక్నాలజీ పార్ట్‌నర్ కోసం ప్రభుత్వం టెండర్లు పిలిచింది. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన ఈ ప్రక్రియలో ఐదు కంపెనీలు పాల్గొన్నాయి. రూ.33.99 కోట్లతో ఎల్–1గా నిలిచిన క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ కొత్త పార్ట్‌నర్‌గా ఎంపికైంది. అత్యాధునిక టెక్నాలజీతో ప్రైమ్ కార్డ్ అప్లికేషన్‌ను ఆ కంపెనీ రూపొందించింది. ప్రజలకు ఇబ్బందులు తప్పించడానికి ప్రభుత్వం చేస్తున్న ఈ పనిని అభినందించాల్సింది పోయి తనకలవాటైన రీతిలోనే 'ఈనాడు' విషం చిమ్మింది. కేంద్రం ఉచితంగా సాఫ్ట్‌వేర్ ఇస్తానంటే వద్దని ప్రభుత్వం రూ.34 కోట్లతో తమకు కావాల్సిన వారికి ఆ కాంట్రాక్టు ఇచ్చిందని అడ్డగోలు అబద్ధాలను తన కథనంలో వండివార్చింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఒకే రిజిస్ట్రేషన్ల విధానం ఉండాలనే ఉద్దేశంతో ఎన్‌జీడీఆర్ఎస్ సాఫ్ట్‌వేర్‌ను కేంద్రం 2012లో తెచ్చింది. అప్పటికి 14 ఏళ్లకు ముందే మన రాష్ట్రంలో కార్డ్ అప్లికేషన్ ద్వారా అంతకుమించిన ఐటీ ఆధారిత రిజిస్ట్రేషన్ సేవలు అమలవుతున్నాయి. కేంద్రం ఇచ్చిన సాఫ్ట్‌వేర్‌ను ఉచితంగా తీసుకుంటే మళ్లీ మనం పాత టెక్నాలజీనే వాడాల్సి ఉంటుంది. ఆ టెక్నాలజీ అప్పటికి ఐటీ సేవలు ప్రారంభించని రాష్ట్రాలకు ఉపయోగం తప్ప అప్పటికే టెక్నాలజీ సేవల్లో ముందున్న మన రాష్ట్రానికి కాదు. ఈ విషయాన్ని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కేంద్రానికి చెప్పి తాము ఇంకా ఆధునిక టెక్నాలజీలోకి వెళుతున్నట్లు చెప్పగా అంగీకరించింది. కానీ 'ఈనాడు' మాత్రం పాత టెక్నాలజీనే వాడాలంటూ వింత వాదనలు చేస్తోంది.

కొత్త టెక్నాలజీ ద్వారా అత్యాధునిక సేవలు..

రిజిస్ట్రేషన్ల శాఖ కొత్తగా తెచ్చిన ప్రైమ్ కార్డ్ అప్లికేషన్ అత్యాధునిక టెక్నాలజీతో అన్ని అవసరాలను తీర్చేలా పనిచేస్తుంది. దీనిద్వారా త్వరలో ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్ సేవలు అందించబోతున్నారు. వినియోగదారులు తమ డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో తామే తయారు చేసుకునే సౌలభ్యం కూడా ఉంటుంది. రెవెన్యూ, మున్సిపల్ శాఖల డేటాబేస్‌లకు అనుసంధానమై అత్యంత కీలకమైన ఆటోమ్యుటేషన్ విధానాన్ని ఈ కొత్త టెక్నాలజీ ద్వారానే అందుబాటులోకి తేనున్నారు. ఈ–సైన్, ప్రైమ్ మొబైల్ యాప్‌ల ద్వారా సరికొత్త రిజిస్ట్రేషన్ సేవలు ప్రజల ముంగిటకు రానున్నాయి. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ చెల్లింపులు జరిపే ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాలన్నింటిల్లోనూ ఈ కొత్త టెక్నాలజీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సేవలన్నింటినీ ఎన్‌జీడీఆర్ఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా, ఎన్‌ఐసీ పాత సాఫ్ట్‌వేర్‌తో చేసే పరిస్థితి ఏ మాత్రం లేదు. ఆధునిక అవసరాలకు తగ్గట్టు ఈ సేవలన్నీ అందించేలా ప్రైమ్ కార్డ్ టెక్నాలజీని నడిపే సామర్థ్యం ఉండడం వల్లే క్రిటికల్ రివర్ టెక్నాలజీస్ కంపెనీని టెక్నాలజీ పార్ట్‌నర్‌గా ఎంపిక చేశారు. ఇది ఈనాడుకు మింగుడుపడకే తన కథనంలో దుష్ప్రచారానికి దిగింది.

చంద్రబాబు అండ్ కోను తరిమికొట్టండి

తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి



రాజానగరం: పదేపదే ప్రజల్ని మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు అండ్ కో దొంగలను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని ప్రజలకు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తన పాలనలో ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి.. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచేశారని మండిపడ్డారు. 2014 ఎన్నికలప్పుడు 600కు పైగా హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చకపోవడమే కాకుండా.. ఏకంగా మేనిఫెస్టోనే టీడీపీ వెబ్‌సైట్ నుంచి మాయం చేసిన విషయాన్ని ప్రజలింకా మర్చిపోలేదన్నారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సంక్షేమాభివృద్ధి పథంలో పయనిస్తుంటే చంద్రబాబు, లోకేశ్, పవన్, రామోజీ అసహనానికి గురై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

'నన్నయ'లో సహస్రాబ్ది ఉత్సవాలు ప్రారంభం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'ఆదికవి నన్నయ మహాభారత రచన, రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు' బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర సాహిత్య అకాడమీతో కలిసి 'నన్నయ' వర్సిటీ నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు రెండు రోజుల పాటు జరుగనున్నాయి. ఎంపీ మార్గాని భరత్‌రామ్, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, వైస్ చాన్సలర్ కె.పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం హత్య కేసులో అప్పీల్‌పై ముగిసిన వాదనలు

తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం



సాక్షి, అమరావతి: ఎమ్మెల్సీ అనంతబాబు మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు నిరాకరిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మృతుని తల్లిదండ్రులు దాఖలు చేసిన అప్పీల్‌లో బుధవారం వాదనలు ముగిశాయి. వాదనలు విన్న న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ ప్రతాప్ వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు ప్రకటించింది. తమ కుమారుడు సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ మృతుని తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ గత ఏడాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి, దర్యాప్తును సీబీఐకి అప్పగించేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను కొట్టేశారు. దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి మూడు నెలల్లో సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ నూకరత్నం, సత్యనారాయణ ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై బుధవారం జస్టిస్ దుర్గాప్రసాదరావు ధర్మాసనం విచారణ జరిపింది. పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేయలేదని నూకరత్నం, సుబ్రహ్మణ్యం తరఫు న్యాయవాది జడా శ్రవణ్ కుమార్ తెలిపారు. సీసీ టీవీ ఫుటేజీలో కనిపిస్తున్న ఇతరుల పాత్ర గురించి దర్యాప్తు చేయలేదన్నారు. నామమాత్రంగా దర్యాప్తు చేసి కింది కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి చేతులు దులుపుకున్నారని తెలిపారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది (జీపీ) వేలూరు మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇతరుల పాత్ర విషయంలో నిర్దిష్టమైన ఆధారాలు లభించకపోవడంతో ఎమ్మెల్సీ అనంతబాబు ఒక్కరినే నిందితునిగా చేర్చడం జరిగిందన్నారు. ఆ మేరకు అనుబంధ చార్జిషీట్ దాఖలు చేశామన్నారు. దర్యాప్తునకు సంబంధించిన సీడీ ఫైల్‌లో అన్ని వివరాలు ఉన్నాయంటూ, ఆ ఫైల్‌ను ఆయన ధర్మాసనం ముందుంచారు. ఇది సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాల్సినంత కేసు కాదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్టు ప్రకటించింది.

క్వాష్ పిటిషన్లు ఎలా వేస్తారు?

- టీడీపీ నేతల పిటిషన్లపై హైకోర్టు అభ్యంతరం
- ముందస్తు బెయిల్ పిటిషన్లు వేసుకోండి
- హత్యాయత్నం కేసు ఉన్న నేపథ్యంలో సెక్షన్ 41 నోటీసు ఇవ్వం
- మీ పిటిషన్లు ఉపసంహరించుకోండి
- తేల్చిచెప్పిన న్యాయస్థానం.. విచారణ వాయిదా



సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా అంగళ్లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, పోలీసులపై టీడీపీ కార్యకర్తలు చేసిన హత్యాయత్నానికి సంబంధించి నమోదైన కేసులను కొట్టేయాలని కోరుతూ పలువురు టీడీపీ నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 438 కింద ముందస్తు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసుకోకుండా సెక్షన్ 482 కింద క్వాష్ పిటిషన్లు దాఖలు చేయడం సరికాదని తేల్చిచెప్పింది. అంతేకాకుండా హత్యాయత్నం కింద కేసు నమోదు చేసిన నేపథ్యంలో సీఆర్‌పీసీ సెక్షన్ 41 కింద నోటీసు జారీ చేయడం కూడా సాధ్యం కాదని స్పష్టం చేసింది. కేసులను కొట్టేయాలని కోరుతూ టీడీపీ నేతలు దాఖలు చేసిన పిటిషన్లను ఉపసంహరించుకోవాలని పేర్కొంది. టీడీపీ నేతల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. ముందస్తు బెయిల్ పిటిషన్లను ఇప్పటికే దాఖలు చేశామని చెప్పారు. అందువల్ల విచారణను వాయిదా వేయాలని కోరారు. ఇందుకు అంగీకరించిన హైకోర్టు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత గంటా నరహరిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషన్‌తో పాటు పోలీసుల వద్ద మాత్రమే ఉండాల్సిన కేసు డైరీ పార్ట్1ని జత చేయడంపై మండిపడింది. పోలీసులు మాత్రమే చూడదగ్గ ఆ డాక్యుమెంట్‌ను ఎలా సంపాదించారని ప్రశ్నించింది. దీనిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకుంటానని న్యాయమూర్తి హెచ్చరించారు. దీంతో గంటా నరహరి తరఫు న్యాయవాది ఆ డాక్యుమెంట్‌ను ఉపసంహరించుకుంటానని కోర్టును అభ్యర్థించారు. తమపై ముదివీడు పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టేయాలని కోరుతూ వ్యూహాత్మకంగా టీడీపీ నేతలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మహ్మద్ షాజహాన్ బాషా, గంటా నరహరి, దొమ్మలపాటి రమేష్, రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, గుండ్లపల్లి శ్రీరామ కుమార్ తదితరులు హైకోర్టులో వేర్వేరుగా క్వాష్ పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా..

కాగా తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ సీనియర్ నేతలు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, పులివర్తి నాని దాఖలు చేసిన వ్యాజ్యాల్లో తదుపరి విచారణ గురువారానికి వాయిదా పడింది. బుధవారం జరిగిన విచారణలో కిషోర్ కుమార్‌రెడ్డి తరఫు న్యాయవాది ఎస్‌వీ సుమంత్ వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో సహ నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఆయనను నాలుగో నిందితుడిగా చేర్చారని తెలిపారు. కిషోర్ కుమార్‌రెడ్డి ప్రత్యక్ష పాత్ర గురించి ఎఫ్ఐఆర్‌లో ఎక్కడా ఎటువంటి ప్రస్తావన లేదన్నారు. పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు గన్‌మెన్ తన వద్ద ఉన్న తుపాకీ తీసి ఫిర్యాదుదారు, ఇతరులను చంపేస్తానంటూ బెదిరించారని తెలిపారు. కారు డ్రైవర్ గుర్మీత్ సింగ్‌ను అరెస్ట్ చేయగా అతడు తన వాంగ్మూలంలో కిషోర్ కుమార్‌రెడ్డి, నరహరి తదితరులు కారును వేగంగా పోనిచ్చి, అడ్డొచ్చిన వారిని కారుతో ఢీకొట్టాలంటూ ఆదేశాలు ఇచ్చారని చెప్పాడన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

జీపీఎస్‌తో.. జీవిత భాగస్వామికీ పెన్షన్

తాజాగా గవర్నర్ వద్దకు చేరిన జీపీఎస్ పత్రాలు

- ఆమోదముద్ర పడిన వెంటనే అమలుకు కార్యాచరణ
- లక్షలాది మంది సీపీఎస్ ఉద్యోగుల డిమాండ్‌ను నెరవేర్చిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ అందించేలా ప్రభుత్వం గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తీసుకొస్తోంది. దీని ద్వారా పెన్షనర్ జీవిత భాగస్వామికి కూడా పెన్షన్ లభించనుంది. రిటైర్ అయిన ఉద్యోగి చివరి నెల మూల వేతనంలో 50 శాతం పెన్షన్ వచ్చేలా జీపీఎస్‌ను రూపొందించింది. ఒకవేళ జీపీఎస్ చందాదారుడు మరణిస్తే ఆయన/ఆమె జీవిత భాగస్వామికి ఆర్థిక భరోసా ఉంటుంది. పదవీ విరమణ చేసిన వ్యక్తి మరణిస్తే అప్పటివరకు ఆ వ్యక్తి నెలవారీ అందుకున్న పెన్షన్‌లో 60 శాతం జీవిత భాగస్వామికి పెన్షన్ కింద అందనుంది. వీటితో పాటు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని తగ్గించడానికి ఆ మేరకు కరువు భృతి (డీఆర్)కి జీపీఎస్‌లో అవకాశం ఉంది. ముఖ్యంగా యాన్యుటీలో ఏమైనా లోటు ఏర్పడితే దాన్ని కూడా ప్రభుత్వమే భరించనుంది. తాజాగా ప్రభుత్వం జీపీఎస్ ఆమోదం కోసం గవర్నర్ వద్దకు పత్రాలను పంపించింది. ఆయన ఆమోదముద్ర పడిన వెంటనే దీని అమలుకు ఆర్డినెన్స్ తీసుకురానుంది. ఈ మేరకు తమకు ఎటువంటి ఆర్థిక భద్రత లేని సీపీఎస్‌ను పునఃసమీక్షించాలన్న లక్షలాది మంది ఉద్యోగుల చిరకాల డిమాండ్‌ను ప్రభుత్వం నెరవేర్చింది. పదవీ విరమణ తర్వాత మేలైన ఆర్థిక భద్రతను అందించడంలో జీపీఎస్ దేశానికే ఆదర్శంగా నిలవనుంది.

ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం..

రాష్ట్ర భవిష్యత్తు, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జీపీఎస్‌ను రూపొందించింది. పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను అమలు చేయాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అది పెనుభారంగా మారుతుంది. పెన్షన్ల మొత్తం ఉద్యోగుల జీతాలను కూడా దాటేసి మోయలేని స్థాయికి చేరుకుంటుంది. 2041 నాటికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.65,234 కోట్లు పెన్షన్ల కోసమే ప్రభుత్వం చెల్లించాల్సి వస్తుంది. రుణాలపై చెల్లింపులతో కలిపి రాష్ట్ర సొంత ఆదాయంలో 220 శాతానికి ఈ వ్యయం చేరుకుంటుంది. 2070 నాటికి ఈ చెల్లింపులు సుమారు రూ.3,73,000 కోట్లకు వెళ్తాయి. ఏదో ఒక దశలో ఈ మోయలేని భారాన్ని తట్టుకోలేక 2003లో మాదిరిగానే మళ్లీ ఓపీఎస్‌ను రద్దు చేయాల్సిన పరిస్థితులు రాక తప్పవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో సుదీర్ఘ చర్చల అనంతరం సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా జీపీఎస్‌ను ప్రతిపాదించింది. ఈ మేరకు జూన్‌లోనే రాష్ట్ర మంత్రి మండలి చట్టసవరణకు ఆమోదం తెలిపింది. తాజాగా జీపీఎస్‌లో చందాదారులకు వర్తించే నిబంధనలు, పూర్తి విధివిధానాల వివరాలతో ఈ పత్రాలను గవర్నర్ వద్దకు పంపింది. గవర్నర్ ఆమోదం అనంతరం ప్రస్తుతం ఉన్న సీపీఎస్ చందాదారులు నిబంధనల ప్రకారం నిర్దేశించిన వ్యవధిలో ఏపీజీపీఎస్‌లో చేరే అవకాశాన్ని కల్పిస్తుంది.

సీపీఎస్‌లో పెన్షన్‌కూ గ్యారెంటీ లేదు..

ప్రస్తుత సీపీఎస్ విధానం సెప్టెంబర్ 1, 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి వర్తిస్తోంది. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు తమ బేసిక్‌లో 10% జీతాన్ని పెన్షన్ ఫండ్‌కు బదిలీ చేస్తుండగా అంతే మొత్తాన్ని ప్రభుత్వం జమ చేస్తోంది. ఉద్యోగ విరమణ తర్వాత కార్పస్‌లో 60 శాతాన్ని ఉద్యోగి తీసుకుని 40 శాతం సొమ్మును యాన్యుటీ పెన్షన్ స్కీమ్‌లో పెట్టుబడిగా పెట్టాల్సి ఉంది. ఇదంతా మార్కెట్ ఒడిదుడుకులకు లోనై ఉంటుంది. అనిశ్చితి ఏర్పడితే రావాల్సిన పెన్షన్‌కూ గ్యారెంటీ ఉండటం లేదు. బేసిక్ శాలరీలో 20.3 శాతమే పెన్షన్‌గా వచ్చే అవకాశం ఉండగా అది కూడా వడ్డీరేట్లపై ఆధారపడి ఉండటం వల్ల భద్రత కూడా తక్కువే.

జీపీఎస్‌తో పూర్తి గ్యారెంటీ..

సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన జీపీఎస్ విధానం పదవీ విరమణ తర్వాత పెన్షన్‌కు పూర్తి గ్యారెంటీ ఇస్తుంది. ఇందులోనూ సీపీఎస్‌లో చెల్లించినట్లే ఉద్యోగి 10 శాతం పెన్షన్ వాటాగా చెల్లిస్తే ప్రభుత్వం కూడా అంతే జమ చేస్తుంది. పదవీ విరమణ సమయంలో చివరి జీతంలో ఉన్న బేసిక్‌లో 50 శాతం పెన్షన్‌గా అందుతుంది. ఇక్కడ సీపీఎస్‌తో పోలిస్తే పెన్షన్ 150 శాతం అధికంగా ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే డీఏలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం కూడా డీఆర్‌లు ఇస్తుంది. ఉదాహరణకు రిటైరైన ఉద్యోగి చివరి నెల బేసిక్ జీతం రూ.లక్ష ఉంటే అందులో రూ.50 వేలు పెన్షన్‌గా వస్తుంది. అది డీఆర్‌లతో కలుపుకొని ఏటా పెరుగుతుంది. 62 ఏళ్లకు రిటైర్ అయ్యే ఉద్యోగి మరో ఇరవై ఏళ్ల తర్వాత అంటే 82 ఏళ్ల వయసులో జీపీఎస్ ద్వారా రూ.1,10,000 పెన్షన్‌గా తీసుకుంటారు. తద్వారా రిటైర్డ్ ఉద్యోగి జీవన ప్రమాణాలను కాపాడినట్లు అవుతుంది. సీపీఎస్‌లో ఇలాంటి వెసులుబాటు లేదు. దేశంలో కొన్ని రాష్ట్రాలు మళ్లీ ఓపీఎస్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించినా దాన్ని అమల్లోకి తీసుకురాలేకపోతున్నాయి. మోయలేని ఆర్థిక భారం నేపథ్యంలో ఏం చేయాలో తెలియక మల్లగుల్లాలు పడుతున్నాయి. 2070 నాటికి జీపీఎస్ వల్ల రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వ్యయం క్రమంగా పెరుగుతూ రూ.1,33,506 కోట్లకు చేరుకుంటుంది. ఇందులో రూ.1,19,520 కోట్లను ప్రభుత్వమే బడ్జెట్ నుంచి భరించాల్సి వస్తుంది.

బ్యాంక్ ఖాతాల్లోంచి డబ్బునలా కాజేస్తున్నారు!

- ఆధార్‌కు అనుసంధానమైన వేలిముద్రల డూప్లికేట్
- కస్టమర్ సర్వీస్ పాయింట్లలో ఆ వేలిముద్రల స్కాన్
- దేశవ్యాప్తంగా 416 మంది బ్యాంకు ఖాతాల నుంచి నగదు స్వాహా
- ఐదుగురు సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన వైఎస్సార్ జిల్లా ఎస్పీ



సైబర్ క్రైమ్ నిందితుల అరెస్ట్ వివరాలు చెబుతున్న వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: ఆధార్ కార్డుకు అనుసంధానమైన వేలి ముద్రలను డూప్లికేట్ చేసి వారి బ్యాంక్ అకౌంట్లలోంచి నగదు కాజేస్తున్న ఐదుగురు సైబర్ నేరగాళ్లను వైఎస్సార్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల్లో ప్రకాశం జిల్లాకు చెందిన నల్లగళ్ల వెంకటేష్, గుంటూరుకు చెందిన మాల్యాద్రి మల్లఅజయ్, గంటా కళ్యాణ్, పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన షేక్ జానీ, పసుపులేటి గోపి ఉన్నారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ బుధవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. గతేడాది డిసెంబర్‌లో కడప నగరానికి చెందిన శంకరయ్య తన ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా నుంచి రూ.5,500 విత్ డ్రా అయినట్టు కడప సైబర్ క్రైమ్ ఆఫీస్‌లో ఫిర్యాదు చేయడంతో నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఈ ఫిర్యాదు నమోదైంది. కాగా, ఈ నెల 15న ఓ వ్యక్తి వాట్సాప్, ఇంటర్‌నెట్ కాల్స్ ద్వారా శంకరయ్యకు ఫోన్ చేసి 'నువ్వు ఫిర్యాదు చేయడం వల్ల నా అకౌంట్ ఫ్రీజ్ చేశారు. రేపటిలోగా నా అకౌంట్‌ను అన్‌ఫ్రీజ్ చేయించకుంటే చంపేస్తాం' అంటూ బెదిరించాడు. దీనిపై బాధితుడు కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వైఎస్సార్ జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ తుషార్‌డూడీ ఆధ్వర్యంలో స్పెషల్ టీంలను నియమించి విచారణ చేపట్టారు.

అలా వారి ఖాతాలకు నగదు బదిలీ

ఈ నేరం ఆధార్ ఎనేబుల్ సిస్టం(ఏఈపీఎస్)ద్వారా ఫిర్యాది బయోమెట్రిక్(వేలిముద్రలు)లను నకిలీవి సృష్టించి వాటి సాయంతో కస్టమర్ సర్వీస్ పాయింట్స్(బిజినెస్ కరస్పాండెంట్స్)లోని బయోమెట్రిక్ డివైస్‌లో స్కాన్ చేసి ఫిర్యాది ఆధార్ కార్డు లింక్ చేసి ఉన్న బ్యాంకు అకౌంట్ నుంచి రూ.5,500 విత్‌డ్రా చేసినట్టు పోలీసులు గుర్తించారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నగదు విత్‌డ్రా జరిగిన ప్రదేశం కడప పట్టణంలో ఉందని గుర్తించారు. అలాగే అనుమానితుల ఫోన్ నంబర్లను ట్రాక్ చేసి కడప ఓల్డ్ బైపాస్ వద్ద నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల్లో వెంకటేష్(బిజినెస్ కరెస్పాండెంట్) బ్లాక్ మార్కెట్ ద్వారా ఏపీ, తెలంగాణ ప్రజల వేలి ముద్రలు, ఆధార్‌కార్డులు, బ్యాంక్ ఖాతాల వివరాలను సేకరించి, నిందితుల సాయంతో బాధితుల బ్యాంక్ ఖాతాల నుంచి నగదును తమ ఖాతాలకు బదిలీ చేసేవారు. నిందితుల నుంచి కారు, నాలుగు సెల్‌ఫోన్‌లు, నేరాలకు ఉపయోగించే డివైస్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై 4 ఎఫ్ఐఆర్‌లు, 412(నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్) ఎన్‌సీఆర్‌పీ పిటిషన్‌లు నమోదైనట్లు, దేశంలో మొత్తం 416 మంది బాధితులను గుర్తించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.